# ప్రేమపుష్పం



వావిలికొలను రాజ్యలక్ష్మి

# ప్రేమ పుష్పం

నవల

వావిలికొలను రాజ్యలక్ష్మి

సూర్య ప్రచురణలు
హైదరాబాదు

# PREMAPUSHPAM

By **Vavilikolanu Rajyalakshmi**

© V. Rajyalakshmi

*First Edition* : 2009

*Price* : Rs. **75/-** **$ 5**

*For Copies* :
**Mrs. V. Rajyalakshmi**
S.V. Nilayam,
Plot No. 28/B, Flat No. G-2,
Prabhat Nagar Colony, Chaitanyapuri,
Hyderabad - 500 060
Ph : 040-2405 3455

*Book Production* :
**T. Muralidhar Gowd**

*Typeset* :
**K.B.T. Kondaiah**

*Printed at :*
**Vipla Computer Services**
(*Designers & Multicolour Offset Printers*)
Nallakunta, Hyderabad - 500 044
Ph : 040-2767 6910, 2765 4003

*Published by* :
**Surya Prachuranalu**
Hyderabad - 500 035
Ph : 040-2404 7889

# మంచినవల 'ప్రేమపుష్పం'

ఇది రెండు కుటుంబాల కథ. బావామరదళ్ళ ప్రేమకథ కూడా. ఇందులో బాంధవ్యాలు, అనుబంధాలు, రెండు కుటుంబాలలోని వ్యక్తుల సహృదయతా సహజత్వానికి చాలా దగ్గరగా చిత్రింపబడ్డాయి. సుమబాల, సారథి బావామరదళ్ళు. చిన్నప్పుడే ఇరువైపు పెద్దలు వాళ్ళకి వివాహం నిశ్చయించడం వల్ల చెట్టుకి పాదుచేసి నీరుపోసినట్లుగా వాళ్ళిద్దరి మధ్య అనురాగం అందమైన పూపొదలా అల్లుకు పోతుంది. సరిగ్గా వాళ్ళవివాహానికి ముహూర్తం నిశ్చయించాక... అనుకోని అవాంతరాలు... కొన్ని అవాంఛనీయ సంఘటనలు జరగడంవల్ల సుమసారథుల వివాహం భగ్నమౌతుంది. సుమ పెద్దక్క నాలుగో కాన్పులో ప్రసవం కష్టమై చనిపోతుంది. అదే సమయంలో రైలుప్రమాదంలో సారథి చనిపోయినట్లుగా వచ్చిన వార్తవల్ల కలిగిన దుఃఖంలో, ఆ వైరాగ్యంలో తల్లి కరువైన అక్కపిల్లలకి తల్లిగా వెళ్ళడానికి అంగీకరిస్తుంది సుమ. తీరా పెళ్ళి సమయానికి సారథి బతికే ఉన్నాడని తెలుస్తుంది. చివరికి సారథితో సుమ పెళ్ళి జరిగి కథసుఖాంతమౌతుంది. ముగింపు కొంచెం సినిమా టిక్‌గా అనిపించినా చదివించడానికి ఈ మాత్రం ట్విస్టులుండాల్సిందే ననిపిస్తుంది. చివరి సగం చాలా ఉత్కంఠభరితంగా సాగుతుంది. పాత్రలు సజీవంగా, వాళ్ళమధ్య జరిగే సంభాషణ సహజత్వానికి దగ్గరగా ఉన్నాయి. సంఘటనలూ, సన్నివేశాలు కళ్ళకు కట్టినట్లుగా చిత్రించడంలో రచయిత్రి కృతకృత్యులైనారనే చెప్పొచ్చు. సారథి తండ్రి కేశవస్వామి వైరాగ్యభావంతో ఇల్లొదిలిపోయి ఎక్కడో ద్వారకలో సన్యాసి జీవితం గడుపుతున్నా, తనని ఇంటికి తీసుకుపోవడానికి వచ్చిన కొడుకు తిరిగి వెడుతూ

మార్గమధ్యంలో రైలుప్రమాదంలో మరణించాడని తెలిసి, తనకోసమే వచ్చి కొడుకు దుర్మరణం పాలయ్యాడని వ్యథచెంది ఇంటికి తిరిగి వచ్చిన సన్నివేశం ఆ పాత్ర ఉదాత్తతను చాటుతున్నట్లుగా ఉంది.

ఈ నవల సమాజానికి పెద్దగా సందేశాన్ని అందించకపోయినా ఒడిదుడుకులతో, వెలుగు నీడలతో కూడుకొన్న మానవజీవితాన్ని గులాబీ చెట్టు ముళ్ళతో పోల్చడం, ప్రేమను ఆ చెట్టుకు పూసిన గులాబీ పువ్వుగా అభివర్ణించడం సమయోచితంగా ఉంది. ఒక మంచి నవలను చదివిన అనుభూతి పాఠకులకు మిగులుతుంది!

**పోల్కంపల్లి శాంతాదేవి**

# నా గురించి...

నేను పుట్టింది పెరిగింది మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్ కర్నూల్ తాలూకాలోని 'ఏదుట్ల' గ్రామంలో. అక్కడ ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తయ్యాక మా ఊరికి దగ్గరలోవున్న 'వనపర్తి' బాలికోన్నతపాఠశాలలో ఉన్నత విద్య అభ్యసించాను. హైదరాబాదులోని 'ఆంధ్రసారస్వత పరిషత్తు'నుంచి తెలుగు పరీక్షలు రాసి పాసైనాను.

తెలంగాణలో ప్రముఖ రచయిత్రి అయిన శ్రీమతి పోల్కంపల్లి శాంతాదేవి మా వదినగారు. మంచి మనసున్న వదినతో నాకున్న స్నేహబాంధవ్యం విడదీయరానిది. నేను రచయిత్రిని కావడానికి ముఖ్యప్రేరణ మా వదినగారే! తాను రాస్తుంటే చూసి, అవి చదువుతుంటే నాకు కూడా ఏమన్న రాయాలని మహా ఆరాటంగా వుండేదా వయస్సులో. ఆ తపనలో నుంచే పుట్టిన నా మొట్ట మొదటి రచన 'మధుశ్రీ'. ఆ కథానిక బెంగుళూర్ నుంచి వెలుబడుతుండే ప్రజామత అనే వార పత్రికలో ప్రచురించబడింది. ఆ తరువాత 'బాలమిత్ర, ప్రజామత, ఆంధ్రజ్యోతి, కల్పన, ప్రగతి, జ్యోతి, శ్రీమతులు, జయశ్రీ, తెలుగు వెలుగు' మున్నగు వార, మాస పత్రికలలో (ఇవి ఒకప్పటి పాత పత్రికలు) పాతిక కథలకు పైగానే ప్రచురించబడ్డాయి.

హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం నుంచీ, విశాఖపట్నం రేడియో కేంద్రం నుంచి స్త్రీల కార్యక్రమాలలో కొన్ని కథానికలు ప్రసారమైనాయి. ఈ మధ్యకాలంలో 'ఆంధ్రభూమి' లో 'చినుకు', 'చేతన' మాసపత్రికలలో కొన్ని రచనలు వెలువడ్డాయి.

నా మొట్టమొదటి నవల 'ఆనంద కిరణాలు', రెండో నవల 'జీవనచక్రం' ప్రజామత వార పత్రికలో సీరియల్స్‌గా వచ్చాయి. 'ఓ పూవురాలింది' ప్రగతి

వారపత్రికలో సీరియల్‌గా ప్రచురించబడింది. ఆ తరువాత 'కల్యాణరేఖ', 'మౌనగీతం', 'ఆశలదీపాలు', 'ప్రేమసంగీతం' మున్నగు నవలలు రాశాను. ఎనిమిదవ నవలే ఈ 'ప్రేమపుష్పం'.

చిత్రలేఖనం, రచనా వ్యాసంగం, పుస్తకపఠనం, పూల మొక్కలు పెంచడం, కుట్లు, అల్లికలు, బోధన మున్నగునవి నాకున్న హాబీలలో ముఖ్యమైనవి.

1975లో శ్రీ వి. సీతారామారావుగారితో వివాహం, ఇద్దరు పిల్లలు. అమ్మాయి రాధిక, అబ్బాయి ఉదయ్‌కాంత్. మా వారికి ఏర్‌ఫోర్స్‌లో ఉద్యోగం కాబట్టి ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, అస్సాం, గుజరాత్ మున్నగు రాష్ట్రాల్లో ఉండడం జరిగింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం.

ఫిరోజ్‌గూడలో వున్న చైతన్య గ్రామర్ హైస్కూల్లో చాలా సంవత్సరాలు ఉపాధ్యాయినిగా పనిచేసి, ఎన్నెన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. ఉత్తమ ఉపాధ్యాయురాలుగా మంచి పేరు సంపాదించుకొన్నానక్కడ. నన్ను అభిమానించే కరస్పాండెంట్ మనోహర్ రెడ్డిగారు, ప్రధానోపాధ్యాయురాలు సునీత, స్నేహశీలి అయిన ప్రభా టీచర్, ఆ పిల్లలు... ఆ స్కూల్‌తో నాకున్న అనుబంధం మరుపురానిది.

నా అభిమాన రచయిత్రులు మా వదిన పోల్కంపల్లి శాంతాదేవిగారు, యద్దనపూడి సులోచనారాణిగారు, కోడూరి కౌసల్యాదేవిగారు. మంచి ఎక్కడున్నా స్వీకరించడం నా కిష్టం!

**వావిలికొలను రాజ్యలక్ష్మి**

# అంకితం

నా యీ 'ప్రేమపుష్పం' నవల
మా అమ్మాయి, అల్లుడుగారైన
డాక్టర్ **రాధికా నగేష్‌లకు...**

- ప్రేమతో

# కృతజ్ఞతలు

ఈ నవల ఇంత అందంగా రావడానికి కారకులైన 'పుస్తక రూప శిల్పి', ప్రముఖ రచయిత శ్రీతాళ్ళపల్లి మురళీధర గౌడు గారికి, ఓపి కతో డి.టి.పి. చేసిన శ్రీ కె.బి.టి. కొండయ్య గారికి, సకాలంలో ముద్రించి ఇచ్చిన విప్ల కంప్యూ టర్ సర్వీసెస్ అధినేత శ్రీ ఎం. విజయ సేనారెడ్డిగారికి నా కృతజ్ఞతలు.

ఎంతబిజీగా ఉన్నా కోరగానే అందమైన ముఖచిత్రం వేసి పంపించిన ప్రముఖ చిత్ర కారులు శ్రీ నర్సింగారికి (ఇండియా టుడే) ధన్యవాదాలు.

**– రాజ్యలక్ష్మి**

అతినిశ్శబ్దంగా ఉన్న ఆ ఇంటి వాతావరణంలో... హంసలా అడుగులేస్తూ వస్తూన్న సుమబాల కాళ్ళకి మువ్వలున్న వెండి పట్టీలు ఘల్లుఘల్లుమంటూ సుమధురంగా మోగుతున్నాయి.

గుమ్మంలో వినవచ్చిన అందెల శబ్దానికి ... గదిలో మంచంపై అటు తిరిగి పడుకొని వున్న సుశీలమ్మ, కూతురి రాకని గమనించి “అమ్మాయ్! సుమా!... అంటూ చాలా నీరసంగా పిల్చింది.

“ఏమ్మా!...” అంటూ లోనికి వచ్చింది సుమబాల.

“పెరట్లో గౌరి వుందేమో, అంట్లసామాను కడిగేసే పని అయిపోతే తన్ని ఓ మారిలా రమ్మని పిలువు”.

“ఎందుకమ్మ?”

“ఎందుకేమిటే?... ఈ కుడికాలు ఓ గంట నుంచీ మరీ తెగ పోటు పెట్టేస్తూంది. ఎటూ కదలనిచ్చి చావడం లేదు. గౌరితో అమృతాంజనమన్నా మర్దన చేయించుకుంటే, సాయంత్రానికల్లా కాస్త తగ్గుతుందేమో?... అబ్బా... ఊః” అని నీరసంగా మరోమారు మూల్గి నెమ్మదిగా తన భారీ శరీరాన్ని ఇటు తిప్పింది.

“అమృతాంజనం నేను రాయనా అమ్మా?”

“ఒద్దులేవే. నీకేం చేతనవును... బాగా బలంగా సత్తువకొద్దీ మర్దన చేయాలి”.

“నీ చాదస్తంగానీ, గౌరి నాకంటె కూడా బాగా రుద్దుతుందా ఏమిటి?” అంటూ అలమార తెరిచి అమృతాంజనం సీసాని చేతిలోకి తీసుకుంది సుమబాల.

“నీవు మెల్లిగా లేచి కూర్చో అమ్మా!” అని తల్లికో ఆజ్ఞ జారీ చేసి తాను గబగబా పక్కగదిలోకెళ్ళి కొంచెం ఎత్తుగా వున్న ఓ చిన్న స్టూల్ పట్టుకొచ్చి తల్లి మంచానికి దగ్గరగా వేసింది.

అప్పటికే సుశీలమ్మ మెల్లిగా లేచి కూర్చుంది.

చేత్తో మోకాలుపై రుద్దుకుంటూ కుడికాలును అతినెమ్మదిగా ఆ స్టూలుపై వుంచింది ఆవిడ.

సుమ తీరిగ్గా కింది నేల మీద బాసింపట్టు వేసుక కూర్చొని బాగా బలంగా తనశక్తినంతా ఉపయోగించి తల్లి మోకాలికి అమృతాంజనం మర్దన చేయసాగింది.

‘‘అమ్మో!... అబ్బో!... చాలా నొప్పిగా వుందే, మరీ అంత గట్టిగా రుద్దకే’’ అంటూ బాధగా మూల్గుతూ కూతుర్ని వారించసాగింది సుశీలమ్మ.

మరి సత్తువకొద్దీ రుద్దాలన్నావుగా... గౌరిలా నాకు చేతకాదన్నావుగా’’ నవ్వుతూ సుమ తన జోరుని కాస్త తగ్గించింది.

రెండు నిమిషాలు తల్లీ కూతుర్ల మధ్య నిశ్శబ్దంగా గడిచిపోయాయి.

‘‘అన్నట్లు, మీ చిన్నత్తయ్య ఏం చేస్తుందే సుమా?’’ ఆవిడ ఉన్నట్లుండి హఠాత్తుగా అడిగింది.

‘‘ఈ వేళప్పుడు అత్తయ్య ఏం చేస్తుంటుందమ్మా? మామూలేగా... భోజనం చేసి మడి వదిలి వంటింటి గడపలోనే కొంగు వాల్చుకొని పండుకుంది’’.

‘‘నాకీ మోకాళ్ళ నొప్పుల వలన మీ అత్తయ్యకి ఈ మధ్య ఇంట్లో పని మరీ ఎక్కువైపోయిందే సుమా!’’

‘‘మరి నేనేం చేయను?... ‘పనంతా నేను చేస్తానత్తయ్యా...’ అంటే ససేమిరా ఒప్పుకోదు. ఏ ఒక్కపనీ నన్ను ముట్టనివ్వదు. అన్ని పనులూ స్వయంగా తానే చేస్తానంటుంది...’’ కొంచెం బాధపడుతూనే అందీమారు సుమ.

‘‘చిన్నప్పటినుంచి అయినా అంతే..... ఆవిడ కష్టజీవి! జీవితంలో సుఖసంతోషాలనేవే ఎరుగదు. ఏమిటో పాపం... ఆవిడ బతుకలా అయిపోయింది’’ అంటూ బాధావేదనలతో ఓ నిట్టూర్పు విడిచింది సుశీలమ్మ.

‘‘చిన్నత్తయ్యది అలా చీకటి బతుకవడానికి ఓ విధంగా కారణం మీరే నమ్మా!’’ సూటిగా అనేసింది సుమ.

కూతురి మాటలకి ఓ క్షణం విస్తుబోయింది మొదట ఆవిడ. తలెత్తి చూస్తూ, ‘‘అదేమిటే అలా అంటావ్?’’ కొంచెం మందస్వరాన అంది.

‘‘లేకపోతే ఏమిటమ్మా?... చిన్నప్పుడే భర్తపోయిన చిన్నత్తయ్యకి ఆ వయసులోనే మళ్ళీ పెళ్ళి చేసి ఉండుంటే, పిల్లా పాపలతో పచ్చగా కళకళలాడే

సంసారం అందరిలా అత్తయ్యకీ ఉండేదీరోజు...'' కాస్త ఆవేశంగా ఆరాటంగా అందీమారు సుమ.

''అవును నీవన్నది నిజమేనే సుమా! మీ చిన్నత్తయ్యకి పునర్వివాహం చేయాలని ఆ రోజుల్లో నేనూ మీనాన్నగారు ఎంత మొత్తుకున్నా రవంతైనా లాభం లేకపోయింది. ఆ రోజుల్లో మహానిష్టాపరులు మీతాతయ్య. ఆచార వ్యవహారాలకీ, సంప్రదాయాలకీ ప్రాణం పెట్టేరకం అయిన మీ తాతయ్య- మా మాటల్ని గడ్డిపోచలా తీసి పారేశాడు. మొండిఘటం!... ఎంత చెప్పినా వినలేదు. అప్పట్లో ఆయన్ని ఎదిరించేంతటి ధైర్యం, సాహసం మాలో లేకపోయింది. మూఢాచారాలకీ, సంప్రదాయాలకీ వున్న బలం... ప్రేమ, కడుపుతీపికి కూడా లేకపోయింది. కన్న కూతురి కన్నీటి మయమైన విషాద బతుకును చూశాడేగానీ, ఆచారవ్యవహారాలనీ.... సంప్రదాయాలనీ ఉల్లంఘించే సాహసం, తెగువ చేయలేకపోయాడు మీ తాతయ్య.

''మీ చిన్నత్తయ్యకి చిన్నతనంలోనే పెళ్ళి అయిందన్న మాటేగాని అత్తింటి కాపురం చేయలేదు. సంసార మాధుర్యాలేవీ ఎరక్కుండానే విధవై కూర్చుంది. అలా చిన్నప్పటినుంచే చన్నీటి స్నానాలు... పూజాపునస్కారాలు... ఉపవాసాలు, మడి, తడి వీటితోనే రుక్మిణి జీవితమంతా వంటింటికే అంకితమైపోయింది. చిన్నావిడ బతుకు భర్తలేక ఇలా అయింది. పెద్దావిడకి భర్త వుండీ కూడా లేనిదానితో సమానమై పోయి ఆవిడ బతుకలా అయింది'' అంటూ బాధాతప్త స్వరంతో ఓ నిట్టూర్పు వదిలింది సుశీలమ్మ.

తల్లి చెప్పేదంతా మౌనంగా ఊకొడ్తూ కాలు రుద్దడంలో పూర్తిగా నిమగ్నురాలై వున్న సుమ ఒక్కసారిగా తలెత్తి పరీక్షగా చూస్తూ ''ఇక మామయ్య ఎప్పటికీ తిరిగి రాడంటావా అమ్మా?'' అడిగింది అమాయకంగా.

''ఇరవై సంవత్సరాలు కావస్తోంది. పిల్లలు ముగ్గురూ పసివాండ్లుగా ఉన్నప్పుడు వెళ్ళాడు. ఇంతవరకూ పత్తాలేడా మనిషి. ఇంకేం వస్తాడు? అస్సలు బతికున్నాడో లేడో?...'' అంటుంటే ఆవిడ స్వరం గద్గదికం అయింది.

''అయ్యో! అలా అనకమ్మా. మామయ్య తప్పకుండా తిరిగి వస్తాడనే బలమైన నమ్మకంతో, ఆ ఆశతోనే అత్తయ్య ఇన్నేళ్ళుగా జీవిస్తోంది''.

''పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. కనీసం కన్న కూతురి కల్యాణానికన్నా రాలేదు. కూతురి పెళ్ళి కన్నులారా చూసుకునే అదృష్టానికీ... ఆ ఆనందానికీ నోచుకోలేక

పోయాడు. కాళ్ళు కడిగి కన్యాదానం చేయవల్సిన ఆయన స్థానంలో పెళ్ళి పీటల మీద మీ నాన్నగారు నేను కూర్చుని జరిపించాం కదా! ఆయన రావాలనుకుంటే తప్పకుండా కూతురు పెళ్ళికే తిరిగి వచ్చేవాడు''.

''నీ పిచ్చిగాని ఎక్కడో దేశాలు పట్టుక తిరుగుతూన్న ఆయనకి ఇక్కడ కూతురి పెళ్ళి జరుగుతుందని ఎట్లా తెలుస్తుందే అమ్మా?'' సుమ ఎదురు ప్రశ్న వేసింది.

''అయ్యో! అదేమిటి అట్లా మాట్లాడుతావ్?''.... ఆ శుభలేఖని సారథి చాలా మటుకు ఎన్నో పేపర్లలో ప్రకటనగా వేయించాడు కదా! తండ్రి ఎక్కడున్నా అది చూసుకొని తప్పకుండా తిరిగి వస్తాడేమోనని కొండంత ఆశతో ఎదురు చూశాడు కాని లాభం లేకపోయింది.

''ఆహాఁ, అలాగా. నాకు తెలియదీసంగతి; బావలా పేపర్లో వేయించాడనీ''. ఈమారు కొంచెం ఆశ్చర్యం కనబర్చింది. అంతటితో వాళ్ళ మాటలు ముగిసినట్లుగా కాసేపు మౌనమే రాజ్యమేలింది ఇద్దరి మధ్య.

''ఇక చాలు సుమా! బాగానే రుద్దావు. ఇంట్లో ఒక్కరోజు లేచి తిరిగితే రెండు రోజులిలా పడకెయ్యాల్సి వస్తుంది. నాకీ మోకాళ్ళ నొప్పులూ, మీ నాన్నగారికి ఆ ఉబ్బసం ఇక ఈ జన్మలో తగ్గవేమో! మేము బతికుండగానే అక్కయ్యల్లా నిన్నూ ఓ ఇంటిదాన్ని చేస్తే మా బరువు బాధ్యతలు తీరిపోతాయమ్మా!. మేము ఎంత తొందర పడుతున్నామో... సారథి అంత ఆలస్యం చేస్తున్నాడీ విషయంలో. ఈ ఏడాది అయినా పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకుంటాడో లేదో? అన్నట్లు సారథి మీ నాన్నగారివి మందులు తెప్పించాడా అమ్మా?'' ఉన్నట్లుండి హఠాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చినట్లుగా అడిగింది సుశీలమ్మ కూతుర్ని.

''ఈ రోజు ఉదయమే బావ స్కూటరేసుకొని పట్నం వెళ్ళి మందులు పట్టుకొస్తానన్నాడు. ఏదీ, ఇంతవరకూ పత్తాలేడా మనిషి. అయినా ఆయనగారికి ఎక్కడ తీరిక ఉంటుందే అమ్మా? పొలం పనులతో ఇంటి విషయాలతో, ఊరి వ్యవహారాలతో తిండి తిప్పలు, నిద్రాహారాలు కూడా మర్చిపోయి క్షణం తీరిక లేకుండా గడిపే ఆ మహానుభావుడికి నాన్నగారి మందుల విషయం గుర్తు వుందో లేదో మరి. తాను వెళ్ళడానికి తీరిక లేకున్నా మరెవరినన్నా పంపించి తెప్పించ మన్నాను. 'నాన్నగారికి ఉబ్బసం మరీ ఎక్కువైందీ మధ్య. ఆ మందులు వాడకపోతే

లాభం లేదు. తప్పకుండా సిటీకి ఎవరినైనా పంపించి అయినా ఆ మందులు తెప్పించు బావా!...' అని ఫోన్ చేసి మరీ మరీ చెప్పాను".

"సారథి వాళ్ళ మామయ్య మందుల విషయం ఏం మర్చిపోడే సుమా, అందులో నీవు చెప్పావంటే మర్చిపోతాడా?"

"ఏదీ, ఇంతవరకూ మందులే రాలేదు".

"తనకు వెళ్ళడానికి తీరిక లేకున్నా మరెవరితోనన్నా తప్పకుండా తెప్పిస్తాడు మందులు..." మేనల్లుడి పట్ల చాలా నమ్మకంగా అందీమారు సుశీలమ్మ.

అంతట్లోనే బయటి నుంచి ఎవరో "అమ్మగారూ" అంటూ పిల్చారు.

"అదిగో, ఎవరో వచ్చినట్లున్నారు... పిలుస్తున్నారు. ఎవరో వెళ్ళి చూడవే" కూతుర్ని పంపించిందావిడ.

సుమ గబగబా ఇవతలికి వచ్చింది.

నల్లగా గుమ్మటంలా ఉన్న ఓ వ్యక్తి చేతిలో ఏదో పాకెట్ పట్టుకొని వీధి గుమ్మంలో నిల్చుని ఉన్నాడు.

"ఓహోఁ, నువ్వా ఖాసీమ్ ఏమిటిలా వచ్చావ్?" అంది సుమ చిన్నగా పలుకరింపుగా నవ్వుతూ.

సారథి బాబుగారు మీకీమందులు ఇచ్చి రమ్మన్నారమ్మా"

"అసలు నీవిప్పుడు ఎక్కడి నుండి వస్తున్నావ్?"

"సరాసరి పట్నం నుంచే వస్తున్నానమ్మా" అంటూ చేతిలోని మందుల పాకెట్‌ని సుమ చేతికందించాడతను.

"బావ వెళ్ళుతానన్నాడుగా సిటీకీ... వెళ్ళలేదా?"

"లేదమ్మగారూ! వెళ్ళలేదు. ఊరినుంచి బాబుగారి చెల్లెలు వచ్చింది కదా! అందుకని తీరక మందుల కోసం పట్నం నన్నే పంపారు".

"ఏమిటీ, ఊరి నుంచి గౌతమి వచ్చిందా? ఎప్పుడు వచ్చింది ఖాసీమ్? ఫోన్ చేసినప్పుడు బావ నాతో చెప్పనేలేదే ఈ సంగతి" ఆశ్చర్యానందాలతో ఆత్రుతగా అడిగిందీ సుమ.

"రాత్రి బస్సుకి వచ్చారమ్మా!"

"ఆమె భర్త గిరిబాబుగారు కూడా వచ్చారా?"

‘‘లేదమ్మా, గౌతమమ్మగారు ఒక్కరే వచ్చారు’’.

ఉన్నట్లుండి సుమ దృష్టి ఈమారు వాకిట్లో స్టాండ్ వేసి వుంచిన సైకిల్పై పడింది.

‘‘బస్సులో వెళ్ళలేదా పట్నం నువ్వు... సైకిల్పై వెళ్ళావా?’’

‘‘ఉదయం ఫస్ట్ బస్సు తప్పిపోయిందమ్మా. బాబుగారేమో మందులు చాలా అర్జంట్గా కావాలన్నారు. అందుకని సైకిలేసుకొని వెళ్ళి వచ్చాను’’ ఎంతో వినయంగా చేతులు కట్టుకొని చెప్పాడు ఖాసీమ్.

‘‘అయ్యో, పాపం! బావ నిన్ను బాగానే కష్టపెట్టాడు. ఈ ఎండల్లో అంతదూరం సైకిలేసుకొని వెళ్ళి రావడమంటే మాటలా... బాగా అలసిపోయి నట్లున్నావ్ అన్నట్లు భోజనం చేశావా?’’ చెమటలు కారుతున్న అతని ముఖంకేసి సానుభూతిగా చూస్తూ అనునయంగా అడిగింది సుమ.

‘‘లేదమ్మగారూ! నేరుగా ఇక్కడికే వచ్చాను. ఇంటికెళ్ళి భోజనం చేస్తా నిప్పుడు...’’

‘‘ఈ పూటకి ఇక్కడే భోజనం చేసి మరీ వెళ్ళు. ఈ వేళప్పుడు మీ ఇంట్లో మీ ఆవిడ లేకుండొచ్చు. పనిలోకి వెళ్ళి ఉంటుంది. ఇంట్లో నీకోసం భోజనం రెడీగా ఉందో లేదో! ఇంటికెళ్ళి మళ్ళీ ఏం తిప్పలు పడుతావ్. పెరట్లోకెళ్ళి నూతి దగ్గర కాళ్ళు చేతులు కడుక్కో. ఇక్కడే భోజనం చేద్దువుగానీ...’’ అంటూ అతనికి మరో మాటకైనా అవకాశం ఇవ్వకుండా చేతిలోని మందుల పాకెట్ని హాలు మధ్యలో ఉన్న ఉయ్యాల బల్లపై ఉంచి... కాలి అందెలు ఘల్లు ఘల్లున మోగుతుండగా పరిగెత్తినట్లుగానే వంటింటి వైపు దూసుకపోయింది సుమ.

✧ ✧ ✧

ఊరి బయటనున్న శివాలయానికి వెనగ్గా ఉన్న పసుపు రంగులోని ఆ రెండంతస్తుల మేడపై, సాయం సంధ్యారుణ కాంతులుపడి బంగారు రంగుతో మరింత ఆకర్షణీయంగా అందంగా మెరిసిపోతూంది. ఇంటిముందు నిండుగా కళకళలాడుతున్న పూతోట... ఆ ఇంటి యజమాని అభిరుచిని చాటి చెప్పుతూ ఆ ఇంటికే వన్నె తెచ్చేలా ఉంది.

కాంపౌండ్ గోడకి దగ్గర్లో గేట్కి ఇరువైపులా ఉన్న కొబ్బెరిచెట్లు చల్లగా వీస్తున్న మలయపవనుడి తాకిడికి విసురుగా అటు ఇటు ఊగుతున్నాయి.

ఆ ఇంటిగేట్‌ని చొరవగా తెరుచుకొని సుమబాల గబగబా లోపలికి వెళ్ళుతూంది. ఆమె వెనకాలే గౌరి చేతిలో ఓ పెద్ద స్టీల్ క్యారియర్ పట్టుకొని అమ్మాయ్‌గార్ని అందుకోవాలన్నంత వేగంగా నడుస్తూంది.

"అత్తయ్యా... అత్తయ్యా..." పెద్దగా పిలుస్తూ సుమ నేరుగా వంటింటివైపు వెళ్ళింది.

నానిన బియ్యాన్ని చిల్లుల జల్లెడలో పడేస్తున్న అన్నపూర్ణమ్మ గభాల్న ఇటు తిరిగింది.

చిరునవ్వు ముఖంతో మేనకోడల్ని పరికిస్తూ "ఏయ్, సుమా! బాగున్నావా? నీ దర్శన భాగ్యమే మాకు బంగారమైంది. నీవీ ఇంటికి వచ్చి ఎన్నాళ్ళు అయిందో తెలుసా?..." అంటూ కొంచెం నిష్ఠూరం మేళవించి పలుకరించిందావిడ.

"అమ్మకి నాన్నకి ఒంట్లో బాగుండడం లేదత్తయ్యా! ఇవాళో రేపో నేనొద్దామనే అనుకుంటున్నాను. ఇంతలో మధ్యాహ్నం ఖాసీం వచ్చినప్పుడు గౌతమి వదిన వచ్చినట్లుగా చెప్పాడు. అందుకనే ఇలా పరిగెత్తుక వచ్చాను..." అంటూ వెనుదిరిగి గౌరి చేతిలో నుంచి క్యారియర్ అందుకొని అన్నపూర్ణమ్మకిచ్చింది.

"ఇదేమిటీ?..." అందావిడ ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి.

"ఏవో పిండి వంటలు. వదిన వచ్చింది గదా అని చిన్నత్తయ్య చేసి పంపించింది. అన్నట్లు, వదిన కన్పించదేం అత్తయ్యా?"

"పూలు కడ్తూ పెరట్లో వుంది. వెళ్ళి చూడు".

సుమ మరో మాటకైనా అవకాశం ఇవ్వకుండా పెరట్లోకి పరుగు తీసింది.

సన్నజాజి మొగ్గలు, కనకాంబరాలు, మరువంతో నిండుగా ఉన్న స్టీల్ పల్లెం ఒళ్ళో పెట్టుకొని కూర్చుని మాల కడుతూ... అక్కడే నూతి దగ్గర అంట్ల సామాను కడుగుతూన్న రత్తాలుతో ఏదో మాట్లాడుతున్న గౌతమి, అందెల చప్పుడుకి గభాల్న ఇటు తిరిగి చూసింది.

"హాయ్, వదినా! బాగున్నావా?..." సుమ నవ్వుతూ వెళ్ళి గౌతమి మెడచుట్టూ రెండు చేతులూ పెనవేసి సంతోషంతో ఉక్కిరి బిక్కిరి చేసేసింది.

"ఆఁ, ఆఁ... నేను బాగానే ఉన్నాను. నీవెలా ఉన్నావ్? పిన్ని బాగుందా? అత్తయ్య మామయ్య అంతా కులాసే కదా?" అంటూ పలుకరింపుగా నవ్వింది.

"ఒక్కదానివే వచ్చావేం వదినా?"

‘‘మీ అన్నగారు ఊళ్ళో లేరు. క్యాంపుకెళ్ళారు. వారం పదిరోజుల దాకా రానన్నారు. ఇక నేనొక్కత్తిని అక్కడ ఉండడం ఎందుకని ఇక్కడికి వచ్చాను. నిల్చుండి పోయావేం? కూర్చో... ఒసే రత్తాలూ! లోపలికెళ్ళి ఓ కుర్చీ పట్రా’’ అంది గౌతమి.

‘‘ఇదిగో, నేనట్టుకొస్తున్నాను అమ్మాయ్‌గోరూ!... ’’ అంటూ గౌరియే ఓ కుర్చీ తెచ్చి వేసింది సుమకి.

‘‘ఓహోఁ... వెంట నీచెలికత్తె కూడా వచ్చిందన్నమాట’’ సుమ వంక ఓరగా చూసి నవ్వుతూ అంది గౌతమి.

‘‘మరే... ఆవిడ రాకుమారి కదా! వెంట చెలికత్తె లేకుండా ఓ క్షణం కూడా గడవదాయె...’’

ఎవరా మాట్లాడేది అన్నట్లుగా గౌతమి సుమ ఇద్దరూ ఉలికిపాటుతో తలెత్తి చూశారు.

పైన బాల్కనీలో నుంచి పెరట్లోకి చూస్తూ నిల్చున్న సారథి కన్పించాడు నవ్వు ముఖంతో.

‘‘ఓహో... తమరా? ఈ వేళప్పుడు ఇంట్లో వున్నారే తమరు. ఏమిటి విశేషం?...’’ బావ వంక ఓరగా చూస్తూ చిన్నగా నవ్వింది సుమ.

‘‘ఏమిటో ఆ విశేషం నేను కిందికి వచ్చి చెప్తానుండు’’ అక్కడి నుండి కదిలాడు సారథి.

‘‘ఆ విశేషం నేను కిందికి వచ్చి చెప్తాను అని అన్నయ్య అంటున్నాడు గానీ, అదేమిటో నేను చెప్పనా సుమా ఇప్పుడే. నీవీరోజు ఇక్కడికి వస్తావనే అన్నయ్య ఎక్కడికీ వెళ్ళకుండా ఇంట్లోనే ఉండిపోయాడు...’’ సుమకేసి ఓరకంట గమనిస్తూ ముసి ముసిగా నవ్వుతూ అంది గౌతమి.

అంతలోనే అన్నపూర్ణమ్మ కాఫీలకి రమ్మని లోపలినుంచే అందరినీ కేకేసి పిలిచింది బిగ్గరగా.

కట్టిన పూలమాలని రెండు భాగాలుగా చేసి ఒకటి తన తల్లో పెట్టుకొని మరొకటి సుమ తల్లో తురిమి కుర్చీలో నుంచి లేచింది గౌతమి.

గౌరి నూతి దగ్గరికెళ్ళి అంట్ల సామాను కడుగుతున్న రత్తాలుకి ఆ పనిలో సాయం చేయసాగింది కబుర్లాడుతూ.

“పద పద... అన్నయ్య కిందికి దిగి వచ్చాడులా ఉంది. మనం కూడా వెళ్దాం. అమ్మ పిలుస్తూంది” అంటూ గౌతమి సుమ చేయి పట్టుకొని లోపలికి లాక్కొని వెళ్ళింది.

సుమ వాళ్ళింటి నుంచి తీసుకొచ్చిన ఫలహారాలను ప్లేట్స్‌లో పెట్టి అందరికీ ఇచ్చింది అన్నపూర్ణమ్మ.

“ఇవెక్కడివి? ఈ స్వీట్స్... జంతికలు. నువ్వు చేశావా అమ్మా?” కొంచెం ఆశ్చర్యంగా అడిగాడు సారథి.

“అబ్బే, నేనేం చేయలేదురా వాళ్ళింటి నుంచి సుమ పట్టుకొచ్చింది”.

“ఓహో...” సుమకేసి ఓరగా చూసి అదోలా గొణిగాడు సారథి.

“అత్తయ్యా! ఇది నా కొద్దు...” అంటూ సుమ తన ప్లేట్‌ని తిరిగి అన్నపూర్ణమ్మ గారికి అందివ్వబోయింది.

“అయ్యో! అదేమిటే వద్దాంటావ్. కాస్తయినా తిను” అన్నారావిడ.

“పిన్నికి ఏం పని ఉండదు వాళ్ళింట్లో. కొత్తరకం స్వీట్స్ అంటూ అస్తమానం ఏవేవో వంటకాలు చేస్తూనే ఉంటుంది. ఏ పనీపాటలేని ఈ రాకుమారిగారు ఆ స్వీట్స్ తినితిని ఇలా ఒళ్ళు పెంచేసుకుంటుందని ఆ మధ్య ఓ మారు వాళ్ళింట్లో అన్నాను నేను. అందుకనే ఈ రోజు నా ఎదురుగుండా తిననంటుందే అమ్మా! తిను తిను... మరేం ఫర్వాలేదులే నీ వెంత లావెక్కినా పెళ్ళిచేసుకోవడానికి నేను రెడీగానే ఉన్నానుగా...” నవ్వుతూ అంటున్న సారథి వంక గుర్రుగా చూసింది సుమ.

“ఇదిగో బావా! నువ్వేం నన్ను దెప్పనక్కరలేదు. నాకంటె కూడా నువ్వే డబుల్ లావుగా ఉన్నావ్ తెలుసా?” ఉక్రోషంగా అంది సుమ.

“మగవాడు ఎంతలావుగా ఉన్నా ఏం ఫర్వాలేదుగాని, ఆడపిల్ల అలా కాదే!... పెళ్ళీడుకొచ్చిన అమ్మాయ్ నీలా ఇంత లావుగా అయిపోతే ఎవరు చేసుకుంటారు? సన్నటి నడుముతో నాజుకుగా పూతీగలా మెరుపు తీగలా..”

“ఆపావు నీ వర్ణనలు, వినలేకపోతున్నాను. నీవేం నన్ను చేసుకోనక్కరలేదు. ఇలా దెప్పడానికి” అంటూ గర్వంగా తల ఎగరేసింది సుమ.

“ఏమిటే, నీకు మామయ్య వేరే సంబంధాలు చూస్తున్నాడేమిటి సుమా?” గౌతమి ఉండబట్టలేక అడిగింది.

“ఇక ఇప్పట్లో పెళ్ళి వద్దు... ఇంకొన్నాళ్ళు ఆగనీ, రవీంద్ర చదువు పూర్తి కానీ అంటూ వీడిలా ఏవేవో కుంటిసాకులు చెప్తూ పెళ్ళిని వాయిదాలమీద వాయిదాలు వేస్తుంటే - చిన్నప్పటినుంచీ ఎంత అనుకున్న సంబంధం అయినా... ఎదిగిన ఆడపిల్లని ఇంట్లో పెట్టుకొని అన్నయ్య మాత్రం ఇంకా ఎన్నాళ్ళిలా ఊరుకుంటాడు గౌతమీ...” కొడుకు వైఖరిపట్ల నిష్ఠూరంగా మాట్లాడుతూ అందరికీ నీళ్ళ గ్లాసులు అందించింది అన్నపూర్ణమ్మ.

“అన్నయ్య ఈ వేసవిలో తప్పకుండా పెళ్ళి చేసుకుంటానని అన్నాడే రాత్రి నాతో” అంది గౌతమి.

“ఆఁ... వాడికేం అలాగే అంటాడు. ఆ సమయం వచ్చేసరికీ మళ్ళీ ఏవేవో మాయమాటలు చెప్తాడు”.

“నో నో... ఆరు నూరైనా-నూరు ఆరైనా ఈ వేసవిలో సుమబాలగారు తప్పకుండా పెళ్ళికూతురు అవుతుందే అమ్మా!...” అని నవ్వుతూ అంటూ సిగ్గుపడు తున్నట్లుగా తల వంచుకొని నిల్చున్న మరదలి వంక ఓరకంట చూశాడు సారథి.

“సుమ పెళ్ళికూతురు అవుతుందని అంటున్నావ్. మరి ఆ పెళ్ళికొడుకువి నీవు కాదా అన్నయ్యా?”

“సుమ పెళ్ళికూతురైతే... పెళ్ళికొడుకు బావకాక మరెవరు అవుతారు?..” అంటూ నవ్వుతూ ఎదురు ప్రశ్న వేశాడు.

“ఊఁ, సర్లే... నీ మాటలకేంగాని పొలం నుంచి నాయుడు ఇంతవరకూ ఏ కూరగాయలు పంపలేదురా. నువ్వన్నా వెళ్ళి త్వరగా పంపు. రాత్రికి వంట చేయాలి” కొడుకుకి కాఫీ గ్లాసు అందిస్తూ అందావిడ.

“వెళ్తానుగాని ఈ రోజు ఈ రాకుమారిని వాళ్ళింటికేం పంపకు. ఈ పూటకి ఇక్కడే ఉంటుందని అత్తయ్య వాళ్ళకి కబురు పంపు”.

“లేదు లేదు ... వెళ్ళాలి... నేను తప్పకుండా ఇంటికెళ్లాలి అత్తయ్యా!” అంది సుమ కంగారుగా.

“వెళ్ళుదువుగానిలే సుమా! ఈ రాత్రికి ఇక్కడనే ఉండిపో సరదాగా కబుర్లు చెప్పుకుందాం. రేపు ఉదయం నీతోపాటు నేను కూడా వస్తాను” అంది గౌతమి.

“నేనిక్కడే ఉంటానని ఇంట్లో వాళ్ళకేం తెలుసు వదినా? నాకోసం ఎదురు చూస్తూ ఉంటారు. అందుకని వెళ్ళి పోతానత్తయ్యా!”

“నీవు ఈ రోజు మీ ఇంటికేం వెళ్ళడం లేదు. ఇక్కడే ఉంటావు ఇవాల్టికి” సుమ వంక చూస్తూ ఖచ్చితంగా అన్నాడీసారి సారథి.

“ఐతే నీవిప్పుడు పొలం వెళ్ళేటప్పుడు దార్లో ఆగి ఇంటికెళ్ళి అత్తయ్యతో చెప్పు. సుమ ఈ పూటకి ఇక్కడే ఉంటుందనీ...” కొడుక్కో సలహా ఇచ్చింది ఆవిడ.

“ఫోన్ చేసి చెప్పమ్మా! నేనిప్పుడు వాళ్ళింటికెళ్ళను. నాకు చాలా పనులున్నాయి. అన్నట్లు, మన మతిమరుపు తగలడ సుమ చెలికత్తె ఇక్కడే ఉందిగా గౌరితో చెప్పి పంపండి” అని తల్లితో చెప్పేసి ఖాళీగ్లాసు టేబుల్‌పై పెట్టి మరో మాటకైనా అవకాశం ఇవ్వకుండా అక్కడినుంచి లేచాడు సారథి.

✧ ✧ ✧

ప్రభాత సమయం కావస్తోంది.

పెరట్లోని చెట్లపై పక్షుల కలకలరావాలతో మేల్కొల్పు అయింది సుమిత్రకి. మంచంపై తనని గట్టిగా కరుచుకొని పడుకొన్న చంటిదాన్ని మెల్లిగా అటు జరిపి రగ్గు తీసి దాని నిండా కప్పి నెమ్మదిగా మంచం దిగింది.

అటువైపు మంచంపై రఘురాం గుర్రుపెట్టి హాయిగా నిద్రపోతున్నాడు.

గోడవారగా ఉన్న మరో పెద్ద మంచంపై వరసవారీగా ఉన్న ముగ్గురాడ పిల్లలూ ఒకరి నడుములపై మరొకరి కాళ్ళూ... ఒకరి తలలపై మరొకరి చేతులు పెనవేసుకొని అడ్డదిడ్డంగా పడుకొని ఉన్నారు.

పిల్లలందరివైపూ సుమిత్ర ఓమారు కలియ చూస్తూ చిన్నగా నిట్టూర్చింది. ‘ఏమిటో మాయదారి భగవంతుడు! అందర్నీ ఆడపిల్లలనే పుట్టిస్తున్నాడు. అదృష్టవశాత్తూ ఈ మారన్నా మగనలుసైతే ఎంతో బాగుండేది. వంశాకురం కోసం తాము పడే ఆశానురాగాలు ఫలించేవీ, ఇటు అత్తయ్య కోరికా నెరవేరేది...’ అనుకుంటూ భారంగా అడుగులేస్తూ నిండు చూలాలైన ఆమె పెరటి వైపు దారి తీసింది.

వెనక వరండాలో నుంచి పెరట్లోకి వెళ్ళే తలుపులు బార్లాగా తెరిచే ఉన్నాయి. పెరట్లోకి తొంగి చూసింది.

ముసలి అత్తగారు గోడపట్టుకొని తచ్చాడుతూ మెల్లిగా బాత్‌రూం వైపు వెళ్ళుతూ కన్పించింది.

ముసలావిడకి అరవై ఏళ్ళు పైన్నే ఉంటాయి. చూడడానికి మనిషి బాగానే బలంగానే ఉంటుంది.కాని కళ్ళే బొత్తిగా అగుపించవు. అందుకనే ఈ మధ్య కొడుకు ఓ కంటి డాక్టర్ దగ్గరికి తీసికెళ్ళి అన్ని టెస్టులూ చేయించి కళ్ళజోడు ఇప్పించాడు. అప్పటి నుంచి ఆవిడ ఇంట్లో కళ్ళజోడు సహాయంతో బాగానే తిరగాడుతూంది. 'మరి ఇదేమిటి?... ఈ రోజు మళ్ళీ తచ్చాడుతూ నడుస్తుందేమిటి?...' ఆశ్చర్యంగా అనుకుంటూ సుమిత్ర ఆవిడ ముఖంకేసి పరీక్షగా చూసింది.

కళ్ళజోడు లేదావిడకి.

"అత్తయ్యా మీరెందుకు ఇంత పెందరాళే లేచారు? కళ్ళజోడు ఎక్కడ పెట్టారు?"

కోడలి మాటలు వినిపించగానే ఆ ముసలావిడ ఓ క్షణం ఆగి వెనుదిరిగి చూస్తూ, "నువ్వా లేచావా? బాత్‌రూంలోకి వెళ్ళుదామని లేచి వచ్చాను. నా కళ్ళజోడు రాత్రి చిన్నమ్మలు తీసింది. ఎక్కడ పెట్టిందో ఏమిటో దొరక లేదు నాకు. కాస్త వెతికి పట్రా తల్లీ! బొత్తిగా అగుపించడం లేదు..." అంటూ చెప్పింది.

"మీరిక్కడే ఉండండి. నేవెళ్ళి పట్టుకొస్తాను". సుమిత్ర గబగబా లోపలికి వెళ్ళి టేబుల్ మీద చూసింది. అగుపించలేదక్కడ... అలమార తెరచి చూస్తే అందులో కనిపించింది. కళ్ళజోడుని తన పైట చెంగుతో ఓమారు తుడిచి తెచ్చి అత్తగారి ముఖానికి అమర్చింది.

"హమ్మయ్య! ఇప్పుడిక తేలిగ్గా వెళ్ళగలను" అంటూ ముసలావిడ ఈ మారు హుషారుగా బాత్‌రూం వెళ్ళింది.

ఏడింటికల్లా ఇంట్లో పిల్లలందరూ నిద్రలేచారు.

అప్పటికే తన స్నానం పూజా ముగించుకొని కాఫీ టిఫిన్ రెడీ చేసింది సుమిత్ర.

పనిపిల్ల పంకజం వచ్చి ఇల్లూ వాకిలి ఊడ్చి కళ్ళాపి చల్లింది.

రాత్రి అంట్ల సామానంతా కడిగేసి డైనింగ్ టేబుల్ శుభ్రం చేసింది.

పిల్లలందరికీ స్నానాలు చేయించి డ్రెస్సులు వేసి ముఖాలకి పౌడర్ గట్రా రాసి వాళ్ళని చాలా నీట్‌గా తయారు చేసింది పంకజం.

ఆ తరువాత సుమిత్ర అందరికీ కాఫీ టిఫిన్ అందించింది.

చంటిదానికి పాలు కలిపి పట్టింది.

“బాక్సుల్లో అన్నం పెట్టేయ లేదా అమ్మా?” ఖాళీ డబ్బాలు చూపిస్తూ అడిగారు పిల్లలు తల్లిని.

“మరే, ఈ రోజు నేనింకా వంట చేయలేదమ్మలూ! మధ్యాహ్నం వరకూ నేను పంకజంతో మీ అందరికీ క్యారియర్ పంపిస్తానుగా” అని సర్దిచెప్పి పిల్లల్ని స్కూల్‌కి పంపించి వేసింది పనిపిల్ల వెంట.

“ఒసే పంకజం! నువ్వు మళ్ళీ త్వరగా తిరిగిరా! బజారుకెళ్ళి కూరకాయలు తీసుకురావాలి...” అంటూ వెనకాల నుంచి ఓ కేక వేసింది సుమిత్ర.

కాఫీ చప్పరిస్తూ అక్కడే కూర్చున్న ముసలావిడ “అబ్బాయ్ ఇంకా నిద్రలేవ లేదా?” అడిగింది కోడలిని.

“లేదు. లేవలేదు...”

“ఏం. ఆఫీసుకు వెళ్ళడా?”

“ఈరోజు ఆఫీసుకు సెలవు పెట్టారు అత్తయ్యా. అందుకని ఇంకా తీరుబాటుగా పడుకున్నారు.”

“ఎక్కడికైనా వెళ్ళాలా?”

“నన్నీరోజు హాస్పిటల్‌కి తీసికెళ్ళుతానన్నారు. అందుకని సెలవు పెట్టారు. ఏమిటో నిన్నటి నుంచి ఒంట్లో నలతగా ఉంటూంది. నడుం నొప్పి కూడా బాగా ఉంది. అందుకని ఓమారు వెళ్ళి పరీక్ష చేయించుకుందామనీ...” అంటూ సుమిత్ర జడ విప్పుకొని తీరిగ్గా జుత్తుకి నూనె రాసుకోసాగింది.

“నడుము నొప్పి అంటున్నావ్ తొందరలోనే పురుడు వస్తుందేమో!... సమయానికిప్పుడు ఇంట్లో వంటమనిషి కూడా లేదాయె! పనంతా నువ్వే చేసుకోవాల్సి వస్తూంది. ఇలాంటి సమయంలో ఆవిడని నీవు ఊరెందుకు పంపావో నాకర్థం కావడం లేదు. ఎప్పుడు వస్తుందో ఏమో?...” ముసలావిడ కాస్త దిగులుగా అంది.

“మనింట్లో వంట చేస్తున్నంత మాత్రాన ఆవిడ ఆశలు కోరికలు అన్నీ చంపుకొని జీవచ్ఛవంలా బతకాలా? ఆవిడా మనలా ఓ మనిషే కదా అత్తయ్యా! దగ్గరి చుట్టాలింట్లో పెళ్ళనీ, తప్పకుండా తానా పెళ్ళికి వెళ్ళాలని ఎంతగానో బతిమాలుకొని అడిగితే కాదనలేకపోయాను. రెండు మూడు రోజుల్లో తిరిగి వస్తానంటే ‘పోనీలే... వెళ్ళిరానీ’ అనుకొని పంపాను”.

"ఏదీ ఇవాల్టికి ఆవిడ వెళ్ళి వారం రోజులైంది. ఇంతవరకూ పత్తాలేదా మనిషి! అసలు వస్తుందో లేదో?..." ముసలావిడకి అనుమానం.

"ఆవిడ అట్లా ఎప్పటికీ చేయదత్తయ్యా, తప్పకుండా వస్తుంది" కోడలి నమ్మకంతో కూడిన మాటలవి. మళ్ళీ తానే అంది- "అంతగా అవసరమైతే మన పక్కింటి సుగుణమ్మ పిన్నిగారు ఉన్నారుగా ఏదైన సహాయం చేయడానికి".

"ఆఁ, ఆవిడేం చేస్తుంది లెద్దూ! తన పిచ్చికొడుకుతో వేగలేక పని తెమలక చస్తుంది. నీకా పురిటి రోజులు సమీపిస్తున్నాయి. ఇంట్లో వంట మనిషి లేదు. నాకా ఏ పనీ అంతగా చేతగాదు. పిల్లలేమో పసివాళ్ళు. ఆ పనిపిల్ల ఒక్కత్తి ఎంతని చేయగలదు చెప్పు? ఎట్లానో ఏమిటో?..." కొంచెం దిగులుగా అంటున్న ముసలా విడకి వెంటనే మెరుపులా ఓ ఆలోచన వచ్చింది.

"అమ్మాయ్ సుమిత్రా! పోనీ, ఓ పని చేస్తేనో?" ఉత్సాహంగా అంది.

"ఏమిటది అత్తయ్యా?" ఆశ్చర్యంగా అడిగింది సుమిత్ర.

"మీ చిన్న చెల్లెల్ని కొద్దిరోజులపాటు ఇక్కడికి పంపమని మీ వాళ్ళకి ఓ లెటర్ రాస్తేనో?..."

"నిన్న నేనూ ఇదే సంగతి అన్నాను మీ అబ్బాయి గారితో కానీ, 'ఆఁ... మీ వాళ్ళేం పంపించరు' అంటూ నా మాటల్ని చాలా తేలిగ్గా తీసిపారేశారు."

"ఎందుకు పంపించరు? తప్పకుండా పంపిస్తారు. అబ్బాయ్ మాటలకేం గాని, నా మాటగా ఈ రోజే మీ వాళ్ళకి ఓ ఉత్తరం ముక్కరాసి పడేయ్ లేదా ఫోన్ చేసి మాట్లాడు" ఖచ్చితంగా అంది ముసలావిడ.

"సరే... అట్లాగే మాట్లాడుతానుగానీ, మిమ్మల్ని నేనో మాట అడుగుతాను. కాదనకూడదత్తయ్యా!" తలవంచుకొని జడ చివర్లని దువ్వెనతో అదేపనిగా దువ్వుతూ అంది సుమిత్ర మెల్లని స్వరంతో.

"ఏమిటది?" ముసలావిడ ఆశ్చర్యంగా చూడసాగింది.

"ఈమారు బాబు పుట్టినా పాపపుట్టినా నేను తప్పక ఆపరేషన్ చేయించు కుంటానత్తయ్యా! మీరు కాదనకూడదు".

ముసలావిడ దీర్ఘంగా ఓ నిట్టూర్పు విడిచింది. "ఈమారు... ఈమారు అంటూ నేను వంశాంకురం కోసం ఆశపడ్డం మూలానే ఇప్పటికీ వరసగా నల్గురు ఆడపిల్లలకి తల్లివైనావ్. ఈసారి నాకెందుకో గట్టి నమ్మకం ఉంది సుమిత్రా!

తప్పకుండా నీకీ మారు బాబే పుడ్తాడు; నా కోరిక తీరుస్తాడు. మీ మామగారి తాతగారి కాలం నుంచి కూడా అందరికీ ఒక్కడే కొడుకట. అది వంశాచారమో ఏమిటో?... ఆ లెక్కన అయినా నీకీ మారు ఆనవాయితీ ప్రకారం కొడుకు పుట్టి మన వంశం నిలబెట్టాలి. తప్పకుండా ఆ భగవంతుని దయవలన బాబే పుట్టాలి. నా తుది కోరిక తీరాలి'' ఎంతో నమ్మకంగా ఆశగా అంటున్న అత్తగారికేసి జాలిగా చూసి చిన్నగా నిట్టూర్చింది సుమిత్ర.

''బాబు పుట్టినా పుట్టకపోయినా నేను మాత్రం తప్పకుండా ఆపరేషన్ చేయించుకుంటాను ఈమారు. తప్పనిసరిగా వంశాంకురం కావాలని మీకంత పట్టుదలగా ఉంటే మీ అబ్బాయికి మళ్ళీ పెళ్ళి చేయండి. ఇందుకు నాకెంత మాత్రం అభ్యంతరం లేదు. కావాలంటే మీకిప్పుడు అలా రాసివ్వమన్నా రాసిస్తాను. క్రితం చంటిది పుట్టినప్పుడే డాక్టర్‌గారు ఇకనైనా ఆపరేషన్ చేయించుకోమని అడిగింది. ఈసారి కూడా చేయించుకోకపోతే కోపావేశాలతో ఆవిడ నానా చీవాట్లు పెడ్తుంది.

ముసలావిడ ఓ క్షణం ఏం మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నట్లుగా మౌనం వహించి... ఆ తరువాత తలెత్తి కోడలి వంక అపేక్షానురాగాలతో చూస్తూ, ''ఈసారి నేనేమీ అడ్డుచెప్పను అమ్మాయ్. తప్పకుండా చేయించుకో ఆపరేషన్'' మనస్ఫూర్తిగానే అందావిడ.

అంతలోనే స్కూల్‌కి వెళ్ళిన పంకజం తిరిగి వచ్చింది.

ఆపరేషన్‌కి అత్తగారు అంగీకారం తెల్పగానే సుమిత్ర ముఖం సంతోషంతో విప్పారింది. చేతిలోని దువ్వెన్ని టేబుల్ మీద పడేసి హుషారుగా లోపలికెళ్ళి డబ్బులు, సంచీ తెచ్చి బజారులోనుంచి ఏమేమి కావాలో కూరగాయల లిస్ట్ చెప్పి పంపింది పంకజాన్ని.

''సుమిత్రా!'' గదిలో నుంచి రఘురాం పిల్చాడు భార్యని.

''అదిగో, అబ్బాయ్ లేచాడులా ఉంది. వెళ్ళి చూడు... పిలుస్తున్నాడెందుకనో'' అందావిడ కోడల్ని ఉద్దేశించి.

''ఏమిటీ?''... అంటూ గదిలోకి వెళ్ళింది సుమిత్ర.

''టైం ఎంతయింది?'' బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ అడిగాడు భార్యని.

''టైం కేం... బాగానే అయిందిగాని తమరిక త్వరాగా లేవండి. రాత్రి మందు మత్తు ఇంకా వదలలేదా ఏమిటి? హాస్పిటల్‌కి వెళ్ళుదామన్నారుగా''.

"వెళ్ళుదాం లేవోయ్!  తొందరేముంది. పదింటికిగాని నర్సింగ్‌హోంకి ఆ లేడీ డాక్టర్ రాదాయె! మనం ముందుగా అక్కడికి వెళ్ళి కూర్చొని ఏం చేయాలి? ఊఁ సరేగాని ఆ టేబులుపై సిగరెట్టు పెట్టె మ్యాచ్ బాక్స్ ఉంది. ఇలా పట్రా".

భర్తకు వాటిని తెచ్చి ఇచ్చి "సరే ఐతే నేనీలోగా వంట ప్రయత్నాలు మొదలు పెడతాను" అంటూ సుమిత్ర వంటింటి వైపు వెళ్ళింది.

✧ ✧ ✧

ఆకాశమంతా నల్లనికారు మేఘాలు దట్టంగా అలముకొని ఉన్నాయి. ఇప్పుడో ఇంకాసేపటికో పెద్దపెట్టున భోరున వర్షం కురిసేలా ఉంది వాతావరణం.

అలాంటి సమయంలో పచ్చని చేల మధ్య ఛెంగు ఛెంగున గంతులేస్తూ హుషారుగా పరిగెత్తుతూన్న సుమ, ఆ ఆకుపచ్చని చీరలో నిజంగా వనకన్యలాగే ఉంది.

"ఇదిగో... సుమా! చిన్నపిల్లలా పొలాల వెంట ఏమిటా పరుగులు? వర్షం కురిసేలా ఉంది. ముందు నువ్విలారా!..." వెనకాల నుంచి మరదల్ని ఓ కేకేశాడు సారథి.

అయినా కూడా సుమ అతని మాటల్ని లెక్కచేయకుండా నవ్వుతూ తుళ్ళుతూ అట్లాగే లేడిపిల్లలా ముందుకు పరిగెత్తసాగింది.

అంతలోనే పెద్దపెట్టున టపటపమంటూ వర్షపు చినుకులు పడనారంభించాయి.

"ఏయ్ సుమా! నిన్నే ఇలా రా..." అంటూ గదమాయించినట్లుగా పిలిచాడు సారథి.

చల్లని గాలులు మనస్సుకి హాయి గొల్పేలా మత్తుగా రివ్వున వీస్తున్నాయి. పెద్ద పెద్ద చినుకులతో పడుతూన్న వర్షం క్షణంలో ధారగా మారిపోయింది.

వెనుదిరిగి వస్తున్న సారథి తడుస్తూనే "ఏయ్ పిల్లా! వచ్చేసేయ్ త్వరగా మరదల్ని మళ్ళీ ఓమారు కేకేశాడు బిగ్గరగా.

అప్పటికే బాగా తడిసిపోయింది సుమ. తడిసి ముద్దైన చీర కాళ్ళకి బంధం పడుతూ టపటపమని కొట్టుకుంటుంటే - మెల్లిగా అడుగులో అడుగులేస్తూ వెనుదిరిగి రాసాగింది.

"అబ్బ! వర్షంలో అలా వెళ్ళుతూ ఉంటే నా కెంతో హాయిగా ఆనందంగా ఉందో చెప్పలేను బావా! నీవేమో ఏమిటలా రా, రమ్మంటూ ఒహటే గొడవ

చేస్తున్నావ్?...'' అంటూ చిరుకోపం ప్రదర్శిస్తూ చీర కుచ్చెళ్ళు గట్టిగా పిండి విదిలించింది.

''ఆఁ, నీకలాగే హాయిగానే ఉంటుంది. కాని రేపు నీకు ఇలా వర్షంలో తడిసినందుకు ఏ జలుబో, జ్వరమో వచ్చిందా... ఇక మీ వాళ్ళంతా నన్నే తిట్టి పోస్తారు. పద పద లోపలికి'' అంటూ సుమ చెయ్యి పట్టుకొని బలవంతంగా లోపలికి తీసికెళ్ళాడు.

పొలం దగ్గర ఉన్న సారథి విశ్రాంతి గృహం అది!...

ముందు చిన్నది పొడవాటి వరండా ఉంది. లోపల ఓ చిన్న గదిలా ఉన్న రేకులషెడ్డు అది. సుమ లోపలికి వస్తూ ఓమారు చుట్టూతా కలియ చూసింది.

కింద నేలంతా గచ్చుతో శుభ్రంగా ఉంది.

ఎదురుగుండా ఓ పెద్ద కిటికీ... ఆ కిటికీ పక్కనే గోడవారగా మంచం లాంటి ఓ పొడవాటి బల్లపీట... దానిపై వేసిన పరుపుపై పసుపు తెలుపు గళ్ళు వున్న దుప్పటి పరచి ఉంది. దానిపై ఉన్న తలగడ కవరుకి అటు ఇటు ఎంబ్రాయిడరీ చేసిన హంసలు చూపరులని ఆకట్టుకునేలా ఉన్నాయి.

గోడకి ఇటు వైపు ఓ చిన్న స్టూల్, దానిపై నీళ్ళతో ఉన్న కూజా... పైన ఓ గాజుగ్లాసు బోర్లించి ఉంది. అటువైపు గోడకున్న చిన్నపాటి అలమారలో నుంచి ఓ టవల్ తీసి మరదలికిచ్చాడు సారథి.

''మరి నీకో బావా! నీ తల కూడా తడిసిందిగా...'' అంటూ సుమ రెండడుగులు ముందుకు వేసి అతన్ని సమీపించింది. ''ఇదిగో, నీవిలా మంచంపై కూర్చో బావా! ముందుగా నీ జుత్తు తుడిచి ఆనక నేను తుడుచుకుంటాను''.

''వద్దు... నాకేం అక్కరలేదు. నావేం నీలా బారెడు కురులు కావు. ఆ జడ విప్పి ముందుగా నువ్వే జుత్తు తుడుచుకో''.

''ఐతే నేనేం తుడుచుకోను. ఇలాగే ఉంటాను...'' చిన్నపిల్లలా బుంగమూతి పెట్టి కోపంగా అంది సుమ.

''ఇదిగో, ఈ మొండి పట్టే వద్దంటాను నీకు. నా ఈ శరీరం ఉక్కులాంటిది. నాకేం జ్వరాలు... జలుబులు రావు. ఒకవేళ వచ్చినా మీ వాళ్ళలాగా మా అమ్మేం అంతగా కంగారు పడదు...'' అంటూ తడిసిన షర్టు విప్పి కిటికీ రెక్కపై వేశాడు.

“ఐతే వర్షంలో తడిస్తే జ్వరాలు, జలుబులు వచ్చేది నాకేనన్నమాట. చూద్దాం. ఎలా వస్తుందో. నేనేం తుడుచుకోను...” చేతిలోని టవల్‌ని అతినిపై పడేలా విసిరి కొట్టింది.

ఆ టవల్ని కిందపడకుండా సారథి ఒడుపుగా పట్టుకొని “ఛ ఛ! నీతో వేగలేను తల్లీ! ఇప్పుడే ఇట్లా సతాయిస్తావ్? పెళ్లైతే ఇంకెంతో...” సుమకేసి ఓరగా చూస్తూ తానే ముందుగా తల తుడుచుకోసాగాడు.

“ఆహాఁ... అలా కాదు. నేను తుడుస్తానుండు” అని నవ్వుతూ సుమ ముందు కొచ్చి అతని చేతిలోనుంచి టవల్ లాక్కొని బలవంతంగా మంచంపై కూలదోసి తానే స్వయంగా అతని తల తుడవసాగింది.

“ఇదేమిటి? నాకు తుడుచుకోవడానికి రాదా?” మంద స్వరాన అంటూ తనకి దగ్గరగా మోకాళ్ళ మధ్యన పూర్తిగా తడిసి ఒంటికి అత్తుకపోయిన దుస్తులతో నిల్చున్న సుమని నుదిటిపైనుంచి అడ్డుపడుతున్న జుత్తుకొసల నుంచి అపురూపంగా క్రీగంటగా చూస్తూ కాళ్ళని బార్లాగా జాపి... ఆమె మోకాళ్ళ చుట్టూ పెనవేసి అటు ఇటు కదలకుండా బంధించాడు. అదే క్షణంలో తన రెండు చేతులూ ఆమె సన్నని నడుం చుట్టూ పోనిచ్చి గబ్బుక్కున బలంగా ముందుకు లాక్కున్నాడు.

అనుకోని ఆ హఠాత్తు సంఘటనికి సుమ అతనిపై వాలిపోయింది.

కావాలనో... లేక సుమ తనపై పడిన విసురుకో ఆమెతోపాటు మంచంపై అడ్డంగా పడిపోయాడు సారథి. సుమ చేతిలోని టవల్ కిందికి జారిపడింది. అతనామెను మరింత దగ్గరగా లాక్కున్నాడు. హృదయమంతా పొంగిపొరలుతున్న ప్రేమానురాగాలతో ఆర్తిగా ఆమెను గుండెలకు హత్తుకున్నాడు. సుమ చేతులు తనకి తెలియకుండానే అతని మెడ చుట్టూ జంట సర్పాల్లా పెనవేసుకొని పోయాయి. అతని నుంచి వస్తున్న ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆమెకు వేడిసెగలా తగులుతున్నాయి. ఆమె బుగ్గలపై నుదుటిపై పిచ్చిగా ముద్దుల వర్షం కురిపించసాగాడు.

మందార మొగ్గల్లా ఎర్రబడిన బుగ్గలతో సుమ సిగ్గు బరువుతో అరమోడ్పు కన్నులతో చూస్తూ అతని చర్యల్ని వారించబోతున్న ఆమె పల్చని పెదవులకి ఆ అవకాశం ఇవ్వకుండా తన పెదాలతో సుతారంగా ఆమె నోరు మూశాడు.

అంతట్లోనే బయటినుంచి “బాబుగారూ!...” అంటూ ఖాసీం కంఠం వినవచ్చింది.

ఉలిక్కిపాటుతో ఒక్కసారిగా ఈ లోకంలోకి వచ్చిన సారథి సుమని పక్కకి నెట్టి గబుక్కున మంచం దిగి బయటికెళ్ళిపోయాడు.

"పంపుసెట్ కట్టేసాను మోటారు రూం తాళం వేశానండి. ఇంద తాళాలు. అన్నట్లు అమ్మాయిగారు వెళ్ళిపోయారా బాబుగారూ?"

ఏం మాట్లాడాలో ఓ క్షణం తోచలేదు సారథికి.

"ఉంది" అన్నాడు ముక్తసరిగా.

"అమ్మాయ్‌గారికి ఇష్టమని దోరదోర జామకాయల్ని తెచ్చాను" అంటూ భుజంపైని తుండు మూటని విప్పసాగాడు ఖాసీం.

"సర్లే వాటిని స్కూటర్ బాక్స్‌లో వేసేయ్ వర్షం కాస్త తగ్గినట్లుంది వెళ్ళాలిక."

"అలాగే బాబుగారూ!" అంటూ ఆ జాయకాయల్ని స్కూటర్ బాక్స్‌లో పెట్టసాగాడు ఖాసీం.

తిరిగి లోపలికెళ్ళడాని కెందుకో సారథికి ధైర్యం చాలడం లేదు. ఏదో తప్పుచేసిన వాడిలా ఫీలవ్వసాగాడు- "సమయానికి ఖాసీమ్ వచ్చాడు. అతను రావడం వలన సరిపోయింది. లేకపోతే సుమనీ..." ఇక ఆపైన ఆలోచించలేక పోయాడు. ఆపాటి నిగ్రహం లేకుండా ఎట్లా ప్రవర్తించానా అన్నట్లుగా లోలోన బాధపడసాగాడు.

మెల్లిగా లోపలికెళ్ళాడు సారథి.

సుమ అప్పటికే జుత్తు విరబోసుకొని టవల్‌తో తాపీగా తుడుచుకుంటూ ఉంది.

"వర్షం కాస్త తగ్గింది. త్వరగా ఇంటికెళ్దాం పద సుమా!..." అంటూ కిటికీ రెక్కపైన వేసున్న షర్టు అందుకొని గబగబా వేసుకొని... స్కూటర్ తాళాలు తీసుకొని ఆమెవైపు చూడకుండానే మళ్ళీ బయటికెళ్ళిపోయాడు.

తానింకా అక్కడే ఉంటే ఇంకేం ప్రమాదమో అన్నట్లుగా ఇంటికెళ్ళడానికి తొందర పడుతున్న సారథి వాలకానికి సుమ లోలోన ముసిముసిగా నవ్వుకుంది.

ఇంతలో బయట స్కూటర్ స్టార్ట్ అయిన శబ్దం వినవచ్చింది.

తడి జుత్తును చేతితో ఓమారు గట్టిగా విదిల్చి... జారుముడిగా వేసుకొని బయటికొచ్చిన సుమ..... సారథి వెనకాల వెళ్ళి కూర్చోగానే స్కూటర్ రయ్యిన ముందుకు దూసుకుపోయింది.

ఖాసీం ఓ క్షణం వాళ్ళు వెళ్ళిన వైపే చూసి, షెడ్ తాళం వేయడానికి అక్కడి నుంచి కదిలాడు.

✧ ✧ ✧

సాయంకాలం వాకిట్లో ఉన్న మల్లెపందిరికి నిచ్చెన వేసుకొని మొగ్గల్ని తుంచుతూంది సుమబాల. చేతిలోని మొగ్గల్ని పైట చెంగులో వేసుకుంటూ అప్రయత్నంగా తలెత్తి ముందుకు చూసింది.

చేతిలో ఏదో ఓ చిన్న బుట్టపట్టుకొని ఇటే వస్తున్న అన్నపూర్ణమ్మ అల్లంత దూరంలో కనబడింది.

సుమ గబగబా నిచ్చెన దిగి చిన్నపిల్లలా ఇంట్లోకి పరిగెత్తింది.

అంతకుముందే పొలం నుంచి వచ్చిన వెంకట్రామయ్యగారు మధ్యహాల్లో ఉన్న ఉయ్యాల బల్లపై కూర్చుని తాపీగా టీ తాగుతున్నారు.

ఆదరాబాదరాగా లోపలికి పరిగెత్తుకొస్తున్న కూతుర్ని విస్తుబోయి చూస్తూ "ఏమిటమ్మా సుమా! ఏమైంది?... ఎందుకలా పరిగెత్తుతూ వస్తున్నావ్?" కంగారుగా అడిగాడాయన.

"మరేఁ నాన్నా! అత్తయ్య..... పూర్ణమ్మ అత్తయ్య వస్తూంది మనింటికి....." ఆనందోత్సాహాలతో చెప్పింది సుమ.

"ఎవరూ మన అన్నపూర్ణే!..." ఆశ్చర్యంగా అంటూ తాగుతున్న టీని ఒక్క గుక్కలో ముగించి, ఖాళీగ్లాసు కింద పెట్టి బల్లమీది నుంచి లేచి చెల్లెలికి ఎదురెళ్ళా డాయన వాకిట్లోకి.

అప్పటికే అన్నపూర్ణమ్మ గేట్ తీసుకొని లోపలికి వచ్చేసింది. ఎదురుగా అగుపించిన వెంకట్రామయ్యని నిలువెల్లా పరికిస్తూ "బాగున్నావా అన్నయ్యా? ఒంట్లో ఎలా ఉందిప్పుడు?" నిండైన నవ్వుముఖంతో అడుగుతున్న అన్నపూర్ణమ్మ గొంతుకలో ఎనలేని ఆప్యాయత... మమతానురాగాలు పొంగిపొరలుతున్నాయి.

"ఆఁ, ప్రస్తుతం బాగానే ఉంది ఒంట్లో, నీవేమిటి ఇలా హఠాత్తుగా వచ్చావ్? అంతదూరం నుంచీ... ఏదైనా అర్జంట్ పనుంటే ఎవరితోనైన కబురుపెట్టక పోయావా పూర్ణా? నేనే వచ్చేవాడినిగా అక్కడికి" అనునయంగా అంటూ ఆమె చేతిలోని బుట్టని తాను తీసుకున్నాడాయన.

"ఈ రోజు గుడికెళ్ళానన్నయ్యా! అట్నుంచి సరాసరి ఇక్కడికే వచ్చాను. అన్నట్టు, వదిన బాగుందా? కాళ్ళ నొప్పులు తగ్గాయా?" అడుగుతూ హాల్లోకి ప్రవేశించింది.

అప్పటికే సుమబాల ద్వారా అన్నపూర్ణమ్మ వచ్చిందన్న వార్త వినగానే సుశీలమ్మ, రుక్మిణి చేస్తున్న పనులు వదిలేసి ఆదరా బాదరాగా ఇవతలికి గబగబా పరిగెత్తుకొచ్చినట్లు వచ్చారు.

"ఏమిటక్కయ్యా! బాగున్నావా?" అన్నపూర్ణమ్మని నవ్వుతూ సాదరంగా పలుకరించింది రుక్మిణి.

ఉండేది ఒకే ఊరైనా ఒకరింటికి ఒకరు వెళ్ళి కల్సుకునేది ఏ నెల రెండు నెలలకోసారి కాబట్టి, ఏదో ఊరునుంచి వచ్చినట్లుగా వాళ్ళు పలుకరించుకోవడాలు పరిపాటే.

"ఈ రోజు నాకెంతో ఆనందంగా ఉందొదినా! ఇన్నాళ్ళకీ ఆ భగవంతుడు నాదో కోరికను నెరవేర్చబోతున్నాడు. అందుకనే ముందుగా గుడికెళ్ళి అర్చన చేయించి ఇలా వస్తున్నాను. ఆ బుట్టలో ప్రసాదం ఉంది. తీసి అందరికీ ఇవ్వు".

"నిన్నీరోజు చూడగానే అనుకున్నాను నీవేదో ఆనందోత్సాహాల్లో మునిగి ఉన్నావనీ, ఇంతకీ ఏం కోరిక నెరవేరబోతుందే అక్కయ్యా?" రుక్మిణి నవ్వుతూనే అడిగింది అన్నపూర్ణమ్మని.

"ఆ శుభవార్తేమిటో చెప్తానుగా ముందు అందరూ ప్రసాదం తీసుకోండి".

కళ్ళకద్దుకొని వాళ్ళంతా గబగబా ప్రసాదం తీసుకున్నారు.

అన్నపూర్ణమ్మ నోట్లో నుంచి వచ్చే ఆ శుభవార్త ఏమిటోనన్న ఆరాటం, ఆత్రుత శ్రోతలందరి హృదయాల్ని ఉక్కిరి బిక్కిరి చేయసాగింది.

'ఒకవేళ బావగారి ఆచూకీ ఏమైనా తెల్సింది కాబోలు! అందుకనే అక్కయ్య ఇంతలా ఉత్సాహపడుతూంది' అనుకొంది మనస్సులో.

"త్వరగా చెప్పమ్మా పూర్ణా! ఏమిటా శుభవార్త? కేశవరావు విషయం ఏమైనా తెల్సిందా?" రుక్మిణి మనస్సులోని మాటని వెంకట్రామయ్యగారు పైకే అడిగేశాడు చటుక్కున.

ఆ మాట అడగ్గానే అన్నపూర్ణమ్మ వదనంలో క్షణకాలంపాటు విషాద చ్ఛాయలు అలుముకున్నాయి. అది కాదన్నట్లుగా తల అడ్డంగా ఆడించింది.

“సారథి పెళ్ళికి ఒప్పుకున్నాడు”.

ఆ మాట వింటూనే శ్రోతలంతా ‘హమ్మయ్య’ అన్నట్లుగా గుండెల నిండా తృప్తిగా గాలి పీల్చుకున్నారు.

ఎంత మేనరికం అయినా సారథి సుమని చేసుకుంటాడో లేదో?... పెళ్ళి ఇప్పట్లో వద్దంటూ వాయిదాలు వేస్తున్నాడని మదిలో కొంచెం శంకిస్తున్న వారి భయాందోళనలన్నీ ఆ మాటతో ఒక్కసారిగా విహంగాల్లా ఎగిరిపోయాయి.

సుమబాలని తప్పనిసరిగా తన కోడలుగా చేసుకుంటానని వాళ్ళన్నా వదినలకి మాటిచ్చింది అన్నపూర్ణమ్మ. కొడుకు తన మాట నెరవేరుస్తాడా లేదా?... వీడస్సలు ఇప్పట్లో పెళ్ళే వద్దంటూ వాయిదాలు వేస్తున్నాడని మదిలో కొంచెం శంకిస్తున్న వారికి దిగులైన సంశయంతో హృదయాంబరాన్ని ఆవరించుకొన్న దట్టమైన కారు మేఘాలన్నీ ఈ రోజు ఉదయం కొడుకు పెళ్ళి ముహూర్తం పెట్టించమని చెప్పిన ఆ చల్లని శుభవార్త వినగానే పెద్ద పెట్టున వీచిన గాలికి కమ్ముకొన్న కారు మేఘాలన్నీ చెదిరిపోయి స్వచ్ఛమైన వినీలాకాశం బయటపడినట్లుగా తెరిపిన పడిందావిడ మనస్సు ఈనాడు.

అందుకని అన్నపూర్ణమ్మ ఆనందానికి అవధుల్లేవు.

“రేపే శాస్త్రిగార్ని పిలిపించి ముహూర్తాలు ఎప్పుడున్నాయో కనుక్కుంటా నమ్మా పూర్ణా!...”

ఆ శుభవార్త సుమబాల చెవులకి సోకగానే శరీరమంతా తీయని మధురమైన భావంతో పులకించిపోయింది. ఆమె ముఖంలో ఆ కళ్ళల్లో ఒక్కసారిగా వెన్నెల దీపాలు దోబూచులాడసాగాయి. చేతిలోని పూలమాలని అలాగే సుతారంగా పట్టుకొని బుగ్గలకాన్చుకొని అరమోడ్పు కన్నులతో మైమరచి పోయిందోక్షణం.

కాని అక్కయ్యా, ఈ నెల వచ్చే నెలంతా మూఢాలే ఉన్నాయని మొన్నోరోజు శాస్త్రిగారు ఎవరితోనో అంటుంటే విన్నాను. బహుశా రెండు నెలల తరువాత తప్ప... ఇప్పట్లో ముహూర్తాలే లేవనుకుంటాను”.

“పోనీ రెండు నెలలు అయ్యాకనే అవ్వనీ..... తొందరేముంది. ఇన్నాళ్లూ ఆగి ఇక ఈ రెండు నెల్లు ఆగలేమా? అన్నట్లు సుమ ఏదీ..... ఇట్లా పిలుపు రుక్మిణీ!...”

క్షణంలో రుక్మిణి లోపలికెళ్ళి సిగ్గుల మొగ్గలా ముడుచుకు కూర్చున్న మేనకోడల్ని రెక్కపట్టి ఇవతలికి తీసుకవచ్చి వాళ్ళక్కయ్య చేతికందించింది.

నునుసిగ్గు దొంతరల మధ్య అప్సరసలా ఉంది సుమబాల. లేత గులాబీరంగు శరీరచ్ఛాయ, కలువ రేకుల్లాంటి పెద్ద పెద్ద కళ్ళూ, ఒడ్డు పొడువుతో అందాల బొమ్మలాంటి మేనకోడలు త్వరలో ఇక స్వంత కోడలు కాబోతున్నందుకు అన్నపూర్ణమ్మకి చాలా సంతోషంగా ఉంది.

సుమ గడ్డంపట్టి బలవంతాన తలపైకెత్తి "అయ్యో! అప్పుడే అంత సిగ్గా పిల్లా?" అంటూ నవ్వి మేనకోడలి చేతిలో అలాగే ఉన్న మాలని తీసుకొని వెనక్కి తిప్పి బారెడు జడలో కుదురుగా అందంగా అమర్చింది.

"అత్తయ్యకి కాఫీ చేసి పట్రా తల్లీ!..." తండ్రి అన్న ఆ మాట వినిపించగానే ఇక అక్కడో క్షణం కూడా నిల్చోలేక గబగబా వంటింట్లోకి పరిగెత్తింది సుమ.

అంతలోనే బయట స్కూటరేదో ఆగిన శబ్దం వినవచ్చింది.

"అదిగో సారథి కూడా వచ్చినట్లున్నాడు".

"బహుశా ఇంటికెళ్ళి ఉంటాడు. నేను ఇంట్లో లేనందువల్ల ఇక్కడికి వచ్చి ఉంటాడు" అంది అన్నపూర్ణమ్మ.

సారథి సరాసరి లోపలికొచ్చాడు. ప్యాంట్ జేబుల్లో రెండు చేతులూ పెట్టుకొని హాల్లో ఉన్న వాళ్ళందర్నీ ఓమారు ఎగాదిగా ఆశ్చర్యంగా చూస్తూ "ఏమిటి విశేషం? అందరూ ఇక్కడ సమావేశమైనారు?" అంటూ తాపీగా ఉయ్యాల బల్లపై కూర్చున్నాడు.

"విశేషం ఉంది నాయనా! తమరి పెళ్ళటగా..." అంది రుక్మిణి ముసి ముసిగా నవ్వుతూ.

"అలాగా ఎవరన్నారటా?..." పిన్ని గొంతుని అనుకరిస్తూ వెక్కిరిస్తున్నట్లుగా అన్నాడు సారథి.

"ఇదిగో సారథీ! ఏమిటా వెక్కిరింపులు!!" తల్లి కొంచెం మందలించింది కొడుకుని.

"మరేం ఫర్వాలేదులేవే అమ్మా! మన పిన్నేగా!... ఏమీ అనుకోదు" తేలిగ్గా నవ్వేస్తున్న సారథి... ఓసారి అటూ ఇటూ దిక్కులు చూడసాగాడు.

అతని వాలకం కనిపెట్టిన రుక్మిణి "ఎందుకు నాయనా! అలా దిక్కులు చూస్తున్నావ్?" నవ్వుతూ అడిగింది.

“అబ్బే ఊర్కెనే” భుజాలెగరేస్తూ అన్నాడతను.

“నువ్వు ఎవరి కోసం చూస్తున్నావో నాకు తెలుసులే”.

“ఏమిటో నీకు తెల్సింది? చెప్పు పిన్నీ! చూద్దాం...”

“సుమ కన్పించడం లేదేమిటా అని చూస్తున్నావ్”.

“అవునవును నీవన్నది నిజమే. ఇంతకీ సుమ ఎక్కడ పిన్నీ?”

“ఆమెకు సిగ్గుదొంతరలు ముంచుకొచ్చాయి. అందుకని ప్రస్తుతం లోపల ఉంది”.

“సిగ్గు దొంతరలా? అవెప్పటినుంచి?” సూటిగా అడిగేశాడు.

“నిన్న సాయంత్రం నుంచీ...” ఠపీమని సమాధానం చెప్పింది రుక్మిణి నవ్వుతూ.

ఆ మాట వినగానే లోలోన గతుక్కు మన్నాడీసారి సారథి.

అంతదాకా మౌనంగా ఉన్న శ్రోతలు ముగ్గురిట్లో ఒకరైన సుశీలమ్మ ముందుగా గొంతు విప్పింది..

“అదేమిటి సారథీ! నిన్న సాయంత్రం పొలం వైపు షికారుకి తీసికెళ్ళిన సుమని వర్షంలో తెచ్చి వాకిట్లో దించి వెళ్ళావ్. మేం ఎంత పిలిచినా వినిపించు కోకుండా... ఇంట్లోకి రాకుండా అట్లా వెళ్ళిపోయావేమిటి?”

“అదా అత్తయ్యా! అర్జంట్ పనుండి వెళ్ళిపోయానలా...”

అంతలోనే లోపలి నుంచి సుమబాల ట్రేలో అందరికీ కాఫీలు పట్టుకొచ్చింది.

“ఒరేయ్ సారథీ! ఇవి పెళ్ళి చూపులురా! అమ్మాయ్‌ని బాగా చూడు ఆనక ఏమన్న అంటే బాగోదు” అంది నవ్వుతూ కొడుకుతో అన్నపూర్ణమ్మ.

“ఆహాఁ. అలాగా... ఏదీ అమ్మాయ్ కాస్త తలఎత్తు” తనకి కాఫీ కప్పు అందిస్తున్న మరదలివంక తదేకంగా చూడసాగాడు సారథి.

“ఫర్వాలేదమ్మా! అమ్మాయ్ సంసారపక్షంగా బాగానే ఉంది. ఒప్పుకోవచ్చు గానీ...” కాఫీ చప్పరిస్తూ మెచ్చుకోలుగా అంటూ ఓ క్షణం అర్ధోక్తిలో ఆగిపోయాడు.

“ఇంకా ఆ కానీ ఏమిటోయ్?” వెంకట్రామయ్యగారు నవ్వుతూ అడిగారు.

“అదే మామయ్య కట్నం కానుకలు ఏ పాటి ఇస్తారోననీ...”

“నీ కెంత కట్నం కావాలేమిటి సారథీ?” ఈమారు రుక్మిణి కొంచెం సీరియస్‌గానే అడిగింది.

"మీరు ఇవ్వగల్గినంతా... నేను పుచ్చుకునేంతాను".

"ఓహోఁ, పెళ్ళి కొడుక్కి కట్నం కానుకల మీద ఆశ బాగానే ఉన్నట్లుంది. మాకీ సంబంధం అక్కరలేదక్కయ్యా.." అన్నపూర్ణమ్మతో ఖచ్చితంగా చెప్పేసింది రుక్మిణి.

"ఐతే మాకూ అక్కర్లేదీ సంబంధం. మాకు పిల్లే దొరకదనుకున్నావా ఏమిటి? ఇంకో క్షణం కూడా ఇక్కడ ఉండొద్దు, పదవే అమ్మా" ఖాళీ కప్పు కింద పెడ్తూ వచ్చే నవ్వుని ఆపుకుంటూ బింకంగా అన్నాడు సారథి!

"నీకు నిజంగా కట్నకానుకలు కావాలంటే ఈ ఆస్తి అంతా సుమ పేరనే రాస్తాను సారథి!" కొంచెం గంభీరంగా అంటున్న వెంకట్రామయ్యగారి మాటలకి "మామయ్యా..." అంటూ మధ్యలోనే అడ్డు తగిలాడు.

"ఏంటి మామయ్యా! మీరలా మాట్లాడుతారు? ఏదో తమాషాకి పిన్నితో అలా మాట్లాడుతుంటే మీరంతా నిజంగానే అనుకుంటున్నారా? నాకేం కట్నాలు కానుకలు ఎంత మాత్రం అక్కరలేదు. వాటన్నింటిని మించిన బంగారు బొమ్మ లాంటి సుమనే నాకర్పిస్తున్నారు. ఇంతకన్నా కట్నం ఇంకేం కావాలి మామయ్యా?" అంటున్న సారథి మాటలకి చలించిపోయాడు వెంకట్రామయ్యగారు. చెమ్మగిల్లిన కన్నుల నిండా ప్రేమానురాగాలు నింపుకొని మేనల్లుడికేసి అపేక్షగా చూడసాగాడు.

"ఏం పెళ్ళి చూపులే ఇవి అమ్మా? ఒట్టి కాఫీతోనే సరిపుచ్చారు. కనీసం మర్యాదకైనా టిఫిన్ పెట్టలా..." సారథి మళ్ళీ తన సహజ ధోరణిలోకి దిగిపోయాడు.

"సుమా, బావకి టిఫిన్ తెచ్చి పెట్టమ్మా" కూతురికి చెప్పింది సుశీలమ్మ.

"పిన్నీ నీవీరోజు ఏం కొత్తరకం స్వీట్స్ చేయలేదా?"

"అక్కయ్యా, నీ వెప్పుడూ మీ ఇంట్లో స్వీట్స్ చేయవా? వీడెప్పుడూ ఇక్కడి కొచ్చినా స్వీట్స్... స్వీట్స్ అంటూ నా వెంటబడుతాడేమిటి?"

"నువ్వు రోజూ ఏదో ఒకటి కొత్తరకం స్వీట్స్ చేస్తుంటావనీ, వాడలా వెక్కిరిస్తుంటాడే..." అన్నపూర్ణమ్మ నవ్వుతూ చెప్పింది చెల్లెలికి.

"అలా నీవు రోజుకోరకం కొత్త కొత్త స్వీట్ చేస్తుండడం వలన సుమ వాటిని తింటూ ఉండడం వలన ఈ మధ్య మరీ అంతగా లావెక్కిపోయింది మనిషి".

"సుమ లావుగా ఉందా? ఎవరైనా వింటే నవ్విపోతారు, చాలు చాలోయ్ నీ బడాయి మాటలు. అదస్సలు స్వీట్సే తినదు తెలుసా?"

"నే ఛస్తే నమ్మను".

"నిజమేనయ్యా సారథీ! సుమ ఎప్పుడో ఓసారి తప్పా, అదస్సలు నిజంగానే స్వీట్స్ తిననే తినదు. నీకీ సంగతి తెలియదు కాబోలు!" ఈసారి సుశీలమ్మ కల్పించుకొని చెప్పింది.

అంతలోనే సుమబాల ఓ ప్లేట్ నిండా మైసూర్ పాక్ ముక్కలు పెట్టుకొని తెచ్చి సారథికిచ్చింది.

"ఏమిటీ, ఇన్ని ముక్కలే... నేనేం బకాసురుడినని అనుకుంటున్నావా?"

"కాదు... వాడి తమ్ముడివి తిను" సుమ వెక్కిరిస్తున్నట్లుగా అని ఓ ముక్క తీసి అతని నోట్లో బలవంతంగా కుక్కింది.

అది చూసి అందరూ హాయిగా ఆనందంగా నవ్వుకున్నారు.

నీళ్ళు తీసుకురావడానికి సుమ మళ్ళీ లోపలికెళ్ళింది.

"ఏమిటి సారథి నీవీరోజు ఇంత తీరుబాటుగా కూర్చున్నావ్. పనులేం లేవా?" ఉన్నట్లుండి మేనల్లుడిని అడిగాడాయన.

"పనులు లేకం బోలెడన్ని ఉన్నాయి మామయ్యా! ఈ వారం నాన్నపేరిట కట్టించిన హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ఆరోగ్యశాఖమంత్రి రాబోతున్నారిక్కడికి. ఆ రోజు ఫంక్షన్‌కి ఏర్పాట్లు అవీ చూడాలి. ఆ రోజు స్కూల్ పిల్లలతో కొన్ని చిన్న చిన్న నాటికలు డ్యాన్స్ ప్రోగ్రామ్స్‌లాంటివి చేయించాలి. వారం పదిరోజుల నుంచీ ఆ ప్రయత్నంలోనే ఉన్నాను. ఈ రెండు మూడు రోజులలో పొలంలో వేరుశనగ కాయ కూడా పీకించాలి. జామతోట ఈసారి బాగా విరగకాసింది. వాటిని మార్కెట్టుకి పంపించాలి. ఇలా చెప్పుకుంటూ పోతే ఇంటి పనులు, పొలం పనులు, బయటి పనులు చాలా ఉన్నాయి మామయ్యా!"

"ఊఁ... అలాగా"

సారథిని గురించి మనమిక్కడ కాస్త తెలుసుకుందాం. మంచి వ్యక్తిత్వం గల ఆరడుగుల అందగాడు. అగ్రికల్చర్ బియస్సీ చదివాడు. చదువు అయిపోగానే ఏ ఉద్యోగ ప్రయత్నాలూ మొదలు పెట్టకుండా నేరుగా స్వంత ఊరికి వచ్చి చక్కటి సంస్కారవంతమైన భావాలతో, విశాల హృదయంతో తోటి రైతాంగానికి ఆదర్శంగా నిలిచాడు. ఉన్న ఊళ్లోనే వాళ్ళకున్న పొలాలలో వ్యవసాయం ప్రారంభించిన కొద్దికాలంలోనే మంచి రైతుగా ఆ చుట్టుపక్కల గ్రామాలలోనే

గాక... ఆ జిల్లాలోనే పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్నాడు. పండ్ల తోటలు, పూలతోటలు, కూరగాయల పెంపకం విషయంలో రైతులకు వ్యవసాయానికి సంబంధించిన తగిన సలహాలు కూడా తరచు ఇస్తూనే ఉంటాడు. తమ పంట పొలాలలో విరివిగా కొత్త వంగడాలను నాటించి ఎక్కువ ఉత్పత్తిని సాధించి నందుకు క్రితం సంవత్సరం 'ఉత్తమ కర్షక' అవార్డును కూడా ప్రభుత్వం తరఫున అందుకున్నాడు.

"అన్నట్లు సారథీ! నీకో విషయం చెప్పడం మర్చిపోయాను. హైద్రాబాద్ నుంచి సుమిత్ర ఫోన్ చేసింది; లెటర్ కూడా రాసిందనుకో. సుమని కొన్నాళ్ళపాటు అక్కడికి పంపించమని".

"సుమనా? ఎందుకన్నయ్యా?" ఈసారి అన్నపూర్ణమ్మ ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

"ఎందుకేమిటక్కయ్యా!... సుమిత్రకిప్పుడు డెలివరీ సమయం కదా! వాళ్ళత్తగార్కి ఈ మధ్య మరీ బొత్తిగా చాతకావడం లేదట. ఆరోగ్యం బాగలేదట. తాను డెలివరీకి హాస్పిటల్లో చేరితే, పిల్లలతో ఇంట్లో కష్టం అవుతుందనీ, పిల్లలకి కాస్తా సాయంగా ఉంటుందనీ కొద్ది రోజులపాటు సుమని పంపమని రాసింది. వంట మనిషి ఉందట; పనివాళ్ళు ఉన్నారట. తాను హాస్పిటల్లో ఉంటే అన్ని విషయాలూ చూసుకునేందుకు సుమని పంపమని నిన్న ఫోన్ చేసి కూడా మరీ మరీ చెప్పింది". అన్ని విషయాల్ని పూసగుచ్చినట్లుగా రుక్మిణే వివరంగా చెప్పుకొచ్చింది.

"మరి సుమ వెళ్లడానికి ఒప్పుకుందా మామయ్యా?" కొంచెం ఆత్రుతగా అడిగాడు సారథి.

"సుమిత్రకి మాత్రం అత్తగారి తరఫున ఎవురున్నారు బాబూ... సమయానికి ఆదుకోవడానికి మనం కాకపోతే, మరిక తప్పుతుందా? నేను సుమ రేపే బయలుదేరి వస్తున్నట్లుగా ఫోన్ చేశాను."

"ఈసారి అమ్మాయ్ తప్పకుండా ఆపరేషన్ చేయించుకుంటుందట. అల్లుడు... అత్తగారు కూడా ఒప్పుకున్నారట" అన్నపూర్ణమ్మతో అంది సుశీలమ్మ.

"ఆఁ, అలా అంటూనే ఇప్పటికీ అందరు ఆడపిల్లలు పుట్టారు సుమిత్ర వదినకి. మళ్ళీ ఈసారి కూడా ఆడపిల్లే పుట్టిందనుకోండి... ఆపరేషన్ నో అంటారు అప్పుడా తల్లీ కొడుకులు. అవునూ, అత్తయ్యా! అక్కడికి నీవో, పిన్నో వెళ్ళక సుమని ఎందుకు పంపడం?" ఉన్నట్లుండి హఠాత్తుగా అడిగాడు సారథి.

"రుక్మిణేమో ఈ ఇల్లు వదిలి ఎక్కడికీ వెళ్ళదు. నాకేమో ఈ మోకాళ్ళ నొప్పులు. ఒకరోజు నడిస్తే తప్పనిసరిగా రెండురోజులు పడకేయాల్సి వస్తుంది. ఈ విషయం దానికి తెలుసు కాబట్టి సుమని పంపమని చెప్పింది. అమ్మాయ్‌కి ఆపరేషన్ చేయించుకొని ఇంటికి రాగానే సుమ తిరిగి వచ్చేస్తుంది. ఒకవేళ ఈసారి వాళ్ళ అదృష్టం బాగుండి బాబే పుడ్తే బారసాల వేడుక ఇక్కడే ఘనంగా జరపాలి..."

అత్తయ్య మాటల్ని పరాకుగా వింటున్న సారథి ముఖం క్షణంలో అదోలా అయిపోయింది. అది గమనించిన అన్నపూర్ణమ్మ సుమ హైద్రాబాద్ వెళ్ళడం ఎందుకనో కొడుక్కి ఇష్టంలేదని మాత్రం క్షణంలో గ్రహించింది.

"మీరు రేపే వెళ్తారా అన్నయ్యా?" అడిగిందావిడ.

"రేపు ఉదయం శాస్త్రిగార్ని పిలిపించి ముహూర్తాలు ఎప్పుడు ఉన్నాయో కనుక్కుంటాను. ఆయనతో అన్ని విషయాలూ మాట్లాడి రేపు వెళ్ళగలం... ముందుగా విజయవాడలో దిగి సుభద్ర ఇంట్లో ఓ పూట ఉండి, ఆ మరుసటి రోజు హైద్రాబాద్ వెళ్ళగలం".

"మీరు విజయవాడ వెళ్తే సుభద్రని అడిగి కొంచెం తమ్ముడి విషయం కనుక్కోండి మామయ్యా! ఎందుకనో వాడీ మధ్య అసలు ఫోన్స్ కూడా చేయడం లేదు. మెడిసిన్ ఫైనలియర్ వాడిప్పుడు బాగా చదవమని చెప్పండి. డబ్బు ఏమన్నా అవసరమైతే లెటర్ రాయమని చెప్పండి" అంటూ మెల్లిగా ఉయ్యాల బల్లమీది నుంచి లేచాడు సారథి.

"అలాగే చెప్తాను. అన్నట్లు సుశీలా! కాస్త వంట ప్రయత్నాలవీ చూడకూడదూ! ఈ రోజు సారథి అన్నపూర్ణ ఇక్కడే భోజనంచేసి వెళతారు" అన్నాడాయన.

"ఒద్దులే అన్నయ్యా! మేం ఇంటికి వెళతాం" అంది అన్నపూర్ణమ్మ.

"నీవు ఊరుకోవే అమ్మా! ఓ పూట మనకి భోజనం పెట్టగానే మీ అన్నయ్య ఆస్తి ఏం తరిగిపోదులే..." నవ్వుతూ సారథి సుమతో మాట్లాడడానికి నేరుగా లోపలికి వెళ్ళాడు.

✧ ✧ ✧

ఆ రోజు ఆదివారం.

అందుకనే ఆనందరావు ఇంకా హాయిగా ఆదమరిచి నిద్రపోతున్నాడు.

"కాఫీ కలిపాను. మీ డాడీని లేపరా బాబీ!" వంటింట్లో నుంచి వాళ్ళమ్మ వేసిన కేకని అక్షరాల అమలు పర్చాడు పుత్రరత్నం.

"డాడీ, లేవండి. మమ్మీ పిలుస్తోంది కాఫీ కోసం" ఐదేళ్ళ బాబీ తండ్రి కప్పుకున్న దుప్పటిని పక్కకి లాగి పిలువసాగాడు.

"ఊఁ..." అని బద్ధకంగా మత్తుగా మూల్గుతూ కొడుకు లాగిన దుప్పటిని సరిచేసుకొని మళ్ళీ కప్పుకొని అటువైపు ఒత్తగిలి పడుకున్నాడతను.

"మరే మమ్మీ డాడీ లేవడం లేదు. నాకు ముందు పాలు పోసేయ్" వంటింట్లోకి వెళ్ళాడీసారి బాబీ.

"పోనీ, మీ బాబాయన్నా లేచాడా?" గ్యాస్‌స్టవ్‌పై మరుగుతున్న కాఫీ డికాషన్ గిన్నె కిందికి దించుతూ అడిగింది సుభద్ర.

"బాబాయ్ ఎప్పుడో నిద్ర లేచాడు. బాత్‌రూంలో ఉన్నాడు. స్నానం చేస్తున్నాడు".

సుభద్ర ఓ గ్లాస్ నిండా పాలుపోసి సుగర్ ... బోర్నవిటా వేసి చెంచాతో కలిపి కొడుక్కి అందించింది.

"మమ్మీ, మరి బిస్కెట్లో?"

"బిస్కెట్స్ లేవురా అయిపోయాయి. ఈ రోజు బాబాయ్ కూరగాయలకి బజారుకెళ్ళినప్పుడు తెప్పిస్తానుగాని... ముందాపాలు తాగేసేయ్" అంటూ సుభద్ర కత్తిపీట ఉల్లిపాయల బుట్ట, ఓ గిన్నెలో నీళ్ళు తెచ్చుకొని తాపీగా కూర్చుంది.

అంతలోనే బాత్‌రూంలోనుంచి రవీంద్ర స్నానం చేసి వచ్చాడు. గదిలో నుంచి లుంగీ కట్టుకొని పెరట్లోకెళ్ళి చేతిలోని తడి టవల్ని తీగపై ఆరవేసి నేరుగా వంటింటివైపు వెళ్ళాడు.

"కాఫీ ఫ్లాస్క్‌లో పోసి ఉంచాను రవీ. కప్పు తీసుకొని పోసుకో" అంటూ పెరట్లో జామచెట్టుపై ఓ కాకి గొంతెత్తి అదే పనిగా అరుస్తోంటే - అటే చూస్తోంది సుభద్ర ఉల్లిపాయల పొట్టు తీస్తూ.

"ఈ రోజు మనింటికెవరో చుట్టాలు వస్తారు కాబోలు వదినా! ఆ కాకి ఇందాకట్నుంచీ అదే పనిగా అరుస్తోంది" కాఫీ తాగుతూ రవీంద్ర అన్నాడు.

"అదే నేనూ అనుకుంటున్నాను. అయినా ఎవరొస్తారబ్బా?" సాలోచనగా అంది సుభద్ర.

"పెదనాన్న దగ్గర్నుంచి తాతయ్య బామ్మ వస్తారేమో మమ్మీ" పాలు తాగడం పూర్తిచేసిన బాబి ఉత్సాహంగా అన్నాడు.

“నీ మొహం వాళ్ళేం రారిప్పుడు. పెదనాన్న దగ్గర్నుంచీ నిన్ననేగా ఫోన్ వచ్చింది. బామ్మ తాతయ్య తీర్థయాత్రలకి వెళ్ళారట. ఈ నెల చివర్లో వస్తారట”.

“మరింకెవ్వరు వస్తారబ్బా!” చూపుడు వేలుతో పెదాలపై సుతారంగా కొట్టుకుంటూ బాబీ తెగ సీరియస్‌గా ఆలోచించసాగాడు రాబోయే చుట్టాల కోసం.

“బహుశా పల్లెనుంచి ఎవరన్నా వస్తారేమో?” కాఫీ తాగడం ముగించిన రవీంద్ర వచ్చి వాళ్ళొదిన దగ్గర బాసింపట్టు వేసుకొని కూర్చున్నాడు. తానూ ఉల్లిపాయలు అందుకొని పొట్టు తీయసాగాడు.

“ఏమిటొదినా! ఈరోజు ఇన్ని ఉల్లిపాయలు తరుగుతున్నావ్ సండే స్పెషలా?”

“స్పెషల్ లేదు; ఏమీ లేదు. ఉల్లిపాయ పకోడీలు వేయమని మీ అన్నగారు చాలా రోజుల నుంచీ అడుగుతున్నారు. ప్రతిరోజూ ఉదయం హడావిడిగా వండుకోడం తినడం, ఆదరాబాదరాగా ఎవరి దారిన వాళ్ళం వెళ్ళిపోవడం. ఈ సండేనే కదా ఏమన్న తీరిక దొరికేది”.

“అవునవును. నీవన్నది నిజమే వదినా!”

చుట్టాలగురించి ఆలోచిస్తున్న బాబీకి వెంటనే ఏదో స్ఫురించినట్లుగా ముఖం పెట్టి “చుట్టాలెవరొస్తున్నారో తెల్సింది మమ్మీ” అన్నాడు ఉత్సాహంగా.

“ఎవర్రా చెప్పు?” నవ్వుతూ అంటూ పొట్టు తీసిన ఉల్లిపాయల్ని నీళ్ళ గిన్నెలో కడిగి తరగ సాగింది సుభద్ర.

“పల్లెనుంచి తాతయ్య అమ్మమ్మ వస్తారు”.

“పల్లె నుంచి ఎవరన్నా వస్తారేమోనని ఇందాక నేను కూడా ఇదే విషయం అన్నానుగా వదినా!”

“ఏమో మరి ఈ మధ్య అసలు వాళ్ళ సంగతులేవీ తెలియడం లేదు. ఎట్లా ఉన్నారో ఏమిటో? కనీసం మీ అన్నయ్య అయినా రాలేదు. ఈ రోజు ఫోను చేసి మాట్లాడతాను”.

“అన్నయ్యకి తీరిక లేకుండొచ్చు వదినా! ఎప్పుడూ ఆ పొలం పనులతో బిజీగా ఉంటాడు”.

“అన్నట్లు నీవు రాస్తున్న కథ పూర్తి అయిందా రవీ?” సుభద్ర మాట మార్చింది.

“ఆఁ, రాత్రి ముగించేశాను వదినా! ఈ రోజు ఫెయిర్ చేసి రేపు ఏదైనా పత్రికకు పంపాలనుకుంటున్నాను”.

“నీవు కథలే రాసుకో; కవితలే రాసుకో, నేనొద్దనను. చదువు మాత్రం ఎప్పుడూ అశ్రద్ధ చేయవద్దు తెలిసిందా? నేను నీకిచ్చే అతిముఖ్యమైన సలహా ఇదొకటే. ఈ సంవత్సరం నీవు ఫైనలియర్. ఏ సబ్జెక్టు అయినా తప్పావా... సారథి ఊరుకోడు. నానా రభసా చేస్తాడు. అస్సలే అతని ఆశలూ కోరికలూ అన్నీ నీమీదనే...”

“నేను చదవడం లేదనుకోకు వదినా! మునుపటికన్నా బాగా చదువుతున్నాను. ఈ సంవత్సరం ఫస్టున ప్యాసయి హౌస్‌సర్జన్‌లో చేరకపోతే అప్పుడడుగు నన్ను” ఛాలెంజి చేస్తున్నట్లుగా అన్నాడు రవీంద్ర.

ఆనందరావు నిద్రలేచాడులా ఉంది. “ఏమోయ్ సుభద్రా! కాఫీ పట్రా!” గదిలో నుంచి ఓ కేకేశాడు.

“మిగిలిన ఉల్లిపాయలు నేను తరిగి పెడ్తాను. నువ్వెళ్ళి అన్నయ్యకి కాఫీ ఇవ్వు వదినా!” రవీంద్ర కత్తిపీట అందుకున్నాడు.

సుభద్ర లేచి కాఫీ కలుపుతూంది.

“బాబాయ్! ఈ రోజు బజారుకెళ్ళినప్పుడు నాకు బిస్కెట్స్ పట్రా” అన్నాడు బాబీ.

“సరేలే అలాగే పట్టుకొస్తానుగాని ముందు నీవు లేచి ఓ ఖాళీ ప్లేట్ పట్రా తరిగిన ఉల్లిపాయలు వేయడానికి”.

కాఫీ కప్పు భర్తకందించి వంటింట్లోకి వస్తుంటే బయట వాకిట్లో ఏదో ఆటో ఆగిన శబ్దం వినవచ్చింది. సుభద్ర మళ్ళీ వెనుదిరిగి వచ్చి గుమ్మానికి ఉన్న కర్టెన్ తొలగించి చూసింది.

ఆటోలో నుంచి దిగుతూన్న తండ్రిని చెల్లాయ్‌ని చూడగానే ఆశ్చర్యంతో ఆనందంతో ఆమె ముఖం విప్పారింది.

“ఎవరోయ్ వచ్చింది?” మంచంపై కూర్చొనే కాఫీ తాగుతున్న ఆనందరావు ఆత్రుతగా అడిగాడు.

“పల్లె నుంచి నాన్న చెల్లాయ్ వచ్చారండీ...” సంతోషంగా భర్తకి చెప్తూ వాకిట్లోకి ఎదురువెళ్ళి తండ్రి చేతిలో నుంచి సూట్‌కేస్ అందుకుంది.

ఖాళీ కప్పు కింద పెట్టి ఆనందరావు గబగబా మంచం దిగి వూడిపోతున్న లుంగీని సరిచేసుకొని నడుముకు బిగించుకొని ముందుకు వెళ్ళుతూ ఇంట్లోకి వస్తున్న మామగారిని మరదల్ని చిరునవ్వుముఖంతో పలుకరిస్తూ "రండి, రండి! బహుకాల దర్శనం" అంటూ స్వాగతం పలికాడు.

ఈలోగా లోపల్నుంచి బాబీతోపాటు రవీంద్ర కూడా ఇవతలికొచ్చి వాళ్ళని చిరునవ్వుతో పలుకరించాడు "బాగున్నారా మామయ్యా" అంటూ.

"నేనిందాక చెప్పలేదూ... తాతయ్య వస్తాడనీ" బాబీ వాళ్ళమ్మతో అంటూ అప్పుడే వాళ్ళ తాతగారి ఒళ్ళో చేరాడు.

"ఏమిటి మామగారూ! మీ యీ హఠాత్తు రాక? ఉత్తరం పత్తరం ఏమీ లేదు. కనీసం ఓ ఫోన్‌కాలైనా చేయలేదు. ముందుగా తెల్పివుంటే మీకే ఇబ్బంది కలుగకుండా కనీసం స్టేషన్‌కైనా వచ్చే వాళ్ళం కదా!" భార్య వెనకాల నిల్చుని మరదల్ని ఓరకంట గమనిస్తూ అన్నాడు ఆనందరావు.

"ఏం, మీరు స్టేషన్‌కి రాకుంటే మాత్రం మాకు ఇల్లు తెలియదనుకున్నారా? అందుకనే ఇలా చెప్పాపెట్టకుండా వచ్చేశాం బావా!"

"ఊర్నించి నిన్న మధ్యాహ్నామే బయలుదేరాలనుకున్నాం. కాని వీలు కాలేదు. పల్లె నుంచి సాయంత్రం బస్సుకొస్తే రాత్రి రైలు దొరికింది ఇక్కడికి రావడానికి" అంటూ అల్లుడితో వెంకట్రామయ్యగారు మాటలు కలిపాడు.

"ఈ రోజు ఉదయం నుంచీ పెరట్లో కాకి తెగ అరుస్తూంటే... చుట్టాలు ఎవరొస్తారబ్బా అనుకుంటూ ఇందాకనే నేను, బాబీ, రవీంద్ర మీ గురించే మాట్లాడు కున్నాం నాన్నా! ఇంతలోనే నిజంగా మీరే వచ్చేశారు" అంది సుభద్ర తండ్రితో.

"నేనైతే కరెక్ట్‌గా మీరే వస్తారని అన్నాను తాతయ్యా"

"బాలవాక్కు బ్రహ్మవాక్కు!" అంటూ ఒళ్ళో కూర్చున్న మనవడి తల నిమురుతూ నవ్వసాగాడాయన.

"ఏది ఏమైనా ఈ శుభోదయ వేళలో వచ్చేసిన ఈ సుమబాల రాకతో మన ఇల్లు పావనం అయిపోయింది సుభద్రా!... వెళ్ళు, త్వరగా వెళ్ళి కాఫీ పట్రా ఉభయులకీ..." రాగయుక్తంగా సాగదీస్తూ ఆజ్ఞాపించాడు భార్యకి.

"ఏమిటే చిన్నక్కయ్యా! బావ అలా మాట్లాడతాడు. కొంపదీసి ఏ మైనా నాటకాల్లో వేషాలు వేయడం లేదు కదా!..."

“వేషాలా పాడా! ఇక ఈయనగారికి అవి ఒకటే తక్కువైనాయి...” అని నవ్వుతూ లోనికెళ్ళింది కాఫీల కోసం.

“నిన్ను చూడగానే అలా మాట్లాడాలనిపిస్తుంది మరదలా!”

“అలాగా... పాపం!” నవ్వుతూనే వెక్కిరిస్తున్నట్లుగా అంటూ అక్కతో పాటు లోనికి వెళ్ళింది సుమ.

మామ అల్లుళ్ళు కబుర్లలో పడ్డారు.

✧ ✧ ✧

రాసిన పేపర్స్‌ని సరిచేసి రవీంద్ర పిన్ పెడుతూంటే ఎవరో తలుపు తోసిన చప్పుడైంది.

గభాల్న తలెత్తి చూశాడు.

సుమ లోపలికొచ్చింది నెమ్మదిగా.

“రా, వదినా రా!...” కుర్చీలో నుంచి లేస్తూ చిరునవ్వుతో ఆహ్వానించాడు రవీంద్ర.

“ఏమిటీ నీవీమధ్య ఏవో కథలుగట్రా రాస్తున్నావట కదా రవీ! అక్కయ్య అంది... నిజమేనా?” టేబుల్‌పై రాసి ఉన్న పేపర్స్ వైపు పరిశీలనగా చూస్తూ అంది సుమ.

“ఏదో అప్పుడప్పుడు రాస్తున్నాను వదినా!...” చిన్నగా నవ్వుతూ అన్నాడు రవీంద్ర.

“రెండు కథలేవో ఓ వార పత్రికలో వచ్చాయట కదా! చాలా బాగా రాశాడని ఇందాకనే చిన్నక్కయ్య అంది. ఏ వీక్లీలో వచ్చాయ్ అవి?”

“భూమిలో వచ్చాయి వదినా! అంత గొప్పగా ఏం రాయలేదనుకో”

“కొత్తగా రాసే వాళ్ళంతా గొప్పగా రాసినా రాయకపోయినా, నీవు మొదట్లోనే రాసిన కథలే ఓ మంచి స్టాండర్డ్‌గల వీక్లీలో రావడమే చాలా గొప్ప విషయం...” అంటూ టేబుల్‌పైని ఆ కాగితాల్ని చేతిలోకి తీసుకుంది సుమ.

అక్షరాలు ముత్యాల్లా ఉన్నాయి. పేపర్స్ తిరిగేసింది. ఏడెనిమిది పేజీల కథది. “నీ చదువెలా సాగుతూంది? మీ అన్నగారప్పుడే నీకోసం అడ్వాన్స్‌గా హాస్పిటల్ కూడా కట్టించారు తెలుసా?”

"తెలుసొదినా! నాన్నగారి పేరు మీద కట్టించాడన్నయ్య. ప్రస్తుతం అన్నయ్య ఫ్రెండ్ అతని భార్య అందులో డాక్టర్స్‌గా పని చేస్తున్నారు".

"అవునట, ఆ డాక్టర్స్ దంపతులకోసం హాస్పిటల్‌కు సమీపంలోనే అన్ని హంగులతో మంచి క్వార్టర్ కూడా కట్టించాడు బావ".

"అవునా?..." ఆశ్చర్యం వ్యక్తం చేశాడు రవీంద్ర.

"మరి మీ అన్నయ్యంటే ఏమనుకున్నావ్?" చిరునవ్వు చిందించింది.

"ఏదైనా పత్రికకి పంపాలని ఈ కథని ఇందాకనే ఫెయిర్ చేశానొదినా! ఈ కథని చదివి ఎలా ఉందో నీ అభిప్రాయం చెప్పు. నేనీలోగా బజారుకెళ్ళి వస్తాను..." అంటూ రవీంద్ర అవతలికి వెళ్ళబోయాడు.

"ఐతే నన్నీకథ చదవమంటావన్నమాట ఆల్‌రైట్..." అని నవ్వుతూ తాపీగా కుర్చీలో కూర్చొని సుమ ఆ కథని చదవనారంభించింది.

✧ ✧ ✧

రాజారావు మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడన్న వార్త అతని బంధువర్గంలో చాలా సంచలనాన్నే కలిగించింది. 'ఇదేమిటి? ... భార్యపోయిన ఇన్నేళ్ళకి ఇప్పుడీ పెళ్ళి చేసుకోవడం ఏమిటీ?' అంటూ ఒకరు, 'పోనిద్దురూ! అతనికి ఇన్నాళ్ళకి పెళ్ళాం మీద మోజు పుట్టింది కాబోలు!' అని ఇంకొకరూ- 'అయినా ఇంత వయస్సులో ఇప్పుడు ఆయనకి ఇదేం పాడు బుద్ధి?' అంటూ మరొకరు సాగదీశారు.

"ఆఁ, అతని వయస్సు ఎంతనీ నలభై నిండాయి. అంతేగా... ఈ రోజుల్లో అంత వయస్సున్న వాళ్ళు ఎంతమంది పెళ్ళిళ్ళు చేసుకోవడం లేదు? పిల్లల్ని కనడం లేదు?..." ఇద్దరు పిల్లలుండి రెండో పెళ్ళి చేసుకున్న ఓ నడి వయస్కుడు వాళ్ళ మాటల్ని తేలిగ్గా తీసిపారేశాడు.

"అయినా పెళ్ళీడుకెదిగిన కూతురుండగా ఇప్పుడు తన పెళ్ళికేం తొందర వచ్చింది?" ఒకరి ప్రశ్న.

"ఆ కూతురు ఆయన దగ్గర లేదు కదా! వాళ్ళ అమ్మమ్మ గారింట్లో గారాబంగా పెరుగుతూందిగా!..." ఇంకొకరి జవాబు.

"కట్నం కానుకలకి ఆశపడి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడేమో?..."

“అయ్యో! ఎంతమాట పాపం అన్యాయంగా అనుకోకూడదు గాని, ఆయన దగ్గర అలాంటి కక్కుర్తి బుద్ధులేం లేవు లెండి. మొదటి పెళ్ళిలోనే కానీ కట్నం తీసుకోలేదు. ఆయన స్వభావం నిజానికి చాలా మంచిది.”

“ఏ దిక్కుమాలిన వాడిచ్చాడో పిల్లని?...” మరో అతని వ్యాఖ్యానం.

“ఎందుకివ్వరు పిల్లను? అతనికేం తక్కువ? నెలకు బోలెడంత సంపాదిస్తున్నాడు. గవర్నమెంట్ ఉద్యోగం. పైగా ఉన్న ఒకానొక తమ్ముడు ఆర్మీలో ఎక్కడో ఉన్నాడు. ఇక ఇంట్లో అత్త ఆడబిడ్డ అంటూ ఎవరి బాదరబందీ లేదు కదా! ఏకాకిగా కాలం గడుపుతున్నాడాయె! ఈ రోజుల్లో ఏ ఆడపిల్ల తండ్రి అయినా కళ్ళకద్దుకొని మరీ ఇస్తారు పిల్లని”.

“ఊహుఁ. అది కాదండీ బావగారూ! విషయం ఏమిటంటే మొదటి భార్య పోయిన కొత్తలో మనవాళ్ళు మళ్ళీపెళ్ళి చేసుకోమని ఎంత వత్తిడి చేసినా ఖచ్చితంగా చేసుకోనని చెప్పి పెళ్ళిపట్ల విముఖత చూపిన ఆ పెద్దమనిషి, ఇన్ని సంవత్సరాలకు ఇలా హఠాత్తుగా మళ్ళీ పెళ్ళి చేసుకోవడం చాలా ఆశ్చర్యంగా లేదూ?...”

“లేకేం ఉంది కానీ, కాలమండీ బాబూ కాలం. అప్పటికీ ఇప్పటికీ ఒకే రీతిగా ఉందా?... ఎన్నెన్నో మార్పులు చేర్పులు జరిగాయి. అట్లాగే మనిషి బుద్ధులు కూడాను. ఏ పెళ్ళిళ్ళ పేరయ్యానో మెడలు వంచి ఒప్పించి ఉంటాడు...” అంటూ సమర్థించాడు మరో పెద్దమనిషి.

అలా ఆవిధంగా ఎన్నో ప్రశ్నలూ, వాటికి తగిన జవాబులూ, విమర్శలూ అన్నీ ఎవరికి తోచినట్లుగా వాళ్ళు మాట్లాడుకోసాగారు.

లోకులూ బంధువులూ అనుకున్నట్లుగా రాజారావు పారిజాతాన్ని మళ్ళీ పెళ్ళి మోజుతో ప్రేమతో చేసుకోలేదు; కట్నం కానుకలకి ఆశపడి అంతకన్నా కాదు. మానవత్వంగల మనిషిగా ఓ పెళ్ళిళ్ళ పేరయ్య ప్రోద్బలంతో.... అతి పసినతంలోనే తల్లిదండ్రులని పోగొట్టుకొని పిన్ని తండ్రి ఇంట్లో ఘోరనరకాన్ని అనుభవిస్తున్న అనాథ అయిన పారిజాతాన్ని జాలితో సహృదయంతో గృహిణిగా స్వీకరించి ఆమెకు ఆ రకమైన నరకకూపం లాంటి చెరని విడిపించి పుణ్యం కట్టుకున్నాడు.

రాజారావు మళ్ళీ పెళ్ళి చేసుకోవడానికి మొదటి భార్య తల్లిదండ్రులైన తన అత్తమామల పోరు కూడా చాలా ఉంది. “ఎన్నాళ్ళిలా మోడులా బతుకుతావ్? పేరయ్య చెప్పినట్లుగా మళ్ళీ పెళ్ళి చేసుకొని ఆ అమ్మాయ్‌కి నీ యింట్లో ఆశ్రయం కల్పించు. నీకు తోడునీడగా ఉంటుంది...” అంటూ ఎన్ని విధాలా హితబోధలు

చెయ్యాలో అన్ని విధాలా చేసి అతన్ని ఒప్పించి ఆ పెళ్ళి జరిపించి తమ దారిన తాము వెళ్ళిపోయారు.

ఎన్నెన్నో కోరికలతో మరెన్నో ఆశానురాగాలతో కొత్త పెళ్ళికూతురు అయిన పారిజాత రాజారావు ఇంటిలోకి అడుగు పెట్టింది.

కాపురానికి వచ్చిన కొద్దిరోజుల్లోనే భర్త మనస్తత్వాన్ని బాగానే అర్థం చేసుకుం దామె.

కన్నె పిల్లలందరిలాగానే పారిజాత కూడా భవిష్యత్తుని గురించి ఎన్నెన్నో మధురమైన రంగురంగులాంటి కలలు కంది. ఆ ఆశలన్నీ కల్లలుగానే మిగిలిపోయి పినతండ్రి ఇంట్లో ఓ పనిమనిషిగా, వంటమనిషిగా ఇంటెడు చాకిరీ చేస్తూ అలాగే తన జీవితం వెళ్ళబారి పోతుందనుకుంది.

కాని, తన నుదిటిన ఏకాస్త అదృష్టరేఖో ఉండబట్టి, తమ ఊరి పేరయ్యగారి పుణ్యాన హఠాత్తుగా ఇలా రాజారావుతో పెళ్ళి జరగడం కలలో కూడా ఊహించని అద్భుత విషయం.

అసలే చక్కని చుక్క అయిన పారిజాత యవ్వనం తెచ్చిన సోయగాలతో అరవిచ్చిన మల్లె మొగ్గలా ఉంటుంది. పెళ్ళయ్యాక మరికొన్ని కొత్త అందాల్ని సంతరించుకొంది.

రాజారావు భార్య మనస్సులోని కోరికలన్నీ సరదాలనీ గ్రహించలేనంతటి మూర్ఖుడేం కాదు. కాబట్టి ఆమె కోరిన నగలు చీరలు కొనిచ్చాడు. తను సాధ్యమైనంతవరకు ఆమెకు అనుగుణంగా ప్రవర్తిస్తూ వీలు చిక్కినప్పుడల్లా అడపాదడపా అలా సినిమాలకీ షికార్లకీ తీసికెళ్ళేవాడు.

''ఓహోఁ. అప్పుడే పడుచు పెళ్ళాన్ని వెంటేసుకొని తెగ తిరుగుతున్నాడు...'' అంటూ తోటి ఉద్యోగస్థులు హేళన చేసినా కూడా అంతగా లెక్క చేయలేదు రాజారావు. అలాగే రెండు మూడు మాసాలు సరదాగా గడచిపోయాయి.

ఉన్నట్లుండి ఓ రోజు రాజారావు బాగా జ్వరపడ్డాడు. పది రోజుల వరకూ మంచం దిగలేకపోయాడు. అన్ని రోజులూ దగ్గరుండి చిన్న పిల్లలకి చేసినట్లుగా సపర్యలు చేసి భర్త త్వరగా కోలుకునేలా చేసింది పారిజాత.

మళ్ళీ మామూలుగా రాజారావు ఆఫీసుకి వెళ్ళివస్తున్న మనిషి మాత్రం మునుపటంతటి హుషారుగా ఉండడం లేదు. ఎంతో నీరసంగా ఏమీ చేతగాని వానిలా తయారయినాడు.

భర్తలోని మార్పుని కనిపెట్టిన పారిజాత ఓ రాత్రి పడుకునే ముందు "ఏమిటో, మీరీమధ్య మునుపటిలా లేరు. ఓసారి డాక్టర్‌కి చూపించుకోండి..." అంటూ ఎంతో ప్రేమానురాగాలు ఉట్టిపడే స్వరంతో అంది.

"నాకేమైంది, బాగానే ఉన్నానుగా, జ్వరపడి లేచాను కదా, కొంచెం నీరసంగా ఉన్నానంతే" అని చిన్నగా నవ్వుతూ భార్య సంతోషం కొద్దీ దగ్గరికి తీసుకున్నాడామెను.

ఉదయం భోజనం చేసి ఆఫీసుకెళ్ళితే సాయంత్రమే మళ్ళీ ఆరింటికే ఇంటికి చేరేవాడు రాజారావు. ఇంట్లో ఒక్కత్తె ఉండే పారిజాతానికి పగలల్లా ఏం తోచేది కాదు. చేతినిండా సరైన పనిలేక మనస్సులో ఏదో తెలియని అసంతృప్తి ఆమె మది నిండా అలుముకోసాగింది.

తమ ఎదురింటి కుర్ర లెక్చరర్ కాలేజీ నుంచి రాగానే స్కూటర్ పైన భార్యని తీసుకొని ప్రతి రోజూ ఎక్కడికో వెళ్ళి అలా అలా తిరిగి మళ్ళీ ఏ పదింటికో నవ్వుతూ తుళ్ళుతూ ఇంటికి చేరేవారు. చిలుకా గోరింకల్లా చూడముచ్చటగా ఉన్న వాళ్ళ జంటని చూసినప్పుడల్లా పారిజాత మనస్సంతా ఈర్ష్యా ద్వేషాలతో నిండిపోయేది భర్త మీద.

వయస్సు మళ్ళిన భర్తని చేసుకోవడం వలన తాను పోగొట్టుకున్నదేమిటో ఆమెకు మెల్లమెల్లగా అర్థమవసాగింది.

సాయంకాలపు వేళ భర్త వాడినముఖంతో ఉస్సురుమంటూ ఇంట్లోకి రాగానే పారిజాత ముఖమంతా చిట్లిస్తూ, "ఓ సరదా లేదు, పాడూ లేదు" అని విసుగ్గా సణుక్కోడం కొత్తగా మొదలు పెట్టింది.

రాజారావు అనారోగ్యం మూలంగా ఈ మధ్య ఎక్కడికీ బయటికి వెళ్ళడమే లేదు. తనని ఎవరో జైలులాంటి నాలుగు గోడల మధ్య బంధించి ఉంచినట్లుగా ఫీలవసాగింది పారిజాత.

అలాంటి సమయంలోనే ఢిల్లీలో ఆర్మీలో పనిచేస్తున్న రాజారావు తమ్ముడు రామం సెలవు మీద హఠాత్తుగా ఊడిపడ్డాడో రోజు అన్నగారింటికి.

అరవిచ్చిన మల్లెమొగ్గలా అందంగా... 'తనకన్నా చాలా తక్కువ వయస్సుగల పారిజాత తనకి వదినా?' అన్నట్లుగా ఆశ్చర్యంతో తలమునకలై పోయాడు రామం.

ఆ రోజు రాత్రి భోజనాల వేళ "నీవింకా పెళ్ళి చేసుకోవా రామూ?" అడిగాడు రాజారావు తమ్ముడిని.

“ఎందుకు చేసుకోను అన్నయ్యా, వదినలాంటి అందమైన అమ్మాయ్ దొరికితే తప్పకుండా చేసుకుంటాను...” వడ్డన చేస్తున్న వదినగారి తెల్లని నాజూకైన చేతులకేసి ఆసక్తిగా చూస్తూ చిన్నగా నవ్వుతూ హుషారుగా అన్నాడు రామం.

తమ్ముడిచ్చిన ఆ సమాధానం రాజారావుకి అసలు నచ్చలేదు. ప్రశ్నార్థకంగా ముఖంపెట్టి అదోలా చూశాడు.

కాని పారిజాత మాత్రం మరిది దగ్గరినుంచి తన అందానికి ప్రశంసాపూర్వక మైన గుర్తింపు లభించేసరికి... మనస్సు ఆనందంతో ఉప్పొంగి పోయింది. బుగ్గల్లో మందారాలు పూశాయి. కన్నులు అరమోడ్పులైనాయి.

రామం రాకతో పారిజాత ఒంటరితనంతో పడే బాధంతా ఒక్కసారిగా పూర్తిగా పటాపంచలైపోయింది.

నిజానికి రామం చాలా సరదా అయిన మనిషి. అస్తమానం ఏవేవో జోక్స్ వేస్తూ తను నవ్వుతూ ఎదుటివాళ్ళు హాయిగా నవ్వేలా మాట్లాడతాడు. ఏ మాత్రం జంకు గొంకు లేకుండా అతనితో ఫ్రీగా మసులుకోసాగింది పారిజాత.

రాజారావు మాత్రం వాళ్ళిద్దరి ప్రవర్తనకి మనస్సులో రవంతగా బాధపడ సాగాడు.

ఓ రోజు సాయంత్రం రాజారావు ఆఫీస్‌నుంచి వస్తుంటే - ముందు హాల్లో కూర్చున్న పారిజాత రామం ఎందుకనో విరగబడి నవ్వుతున్నారు. వాళ్ళిద్దరి నవ్వులు వీధి వాకిలి వరకు వినిపిస్తున్నాయి.

అతను ఇంట్లోకి రాగానే ఎవరో మంత్రించినట్లుగా వాళ్ళ నవ్వులు టక్కున ఆగిపోయాయి.

రామం సోఫాలోనుంచి చటుక్కున లేచి అన్నకి ఎదురెళ్ళి, “అన్నయ్యా! ఇందాకట్నుంచీ మేం నీకోసమే ఎదురు చూస్తున్నాం. త్వరగా తయారవ్వు. చాలా మంచి హిందీ పిక్చర్‌కి మూడు టికెట్స్ బుక్ చేయించి తీసుకొచ్చాను. అందరం కలిసి వెళదాం” ఉత్సాహంగా అన్నాడు.

అప్పటికే తన అలంకరణ పూర్తి చేసుకొని తెల్లటి కాశ్మీర్ సిల్క్ చీర కట్టుకొని అందంగా తయారయి ఉన్న భార్యకేసి క్షణం తేరిపారగా చూశాడు రాజారావు.

“నేను రాలేనురా! ఒంట్లో బాగలేదు. చాలా తలనొప్పిగా ఉంది. మీరిద్దరు వెళ్ళిరండి!” అన్నాడు నిదానంగా జోళ్ళు విడుస్తూ.

“నీవు రాకుంటే వదిన నాతో వస్తుందా?” రామం కళ్ళు రవంత సందేహంతో రెపరెపలాడాయి.

“ఏం, ఎందుకు రాదు? వస్తుందిలే... వెళతావా పారిజాతా?” అడిగాడు రాజారావు భార్య వంక చూస్తూ.

‘వారికలా ఉంటే నేనెలా వస్తాను. నువ్వెళ్ళు...’ అంటుందేమోనని ఆశించాడు. కాని పారిజాత ఏమాత్రం సందేహించక “సరే, అలాగే వెళ్తాను...” అంటూ హుషారుగా తలాడించి “ఫ్లాస్క్‌లో కాఫీ పోసి ఉంచాను. ఓ సారిడన్ వేసుకొని ఆ కాఫీ తాగి హాయిగా పడుకోండి. మేం వచ్చాక భోజనం చేద్దాం...” అంటూ మరో మాటకైన ఆగకుండా రామంతోపాటు వడివడిగా వెళ్ళిపోతున్న భార్య వంక కళ్ళప్పగించి చూడసాగాడు రాజారావు.

ఆ ఒక్కరోజే కాదు!...

రాజారావు ఇంట్లో లేనప్పుడు, ఉన్నప్పుడు, అతన్ని అడిగి కొన్నిసార్లు, అతనికి తెలియకుండా మరికొన్నిసార్లు అలా సినిమాలకి, షికార్లకి మరిదితో జంటగా తెగ తిరుగసాగింది పారిజాత.

“మీ అన్నయ్య ఏమన్న అనుకుంటారేమో” అని మొదట్లో పారిజాత కొంచెం సందేహించినా- “ఆఁ. మరేం ఫర్వాలేదు లెద్దూ! అన్నయ్య ఏమీ అనుకోడు ఆయనది అంత సంకుచిత స్వభావం కాదులే” అని నవ్వుతూ తేలిగ్గా తీసిపారేసి ఆమెకు ధైర్యం చెప్పేవాడు రామం.

ఆర్మీలో ఉండడం వల్ల రామానికి అన్ని సుగుణాలు అబ్బాయి. తన చిన్ననాటి ఫ్రెండ్స్ అంతా కలిసి హోటల్లో పార్టీ చేసుకుంటున్నామని చెప్పి వెళ్ళి పీకలదాకా చిత్తుగా తాగి అర్ధరాత్రికి ఇంటికి చేరాడారోజు.

ఆ రోజు రాజారావు కూడా ఇంట్లో లేడు.

ఆఫీస్ పనిమీద పై ఊరికి వెళ్ళడం వలన పనిపిల్లని తనకి తోడుగా ఇంట్లోనే ఉంచుకుంది పారిజాత.

రామం వచ్చి గబగబా తలుపులు బాదేసరికి ముందు హాల్లోనే పడుకున్న పనిపిల్ల లేచి తలుపులు తెరిచింది.

తూలుతూనే ఇంట్లోకి వచ్చాడు రామం.

“మీ అమ్మగారు పడుకుందా?”

"ఆఁ. పెందరాలే తిని పడుకున్నారు. మీరు భోజనం చేస్తారా బాబూ?"

"అక్కరలేదు. హోటల్లో తినే వచ్చాను. నీ వెళ్ళి పడుకో" అని చెప్పి రామం అప్రయత్నంగానే పారిజాత పడుకున్న గదివైపు వెళ్ళాడు.

కోడె వయసులో ఉన్న పారిజాతకి తీయని ఊహలతో కోరికలతో మనస్సూ తనువూ వేడెక్కిపోతుంటే - నిద్రరాక అటూ ఇటూ దొర్లి అశాంతిగా మథన పడసాగింది.

రామం రావడం, పనిపిల్ల తలుపు తీయడం అంతా వింటూనే ఉంది నిద్రపోని పారిజాత. అతను తడబడే అడుగులతో తన గదిలోకి రావడం లైట్ వెలిగించడం గమనిస్తూనే ఉందామె.

"ఏం చేస్తున్నావ్ నిద్రరావడంలేదా? ఒంటరిగా ఉంటే ఎలా వస్తుంది?" అని చిన్నగా నవ్వుతూ కాంక్ష నిండిన కళ్ళతో చూస్తూ ముందుకెళ్ళి ఆమె మనస్సు గ్రహించిన వాడిలా సరాసరి మంచంపై కూర్చొని ఆమె సన్నని నడుం చుట్టూ తన బలిష్ఠమైన రెండు చేతులూ జంట సర్పాల్లా పెనవేశాడు.

అతని స్పర్శకి పారిజాత శరీరమంతా విద్యుత్తు పాకినట్లైంది. అసలే కోరికలతో వేగిపోతున్న ఆమెకు ఆ తరుణంలో రామం అలా ప్రవర్తించడం ఏమాత్రం తప్పుగా భావించక, అతని చర్యకు ఎలాంటి అభ్యంతరం కూడా చెప్పలేదు. వివేకం కోల్పోయిన ఆమె అతన్ని లతలా పెనవేసుక పోయింది.

భర్తకు ద్రోహం చేస్తున్నానన్న భయంగాని, రామం ఎవరు? తనకి వరసకి ఏమవుతాడన్న విషయంగాని పారిజాత మెదడుకి తట్టలేదాక్షణంలో.

ఆమె ప్రోద్బలంతో రామం హుషారుగా మరింతగా విజృంభించాడు. "ఆ ముసలివాడు నిన్నేం సుఖపెడ్తాడు. నాతో వచ్చేసెయ్ పారూ!" అంటూ ఆమెని నిలువెల్లా ఆక్రమించుకున్నాడు.

ఆ ఒక్కరోజే కాదు. ఏకాంత సమయం దొరికినప్పుడల్లా రాజారావు కళ్ళు గప్పి వాళ్ళ ప్రేమాయణం చాలా సార్లు సాగించారలా.

రామం రెండు నెలల సెలవు పూర్తైపోయింది.

ఆ నెల చివర్న వెళ్ళిపోయాడు తిరిగి ఢిల్లీ...

అతను వెళ్ళిపోయిన రోజు పారిజాత బాధ అంతా ఇంతా కాదు. ఏదో పోగొట్టుకున్నదానిలా ఫీలవ్వసాగింది. తమ్ముడు వెళ్ళిపోగానే భార్యలో కలిగిన ఆ

మార్పుని రాజారావు బాగానే గమనించాడు. అయినా ఆమెని ఏమీ అనలేదు; ముభావంగా ఉండిపోయాడు. అలా నిర్లిప్తంగా ఓ నెల గడిచిపోయింది.

ఈ మధ్య పారిజాతలో ఏదో  మార్పు వచ్చేసింది.

తిండి సహించకపోవడం... బలవంతంగా తిన్నా అది వెంటనే వాంతైపోవడం... పెళ్ళయ్యాక అది చాలా ఆడవాళ్ళకి వచ్చే మామూలు వేవిళ్ళ జబ్బే అయినా, అదేం గ్రహించలేని రాజారావు ఓ రోజు భార్యని బలవంతంగా తనకి బాగా పరిచయం ఉన్న లేడీ డాక్టర్ దగ్గరికి తీసికెళ్ళాడు.

ఆవిడ పారిజాతానికి అన్ని పరీక్షలు చేసి ''నీకేం జబ్బు లేదమ్మాయ్! తల్లివి కాబోతున్నావు. నీరసంగా ఉన్నావు కాబట్టి బలానికి మంచి మందులు రాసిస్తాను'' అని నవ్వలేక నవ్వుతున్నట్లుగా చెప్పేసి ''మీరెళ్ళి బయట కూర్చున్న మీ వారిని ఓసారిలా లోపలికి పంపండి'' అని చెప్పింది.

తాను తల్లి కాబోతున్నందుకు పారిజాతకు ఆ క్షణంలో ఎంతో సంతోషం కలిగింది.

ఆనందంతో వెలిగిపోతున్న ముఖంతో గర్వంగా బయటికొస్తున్న భార్యని కొంచెం అయోమయంగా చూస్తూ, ''ఏమైంది? డాక్టర్ ఏమన్నది?'' ఆత్రుతగా అడిగాడు రాజారావు.

భర్త అలా అడిగేసరికి ఈసారి పారిజాత బాగా సిగ్గుపడిపోయింది. బుగ్గల్లో మందారాలు పూశాయి. ''మిమ్మల్ని డాక్టరుగారు లోపలికి రమ్మన్నారెందుకో?'' తలొంచుకొని సన్నని స్వరంతో అంది.

డాక్టర్ గదిలోకి వెళ్ళిన రాజారావు మళ్ళీ ఓ ఐదారు నిమిషాలకు తెల్లగా పాలిపోయిన ముఖంతో బయటికొచ్చాడు. కళ్ళెత్తి భార్య వంకోమారు తీక్షణంగా చూసి 'పద' అన్నాడు గంభీరంగా.

డాక్టర్ లోపల అతనితో ఏం చెప్పిందో క్షణంలో భర్త ఎందుకలా మారి పోయాడో అర్థంగాని పారిజాత ఏదో తెలియని అయోమయావస్థలో పడి పోయింది.

'బహుశా, ఈ వయస్సులో తండ్రి కాబోతున్నందుకు సిగ్గు బిడియాలతో లోకులకి భయపడుతున్నాడు కాబోలు' అనుకొని సరిపెట్టుకుంది.

ఆ రాత్రి రాజారావు భోజనం కూడా చేయలేదు. ఆకలిగా లేదని వద్దన్నాడు. డాక్టర్ దగ్గరినుంచి వచ్చిన క్షణం మొదలు అతని మనస్సు మనస్సులో లేదు.

లెక్కలేనన్ని ఆలోచనలు మనస్సులో గజిబిజిగా అలుముకున్నాయి. కంటి మీదికి కునుకే రాలేదు. సిగరెట్ల మీద సిగరెట్లు తెగ కాలుస్తూ ఇల్లంతా పిచ్చివాడిలా తెగ పచార్లు చేయసాగాడు.

భర్త వాలకం అర్థంకాని పారిజాత "ఏమైంది? ఎందుకలా ఉన్నారు?" అంటూ రెండు మూడుసార్లు అడిగి బాగా చీవాట్లు తిన్నది. దానితో ఉక్రోషం ముంచుకొచ్చిం దామెకు.

"తండ్రికాబోతున్నందుకు సంతోషించక ఎందుకంతగా తలబద్దలు కొట్టుకోడం? ఈ వయస్సులో పిల్లలేమిటని అనుకొని నాకు అబార్షన్ చేయించు దామని ఆలోచిస్తున్నారేమో! నా దగ్గర ఆ పప్పులేం ఉడకవు. మొదటి నుంచైనా నాకు పిల్లలంటే ఎంతో ప్రేమ, ఇష్టం. మీకో కూతురు ఉన్నందుకు చాలనుకుంటు న్నారు కాబోలు! నాకూ పిల్లలు కావాలి; నేను తల్లిని అవ్వాలి. మీరెన్ని చెప్పినా నేను మాత్రం ఛస్తే అబార్షన్ చేయించుకోను" కోపావేశాలతో విసురుగా అంటున్న భార్య వంక కళ్ళప్పగించి చూడసాగాడు రాజారావు.

✧ ✧ ✧

ఆ మరుసటి రోజు పారిజాత నిద్ర లేచేసరికి బారెడు పొద్దెక్కింది.

పనిపిల్ల వచ్చి నిద్ర లేపింది. కళ్ళు నులుపుకుంటూ మంచంపై కూర్చొని ఓసారి చుట్టూ కలియ చూసింది.

ఎటు చూసినా గదినిండా ఖాళీ డబ్బాలు... కాల్చిపారేసిన సిగరెట్టు పీకలే కుప్పలు కుప్పలుగా పడి ఉన్నాయి. "ఊఁ, రాత్రంతా నిద్రలేకుండా ఇట్లా సిగరెట్లు తగలేస్తూ గడిపారు కాబోలు" అనుకొని "అయ్యగారు నిద్రలేచారా?..." అడిగింది పని పిల్లని.

"అయ్యగారు ఇంట్లో లేనట్లున్నారమ్మా! తలుపులు దగ్గరగా వేసి ఉంటే తీసుకొని నేనొచ్చాను. నాకు త్వరగా అంట్లగిన్నెలు పడేయండమ్మగారూ" అంటూ ఇల్లు చిమ్మడానికి మూలనున్న చీపురు చేతిలోకి తీసుకొంది.

అది వినగానే ఈసారి పారిజాత మంచంమీది నుంచి దిగ్గున లేచింది.

భర్తకోసం ఇల్లంతా కలియ తిరిగింది.

రాజారావు ఎక్కడా కన్పించలేదు.

ఏదో తెలియని భయాందోళనలతో గుండెలు దడదడలాడుతుంటే, మళ్ళీ ముందు హాల్లోకి వచ్చినామెకు, టి.వి.స్టాండ్‌పై ఓ పక్కగా మడత పెట్టి ఉంచిన కాగితమేదో కన్పించింది.

ఒక్క ఉదుటున వెళ్ళి వణుకుతున్న చేతులతో అది అందుకొని విప్పి చదవ సాగిందామె.

"పారిజాతా!

నిన్న డాక్టర్ చెప్పిన వార్త విన్నప్పటినుంచి నా మనస్సు షాక్ తిన్నట్లైంది. ఆ లేడీ డాక్టర్ నా మొదటిభార్య కమల ఉన్నప్పటినుంచి బాగా పరిచయం. కమలకి మొదటి కాన్పులో మా అమ్మాయ్ అయిన సునీత అదే హాస్పిటల్లో పుట్టింది. సునీత తరువాత కమల ఆరేడు సంవత్సరాలకి మళ్ళీ గర్భవతి అయింది. అసలే చాలా నీరసంగా అనారోగ్యంగా ఉండే కమలకు రెండోసారి కాన్పు కావడం చాలా కష్టసాధ్యమైంది. చివరికి బాబు పుట్టాడు. 'నీ భార్యకి మళ్ళీ కాన్పంటూ వస్తే ఆవిడ మాత్రం నీకు దక్కదు' అని డాక్టర్ ఖచ్చితంగా చెప్పడం వలన ఆ వెంటనే నేను పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నాను. ఇది జరిగిన నాలుగు రోజులకే ఇంకా హాస్పిటల్లోనే ఉన్న కమలకి ఏదో విషజ్వరం సోకి హఠాత్తుగా కన్నుమూసింది. పొరపాటుగా తల్లిపాలు తాగడం వలన పుట్టిన ఆ పసివాడు కూడా నాకు దక్కలేదు. నేనీ విషయమంతా వివరంగా నీకిప్పుడు ఎందుకు తెలియ జేస్తున్నానంటే మీ ఊరి పేరయ్యకి నేనీసంగతి చెప్పాను. నీతో కూడా చెప్పమన్నాను. 'నావలన ఆ అమ్మాయ్ తల్లి అయ్యే ఆస్కారం లేదనీ, నీకిష్టమైతేనే ఈ పెళ్ళికి ఒప్పుకోమనీ' చెప్పాను. ఆయన నీతో ఈ విషయం చెప్పే ఉంటాడన్న ఉద్దేశ్యంతో నేను కూడా నీతో ఎప్పుడూ ఈ ప్రసక్తి తీసుకురాలేదు. కాని, నిన్న డాక్టర్ నీవు తల్లివి కాబోతున్నావని చెప్తుంటే నా మతిపోయింది. నేను ఆపరేషన్ చేయించుకోడం ఆవిడకి తెలుసు కాబట్టి 'పెళ్ళి చేసుకున్నాక మీరు పిల్లలు కలగడానికి తిరిగి ఆపరేషన్ చేయించుకున్నారా?' అంటూ చనువుగా అడిగింది. ఆ మాటకి నాకేం మాట్లాడాలో తోచక సిగ్గుతో చితికిపోయాను. 'లేదన్నట్లు'గా తల గబగబా ఆడించాను.

'మరి ఇదేమిటి? మీ ఆవిడ ప్రెగ్నెంట్ ఇప్పుడు...' అంది అదోలా చూస్తూ. ఇక అక్కడ ఒక్కక్షణం కూడా నిల్చోలేకపోయాను. వెంటనే బయటికి వచ్చేశాను. నిన్నటినుంచి నేను పడ్డ నరకయాతన అంతా ఇంతా కాదు. ఇంకిప్పుడు నీకు

సర్వం అర్థమైందనుకుంటాను. నీవు నా వలన తల్లివి కాలేదు. నీ కడుపులో పెరుగుతున్న శిశువుకి తండ్రి ఎవరో నీకు తెలుసు. రామం... వాడితో తప్ప నీవెరితో అంత విచ్చలవిడిగా తిరగలేదనుకుంటాను. ఈ విషయమంతా రామానికి వివరంగా లెటర్ రాశాను. వాడు సాధ్యమైనంత త్వరలో వస్తాడు. తప్పకుండా నిన్ను తనతో తీసుకుపోతాడు. నాకా నమ్మకం ఉంది. నేను కొన్నాళ్ళు సెలవు పెట్టి మా అమ్మాయ్ సునీత దగ్గరికి వెళ్తున్నాను. నేను తిరిగి వచ్చేసరికి నీవీ ఇంట్లో ఉండకూడదు. రామంతో వెళ్ళిపోయి ఉండాలి...'

ఇంతలో రవీంద్ర లోపలికి వచ్చిన అలికిడికి గభాల్న తలెత్తింది సుమ. చేతిలోని కాగితాలు తీసి సరిచేసి టేబుల్‌పై పెట్టింది.

✧ ✧ ✧

"కథ పూర్తిగా చదివావా వదినా?"

"లేదు. ఇంకాస్త ఉందిలే. అయినా నాకు దీని ముగింపు తెలుస్తూనే ఉంది. చివర్లో ఆ పారిజాత ఆత్మహత్య చేసుకుంటుంది కదూ?"

అవునన్నట్లుగా గబగబా తలాడించాడు రవీంద్ర.

"అదే నాకు నచ్చలేదు రవీ! ఎలాంటి జటిల సమస్యకైనా ఏదో ఒక పరిష్కార మార్గమంటూ ఉండకపోదు. అన్ని విషమ సమస్యలకీ చావే పరిష్కార మార్గంగా చూపకూడదు. అదేంటో చాలా మంది రచయితలూ రచయిత్రులూ తమ రచనలని హీరోనో, హీరోయిన్నో చంపేస్తూ ముగిస్తారు. నాకైతే అలాంటివి చదివేందుకే భయమేస్తూ ఉంటుంది".

"భయమెందుకు వదినా! నిజ జీవితాలలో కూడా అలాంటివి ఎన్నెన్నో ఆత్మహత్య సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. రోజూ మనం పత్రికల్లో ఎన్నెన్ని రకాలుగా ఆత్మహత్య వార్తలు చదవడం లేదూ? కిరోసిన్ పోసుకొని ఒళ్ళు అంటించుకోవడం, నూతుల్లోకి దూకి చావడం, ఉరేసుకొని కొంతమంది చావడం..."

"ఇక చాలు. ఆపు బాబూ, నీ ఘోరాల లిస్ట్ వినలేకపోతున్నాను".

"నీది చాలా సున్నిత మనస్తత్వం వదినా! ఏ చిన్న బాధాకరమైన సంఘటనకి కూడా తట్టుకోలేవు. ఏ దారుణాన్ని అయినా విని భరించలేవు. తట్టుకునే శక్తి లేదు. అందుకని నీది చాలా పిరికి గుండె అని నేనంటాను. జీవితంలో ఎదురయ్యే కష్టాల్ని, బాధల్ని విషమ పరిస్థితులను ఎదుర్కొని నిలదొక్కుకునే గుండె ధైర్యం, నిర్భీతి ప్రతిమనిషికీ ఉండాలి; ఉండి తీరాలి...

‘‘నిజానికి నా జీవితంలోనే ఎంతటి దారుణ విషమ పరిస్థితులు ఎదురైనా నీ ఈ కథలోని హీరోయిన్‌లా పిరికిపందలా పిచ్చిగా ఆత్మహత్య ఛస్తే చేసుకోను’’.

‘‘నా కథానాయకి పిరికిపందని అంటున్నావుగాని, అది నిజంగా జరిగిన సంఘటననే వదినా! ఈ వీధికి రెండిళ్ళ అవతల భుజంగం అని ఒకతనున్నాడు. ఆయన కథనే ఆధారంగా తీసుకొని నేనీ రచన చేశాను. సుభద్ర వదిన వాళ్ళ విషయాలన్నీ నాకు వివరంగా చెప్తే, వాటికి నా ఊహాగానాన్ని జోడించి రాశాను’’.

‘‘అయితే, ఆ అమ్మాయ్ నిజంగానే చచ్చిపోయిందా రవీ? వాళ్ళమరిది వచ్చి తీసుకువెళ్ళ లేదా?’’ ఆశ్చర్యంగా అడిగింది సుమ.

‘‘ఊహుఁ. అసలతను రానే లేదు. ‘నీ భార్య అయిన పారిజాతకు నాకు మధ్య ఎలాంటి సంబంధమూ లేదు. ఇక్కడ నేనో అమ్మాయిని ప్రేమించాను. వచ్చే నెలలో వివాహం చేసుకోబోతున్నాను...’ అంటూ వాళ్ళ అన్నగారికి వదినకు ఉత్తరాలు రాశాడట. ఇటు కట్టుకున్న భర్తకు దూరమై, అటు మరిదికి దగ్గరవ్వలేని విషమ పరిస్థితుల్లో ఆ అమ్మాయి ఇంట్లోనే ఉరిపోసుకొని చనిపోయింది.’’

‘‘పాపం, ఆ దుష్టుడి మూలానే ఇలా జరిగింది కదా!’’ అంటుంటే సుమబాల కళ్ళు అప్రయత్నంగా చెమ్మగిల్లాయి.

అంతలోనే ఆ గదిలోకి పరుగు పరుగున బాబీ వచ్చాడు, ‘‘పిన్నీ, పిన్నీ!...’’ అని కేకలేస్తూ.

‘‘ఏమిట్రా ఆ పరుగు...’’ అంది సుమ కుర్చీలో నుంచి లేస్తూ.

‘‘మరే, పిన్నీ! మమ్మీ నిన్ను త్వరగా తయారవ్వమంటుంది. పిక్చర్‌కు వెళ్ళాలట మనమిప్పుడు...’’ హుషారుగా చెప్తూ చెయ్యి పట్టుకొని సుమని లాక్కెళ్ళు తున్నట్టుగా తీసికెళ్ళాడు.

‘‘ఏమిటక్కయ్యా, వీడేదో పిక్చర్ అంటున్నాడు’’.

‘‘మరే, మీ బావగారు పిక్చర్‌కు వెళ్దామంటున్నారు. తొందరగా రెడీ అవ్వు. అందరం కలిసి సరదాగా వెళ్దాం. నేనీలోగా అందరికీ కాఫీలు పట్టుకొస్తాను’’.

‘‘ఎందుకక్కయ్యా పిక్చర్‌కెళ్ళడం. అయినా రాత్రికి మేం వెళ్ళిపోతున్నాంగా పెద్దక్కయ్య వాళ్ళూరికి’’.

‘‘లేదులే రేపు ఉదయం మీరిక్కడినుంచి బయలుదేరడానికి నాన్నగార్ని ఒప్పించాను. అందుకనే ఇప్పుడీ సినిమా ప్రోగ్రామ్’’.

"ఆ సినిమాకెళ్ళే బదులు హాయిగా ఇంట్లో కూర్చొని కబుర్లు చెప్పుకోవచ్చుగా".

"అయ్యో, మా ఇంటికి రాకరాక వచ్చిన మరదలివి. ఈ బావ కనీసం ఓ పిక్చరైన చూపెట్టకపోతే ఎట్లా?" అన్నాడు అప్పుడే అటుగా వచ్చిన ఆనందరావు.

"అయినా పిక్చర్ చూడ్డం నాకంతగా ఇష్టం ఉండదు బావా!"

"మరేం ఫర్వాలేదు, చాలా మంది ఇష్టపడే పౌరాణిక చిత్రమిది".

"ఓహోఁ!..." కళ్ళెగరేసింది సుమ.

"ఓహో అని అంత తేలిగ్గా అంటావేమిటి? అందునా రామారావు పిక్చరాయె! మామగారు కూడా వస్తున్నారు మన వెంట..." అంటూ టవల్ తీసుకొని భుజాన వేసుకొని హడావుడిగా బాత్‌రూం వైపు వెళ్ళాడు ఆనందరావు.

✧ ✧ ✧

"సుమిత్రకి ఎలా ఉందమ్మా? పురుడు రావడానికి ఇంకా ఎన్ని రోజులు పడుతుందట?" పక్కింటి సుగుణమ్మ అడుగుతోంది ముసలావిడని.

"ఏదీ సరిగ్గా తెలియడం లేదు నాకు. అబ్బాయ్ ఏ సంగతులు నాకు తెలియనియ్యడు. ఈ వేళో రేపో కాన్పు కాకపోతే తప్పనిసరిగా ఆపరేషన్ చేయాలని అందట డాక్టరమ్మ. అమ్మాయికి ఎలా ఉంటుందో ఏమో? అంతా ఆ భగవంతుని దయ. పిల్లో పిల్లాడో ఎవరైనా సరే ఈ ఒక్కమారు సవ్యంగా జరిగి అమ్మాయి క్షేమంగా ఇంటికి వస్తే నాకంతే చాలు..." కళ్ళు చెమ్మగిల్లుతుండగా బాధాతప్త స్వరంతో అంటున్న ముసలావిడ వంక జాలిగా చూసింది సుగుణమ్మ.

ఆవిడకి కోడలంటే ఎంతో ప్రేమానురాగాలు!...

ఎంతైనా మీకు కోడలంటే చాలా అపేక్షలెండి. మీలాంటి అత్తా కోడళ్ళూ చాలా అరుదుగా ఉంటారు. మీరేలాంటి దిగులూ బాధా పెట్టుకోకండి. సుమిత్ర ఈసారి పండంటి కొడుకుతో క్షేమంగా ఇంటికి చేరుకుంటుంది... ఓదార్పుగా అందావిడ.

"కూతురైనా కొడుకైనా నాకు అమ్మాయే కదా! ఇంకెవరున్నారు మాకు? వాళ్ళూరికి ఫోన్ చేయించాను. మళ్ళీ ఉత్తరం కూడా రాయించాను సుమిత్రతో... ఈ పురిటి సమయంలో కాస్త సహాయంగా ఉంటుందని వాళ్ళ చెల్లెల్ని పంపమని. కాని ఇంతవరకూ ఎవ్వరూ రాలేదు. వాళ్ళ దగ్గరనుంచీ ఎలాంటి సమాధానమూ రాలేదు. అసలు ఆ అమ్మాయి వస్తుందో రాదో?"

"ఇవాళో రేపో రావచ్చు లెండి. మా అబ్బాయ్ పడుకున్నాడు. వాడు లేచేలోగా నా పనంతా తెమల్చుకొని ఓసారి హాస్పిటల్‌కు వెళ్ళి సుమిత్రని చూసి వస్తాను" అంటూ సుగుణమ్మ వెనుదిరిగేటంతలో ఓ ఆటో సర్రున ముందుకు దూసుకు వచ్చి వాకిట్లో ఆగింది.

ముసలావిడ కళ్ళజోడు సవరించుకుంటూ ఆశ్చర్యంగా చూడసాగింది, ఆటోలోనుంచి దిగుతున్న వాళ్లని.

"మీ ఇంటికేనండి చుట్టాలు... ఎవరో గుర్తించారా?" తగ్గు స్వరంతో అడుగుతున్న సుగుణమ్మ మాటలకి "ఎవరో ఏమిటో నాకంతగా గుర్తు రావడం లేదు" సన్నగా గొణుగుతున్నట్లుగా అంటున్న ముసలావిడ ఇంకా అటే చూస్తోంది.

ఆటో వెళ్ళిపోయింది.

సూట్‌కేస్ చేతపట్టుకొని వెంకట్రామయ్యగారు, ఆ వెనకాల సుమబాల లోపలికి రాసాగారు.

"ఏం, అక్కయ్యా! బాగున్నారా? నేను వెంకట్రామయ్యని. పల్లెనుంచి వస్తున్నాం. ఇది నా చిన్నకూతురు సుమబాల" అంటూ తనను తానే పరిచయం చేసుకున్నాడాయన.

"మీరేనా?... అంతా కులాసే కదా! మిమ్మల్ని చూసి చాలా కాలం అయింది. అందుకనే చప్పున గుర్తించలేకపోయాను. రండీ... రండి లోపలికి... కోడలు పిల్ల తోటకూర కాడలా బాగా ఏపుగా పెరిగిపోయింది..." సుమని అపురూపంగా చూస్తూ అందావిడ.

"ఓహోఁ, ఐతే మీరు సుమిత్ర చెల్లెలేనన్నమాట. ఇందాకనే ఓ నిమిషం ముందు మీ గురించే మాట్లాడారు. ఇంతలోనే మీరు వచ్చేశారు. నిండా నూరేళ్ళ ఆయుస్సు మీకు". నవ్వుతూ సుగుణమ్మ వెళ్లిపోయింది.

"ఎవరత్తయ్యా ఆవిడ?" సుమ అడిగింది.

"సుగుణమ్మ అని మన పక్కింటి ఆవిడ. మీ అక్కయ్య హాస్పిటల్లో చేర్పించినప్పటి నుంచి పాపం ఆవిడ చాలా సహాయం చేస్తోంది".

"ఇంకా డెలివరీ కాలేదా అమ్మాయికి?" వెంకట్రామయ్యగారు కూతురు గురించి ఆత్రుతగా అడిగాడు.

“ఇంకా కాలేదు. ఇవాళ రేపు పురుడు రాకుంటే ఆపరేషన్ చేయాలని అంటుందట ఆ డాక్టరమ్మ. వారం పదిరోజులు ఆఫీసుకు సెలవు పెట్టాడు అబ్బాయ్”.

“అయితే అల్లుడుగారు హాస్పిటల్లోనే ఉన్నారా?”

“ఆఁ, ఇందాకనే అమ్మాయికి పాలు టిఫిన్ పట్టుకెళ్ళాడు హాస్పిటల్‌కి. నాకేమో ఏ పనీ చేతకాదు. ఏమీ తోచి చావక కాలు చెయ్యి ఆడ్డం లేదు”.

“ఫర్వాలేదత్తయ్యా! నేనొచ్చానుగా ఇక అన్ని పనులూ నేను చూసుకుంటాను లెండి. మీరిక నిశ్చింతగా ఉండండి” సుమ నవ్వుతూ ముసలావిడకి అభయమిచ్చింది.

“నా తల్లే, నిన్ను చూస్తుంటే నా కడుపు నిండిపోతుంది. పదమ్మా పద... స్నానాలు చేసి కాఫీ టిఫిన్ తీసుకుందురుగాని...”

“అవునమ్మా సుమా! త్వరగా మనం కాలకృత్యాలు ముగించుకొని హాస్పిటల్ కెళ్ళి ముందుగా మీ అక్కయ్యను చూసొద్దాం”.

“అలాగే నాన్నా! మీరు స్నానం చేసిరండి” అంటూ సుమ సూట్‌కేస్ తెరిచి తండ్రికి బట్టలు, టవలు బయటికి తీసింది.

“అన్నట్లు, అక్కయ్య... పిల్లలేరి?”

“పెద్ద పిల్లలు ముగ్గురూ స్కూల్‌కి వెళ్ళారు. చంటిది మాత్రం పాలు తాగి ఇందాకనే పడుకొంది”.

“సరి సరి” అంటూ వెంకట్రామయ్యగారు టవల్ భుజం మీద వేసుకొని బాత్‌రూం వైపు వెళ్ళాడు.

✧ ✧ ✧

“ఈ కాస్త పాలు తాగు సుమిత్రా!

“అబ్బే! వద్దండి... నేనిక తాగలేను”.

“మొండిగా ఇలా వద్దంటే ఎలా చెప్పు? నీవస్సలే చాలా నీరసంగా ఉన్నావంటుంది డాక్టర్. ఊఁ, చల్లారి పోతున్నాయి. త్వరగా తాగు” అంటూ బలవంతంగా కప్పులోని ఆ పాలన్నీ భార్యతో తాగించాడు రఘురాం.

“ఏమండీ!... ” మెల్లిగా పిల్చింది సుమిత్ర.

‘‘ఫ్లాస్కులో టిఫిన్ బాక్స్ వైరుబుట్టలో సర్దుతున్న అతను తలెత్తి చూశాడు ఆమె వంక ఏమిటన్నట్లుగా.

‘‘మీరు మా వూరికి ఓ మారు ఫోన్ చేయండి. తొందరగా సుమని ఇక్కడికి పంపమని. లేకపోతే చాలా కష్టమవుతుందండి. నేనిలా హాస్పిటల్లో పురుడయ్యాక కూడా ఎన్నాళ్ళు ఉండిపోవాల్సి వస్తుందో, ఇంట్లో పిల్లలతో అత్తయ్యకి నానా యాతనగా ఉంటుంది. చెల్లాయ్ వస్తే ఇక నాకే దిగులూ ఉండదండీ... అన్ని పనులూ అదే స్వయంగా చూసుకుంటుంది’’.

‘‘మీ వాళ్ళు మీ చెల్లాయ్‌ని ఇక్కడికి పంపాలని ఇష్టం ఉన్నా వాళ్లైతే నీవు ఫోన్ చేయగానే పంపేవారు. ఇప్పుడు మళ్ళీ ఫోన్ చేసి కూడా ఆమెనిక్కడికి పంపిస్తా రని నాకా నమ్మకం లేదు’’.

‘‘తప్పకుండా పంపిస్తారండి. ఎందుకు లేటైపోయిందో నాకర్థం కావడం లేదు’’.

‘‘సరే నీ ఇష్టమిక. ఇప్పుడే చేస్తాను మీ ఊరికి ఫోన్ నెంబర్ చెప్పు...’’ అంటూ రఘురాం జేబులో నుంచి సెల్‌ఫోన్ తీశాడు.

అంతలోనే లోనికెవరో వచ్చిన అలికిడికి వెనుదిరిగి చూసిన రఘురాం విస్తుబోయాడు.

‘‘అరె, మామయ్య! మీరా? ఎప్పుడొచ్చారు? హాస్పిటల్‌కెలా వచ్చారు?’’ ఆశ్చర్యానందాలతో ప్రశ్నించాడు.

‘‘పని పిల్ల చూపెట్టింది హాస్పిటల్. మేము వచ్చి ఓ గంటపైగానే అయింది. అమ్మాయికి ఎట్లా ఉంది?’’ అంటూ ముందుగా తండ్రి, ఆ వెనకాల వస్తున్న మరదల్ని అప్పుడు చూశాడు రఘురాం.

‘‘ఫోన్‌చేయ్... ఫోన్‌చేయ్ అంటూ ఇందాకట్నుంచీ ఒకటే గోల. ఇహనేం చూడవోయ్ మీ చెల్లాయ్ కూడా వచ్చింది’’ నవ్వుతూ చెప్పాడు భార్యకి.

తండ్రిని చెల్లెల్ని చూడగానే సుమిత్రకి ఆ క్షణంలో ఎక్కడలేని బలం, సంతోషం వచ్చేశాయి. బెడ్ పైనే మెల్లిగా లేచి కూర్చుంది.

‘‘ఒంట్లో ఎలా ఉంది? మరీ ఇలా చిక్కిపోయావేమమ్మా?’’ కూతురి తలని ప్రేమగా నిమురుతూ అన్నాడాయన.

అక్కయ్య చేతులని తన చేతుల్లోకి తీసుకుంది సుమ. "గాజులు మోచేతిని దాటి పోతున్నాయి ఇంత నీరసంగా ఉందేమిటి? అక్కయ్య మందులవీ ఏం వాడలేదా బావా?"

"మందులన్నీ సవ్యంగానే వాడింది. ఎందుకనో ఈ మధ్యనే హఠాత్తుగా ఇలా సగానికి సగం తగ్గిపోయింది. ఆరోగ్యం కాస్త దెబ్బతింది".

"ఎందుకనో నాకీమారు ఈ కాన్పుకు చాలా భయంగా ఉంది నాన్నా! నాకేమన్న ప్రమాదం అయితే పిల్లల్ని ఎవరు చూస్తారన్నదే నాకో పెద్ద విషమ సమస్యగా ఉండి..... అదో భూతంలా అనుక్షణం నాకళ్ళ ముందు కదలాడుతూ భయాందోళనలను కలిగిస్తుంది. మిమ్మల్ని అందర్నీ మళ్ళీ చూస్తానో చూడనో అనుకున్నాను. అమ్మని కూడా చూసి చాలా కాలమైంది. అమ్మని ఓసారి చూస్తే నా కోరిక తీరుతుంది నాన్నా!"

"అయ్యయ్యో!... అలా మాట్లాడకు తల్లీ! నీవు బిడ్డతో క్షేమంగా ఇంటికి తిరిగొస్తావ్. ఈసారి బారసాల మన ఊళ్లోనే ఘనంగా జరుపుదామంది మీ అమ్మ. సుమ పెళ్ళి అయ్యేంత వరకూ నీవిక ఊరి నుంచి వచ్చేదే లేదు..." ఓదార్పుగా అన్నాడాయన.

అక్కయ్య అలా మాట్లాడుతుంటే సుమ కళ్ళల్లో గిర్రున నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

"సారథి పెళ్ళికి ఒప్పుకున్నాడా నాన్నా?" ఆనందంగా అంది సుమిత్ర.

"ఆఁ, ఇక ముహూర్తం పెట్టుకుందామన్నారు శాస్త్రిగారు.

"అయితే చెల్లాయ్ త్వరలోనే పెళ్ళికూతురవుతుందన్నమాట!"... సుమ కేసి అపేక్షగా చూసిందామె.

"ఓహోఁ, వచ్చేనెలలో మరదలి విందుభోజనం ఉందన్నమాట" రఘురాం కూడా మనస్ఫూర్తిగా సంతోషం వ్యక్తం చేశాడు.

సుమ అక్క బెడ్‌పైనే ఓ పక్కగా వోరగా కూర్చుంది.

రఘురాం ఓమారు రూమంతా కలియచూసి గుమ్మం దగ్గరున్న ఓ చిన్న స్టూల్ పట్టుకొచ్చి మామగారు కూర్చోడానికి వేశాడు.

సుమిత్ర పిల్లల గురించీ, అత్తగారి గురించీ, సుమ రోజు చేయాల్సిన పనుల గురించి వరసగా చెప్పుకపోతుంది.

సుమేమో చిరునవ్వుతో మౌనంగా ఊకొడుతూంది.

"ఏమిటి సుమిత్రా! ఒకేమారు అన్ని పనులు పురమాయిస్తూ మరదలిని అదరగొట్టేస్తున్నావ్?"

"మరేం ఫర్వాలేదు లెండి. ఎన్ని పనులైనా చెల్లాయ్ క్షణంలో ఇట్టే చేసేయ గలదు. సుమ రాకతో నా మనస్సుకిప్పుడు కొంచెం నిశ్చింతగా ఉందండి..." తేలిగ్గా నిట్టూర్చిందామె.

"ఇది ప్రైవేట్ నర్సింగ్ హోమా అక్కయ్యా?"

"అవును క్రితం సారి చంటిది కూడా ఇదే హాస్పిటల్లో పుట్టింది. మీ బావగారికి బాగా పరిచయం, స్నేహితుని భార్య. అందుకనే మాకు స్పెషల్ రూం కూడా ఇచ్చింది. ఓ మంచి డాక్టరుగా ఈ చుట్టుపక్కల మంచి పేరు ప్రఖ్యాతులున్నాయి".

"డాక్టరుగారు కూడా రౌండ్స్‌కి వచ్చే వేళయింది" అన్నాడు రఘురాం చేతి వాచీకేసి చూసుకుంటూ.

ఆ కాసేపట్లోనే నిజంగా ఆ డాక్టర్ రానే వచ్చింది.

"ఏం సుమిత్రా! బొజ్జలోని బాబు ఏమంటున్నాడు?" లోపలికొస్తూ నవ్వుతూ పలుకరించింది అక్కడున్న వాళ్ళని ప్రశ్నార్థకంగా చూసింది.

రఘురాం వాళ్ళ మామగార్ని, మరదల్ని ఆవిడకు పరిచయం చేశాడు.

పరస్పర నమస్కారాలు పూర్తయ్యాక మామ అల్లుడు బయటకెళ్ళారు.

అంతలోనే లావుగా నల్లగా గుమ్మటంలా ఉండి తెల్లని యూనిఫామ్ ధరించిన ఓ నర్సు ట్రేలో పరీక్ష సామగ్రి అంతా ఉంచుకొని లోపలికొచ్చింది.

తాను అక్కడే ఉండాలో బయటికెళ్ళాలో తెలీక కాస్త వెనక్కి తిరిగి గోడవారగా నిల్చుంది సుమ.

"మీ పేరేమిటి?" సుమిత్రని పరీక్షిస్తూనే అడిగిందా డాక్టర్ సుమని.

"సుమబాలండీ!..."

"రూపానికి తగ్గట్టు చక్కని పేరు" మెచ్చుకోలుగా అంది డాక్టర్.

ఆ మాటకి పక్కన్నే ఉన్న నర్సు ముఖం కాస్త చిన్నబోయింది. ఆమె పేరు లావణ్య. పేరుకు తగ్గట్టు లావణ్యం ఆమె శరీరంలో ఏ కోశానా అగుపించదు.

“మా ముగ్గురి అక్కాచెల్లెల్లలో మా చెల్లే చక్కటి చుక్కండి డాక్టర్” సుమిత్ర చిన్నగా నవ్వుతూ అంది.

“అవునవును. ఆ మాట ఒప్పుకోవల్సిందే” నవ్వుతూ అంటూ అన్ని పరీక్షలూ ముగించి... చివరగా ఇంజెక్షన్ కూడా ఇచ్చింది. “నిన్న ఇచ్చిన టాబ్‌లెట్స్ రోజుకి మూడు చొప్పున మర్చిపోకుండా వేసుకో. ఈ రెండు మూడురోజుల్లో డెలివరీ అవ్వచ్చు. లేదా ఖచ్చితంగా ఆపరేషనే” నవ్వుతూ చెప్పి నర్సు వెంటరాగా ఆవిడ అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

✧ ✧ ✧

ఆ రోజు వెంకట్రామయ్యగారు ఊరికి వెళ్ళడానికి ప్రయాణమయ్యాడు.

“అప్పుడే వెళ్ళిపోతావా నాన్నా? అక్కయ్యకి డెలివరీ అయ్యేవరకు ఉండిపోవా?” అడిగింది సుమ.

“మొదట అలాగే ఉందామనే అనుకున్నాను. కాని అక్కయ్యేమో అమ్మని చూడాలంటుంది కదా! కాబట్టి నేనిప్పుడే ఊరెళ్ళి మీ అమ్మని ఇక్కడికి తీసుకు రావడానికి ప్రయత్నిస్తానమ్మా...” అంటూ ముసలావిడకి కూడా చెప్పేసి వెళ్ళిపోయాడు.

అదే రోజు సాయంత్రం హాస్పిటల్ నుంచి వస్తున్న సుమకి పక్కింటి సుగుణమ్మ వాకిట్లోనే ఎదురైంది.

చిరునవ్వుతో సుమని పలుకరించిందావిడ.

“ఎట్లా ఉంది అమ్మాయ్ సుమిత్రకు?”

“ఫర్వాలేదండీ... బాగానే ఉంది”.

“డాక్టర్ ఏమంటుంది?”

“మామూలుగా డెలివరీ కాకపోతే, తప్పని సరిగా ఆపరేషన్ చేయాలంటుం దావిడ”.

“ఆపరేషన్ అంటే ఈ రోజుల్లో అంత భయపడాల్సిన అవసరం ఏం లేదమ్మాయ్”.

“మరే...” చిన్నగా నవ్వింది సుమ.

“ఈ రోజుల్లో నార్మల్ కాన్పులే తక్కువ. ఎక్కువ శాతం ఆపరేషన్ కేసులే అనుకో... అన్నట్లు, మీ నాన్నగారు వెళ్ళిపోయారా?”

''ఆఁ, ఉదయమే వెళ్ళిపోయారాంటీ!''

''మరి మీ అమ్మగార్ని తీసుకు వస్తారా?''

''తీసుకురావడానికే వెళ్ళారు. కాని మా అమ్మ వస్తుందో రాదోనని నా అనుమానం''.

''ఏం, ఎందుకనీ?''

''ఆవిడసలు ఉన్న ఊరు వదలి ఎక్కడికీ కదలదు. పైగా మోకాళ్ళ నొప్పులు. అందుకని వస్తుందో రాదో?''

''రా, అమ్మాయ్ లోపలికి... కాస్త కూర్చొని వెళ్ళువుగాని'' సుగుణమ్మ సాదరంగా ఆహ్వానించింది.

సుమ ఓ క్షణం తటపటాయింపుగా చూసింది. పెద్దావిడలా ప్రేమగా పిలిస్తే వెళ్ళకుండా ఉండడం బాగుండదనిపించింది. కాబట్టి మెల్లిగా ఆవిడ వెనకాలే లోపలికొచ్చింది.

''కూర్చో అమ్మాయ్!'' సోఫా చూపెట్టింది సుగుణమ్మ.

''ఫర్వాలేదు లెండి'' అంటూ సుమ ఆ హాలంతా ఓమారు కలియ చూసింది. ఖరీదైన ఫర్నీచర్‌తో ఎక్కడి సామానక్కడ పొందిగ్గా చాలా నీట్‌గా సర్ది ఉంది. చూడ్డానికి చాలా అందంగా ఉందా హాలు.

అంతలోనే లోపలి గదిలో నుంచి ''మమ్మీ... మమ్మీ! ఎవరు మమ్మీ మనింటికొచ్చింది... బిందుయేనా?... తలుపు తెరువు మమ్మీ!... బిందును చూడాలి నేను. మాట్లాడాలి... తలుపు తెరువు మమ్మీ!...'' మూసివున్న తలుపుల్ని దబదబా బాదేస్తూ ఏడుస్తూ మాటలు వినబడసాగాయి.

ఆ గోలకు సుమ ఒక్కసారిగా ఉలిక్కిపడినట్లై ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి సుగుణమ్మ వైపు చూసింది.

''ఎవరండీ, లోపలున్నతను?'' ఎంతో ఆశ్చర్యంగా అడిగింది.

''వాడు ... వాడు మా అబ్బాయేనమ్మా'' గద్గదిక స్వరంతో విచారంగా చెప్పిందావిడ.

''ఏమిటీ? మీ అబ్బాయా? మరి అలా గదిలో బంధించారేమిటి?'' విస్మయంగా అడిగింది సుమ.

సుమ ప్రశ్నలకి ఈసారి ఆవిడ బాధతో నిట్టూర్చింది.

“వాడి మతి సరిగా లేదమ్మా” అంది ఆవేదనతో.

“మమ్మీ! తలుపు తెరు... బిందుని చూడాలి...” తలుపులు బాదుతున్న వాడల్లా హఠాత్తుగా ఏడ్పు లంకించుకున్నాడు. మరి కాసేపట్లోనే బిగ్గరగా పడి పడి నవ్వసాగాడు.

సుమ వ్యథతో ఆ గదివైపు చూస్తూ “అతనికి చిన్నప్పటినుంచీ అలాగే ఉందా పిన్నిగారూ? ఎక్కడా చూపెట్టలేదా?” ఆత్రుతగా అడిగింది.

“చిన్నప్పటినుంచీ కాదమ్మా. పాతికేళ్ళవరకు కూడా ఏ రోజు వాడు జ్వరపడిన పాపాన పోలా. జలుబుచేసి ఎరుగడు. ఎం.ఏ., ఫస్ట్ క్లాసులో ప్యాసైనాడు. అలాంటి నిక్షేపమైన ఆరోగ్యవంతుడైన మా బాబుకి మనసారా ప్రేమించిన ఓ అమ్మాయి వలన దురదృష్టకరమైన ఈ పిచ్చి జీవితానికి ఘోరంగా బలైపోయాడు”.

“అయ్యయ్యో! అలా ఎట్లా జరిగింది పిన్నిగారూ! ఆ అమ్మాయి మోసం చేసిందా?” ఆత్రుతగా అడిగింది సుమ.

“లేదన్నట్లు”గా ఆవిడ తల అడ్డంగా ఆడిస్తూ పైట చెంగుతో కళ్ళు తుడుచు కుంటూ “అతన్ని గురించి చెప్పాంటే అదంతా ఓ పెద్ద కథ అమ్మాయ్! నీకు వినే ఓపిక ఉంటే తప్పకుండా చెప్తాను తల్లీ!” అంది దుఃఖపూరిత స్వరంతో.

“వింటాను... చెప్పండి పిన్నిగారు! నాకు ఏ సంగతినైనా వివరంగా అడిగి తెలుసుకోవడం అలవాటే. లేకుంటే నిద్రపట్టదు. ఆ కథ ఏమిటో త్వరగా చెప్పండి పిన్నిగారు...” వినడానికి చాలా ఆదుర్దా కనబర్చింది సుమ.

ఆమె పక్కనే కూర్చున్న సుగుణమ్మ కొడుకు కథ చెప్పడానికి ఉద్యుక్తు రాలవుతూ గతజ్ఞాపకాలలో మునిగిపోయింది.

✧ ✧ ✧

సాయంత్రం టైం ఐదు కావస్తోంది.

ఎక్కడికో వెళ్ళేందుకు డ్రెస్ వేసుకొని సిద్ధమైన శ్రీనివాస్ బయట పూల చెట్లమధ్య అటూ ఇటూ పచార్లు చేస్తూనే... మాటి మాటికి గేట్ వైపు చూస్తున్నాడు... ఎవరి ఆగమనం కోసమో అన్నట్లుగా.

అంతలోనే అతని నిరీక్షణ ఫలించినట్లుగా తెరిచి ఉంచిన గేట్‌లో నుంచి ఓ టాక్సీ సర్రున లోనికి దూసుకు వచ్చింది.

భుజంపైన జరీ ఉత్తరీయాన్ని సవరించుకుంటూ టాక్సీలో నుంచి హుందాగా దిగుతున్న ప్రసాదరావుని చూడగానే ''అమ్మా, అమ్మా! అంకులొచ్చారు'' అంటూ ఆనందోత్సాహాలతో హడావుడిగా లోపలికో కేకేశాడు శ్రీనివాస్.

''ఆఁ, ఆఁ... వస్తున్నానురా!'' కట్టుకున్న కంచిపట్టు చీర కుచ్చెళ్ళు సవరించు కుంటూ హాల్లోకి వచ్చింది సుగుణమ్మ.

''రండి... అంకుల్! కూర్చొండిలా. ఈవిడే మా అమ్మగారు...'' అంటూ తల్లిని పరిచయం చేశాడు శ్రీనివాస్ ఆయనకి.

''నమస్కారం అన్నయ్యగారు'' చిరునవ్వుతో అప్పుడే వరస కూడా కల్పేసిందావిడ.

''నమస్కారమమ్మా! మా అమ్మాయ్ బిందు అస్తమానం మీ గురించే చెప్తూ ఉంటుందమ్మా. నిజంగా మా అమ్మాయి చాలా అదృష్టవంతురాలమ్మా. మీలాంటి ఉత్తముల ఇంటికి కోడలుగా రాబోతున్నందుకు...'' అంటూ ఓ చిరునవ్వు నవ్వి ''అన్నట్లు మీరిక రెడీగానే ఉన్నారా? వెళ్ళుదామంటారా? బయట టాక్సీ సిద్ధంగా ఉంది'' అన్నాడు ప్రసాదరావు.

''ఆఁ, ఆఁ... తయారుగానే ఉన్నామనుకోండి. ఒరేయ్, శ్రీనూ! పై నున్న మీ నాన్నగారిని తొందరగా రమ్మని వెళ్ళి చెప్పు'' కొడుక్కి చెప్పి, తాను కాఫీ తీసుకు రావడానికి హడావుడిగా వంటింటివైపు వెళ్ళింది సుగుణమ్మ.

ప్రసాదరావు ఖరీదైన ఆ ఇంటినీ, తాను కూర్చున్న హాల్లోని ఫర్నీచర్ని చాలా అబ్బురంగా కళ్ళు రెండూ విప్పార్చుకొని మరీ చూడసాగాడు.

ఇంతలోనే సుగుణమ్మ కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది ఆయనకి.

''అయ్యో ఇప్పుడెందుకమ్మా!'' మొహమాట పడుతూనే ఆ కాఫీ కప్పు అందుకున్నాడు ప్రసాదరావు.

శ్రీనివాస్ పైకెళ్ళి తండ్రిని వెంటబెట్టుకొని రాసాగాడు.

మెట్ల మీది నుంచి వాళ్ళు వస్తున్న అలికిడికి..... తనకు కాబోయే వియ్యంకుడు ఎలా ఉంటాడో చూడాలన్న తలంపుతో ఆత్రుతగా గభాలన్న తల ఎత్తాడు ప్రసాదరావు.

తెల్లటి పంచె చెంగుకొస ఎడంచేతిలో విలాసంగా పట్టుకొని కుడిచేత్తో కళ్ళజోడు సవరించుకుంటూ ఒక్కో అడుగే వేస్తూ హుందాగా మెట్లు దిగివస్తున్న

ఆ గంభీర విగ్రహాన్ని చూడగానే దిగ్భ్రాంతి చెంది స్థాణువులా బిగుసుక పోయాడలా. చేతిలోని కాఫీ కప్పు అప్రయత్నంగా జారి కిందపడి భళ్ళున బద్దలైంది. ఆ కప్పులాగానే కూతురి వివాహం పట్ల ఆయన ఏర్పర్చుకొన్న కోరికలూ ఆశలూ అన్నీ ఒక్కసారిగా అణగారిపోయాయి.

మెట్లపై నుంచి కిందికి దిగి వస్తున్న రావుగారు... హాల్లో సోఫాలో కూర్చొని ఉన్న ప్రసాదరావుని చూడగానే బిగుసుకపోయినట్లు ఎక్కడి వాడక్కడే ఆగిపోయాడు.

ముఖంలో ఎక్కడలేని క్రోధాగ్ని రేఖలు ఒక్కసారిగా అలుముకున్నాయి.

"నువ్వు... నువ్వు..." సూటిగా చూస్తూ రావుగారికిక ఏమనాలో ఎలా మాట్లాడాలో తెలియదన్నట్లుగా ఆగిపోయాడు.

ఇక తండ్రి వాలకానికీ, అటు అంకుల్ వాలకానికీ విస్తుబోతున్న శ్రీనివాస్ "ఆయన్నే డాడీ... నేను ప్రేమించిన బిందువాళ్ళ ఫాదర్. మనల్నిప్పుడు వాళ్ళింటికి పెళ్ళి చూపులకి తీసికెళ్ళడానికి వచ్చారు" అంటూ పరిచయం చేశాడు.

"చాలు చాలు... ఇక ఆపు నీ పరిచయ వాక్యాలు. మనమిప్పుడు వాళ్ళింటికి పెళ్ళిచూపులకి వెళ్ళడమూ జరగదు, వాళ్ళమ్మాయ్ ఈ ఇంటి కోడలుగా రావడమూ జరగదు కాబట్టి, ఆయన్ని తక్షణం నా కళ్ళముందు నుంచి వెళ్ళిపొమ్మని చెప్పేసేయ్" అంటూ కఠినంగా ఆజ్ఞాపిస్తూ ఇంకోక్షణం కూడా అక్కడ నిల్చోలేక విసురుగా వెనుదిరిగి మళ్ళీ పైకి వెళ్ళాడాయన.

ఆ మాటల్ని శ్రీనివాస్ ప్రసాద్‌రావుకి చెప్పక్కర లేకుండానే స్పష్టంగా వినవస్తూనే ఉన్నాయి.

అవమాన భారంతో తలకుంచించుకపోగా, అడుగులో అడుగేస్తూ బయటికి కదిలాడు ప్రసాదరావు.

అనుకోని ఆ హఠాత్తు సంఘటనకి తల్లీ కొడుకులిద్దరూ శిలా ప్రతిమలే అయ్యారు.

✧ ✧ ✧

"నేను బిందుని గాఢంగా ప్రేమించాను డాడీ! ఆ అమ్మాయిని తప్ప నేనిక మరెవర్నీ పెళ్ళి చేసుకోను".

"ఈ ప్రపంచంలో ఆడపిల్లలకేం కొదవలేదు. మాకు కులగోత్రాలు అక్కర లేదు. కట్న కానుకలు అంతకన్నా అక్కరలేదు. నీవు ఆ బిందును తప్పించి ఇంకే అమ్మాయినైనా సరే పెళ్ళి చేసుకో. నేనెలాంటి అభ్యంతరమూ చెప్పను. నేను మీ అమ్మ మనస్ఫూర్తిగా అంగీకరించి సంతోషంతో ఘనంగా నీ పెళ్ళి జరిపిస్తాం. అంతేగాని ఆ ప్రసాద్‌గాడి కూతురితో మాత్రం ఛస్తే జరగదు. ఆ విషయం కలలో కూడా జరగదని గుర్తుంచుకో. అస్సలు ఆ పెళ్ళి ఊసే మాట్లాడడానికే వీల్లేదు".

"అదే, ఎందుకు వీల్లేదో చెప్పండి డాడీ! మీరు బిందునెప్పుడూ చూడలేదు గాని, చూస్తే ఇలా మాట్లాడరు. బిందు ఎంతో అందంగా పొందిగ్గా ఉంటుంది. అస్సలు బిందు చేసిన నేరమేమిటి? పాపమేమిటి? ఎందుకు మీరీ పెళ్ళి వద్దంటున్నారు?" శ్రీనివాస్ తండ్రికి ఎన్నివిధాల నచ్చచెప్పాలో అన్ని విధాలా చెప్ప ప్రయత్నించ సాగాడు.

"తండ్రీకొడుకుల మాటలు వింటూ సుగుణమ్మ అక్కడే ఉంది.

"ఆ అమ్మాయి అందాన్ని గురించిన ప్రసక్తి ఇక్కడ అనవసరం. ఆ నికృష్టుడి కూతురై పుట్టడమే ఆ అమ్మాయి చేసుకున్న గొప్ప పాపం".

"మీరనేదేమిటో మాకు బొత్తిగా బోధపడ్డం లేదు. ఇంటికొచ్చిన ఆయన్ని ఆ రోజు మీ కోపావేశాలతో అవమానించి పంపారు. అసలు ఆ అమ్మాయిని మీరెందుకు వద్దంటున్నారు? ఆ ప్రసాదరావుతో ఇంతకు ముందే మీకు పరిచయం ఉందా? ఆయన మీకెలా తెలుసు? కాస్త మాకు అర్థమయ్యేలా వివరంగా చెప్పండి?" సుగుణమ్మ భర్తను ప్రాధేయపడుతున్నట్లుగా ప్రశ్నల వర్షం కురిపించింది.

"పాతికేళ్ళనాడు ఆ ప్రసాద్‌గాడు మా కుటుంబానికి చేసిన అవమానం నా ఒకానొక చెల్లెలు శాంతపట్ల దారుణంగా ప్రవర్తించిన సంగతి మీకు తెలుసా? దానికి బదులుగా నేను చేసిన ఈ అవమానం అందులో రవ్వంతైనా కాదు. ఇస్తామని ఒప్పుకున్న కట్నం తాలూకు డబ్బులు ఓ రెండువేలు తక్కువైనాయనీ శాంత మెడలో తాళి కట్టడానికి నిరాకరించాడీ దౌర్భాగ్యుడానాడు. అసలే పేద కుటుంబం అయిన మేం అప్పోసప్పో చేసి ఉన్న ఇంటిని కూడా తెగనమ్మి వాళ్ళు అడిగిన కట్నకానుకలు ఇవ్వడానికి సిద్ధమైనాం. కాని కొన్ని అనుకోని విషమ పరిస్థితుల్లో డబ్బు సరిపడక పెళ్ళి వాళ్ళకి బాకీ పడ్డాం. పెళ్ళి అయ్యాక ఆ మిగిలిన డబ్బులు వడ్డీతో సహా తీరుస్తామని నేను నాన్న వాళ్ళ కాళ్ళావేళ్ళా పడి బతిమాలాం. ఊహుఁ, ససేమిరా కరగలేదు వీడి హృదయం. వీడి తండ్రిది అంతకన్నా కఠిన హృదయం. పాషాణం

అంటే బాగుంటుందేమో! ఫలితం పీటలమీది పెళ్ళి ఆగిపోయింది. పెళ్ళివాళ్ళు తిరిగి వెళ్ళిపోయారు...

"ఎన్నెన్నో కోరికలతో, ఆశలతో పెళ్ళికూతురైన చెల్లాయ్ స్థితి వర్ణనాతీతం. అసలే గుండె జబ్బు మనిషైన మా అమ్మ ఈ దారుణానికి తట్టుకోలేకపోయింది. పీటల మీద పెళ్ళి ఆగిపోయిన చెల్లాయ్‌కి ఇక ఈ జన్మలో పెళ్ళి జరగదంటూ బోరు బోరుమని శోకాలు తీస్తూ హఠాత్తుగా మమ్మల్ని అందరినీ శోకసముద్రంలో ముంచి తనదారిన తాను వెళ్ళిపోయింది.

'తన పెళ్ళి ఆగిపోయిన అవమానంతో పెళ్ళికి వచ్చిన అమ్మలక్కల గుసగుసలతో, అమ్మ మరణంతో ఒక్కసారిగా శాంత ఉక్కిరి బిక్కిరి అయిపోయింది. ఆత్మస్థైర్యం కోల్పోయింది. ఆ బాధాతరంగాల తాకిడికి తట్టుకోలేక పిరికి దానిలా ఆత్మహత్య చేసుకుంది. కళకళలాడాల్సిన ఆ పెళ్ళిపందిరి శోకాలతో పెడబొబ్బలతో విలవిల్లాడి పోయింది. ఆనాడు ఆ పెళ్ళికొడుకైన ప్రసాద్ శాంత మెడలో తాళికట్టి ఉంటే ఒకే రోజున రెండు శవాలు ఆ ఇంట్లో నుంచి కదిలేవి కావు. ఆనాటి ఆ సంఘటనలు ఇప్పటికీ నా కళ్ళకు కట్టినట్లుగా ఉన్నాయి. ఆ పెళ్ళికొడుకు ప్రసాద్ మళ్ళీ ఇన్నేళ్ళకిలా బిందు తండ్రిలా దర్శనమిచ్చాడు...

"అమ్మ, చెల్లాయ్‌ల మరణంతో నాన్న జీవితమే పూర్తిగా మారిపోయింది. అస్తమానం పిచ్చాడిలా తనలో తానే గొణుక్కుంటున్నట్లుగా అమ్మని శాంతని పలవరిస్తూ ఉండేవాడు. అలాంటి సమయంలోనే ఏ కట్నకానుకలు ఆశించకుండా నిన్ను నాదాన్నిగా చేసుకున్నాను సుగుణా! ఒకప్పుడు లేమితో బతికిన నేనూ... స్వశక్తితో ఈనాడిలా ఇంతటి ఉన్నతస్థితికి రాగలిగాను. నాన్న చనిపోయే ముందు కూడా నా దగ్గరోమాట తీసుకున్నాడు. 'కట్నకానుల వలన శాంత జీవితం ఎలా బలైపోయిందో నీకు తెలుసు. కట్నకానుకలు మనుష్యుల్ని రాక్షసులుగా మారుస్తాయి. నీ పిల్లలకి కట్నం తీసుకోకు; ఇవ్వకు. ఇదే నా చివరి కోరిక' అంటూ నాన్న కన్నుమూశాడు..." బాధా తప్త స్వరంతో చెప్పడం ముగించాడు రావుగారు.

ఆయన మదినిండా అలుముకొని ఉన్న ఆ శోకపూరిత యథార్థగాథంతా విన్న తల్లీ కొడుకులు ఓ క్షణం ఏం మాట్లాడలేకపోయారు.

అందులో ముందుగా తేరుకున్నది శ్రీనివాసే!...

"ప్రసాదరావు గతంలో మన కుటుంబంపట్ల చాలా తప్పు చేశారు. అది నేనిప్పుడు కాదనడం లేదు. కాని, దానికి ప్రతీకార చర్యగా ఆయన కూతురైన

బిందుని మీ కోడలిగా స్వీకరించడానికి ఇష్టపడ్డం లేదు. అలనాటి మీ కోపాగ్నికి ఇది సరైన మార్గం కాదు. ప్లీజ్, డాడీ! మీరు బిందుని ఓసారి చూడండి. ఆ తరువాత మీ నిర్ణయం చెప్పండి!...'' ప్రాధేయపడుతున్నట్లుగా అడిగాడు శ్రీనివాస్.

''నో నో... వీల్లేదు. నేను ఆ అమ్మాయిని చూడనూ అక్కరలేదు; నా నిర్ణయం చెప్పనూ అక్కరలేదు. నా తుది నిర్ణయమేమిటో ఆ ప్రసాద్‌గాడిని చూసినప్పుడే చెప్పేశాను. వాడి కూతురితో నీ పెళ్ళి జరగదు. అది మాత్రం గుర్తుంచుకో!''... ఖచ్చితమైన స్వరంతో అంటూ కొడుక్కి మరో మాటకైనా అవకాశం ఇవ్వకుండా అక్కడి నుంచి వడివడిగా వెళ్ళిపోయాడు రావుగారు.

✧ ✧ ✧

''నేనీ పెళ్ళి ఛస్తే చేసుకోను మమ్మీ!...''

''ఏం, ఎందుకు చేసుకోవ్?''

''ఎందుకంటే నాకిష్టం లేదంతే! శ్రీనివాస్‌ని తప్ప నేనెవరినీ పెళ్ళిచేసుకోను. నా మనస్సులో మరింకెవ్వరికీ స్థానం లేదు...'' బిందు ఖచ్చితమైన తన నిర్ణయాన్ని వాళ్ళమ్మతో అంటోంది.

''ఆ శ్రీనివాస్ పేరెత్తావంటే ఆగ్రహావేశాలతో మీనాన్నగారు అంతెత్తున ఎగిరి పడుతున్నారు. మీ నాన్నకి ఆ శ్రీనివాస్ తండ్రికి పూర్వపు సంబంధాల ద్వేషం గురించీ... పెళ్ళి చూపులకని వాళ్ళని తీసుకరావడానికి వెళ్ళడం... వాళ్ళు మీ నాన్నని అవమానించడం... అదంతా వివరంగా చెప్పాడు కదా! కాబట్టి ఇక నువ్వు ఆ శ్రీనివాస్ పేరు పదే పదే ఎత్తావంటే ఆయన ఊర్కోడు. నా మాట విని మీ నాన్నగారు తెచ్చిన ఈ సంబంధానికి ఒప్పుకో బిందూ! అబ్బాయ్ అన్ని విధాలా యోగ్యుడు. ఆ శ్రీనివాస్‌కంటే కూడా అందగాడు'' కామాక్షమ్మ కూతురికి నచ్చజెప్ప డానికి ఎన్నో విధాలా ప్రయత్నిస్తూంది.

''శ్రీనివాస్ కంటే పదిరెట్లు అందగాడైనా సరే, నేనీ పెళ్ళికి ఒప్పుకోను మమ్మీ''.

''అలా అంటే ఎలా బిందూ?''

''నేనీ పెళ్ళిచేసుకోనని డాడీతో చెప్పేసెయ్'' విసురుగా తలఎగరేస్తూ అంది బిందు.

''అటు ఆయనకీ చెప్పలేక, ఇటు నీకు నచ్చచెప్పలేక మధ్యన నేను ఛస్తున్నాను. వాళ్ళపట్ల మీ నాన్నకి ఎంతటి కోపావేశాలు ఉన్నాయో తెలుసా? తెలిస్తే నీవిలా మాట్లాడతావా?''

"నీ వెందుకమ్మా చావడం నేనే ఛస్తాను" మనస్సులోనే గొణుక్కుంటూ నీళ్ళు నిండిన కళ్ళతో గదిలోకి వెళ్ళిపోయింది బిందు.

రావుగారు ప్రసాదరావుని అవమానించి పంపిన రోజు నుంచే కోపతాపాలతో బుసలు కొట్టే తాచుపాములా తయారయినాడు. తండ్రి తరఫున క్షమాపణలు చెప్పడానికని ఇంటికి వచ్చిన శ్రీనివాస్‌ని నానాతిట్లూ తిట్టి... "నీ ముఖం చూపించకిక మీ ముదనష్టపు సంబంధమే మాకు అక్కరలేదు. కోపతాపాలు, పంతాలు పట్టింపులు ఒక మీ నాన్నగారికే కాదు, నాకూ ఉన్నాయి. చూస్తావుగా నా తడాఖా! అబ్బాయ్‌లకేం ఈ దేశం గొడ్డుపోలేదు. నిన్ను తలదన్నేలాంటి సంబంధం తెచ్చి వారం రోజుల్లో నా కూతురికి పెళ్ళి జరిపించి తీరుతాను. నీవు ఇంకెప్పుడూ మా అమ్మాయిని కలువడానికి ప్రయత్నించకు. మీ కుటుంబపు మర్యాదలు మంటగలిసేలా చేయగలను. కాబట్టి తక్షణం నీవిక బయటికి నడు" అంటూ ఏం మాట్లాడానికి కూడా శ్రీనివాస్‌కి అవకాశం ఇవ్వకుండా వాకిట్లో నుంచే గెంటేసినంత పని చేశాడు.

ఆ రోజు ఆయన శ్రీనివాస్‌తో అన్న మాటల్ని అక్షరాలా అమలు పర్చాడు. నాలుగు రోజులు ఓపిగ్గా వెతికి వెతికి ఓ సంబంధం కుదిర్చాడు కూతురికి. బిందుని కాలేజీ మాన్పించాడు. ఇంట్లో నుంచి ఎక్కడికీ కదలకుండా కట్టడి చేశాడు.

బిందు తనకీ పెళ్ళి ఇష్టంలేదని తండ్రికి ఎంతగానో మొత్తుకొని చెప్పినా లాభం లేకపోయింది.

ముహూర్తం కూడా నిర్ణయించబడింది. శుభలేఖలు కూడా అచ్చు అయినాయి.

రేపు పెళ్ళి అనగా ఆ రోజు సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఎవరూ ఊహించని ఓ దారుణ సంఘటన జరిగిపోయిందా పెళ్ళి ఇంట్లో.

✧ ✧ ✧

సాయంత్రం ఎక్కడెక్కడో తిరిగి పిచ్చాడిలా ఇంట్లోకి వస్తున్న శ్రీనివాస్‌ని సంధించిన బాణంలా స్కూటర్‌పై దూసుక వచ్చిన ఓ అబ్బాయి ఆపాడు.

ఎందుకో ఏమిటో తెలియని శ్రీనివాస్ ఆ అబ్బాయి వంక ఆశ్చర్యంతో బిత్తరపోయి చూడసాగాడు.

“ప్రసాదరావుగారి అమ్మాయి బిందు బాత్‌రూంలో కిరోసిన్ పోసుకొని ఒంటికి నిప్పంటించుకుంది. చాలా దారుణంగా కాలిపోయింది. మృత్యువుతో పోరాడుతూ హాస్పిటల్లో చివరి దశలో ఉందామె మిమ్మల్నే కలువరిస్తూంది...” గద్గదిక స్వరంతో చెప్తూ స్కూటర్‌పై శ్రీనివాస్‌ని ఎక్కించుకొని వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు.

హాస్పిటల్లో ఓ మాంసపు ముద్దలా పడివున్న తన ప్రియాతి ప్రియమైన బిందుని ఆ భయంకర దారుణ స్థితిలో చూసీ చూడగానే “బిందూ!...” అంటూ ఓ గావుకేక పెట్టి స్పృహ లేకుండా అక్కడే కుప్పలా కూలిపోయాడు.

అలా పడిపోయిన శ్రీనివాస్‌కి ఆ తరువాత రెండు మూడు రోజులకి స్పృహ వచ్చింది... కళ్ళు తెరుస్తూనే పక్కన్నే ఉన్న తల్లినిగాని, తండ్రినిగాని గుర్తుపట్టలేదు. పిచ్చిచూపులు చూడసాగాడు. ‘బిందు వస్తోంది... నన్ను పిలుస్తోంది...’ అంటూ ఏమిటేమిటో పిచ్చిపిచ్చిగా అర్థం పర్థం లేకుండా మాట్లాడసాగాడు. పెద్దగా నవ్వడం... ఉన్నట్లుండి బిగ్గరగా ఏడవడం... ఇదీ వాడి వరస.

మతిస్థిమితం తప్పినట్లుగా డాక్టర్లు ధ్రువపర్చారు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు అలా పిచ్చాడిలా అయినందుకు మా బాధావేదనలు చెప్పనలవికావు. నేనో పిచ్చి దానిలా అనుక్షణం విలపిస్తూ నరకం అనుభవిస్తున్నాను. ఎన్నెన్నో ఊళ్ళు తిరిగాం. ఎంతోమంది డాక్టర్లకి చూపించాం. కాని లాభం లేకపోయింది. కొన్నాళ్ళు పిచ్చాసు పత్రిలో కూడా ఉంచాం. ఇంకాస్త ఎక్కువైందికాని తగ్గలా. వాడి బాగుకోసం ఎన్ని విధాలా ప్రయత్నించాలో అన్ని విధాలా ప్రయత్నిస్తూనే ఉన్నాం. ఆ భగవంతునికి మా మీద కనికరం కలగలేదు... నాకీ శోకం తప్పలేదు....

✧ ✧ ✧

గాద్గదిక స్వరంతో చెప్పడం ముగించి చెంపలపై జాలువారుతున్న కన్నీటిని పైట చెంగుతో గట్టిగా తుడుచుకుంది సుగుణమ్మ.

ఆ విషాద కథంతా విన్న సుమ కళ్ళు అశ్రుపూరితాలైనాయి.

“ఇటు బాబాయ్‌గారు అటు బిందు వాళ్ళ నాన్నగారు పట్టిన పంతాల మధ్య కోపావేశాలమధ్య చివరికలా వీళ్ళ జీవితాలు సర్వనాశనం అయ్యాయన్న మాట. ఇది చాలా దారుణ విషయం పిన్నిగారూ! మీకీ వయస్సులో ఈ బాధ భరించలేనిది. ఏనాటికైనా తప్పకుండా మీ అబ్బాయి తిరిగి బాగుపడతాడనే నేను ఆ భగవంతుడిని మనసారా కోరుకుంటున్నాను. వస్తా పిన్నీ!...” దుఃఖపూరిత స్వరంతో సోఫాలో నుంచి లేచి పైట చెంగుతో కళ్ళు తుడుచుకుంది సుమ.

“అంతకన్నా నాకు కావాల్సిందేముంది తల్లీ! నీ నోటి చలువ వలన అలాగే అవ్వనీ. అదే పదివేలు నాకు. నా పిన్న తండ్రి కొడుకు ఒకడు అంటే నాకు వరసకి తమ్ముడు అవుతాడు. వాడు ఢిల్లీలో డాక్టర్‌గా ఉంటున్నాడు. విదేశాలకి కూడా వెళ్ళి వచ్చాడు. వాడి ఫ్రెండ్ ఒకతను వచ్చేనెలలో అమెరికా నుంచి ఇండియాకి వస్తున్నాడట. అతనో గొప్ప సైకియాట్రిస్ట్ అట. అతనికి మా శ్రీనివాస్‌ని చూపెట్టాలనీ, ఈ నెలాఖరులోగా మమ్మల్ని ఢిల్లీకి రమ్మని మా తమ్ముడు ఉత్తరం రాశాడమ్మా. మాకు నిన్ననే ఫోన్ కూడా చేశాడు”.

“మరి వెళ్ళడం లేదా పిన్నిగారూ?”

“అయ్యో, ఎందుకు వెళ్ళం? తప్పకుండా వెళ్తాం. ఏమో ఎవరు చెప్పగలరు? ఆ డాక్టరు పుణ్యాన మావాడు మళ్ళీ మనుషుల్లో పడతాడేమో? ఆ ఆశతోనే నేనిలా బతుకుతున్నాను. అందుకే వెళ్తున్నాం. ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు మీ బాబాయ్‌గారు”.

“తప్పనిసరిగా మీకీమారు దైవం అనుకూలంగా ఉంటాడు. వెళ్ళిరండి పిన్నిగారు!” అని చెప్తూ సుమ ముందుకు నడిచింది.

సుగుణమ్మ గుమ్మం వరకు వచ్చి సుమని సాగనంపింది.

✧ ✧ ✧

“ఒరేయ్ అబ్బాయ్, రఘురాం!...” కొడుకు దగ్గరగా వచ్చింది ముసలావిడ.

“ఏమిటమ్మా” బట్టలు మార్చుకుంటున్న రఘురాం అడిగాడు తల్లిని.

“నేనోమారు హాస్పిటల్‌కి వస్తానురా. కోడల్ని చూసొస్తాను”.

“నేనిప్పుడు హాస్పిటల్‌కి వెళ్ళడం లేదమ్మా. ఇందాకనే కదా అక్కడి నుంచి వచ్చింది” వేసుకున్న ఇస్త్రీ షర్టుని ప్యాంట్‌లోకి టక్ చేస్తూ అన్నాడతను.

“మరిప్పుడు నీ వెక్కడికి వెళ్తున్నావ్?”

“నా ఫ్రెండ్ వాళ్ళింట్లో ఓ పార్టీ ఉందమ్మా. అక్కడికి వెళ్ళుతున్నాను. హాస్పిటల్‌కు రేపు ఉదయం వెళ్ళుదాం... ” కోటు వేసుకొని రిస్ట్‌వాచీ బిగించుకుంటూ అన్నాడు.

“అమ్మాయి కులాసాగానే ఉంది కదా?” కోడలి ఆరోగ్యాన్ని గురించి అడిగింది ముసలావిడ.

"సుమిత్రకేం ఫర్వాలేదమ్మా. తప్పనిసరిగా ఆపరేషన్ చేయాల్సిన అవసరం ఏర్పడవచ్చునని అంటోంది డాక్టర్. ఆ ఏర్పాట్లు కూడా రెడీ చేసుకుందామె" కర్చీఫ్‌ని మడతపెట్టి కోట్ జేబులో పెట్టుకుంటూ అన్నాడతను.

అంతలో సుమ టీ తీసుక వచ్చింది వాళ్ళ బావకి.

టీ కప్పు అందుకుంటూ సుమని ఓ క్షణం పరీక్షగా చూసి అదోలా చిన్నగా నవ్వాడు రఘురాం.

అతనలా ఎందుకు నవ్వుతున్నాడో అర్థంకాని సుమ విస్తుబోయింది.

"అదేమిటే అమ్మాయ్? బుగ్గమీద నల్లగా ఆ మసేమిటి?" సుమ వైపు తేరిపారగా చూస్తూ ఉన్న ఆవిడకు కొడుకెందుకు నవ్వాడో అప్పుడర్థమైంది.

"త్వరలో పెళ్ళికూతురు కాబోతుందిగా. అందుకని అడ్వాన్స్‌గా దిష్టి బొట్టు పెట్టుకుంది కాబోలు!..." టీ తాగుతూ అంటూ ముసిముసిగా నవ్వాడు రఘురాం.

సుమ కంగారు పడుతున్నట్లుగా చేతులతో గట్టిగా చెంపను రుద్దుకుంది. కుడి అరచెయ్యికి మసి అంటుకుంది. "ఇందాక వంటింట్లో టేబుల్ కింద కూర్చొని ఊడుస్తుంటే గోడకి బోర్లించి పెట్టిన అట్లపెనం మసికాబోలు అత్తయ్యా, ఇలా అంటుకుంది".

"సబ్బు పెట్టి ముఖం కడుక్కో. అన్నట్లు పిల్లలేం చేస్తున్నారు?" అడిగింది ముసలావిడ.

"అన్నాలు తింటున్నారత్తయ్యా"

"నీవూ అమ్మ కూడా పెందరాళే భోజనాలు చేసి పడుకోండి సుమా!... ఓ ఫ్రెండ్ ఇంటికి పార్టీకెళ్తున్నాను. నేను తిరిగి వచ్చేవరకు ఏ పదో అవుతుంది. నా కోసం ఎదురు చూడకండి" అంటూ ఖాళీ కప్పు అక్కడే నిల్చున్న మరదలికిచ్చి వెళ్ళిపోయాడు రఘురాం.

మరికాసేపట్లోనే వాకిట్లో స్కూటర్ స్టార్టయి వెళ్ళిపోయిన శబ్దం వినవచ్చింది.

ముసలావిడ పెందరాలే అన్నం తినేసింది. 'కృష్ణా!, రామా!...' అంటూ ముందున్న వరండాలో తన పక్కమీదికి చేరింది.

ఓ వైపు ఆవిడ భగవన్నామస్మరణ చేస్తున్నా మరోవైపు మనస్సంతా కోడలు చుట్టే తిరగాడుతోంది. సుమిత్ర ఇంట్లో నుంచి వెళ్ళిపోయినప్పటి నుంచి ఆవిడకి మదిలో ఏమిటోలా బాధగా ఉంది. ఇల్లంతా బోసిపోయినట్లైంది. ఏమీ తోచక

పిచ్చెక్కినట్లుగా బాధపడేది. సుమ ఊర్నుంచి వచ్చాక ఆవిడ పడిన బాధావేదనలకి కాస్త ఉపశమనంలా ఉంది.

"పిన్నీ, పిన్నీ" అంటూ పిల్లలు కూడా సుమకి బాగా దగ్గరయ్యారు.

సుమ కూడా పిల్లల్ని చాలా ప్రేమ చేస్తుంది. ఇంటి విషయంలో ఆవిడకి అన్ని విధాలా సంతృప్తికరంగానే ఉంది. కాని, కోడలికి ఎట్లా ఉంటుందో, కాన్పు సవ్యంగా అవుతుందో లేదోనని మొదటి నుంచి చివరి వరకూ అన్నీ ఆందోళనలే ఆవిడకి.

సుమిత్ర కాపురానికి వచ్చినప్పటి నుంచి నేటి వరకు కూడా ఆవిడెప్పుడూ అత్తగారి అధికారాన్ని చెలాయించి ఎరగదు. సుమిత్ర కూడా అత్తగారిపట్ల ఎంతో గౌరవ మర్యాదలతో పూజ్యమైన భక్తి భావంతో, ఎంతో అణకువగా ఆదరంగా మసలుకుంటూ వచ్చిందింతవరకును.

అత్తా కోడళ్ళలా కాక తల్లీ కూతుళ్ళలాంటి అనుబంధంతో ప్రేమానురాగాలతో ఎంతో అన్యోన్యంగా ఉంటారు వాళ్ళిద్దరూను.

అంతలోనే సుమ నిద్రపోతున్న చంటిదాన్ని భుజాన వేసుకొని వచ్చింది. అత్తగారి మంచం దగ్గరికి.

"పడుకుందా? పాలు తాగిందా?..." అంటూ ముసలావిడ కాస్త సర్దుకొని పడుకొని మనవరాలికి పక్కలో జాగా కల్పించింది.

"పాలు ఇందాకనే తాగిందత్తయ్యా! తాగుతూనే అట్లాగే నిద్రపోయింది..." అంటూ చంటిదాన్ని నెమ్మదిగా పక్కమీద పడుకోబెట్టి దుప్పటి కప్పింది.

చంటిది రాత్రిళ్ళు పక్కతడుపుతుందనీ, అది సుమకి అలవాటు లేని పని అనీ రోజూ తన దగ్గరే పడుకోబెట్టుకుంటుంది ముసలావిడ; కోడలు హాస్పిటల్ కెళ్ళినప్పట్నుంచీను.

"నీవుకూడా భోజనం చేసేయ్ తల్లీ! ఊరి నుంచి వచ్చినప్పటి నుంచి నీకు బాగా పనైంది. సమయానికి వంటావిడ కూడా ఇప్పుడే పత్తాలేకుండా పోయింది. జల్దీ తినేసి పడుకో అమ్మాయ్! అబ్బాయ్ ఏ పదింటికో వస్తాడు. వాడొస్తే నీవేం లేవకు. తలుపులు నేను తెరుస్తానులే!..." అని చెప్పేసి దుప్పటి మడత విప్పి నిండుగా కప్పుకోసాగిందావిడ.

“అలాగే అత్తయ్యా!” అంటూ సుమ అక్కడి నుంచి కదిలి నేరుగా వంటింట్లోకి వెళ్ళింది. వేడి చేసి ఉంచిన పాలు తోడు పెట్టి ఆ గిన్నెని అలమారులో ఉంచింది.

స్టవ్ అంతా పొడి బట్టతో శుభ్రంగా తుడిచింది. అక్కడి నుంచి బాత్‌రూంలో కెళ్ళి గీజర్ ఆన్ చేసి వచ్చింది. టవల్ తీసుకొని మళ్ళీ బాత్‌రూమ్ వెళ్ళి స్నానం చేసొచ్చింది. గదిలో వాళ్ళక్కయ్య బీరువా తెరిచింది.

ఓ అరనిండా రకరకాల చీరలున్నాయి. అందులో ఓ పది దాకా పట్టుచీర లున్నాయి. ‘అక్కకి బావ చీరలు బాగానే కొంటాడు కాబోలు!...’ అనుకుంటూ వాటిలోకెల్లా తనకి బాగా నచ్చిన తెల్లనిదానిపై చిన్న చిన్న నల్లని చుక్కలున్న కాటన్ చీర తీసి తాను కట్టుకుంది సుమ.

ఆ చీరపై నల్లటి జాకెట్ వేసుకుంది.

బొట్టు పెట్టుకుంటూ, తలదువ్వుకుంటూ రకరకాల భంగిమలతో అద్దంలో చూసుకుంటుంటే ఆ చీరలో తాను చాలా అందంగా ఉన్నాననిపించింది సుమకు. పైట చెంగు సవరించుకుంటూ వంటింటికి ఆనుకొని ఉన్న కటకటాల వరండాలో వేసి ఉన్న డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంది. అంత ఆకలిగా లేక, ఏమీ తినిపించా లనిపించలేదామెకు. వేడి నీళ్ళతో స్నానం చేసినందుకు ప్రాణానికి హాయిగా ఉంది. పడుకుంటే చాలు... వెంటనే నిద్రపట్టేలా ఉంది.

టేబుల్‌పై బోర్లించిన పళ్ళెం తీసి కాస్త అన్నం పెట్టుకొని గరిటెతో పెరుగు వేసుకుంది.

ఇక్కడికి వచ్చినప్పటి నుంచి ఎందుకనో సుమ మనస్సు ప్రశాంతంగా లేదు. అస్తమానం ఆమె మదిలో సారథే కదలాడుతున్నాడు. తానొచ్చాక కనీసం ఒక ఫోనైనా చేయలేదు. తానిక్కడికి వచ్చినందుకు కోపం వచ్చింది కాబోలు అయ్య గారికి...

చిన్నగా నవ్వుకుంటూ తినడం ముగించి చెయ్యికడిగేసుకుంది...

అమ్మను తీసుకురావడానికని నాన్న వెళ్ళి రెండు రోజులైంది.

అమ్మ వస్తుందో రాదో?...

డెలివరీ అయి అక్కయ్య ఇంటికెప్పుడొస్తుందో? మళ్ళీ తాను తిరిగి పల్లెకు వెళ్ళడానికి ఎన్నిరోజులవుతుందో?... ఆలోచించసాగింది.

చిన్నప్పటినుంచీ పల్లెటూరిలోనే పుట్టి పెరిగిన సుమకి ఈ సిటీ వాతావరణంలో ఇమడలేకపోతూంది.

రఘురాం కోసం అన్నీ టేబుల్‌పై రెడీగా ఉంచి వెళ్ళి వంటిల్లంతా సర్ది శుభ్రంగా కడిగేసింది. తడి చేతుల్ని పైట చెంగుతో తుడుచుకుంటూ ఇవతలికి వచ్చింది.

చిన్నమ్మలు ఒక్కతి మాత్రమే పడుకొని ఉంది.

మిగతా పిల్లలిద్దరూ మేలుకొనే ఉన్నారు.

సుమ గదిలోకి రాగానే "పిన్నీ... పిన్నీ! ఈ రోజు నువ్వు కూడా మాతోపాటు ఇక్కడే పడుకొని మాకో కథ చెప్పవా?" అంటూ గోల చేయసాగారు.

"అయ్యో! మీరింకా నిద్రపోలేదా?" సుమ ఆశ్చర్యంగా అడిగింది.

"లేదు పిన్నీ.... నిద్రరావడం లేదు. హాస్పిటల్ నుంచి మమ్మీ ఎప్పుడు వస్తుంది పిన్నీ?"

"ఇందాక చెల్లి ఇట్లాగే అడిగితే తమ్ముడు పుట్టాక వస్తుందని చెప్పాను నేను. నిజమే కదా పిన్నీ?"

"అవునా?... మమ్మీకి బాబు పుడ్తాడా పిన్నీ?"

"ఆఁ. తప్పకుండా మీకు చిన్న బుల్లి తమ్ముడే పుడ్తాడు. సరేనా?..."

"బలే బలే!... తమ్ముడితో మేమంతా ఆడుకుంటాం పిన్నీ!"

"సరే అలాగే ఆడుకుందురుగాని, ముందు మీరిక పడుకోండి" దుప్పటి సరిచేసి కప్పింది వాళ్ళకి.

"నువు కూడా ఇక్కడే మాతోపాటు పడుకో పిన్నీ. ఏదైనా కథ చెప్పవా?" పిల్లలు బతిమాలుతున్నట్లుగా అడగసాగారు.

"సర్లెండి. మీరిక నన్ను వదలుతారా?" అని నవ్వుతూ ట్యూబ్‌లైట్ ఆర్పేసి బెడ్‌లైట్ వెలిగించి వచ్చి, ఆ మంచంపైనే వాళ్ళ మధ్యలో పడుకుందామె.

"మీకేం కథలు కావాలి? పిల్లి కథ చెప్పవా? లేక కోతి రొట్టె ముక్కకథ చెప్పనా?"

"ఊహుఁ. వద్దు. ఆ కథలు మాకు తెలుసు పిన్నీ!..."

"మరింకేం కథ చెప్పాలి?"

“మాయల ఫకీరు... రాక్షసుడి కథ చెప్పు పిన్నీ...”

“ఆ కథంటే నాకెంతో ఇష్టం పిన్నీ మమ్మీ అదే చెప్పేది...” రెండో పిల్ల కూడా ఆసక్తిగా అడగసాగింది.

“ఆ కథ ఏమిటో నాకు రాదమ్మా. ఆ కథ మీకు హాస్పిటల్ నుంచి తమ్ముడితో మమ్మీ తిరిగొచ్చాక చెప్పుతుంది గాని, ఇవాల్టికి మాత్రం నేను ‘పులి-పులిహోర’ కథ చెప్తాను. మరి వింటారా?”

“ఈ కథ పేరే చాలా బాగున్నట్లుంది. సరే చెప్పు పిన్నీ వింటాం”.

“అనగనగా ఓ పెద్ద అడవిలో ఓ పులి ఉండేది. అది అన్ని పులులవలె క్రూరమైనది కాదు, ఎంతో మంచిది. ఒకరోజు ఒక కట్టెలు కొట్టుకొని బతికేవాడు రోజూ లాగే చేతిలో గొడ్డలిని, తలపై సద్దిమూట పెట్టుకొని అడవిలోకి వచ్చాడు. వాడు యధాలాపంగా కట్టెలు కొట్టడం ప్రారంభించాడు. అంతలో అక్కడికి ఓ పులి వచ్చింది. దాన్ని చూడగానే వాడు భయాందోళనలతో గజగజ వణికిపోతూ గొడ్డల్ని కింద వదిలేసి గబగబా చెట్టెక్కేసి కూర్చున్నాడు.

ఆ పులి చెట్టుకిందే కూర్చొని పైకి చూస్తూ, “కిందికిరా! నిన్ను నేనేమీ చేయను”... అంది.

“అమ్మో! నువ్వంటే నాకెంతో భయం. కిందికి రాను....” అన్నాడతను.

“లేదు నీవనుకున్నట్లుగా నేను అన్ని పులులలాంటిదాన్ని కాను. మనమిద్దరం మంచి స్నేహితులుగా ఉందాం రా!” అంటూ పిలిచింది పులి.

కాని వాడు పులి మాటల్ని నమ్మలేదు.

అటూ ఇటూ చూస్తున్న పులి దృష్టి ఆ కట్టెలవాడి సద్దిమూట మీద పడింది. దగ్గరికి వెళ్ళి దాన్ని విప్పి చూసింది. అందులో పసుపురంగులో ఉన్న అన్నాన్ని చూసి “ఏమిటిది?” అని అడిగింది.

“పులిహోర” అన్నాడతను.

“ఓహో! అలాగా... నేనిది తింటాను” అంటూ ఆ పులి పులిహోరనంతా పూర్తిగా తిని “చాలా బాగుంది. మళ్ళీ రేపు కూడా ఇదే తీసుకురా” అంటూ వెళ్ళిపోయింది.

ఆ మరుసటిరోజు కూడా ఇలాగే జరిగింది. ఆ తరువాత కొద్దిరోజులలోనే కట్టెలు కొట్టేవాడు, పులి మంచి స్నేహితులైనారు. ప్రతిరోజూ పులికి ఇంటిదగ్గర్నుంచి

తినడానికి ఏదో ఒకటి తీసుకొచ్చేవాడు. పులి కూడా ఎక్కడెక్కడ ఎండిపోయిన చెట్లు ఉన్నాయో తీసికెళ్ళి చూపెట్టేది. వాళ్ళిద్దరూ అడవిలో ఉన్నంత వరకూ ఒకరిని విడచి ఒకరు ఉండేవారు కారు.

పిల్లలు అతి శ్రద్ధగా కథ వినసాగారు.

అది అయిపోయాక ఇంకో కథ చెప్పమని పోరు పెట్టారు పిల్లలు. ఇంకో కథ కూడా చెప్పి వాళ్ళని నిద్రపుచ్చింది సుమ.

ఏదో ఆలోచిస్తున్న ఆమె మదిలో సారథి మెదిలాడు మళ్ళీ.

తాను ఇక్కడికి వచ్చినప్పటి నుంచీ ఒక్క ఫోన్ కూడా చేయలేదెందుకనో!

తెరిచి ఉన్న కిటికీలో నుంచి పక్కింటి సుగుణమ్మగారి అబ్బాయి అరుపులు కేకలు బిగ్గరగా వినవస్తున్నాయి... బిగ్గరగా ఏడవడం.... ఆ ఏడ్పులోనే బిందుని పిలవడం అన్నీ స్పష్టంగా వినవస్తున్నాయి సుమకి. శ్రీనివాస్‌ని తలచుకుంటే ఆమెకి చాలా బాధ కలుగుతుంది. ఉదయం పక్కింటి సుగుణమ్మగారు వాళ్ళబ్బాయిని గురించి చెప్పిన కథే గుర్తుకు రాసాగింది. పదే పదే ఆ ప్రేమికులని గురించే ఆలోచించసాగింది. ఆనాడు పెద్దల అంగీకారమే ఉంటే, వాళ్ళీనాడు ముచ్చటైన చిలకా గోరింకల్లా కళకళలాడుతూ పచ్చగా సంసారం చేస్తూ గడిపేవారు. పాపం చివరికీనాడు వాళ్ల జీవితాలు పెద్ద వాళ్ళ మూర్ఖమైన పంతాలు పట్టుదలకీ. ఘోరంగా బలైపోయాయి. అంతటి విషాదభరితమైన ఆ దుఃఖాన్ని ఆ తల్లిదండ్రులు ఎలా తట్టుకోగల్గుతున్నారో?... భారంగా నిట్టూర్చింది. ఒళ్ళు జలదరించేలా అతను వేస్తున్న కేకలు, ఏడ్పు వింటూ... పిచ్చాడైన శ్రీనివాస్‌ని గురించీ... ఒళ్ళంటించుకొని దారుణంగా కాలి చనిపోయిన బిందుని గురించీ ఆలోచిస్తూనే ఎప్పుడో నిద్రలోకి జారుకుంది సుమ.

సరిగ్గా పదిన్నరకి ఇంటికి వచ్చాడు రఘురాం.

తలుపు తట్టగానే తల్లి లేచి తలుపు తీసింది.

"నీ వింకా పడుకోలేదా అమ్మా?..." అంటూ స్కూటర్ కీ తీసుకొని లోపలికొచ్చి తలుపులు మూసి గొళ్ళెం పెట్టాడు.

షూ అక్కడే విప్పేసి... కోటు కూడా విప్పేసి చేతిమీదుగా వేసుకొని నెమ్మదిగా గదిలోకెళ్ళాడు.

బెడ్‌రూంలో నీలిరంగు బల్బ్ వెలుగుతూంది.

సుమిత్ర పడుకునే మంచం మీద ఈ రోజు పిల్లలతోపాటు పడుకొని హాయిగా నిద్రిస్తున్న మరదల్ని ఆశ్చర్య చకితుడైనట్లుగా చూడసాగాడు.

ఆమె కట్టుకున్న నల్ల చుక్కలున్న ఆ తెల్లటి చీరని మరింత విస్మయంగా ఆసక్తిగా గమనించసాగాడు రఘురాం.

ఆ చీరను తాను గత సంవత్సరం మ్యారేజ్ డేకి తెచ్చాడు సుమిత్రకి.

సరిగ్గా ఈ రోజు తమ మ్యారేజ్ డే!...

అదే రోజున వాళ్ళక్కయ్య చీరని అనుకోకుండా సుమ కట్టుకోవడం రఘురాం కు ఎందుకనో చిత్రవిచిత్రంగా అనిపిస్తోంది.

కొన్ని క్షణాలు సర్వమూ మరచినవాడిలా అలాగే చూస్తూ నిల్చుండి పోయాడు.

తలకింద ఓ చేయి పెట్టుకొని ఇటు తిరిగి పడుకొని ఉన్న సుమ పైట చెంగు కాస్త పక్కకి తొలిగిపోయి... ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు అనుగుణంగా ఆమె గుండెలు కిందికి మీదికి కదులుతున్నాయి.

పక్కన్నే నిద్రిస్తున్న రెండోపాప సుమ నడుం చుట్టూ చెయ్యి వేసి బిగ్గరగా కరచుకొని పడుకుంది.

కాబోయే భర్త అయిన సారథిని గురించి ఏవేవో మధురమైన తీయని సుందర స్వప్నాలు కంటూ ఉంది కాబోలు- నిద్రలో కూడా సుమ పెదాలపై సన్నని దరహాసాలు దోబూచులాడుతున్నాయి.

నీలిరంగు లైట్ కాంతిలో తెల్లటిచీరలో స్నిగ్ధమనోహరంగా నిద్రిస్తున్న సుమని ఓ క్షణం రెప్పవాల్చక అలాగే చూస్తుండిపోయాడు రఘురాం.

చేతిలోని కోట్‌ని బట్టల స్టాండ్‌కి తగిలించాడు.

ఒకే మంచంపై ఇద్దరి పిల్లలతో సుమ పడుకోవడం కొంచెం బాధ అనిపించింది. ఓ పిల్లని తన మంచంపై పడుకోబెట్టుకుందామన్న ఉద్దేశ్యంతో పెద్దమ్మల్ని మెల్లిగా లేపి ఎత్తుకుంటుంటే అతని చెయ్యి అప్రయత్నంగా సుమ చేతికి తగిలే సరికి ఉలిక్కిపడినట్లు అయిన సుమ ఒక్కసారిగా లేచి కూర్చుంది గాబరాగా.

“సారీ సుమా! నీ మంచి నిద్రని డిస్టర్బ్ చేశాను. ఇద్దరి పిల్లలతో నీకీ మంచంలో ఇరుకైపోయిందనీ, పెద్దమ్మల్ని నా దగ్గర పడుకోబెట్టుకుందామని లేపాను” అని మెల్లిగా చెప్పాడు రఘురాం.

“అదికాదు బావా! రాత్రి వీళ్ళు కథలు చెప్పమని ఒకటే గోల చేస్తుంటే ఇక్కడే పడుకొని కథలు చెప్తూ వాళ్ళతోపాటు నేను కూడా అలాగే నిద్రపోయాను. పెద్దమ్మల్ని ఇక్కడే పడుకోబెట్టండి బావా...! రోజులాగా నేను అవతలి గదిలో పడుకుంటాను...” అంటూ పైట సరిచేసుకుంటూ చకచకా మంచం దిగింది సుమ.

“ఫర్వాలేదు సుమా! నీవీరోజు ఇక్కడే పడుకో ప్రతిరోజూ మీ అక్కయ్య పడుకునే మంచమే ఇది...” అంటూ రఘురాం వారించబోయాడు.

అయినా సుమ వినలేదు.

“వద్దులే బావా! నేనవతలే పడుకుంటాను”.

ఇక విధిలేక రఘురాం మళ్ళీ పాపని మంచంపై పడుకోబెడ్తూ ఉస్సురుమని నిట్టూర్చాడు.

సుమ పిల్లలిద్దరిని సరిగా పడుకోబెట్టి దుప్పటి కప్పి ఇటు తిరిగి “మీరెప్పుడొచ్చారు బావా?” కళ్ళెత్తి అతని వంక పరీక్షగా చూస్తూ అంది.

“ఇందాకనే వచ్చాను”.

“భోజనం చేశారా?”

“ఆఁ, అక్కడే చేసొచ్చాను...” అతను మాట్లాడుతుంటే వస్తున్న మందువాసనని తేలిగ్గానే పసిగట్టిందామె.

“ఈయనగారికి ఈ అలవాటు కూడా ఉందా?” అన్నట్లుగా కళ్ళు పెద్దవి చేసి చూస్తూ ‘రేపు ఉదయం అత్తయ్యని అడిగి విషయమేమిటో తెలుసుకోవాలి’ మనస్సులో సాలోచనగా అనుకుంటూ గబగబా ఇవతలికొచ్చేసింది.

✧ ✧ ✧

“అమ్మా! అమ్మా!...” అంటూ సారథి చేతిలో కవరేదో పట్టుకొని సంతోషంతో కేకలేస్తూ వడివడిగా వంటింటివైపు దూసుకువచ్చాడు.

వంట పనిలో ఉన్న అన్నపూర్ణమ్మ “ఏమిట్రా ఆ గావుకేకలు? ఏమైంది?...” తడి చేతుల్ని పైట చెంగుతో తుడుచుకుంటూ హడావుడిగా ఇవతలికొచ్చింది.

సారథి ఆనందం ఆపుకోలేక తల్లిని పట్టుకొని ఊపేస్తూ అన్నాడు. ''అమ్మా!.. ఇన్నాళ్ళు నీవు చేసిన పూజలు ఈనాటికి ఫలించాయమ్మా! నాన్నగారి ఆచూకీ తెల్సిందమ్మా!...''

కొడుకన్న ఆ మాటలు వినగానే అన్నపూర్ణమ్మ కన్నులు ఒక్కసారిగా సంతోషంతో కాంతివంతంగా వెలిగిపోయాయి.

''ఆఁ, నిజంగానా సారథి?...'' నమ్మలేనట్లుగా ఆనందాతిశయంతో ప్రశ్నించింది.

''అవునమ్మా నిజమే... నా ఫ్రెండొకడు గుజరాత్ రాష్ట్రంలో నలియా అనే కచ్ ప్రాంతంలో ఎయిర్‌ఫోర్స్‌లో మెడికల్ ఆఫీసర్‌గా ఉంటున్నాడు. వాడే నాకీ ఉత్తరం రాశాడమ్మా. చదువు... చదువమ్మా'' అంటూ తన చేతిలోని ఆ లెటర్ని తల్లికందించాడు.

అన్నపూర్ణమ్మ కళ్ళు ఆ ఉత్తరంలోని అక్షరాల వెంట పరుగులు తీశాయి...

''డియర్ సారథీ!...

నీవక్కడ కులాసే అనుకుంటాను. ఈ లెటర్ ద్వారా నేను నీకో శుభవార్తని తెల్పుతున్నాను. పోయిన వారంలో మా ఎయిర్‌ఫోర్స్ క్యాంపులోని తెలుగు వారమంతా కలిసి ఇక్కడికి దగ్గరలోనే ఉన్న 'ద్వారక'కు వెళ్ళాం. శ్రీకృష్ణుని నివాస స్థానమైన ఆ ప్రదేశమెంతో బాగుంటుందని విని చూసి తరించాం. అక్కడ ఎంతో మంది సాధుపుంగవులు కూడా దర్శనమిచ్చారు. వారిలో ఒకాయన మీ నాన్నగారి లాగానే ఉన్నాడు. నా దగ్గరున్న మీ నాన్నగారి ఫోటోకి ఈయనకి చాలా దగ్గరి పోలికలున్నాయి. నేను ఆయన దగ్గరగా వెళ్ళి మాట్లాడాను తెలుగులో. భాష స్పష్టంగా ఉంది. తెలుగువాడేనని తెలిసింది. పేరు మాత్రం వేరే ఉంది. మార్చుకున్నాడులా ఉంది. ఆయన మాత్రం ముమ్మాటికీ మీ తండ్రియే! నాకా గట్టి నమ్మకముంది. కొన్నేళ్ళ నుంచీ ద్వారకలోనే ఉంటున్నాడట. అతని ఫోటో తీసి నీకు రాస్తున్న ఈ ఉత్తరంతోపాటు పంపుదామనుకున్నాను. కాని వీలు లేక పోయింది. నీవు మాత్రం ఈ ఉత్తరం అందిన వెంటనే బయలుదేరి రాగలవు. ఇద్దరం కలిసి ద్వారకకు వెళ్దాం. ఏ మాత్రం ఆలస్యం చేయవద్దని నా మనవి. నీ రాకకోసం ఎదురుచూస్తూ ఉంటాను. అమ్మగారికి నా నమస్కారాలు చెప్పగలవు.

ఇట్లు

నీ ప్రియ మిత్రుడు కిషన్.

ఆ ఉత్తరం చదవగానే ఆవిడ కన్నులు ఆనందబాష్పాలతో నిండిపోయాయి.

''నిజంగా... ఆయన మీ నాన్నయే అయివుంటాడా సారథి?... '' నమ్మ శక్యం కానట్లుగా అడిగింది.

''తప్పకుండా అయివుండొచ్చమ్మా! నేను ఈ రోజు బయలుదేరి వెళ్దామనుకుంటున్నాను. ముందు హైద్రాబాద్ వెళ్ళి అక్కడి నుంచి ప్లేన్‌లో బొంబాయి వెళ్తాను. అక్కడి నుంచి ఎలా వీలైతే అలా వెళ్ళగలను...''

''నువు వెళ్ళేప్పుడు హైద్రాబాద్‌లో సుమిత్ర వాళ్ళింటికి వెళ్తావా? సుమని కూడా ఓసారి కలిసినట్టుగా ఉంటుంది''.

''లేదమ్మా. నాకు వెళ్ళడానికి వీలుకాదు. అయినా సుమ అక్కడికి వెళ్ళాక ఫోన్ కూడా చేయలేదేమిటమ్మా?'' సారథి ఆశ్చర్యం వ్యక్తపర్చాడు.

''పనులతో తీరికలేదేమో? పోనీ, నీవైనా చేయవచ్చు గదరా!...'' అన్నపూర్ణమ్మ కొడుకు వంక ఓరగా చూసింది.

''ఊఁ, సర్లే...'' అంటూ ''అన్నట్టు అమ్మా! ఈ రోజు రవీంద్ర వస్తానని ఫోన్ చేశాడు కదూ? వాడు వచ్చాక నేను బయలుదేరుతాను. నేనిప్పుడు పొలం వెళ్ళి ఖాసీంకు పనివాళ్ళకు అన్ని పనులు అప్పజెప్పి వెంటనే తిరిగొస్తాను'' అని మరో మాటకైనా నిలువకుండా వడివడిగా అడుగులేస్తూ వెళ్ళిపోయాడు సారథి బయటికి.

✧ ✧ ✧

సుమ ఉదయం నిద్రలేచేసరికి కాస్త ఆలస్యం అయింది.

సరిగ్గా అదే సమయానికి హాల్లో గోడగడియారం ఏడు గంటలు కొట్టింది.

పొద్దున్నే హాల్లో ఉన్న ముసలావిడ ఎవరితోనో దెబ్బలాడుతున్నట్లుగా పెద్ద గొంతుకతో మాట్లాడుతూంది.

గబగబా మంచం దిగి చీర కుచ్చెళ్ళు సవరించుకుంటూ సుమ ఇవతలికి వచ్చింది.

చేతిలో ఓ సంచీ పట్టుకుని సన్నగా పొడుగ్గా ఉన్న ఓ నడి వయస్కురాలు తలదించుకొని గోడవారగా నిల్చుని ఉంది.

ముసలావిడ ఆవిడనే కోపంగా కేకలేస్తూంది.

ఆవిడెవరో అర్థంకాక సుమ అయోమయంగా కళ్ళప్పగించి చూడసాగింది.

రెండు మూడు రోజుల్లో వస్తానని తీయని మాయమాటలు చెప్పి... మా కోడల్ని నమ్మించి పెళ్ళికని వెళ్ళి మళ్ళీ ఇన్నాళ్ళకా నీవు తిరిగొచ్చేది?...''

''ఏం చెప్పనమ్మా నా పరిస్థితి, అలాగే వద్దామనే వెళ్ళాను కాని అనుకోకుండా నాకు విపరీతమైన జ్వరం వచ్చి వారం రోజులు మూసిన కన్ను తెరువకుండా పడి ఉన్నాను'' అని దీనంగా చెప్తుతుందావిడ.

ఆవిడెవరో సుమకప్పుడర్థమైంది.

వంట మనిషి!...

''నా కోడలు అమాయకురాలు కాబట్టి, నువు అడగ్గానే పెళ్ళికి ఊరెళ్ళమని పంపించినందుకు బాగానే శాస్తి చేశావులే''.

''అయ్యో అంతమాట అనకండి అమ్మగారూ! చెప్పినవిధంగా రాలేక పోయినందుకు మీ కన్నా నేనే ఎక్కువ బాధపడ్డా ఈ విషయంలో. సుమిత్రమ్మకి నెలలు నిండాయి. ఎట్లా ఉందో, ఎలా చేసుకుంటుందోనని నేను బాధపడని రోజు లేదంటే నమ్మండమ్మా! అమ్మగారికి పురుడొచ్చిందామ్మా?'

''లేదింకా అవ్వలేదు. హాస్పిటల్లోనే ఉంది''.

''ఐతే త్వరగా స్నానం చేసి హాస్పిటల్ వెళ్ళి అమ్మగార్ని చూసి వస్తానమ్మా! ఎందుకనో నాకు సుమిత్రమ్మ కళ్ళల్లో మెదిలినట్లుగా ఉంది'' అంటూ వంటావిడ లోపలికెళ్ళడానికి వెనుదిరిగింది.

గుమ్మం దగ్గర నిల్చుని ఉన్న సుమనప్పుడు చూసిందావిడ.

''ఈ అమ్మాయి ఎవరమ్మా?'' ప్రశ్నించింది ముసలావిడను.

''నీవేమో రాలేదు; కోడలికా పురిటిరోజులు!... అలాంటి సమయంలో ఊరి నుంచి వాళ్ళ చెల్లెల్ని పిలిపించాం; కాస్త ఇంట్లో పనిపాటలకి సహాయంగా ఉంటుందని. పేరు సుమబాల. ఆ అమ్మాయి వచ్చినప్పటినుంచీ వంటపనిలో ఇంటిపనిలో సతమతమై పోతూంది. ఇక ఇవాల్టి నుంచి అన్ని పనులూ నువ్వే చూసుకోవాలి చూడు'' అంటూ హెచ్చరించింది ముసలావిడ.

''అలాగే... తప్పకుండానమ్మా!'' నవ్వుతూ తలూగిస్తూ వంటావిడ లోపలికి వెళ్ళింది.

ఓ అరగంట గడిచాక రఘురామ్ సెల్ అదే పనిగా మోగుతూంది.

అది విన్న సుమ మెల్లిగా ఆ గది గుమ్మం వరకు వెళ్ళింది. బావని లేపుదామని.

అప్పటికే లేచిన రఘురాం సెల్లో మాట్లాడిన వెంటనే దిగ్గున మంచంపై నుంచి లేచి కంగారుగా బట్టలు మార్చుకొని విచార వదనంతో బయటికి వచ్చాడు.

"ఎక్కడి నుంచి బావా ఫోన్? హాస్పిటల్ నుంచా?" సుమ కొంచెం భయపడు తున్నట్లుగా అడిగింది.

సుమ మాటలు విన్న ముసలావిడ భయాందోళనలతో వణుకుతూ, "ఏమయిందిరా అబ్బాయ్! అమ్మాయికెలా ఉందని చెప్పింది డాక్టరమ్మ?" ఆదుర్దాగా అడిగింది కొడుకుని.

"సుమిత్రకి తెల్లారుజామున నుంచీ పేన్స్ వస్తున్నాయట. కాన్పు నార్మల్‌గా అయ్యేటట్లు లేదట. పరిస్థితి విషమించేలా ఉంది. అయినా భయపడాల్సిన పని లేదు. ఆపరేషన్‌కి అన్ని ఏర్పాట్లు చేశాను. మీరు త్వరగా వచ్చేయమని చెప్పి ఫోన్ పెట్టేసింది..." అని చెప్తూంటే రఘురాం స్వరం క్షణంలో గద్గదికమైంది.

ఆ మాటలు వినగానే ముసలావిడ ఒక్కసారిగా గొల్లుమంది.

సుమ అచేతనంగా అలాగే నిల్చుండి పోయింది.

✧ ✧ ✧

"ఏమేవ్, సుశీలా! నేను తిరిగొచ్చేసరికి తయారయి ఉండు. పూర్ణవాళ్ళింటి కెళ్ళి సారథితో మన పొలం విషయాలు కాస్త చూస్తుండమని చెప్పేసి వస్తాను... అంటూ హడావుడిగా చెప్పులేసుకొని బయటికొస్తున్న వెంకట్రామయ్యగారు టక్కున ఆగిపోయారు.

అల్లంతదూరంలో అన్నపూర్ణమ్మ, ఆమె వెనకాలా చిన్నకొడుకు రవీంద్ర ఇటే వస్తూ కనిపించారు.

"ఏం అన్నయ్యా! నీవు వదిన ఇంకా ప్రయాణం కాలేదా? మీరు ఒక వేళ ఉదయం బస్సుకే వెళ్ళిపోయారేమోనని హడావుడిగా వచ్చేశాం..." అంటూ లోపలికి వచ్చింది అన్నపూర్ణమ్మ.

"నమస్కారం మామయ్యా!" రవీంద్ర వినయంగా రెండు చేతులూ జోడించాడు నవ్వుతూ.

"నీవెప్పుడొచ్చావురా?" వెంకట్రామయ్యగారు ఆశ్చర్యంగా అడిగాడు.

"నిన్న మధ్యాహ్నం వచ్చాను మామయ్యా! కాలేజీకి అనుకోకుండా వారం రోజులు సెలవులిచ్చారు. అందుకని వచ్చాను".

"అక్కడంతా కులాసే కదా?"

"ఆఁ, అంతా క్షేమమే మామయ్యా! 'పెద్దొదినకి ... అదే సుమిత్రొదినకి డెలివరీ అయిందో లేదో ఏ సంగతి తెలియకపాయె!...' అని సుభద్రొదిన పదే పదే అనుకుంటుండె..."

"ఏదీ అక్కడి నుంచి వచ్చినప్పటినుంచీ నాకు తీరికే లేదు. మీ అత్తయ్యని వెంటనే తీసికెళ్ళుదామని హైద్రాబాద్ నుంచి వచ్చాను. సుమిత్రకి డెలివరీ కాలేదు. హాస్పిటల్లోనే ఉంది. వాళ్ళమ్మని చూడాలనిపిస్తుందని అంటే మీ అత్తయ్యని తీసికెళ్ళదామని నేనిక్కడికొస్తే... ఈవిడేమో మోకాళ్ళ నొప్పులతో మంచాన పడి ఉంది. ఇదిగో ఈ రోజు కాస్త తెరిపిగా వుంటే హైద్రాబాద్‌కు వెళ్ళడానికి ప్రయాణమైనాము నేనూ మీ అత్తయ్య. అక్కడ అమ్మాయ్ ఎట్లా ఉందో?... కాన్పు అయిందో లేదో? నిన్నటి నుంచి అల్లుడిగారి సెల్‌కి ఎన్నిసార్లు ఫోన్ చేసినా కలవడమే లేదెందుకో? నేనిప్పుడు మీ ఇంటికే వద్దామని బయలుదేరబోయాను. తీరా మీరే వచ్చేశారు..."

"ఎందుకన్నయ్యా, ఏమైనా పని ఉందా?"... అన్నపూర్ణమ్మ ఆత్రుతగా అడిగింది.

"పనేమీ లేదనుకో! సారథికి మా పొలం సంగతులూ... అట్లాగే ఇంట్లో రుక్మిణి ఒక్కత్తె ఉంటుంది కదా! కాస్త అప్పుడప్పుడు వచ్చిపోతుండమని చెప్పాలనుకున్నాను" అని వెంకట్రామయ్యగారు అంటుండగానే లోపలి నుండి సుశీలమ్మ, రుక్మిణి ఒకేసారి ఇవతలికొచ్చారు.

"సారథి లేడన్నయ్యా!"

"ఏం, ఎక్కడికి వెళ్ళాడు?"

"వాడు నిన్న ఉదయమే ఊరెళ్ళాడు".

"ఏ ఊరు? హైదరాబాదా?"

"ఊ హుఁ, కాదన్నయ్యా"

"మరెక్కడికి వెళ్ళాడు?"

"సారథికి రెండురోజుల క్రితం గుజరాత్‌లో 'ద్వారక' దగ్గరలో ఉన్న 'నలియా' అనే కచ్ ప్రాంతంలో ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం చేస్తున్న ఓ ఫ్రెండ్ దగ్గరినుంచి ఉత్తరం వచ్చిందన్నయ్యా! అది చూసుకొని హుటాహుటిన ప్రయాణమై వెళ్ళిపోయాడు".

"అక్కడికి ఎందుకమ్మా? బావ విషయం ఏమైన తెల్సిందా?"

"ఆఁ, తెల్సిందన్నయ్యా! అందుకనే వెళ్ళాడు సారథి".

"ఏం తెలిసిందక్కయ్యా?... బావ అక్కడ ఏం చేస్తున్నాడట? ఎలా ఉన్నాడట?" రుక్మిణి ఆత్రుతని అణచుకోలేక పోతున్నట్లుగా మరో అడుగు ముందుకేసి వాళ్ళక్కకు అభిముఖంగా వచ్చి నిల్చుని సంతోషంతో ప్రశ్నల వర్షం కురిపించింది.

"ఎవరో సన్యాసులతో కలిసి తిరుగుతున్నాడట ద్వారకలో".

"మరి సారథి ఫ్రెండ్ బావని ఎలా పోల్చుకున్నాడే అక్కయ్యా?"

"పిల్లలతో మేమిద్దరం కలిసి దిగిన ఫోటోని చాలా కాపీలు తీయించి దూరప్రాంతాలలో ఉన్న ఉద్యోగస్థులైన తన ఫ్రెండ్స్ కందరికీ తలో కాపీ పంపిస్తూ, ఆ ఫోటోలోని పోలికలున్న వ్యక్తి అగుపిస్తే అతన్ని గురించిన వివరాలు తెలుసుకొని వెంటనే తనకు తెలియజేయమని సారథి చాన్నాళ్ళ క్రితమే వాళ్ళందరికీ చెప్పి ఉంచాడు. దాని ఫలితమే సారథి ఇప్పుడు గుజరాత్ వెళ్ళడం..."

"ఇన్నేళ్ళకి నీ పూజలు ఫలించాయి పూర్ణా! భగవంతుడు కళ్ళు తెరిచాడు. తండ్రీ కొడుకులిద్దరూ త్వరగా ఇంటికి తిరిగొస్తే మన ఊరి శివాలయంలో అభిషేకం చేయించి కొబ్బరికాయలు కొడ్తాను..." సంతోషంతో అప్పుడే మొక్కులు కూడా మొక్కుకుంది సుశీలమ్మ.

"నీవెన్ని కొబ్బరి కాయలు కొడతావో ఖచ్చితంగా మొక్కుకోలేదత్తయ్యా!..." రవీంద్ర నవ్వుతూ గుర్తు చేశాడు.

"మీ నాన్న తిరిగొస్తే అంతే చాలు! ఎన్నైనా కొట్టగలను. ఓ పాతిక కొబ్బరికాయలు కొడ్తాను. చాలా?..." అందావిడ నవ్వుతూ.

"వదిన ఆడిన మాట తప్పదురా రవీ! బావ తిరిగి రావాలేగాని తప్పకుండా కొబ్బరికాయలు కొడుతుంది..." అని నవ్వుతూ రుక్మిణి అభయమిచ్చింది రవీంద్రకు... పిన్ని మాటలకు అతను కూడా నవ్వాడు.

"భార్యాభర్తలన్నాక ఎన్నెన్నో మనస్పర్థలు వస్తుంటాయి; పోతుంటాయి. ప్రతిచిన్న విషయానికి తగూ పెట్టుకొని... చిలికి చిలికి గాలి వానలా చేసుకొని, సంసార బంధాల్ని తెంచుకొని, పెళ్ళాం పిల్లల్ని వదిలేసి పిచ్చివాడిలా వెళ్ళిపోయిన బావ నిజంగా నీ నూరేళ్ళ నిండుజీవితాన్ని చీకటిమయం చేశాడే పూర్ణా!..." బాధావేదనలతో నిట్టూరుస్తూ అన్నాడు వెంకట్రామయ్యగారు.

‘‘నేను గతించిన దానికి బాధపడ్డం లేదు; చింతించడం అంతకన్నా లేదు... ఆయన ఎక్కడున్నా క్షేమంగా సంతోషంగా ఉంటే నాకంతే చాలన్నయ్యా...’’ అంటూంటే అన్నపూర్ణమ్మ కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

పైట చెంగుతో గట్టిగా కళ్ళు ఒత్తుకొంది.

ఆ సంభాషణను మరో వైపు మరలించుదామనే ఉద్దేశ్యంతో రవీంద్ర ‘‘అయితే, మామయ్యా! ఇక మీరు ప్రయాణానికి రెడీయేనా? వెళ్దామా బస్‌స్టాండ్‌కు....’’ అంటూ అక్కడే సర్దివుంచిన రెండు బ్యాగ్‌లను చూడసాగాడు.

‘‘ఆఁ, అంతా రెడీయేరా వెళ్దాం కాని, అన్నట్లు...’’ అంటూ ఏదో చెప్పబోయి అన్నపూర్ణమ్మ వైపు చూస్తూ అర్ధోక్తిలోనే ఆగిపోయాడాయన.

‘‘నువు చెప్పబోయేదేమిటో నాకు తెలుసన్నయ్యా! మీరొచ్చే వరకూ రుక్మిణి మా ఇంట్లోనే ఉంటుంది. ఇక్కడ ఒక్కత్తె ఎందుకు?’’

‘‘సరే మరీ మంచిది. బట్టలన్నీ సర్దుకొని నీవు వీళ్ళతోపాటే వెళ్ళు రుక్మిణీ!...’’

‘‘అలాగే అన్నయ్యా!...’’ తలూపింది రుక్మిణి.

‘‘ఇంకొక పని రవీ! సుమిత్ర వాళ్ళకి నీ వొకసారి ఫోన్ కలుపు. నేను నిన్నటి నుంచి ట్రై చేస్తున్నాను. కలవడం లేదు. ఇదిగో వాళ్ళ నెంబరు’’ అంటూ ఆయన జేబులోనుంచి ఓ కాగితంపై రాసి ఉన్న ఆ నెంబరిచ్చాడు.

‘‘అలాగే మామయ్యా!’’ అంటూ రవీంద్ర ఫోన్ దగ్గరికెళ్ళి ట్రై చేయబోయాడు ‘‘అస్సలు రెస్పాన్సే లేదు. ఫోన్ డెడ్డయింది. అందుకనే మీకు కలువలేదు’’.

‘‘అవునా?... ఇక అది బాగయ్యేది ఎప్పుడో? అయినా ఇప్పుడేం అవసరం లేదు కదా!’’

అంతలోనే పోస్ట్‌మాన్ వచ్చాడు వాళ్ళింటికి

‘‘ఉత్తరమేదో వచ్చినట్లుంది మనకు. వెళ్ళి అందుకో రవీ!’’ అన్నాడు వెంకట్రామయ్యగారు మేనల్లుడితో.

రవీంద్ర ముందుకెళ్ళాడు తీసుకోవడానికి.

‘‘లెటర్ కాదండీ... టెలిగ్రామ్ వచ్చింది మీకు. ఇక్కడ సంతకం చేయండి!...’’ అంటూ పోస్ట్‌మాన్ నేరుగా వెంకట్రామయ్యగారి దగ్గరికొచ్చి సంతకం తీసుకొని అదిచ్చి వెళ్ళిపోయాడు.

పోస్ట్‌మాన్ మాట వినగానే అక్కడున్న వాళ్ళందరూ భయాందోళనలతో ఉక్కిరి బిక్కిరి అయిపోసాగారు.

"ఎక్కడినుంచో అది విప్పి చదువు రవీ!..." ఏదో తెలియని భయంతో గద్గదిక స్వరంతో తడబాటుగా అన్నాడు వెంకట్రామయ్యగారు.

"మీరేం భయపడకండి మామయ్యా! మనింట్లో ఫోన్ డెడ్ అయినందుకు సుమిత్రొదిన వాళ్ళు ఇచ్చినట్లున్నారిది" అంటూ చిన్నగా కంపిస్తున్న చేతులతో ఆ కాగితం విప్పాడు రవీంద్ర.

"సుమిత్ర ఎక్స్‌పైర్డ్ స్టార్ట్ ఇమ్మీడియట్లీ... రఘురాం"

అన్న చిన్న వాక్యముందందులో.

అది చదవగానే అతని బుర్ర గిర్రున తిరిగిపోసాగింది.

అంతా అయోమయంగా ఉంది...

'ఎక్కడినుంచి?..."

'ఏం ఉంది అందులో?....'

"త్వరగా చెప్పరా రవీ!..."

అంతా ఒక్కుమ్మడిగా అరిచినట్లు అడుగుతుంటే రవీంద్ర కళ్ళ నిండా నీళ్ళు సుళ్ళు తిరిగాయి. వాళ్ళకి ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలీక బిక్కమొహం వేసుకొని "ఇది రఘురాం అన్నయ్య ఇచ్చిన టెలిగ్రామ్ మామయ్యా!... సుమిత్ర వదిన... సుమిత్రొదిన మనకిక లేదు అత్తయ్యా!..." ఇక ఆపైన మాట్లాడలేక పోతున్నట్లుగా బావురుమన్నాడు.

శ్రోతలంతా ఒక్కసారిగా గొల్లుమన్నారు.

పెద్దకూతురి మరణవార్త వినగానే సుశీలమ్మ ఫిట్స్ వచ్చినదానిలా విరుచుక పడిపోతుంటే... అన్నపూర్ణమ్మ రుక్మిణి చెరోవైపు అదిమిపట్టుకొని ఆవిడ కింద పడిపోకుండా ఆపారు.

✧ ✧ ✧

ఒంటరిగా చీకట్లో గదిలో కూర్చున్న రఘురాం నిశ్శబ్దంగా రోదిస్తున్నాడు.

కళ్ళుమూసినా తెరిచినా అనుక్షణం భార్యరూపమే అగుపిస్తూంది.

సుమిత్ర చనిపోయి ఇవాల్టికి రెండోరోజు!...

''చీకట్లో కూర్చున్నావేం నాయునా?...'' అంటూ లోనికి వస్తున్న వెంకట్రామయ్యగారు గదిలో లైట్ వేశాడు.

''చీకటి కాక నాకింకేం మిగిలింది మామగారు! నా జీవితమే అంధకారమై పోయింది...'' ఏడ్పు స్వరంతో అన్నాడు రఘురాం.

''బాధపడకు బాబు! ఏం చేస్తాం మన ఖర్మ! సుమిత్ర ఇంత త్వరలో మన నుంచి దూరమవుతుందని అనుకోలేదు. మరపు రాకుండా ఉండే ఆమె స్మృతుల్ని మర్చిపోవడానికే వీలైనంతగా ప్రయత్నించాలి. సర్వం మరచి నువ్విలా అనుక్షణం విలపిస్తూ కూర్చుంటే పెద్దమనిషి మీ అమ్మగారి మాటేమిటి? అన్నెం పుణ్యం ఎరుగని ఆ పసివాళ్ళ మాటేమిటి?''

చెట్టంత కూతుర్ని పోగొట్టుకొని గుండెలనిండా ఎనలేని దుఃఖాన్ని నింపుకొని ఉండి కూడా... అల్లుడికి ఓదార్పుగా అనునయ వాక్యాలు చెప్పసాగాడు ఆయన.

అయినా రఘురాం అదేం వినిపించుకోకుండా మోకాళ్ళచుట్టూ రెండు చేతులూ పెనవేసుకొని .... అరచేతుల్లో తల ఇమిడ్చుకొని పిచ్చివాడిలా దుఃఖిస్తూనే ఉన్నాడు.

నిజంగా అక్కయ్య చనిపోయిందంటే సుమకి సుతరామూ నమ్మకం కలగడం లేదు ఈ క్షణం వరకును. తాను కళ్ళారా చూసిన చావే అయినా ఎందుకనో మనస్సు అలా ఒప్పుకోవడం లేదు. అంతా క్షణాలలో కలలో జరిగినట్లుగా జరిపోయింది అక్క అంతిమ యాత్ర!...

'భగవంతుడా! ఏం పాపం చేసుకున్నారని ఈ పసివాళ్ళకి తల్లిప్రేమను కరువు చేసి ఎంతటి ఘోరం చేశావ్?...' అనుకుంటూ పిచ్చిగా విలపించ సాగింది సుమబాల.

ఇక ముసలావిడ పరిస్థితి సరేసరి!...

వంశాంకురం కావాలంటూ తాను పట్టుపట్టడం వలననే క్రితం సారి డెలివరీ అప్పుడు ఆపరేషన్ చేయించుకోలేకపోయింది సుమిత్ర. తాను ఆనాడు ఆపరేషన్కి ఒప్పుకొని ఉండి ఉంటే ఈనాడీ ఘోరకృత్యం జరిగేది కాదు.

ఇంటికి ఇల్లాలు... పిల్లలకి తల్లి లేకుండా పోయింది... తన మూర్ఖత్వం వలననే అన్న నగ్నసత్యం తెలిసేసరికి ముసలావిడ నెత్తీనోరు బాదుకుంటూ హృదయ విదారకంగా విలపించసాగింది.

సుశీలమ్మ కూతురిని బతికుండగానే కడసారి చూపుకైనా నోచుకోలేకపోయి నందుకు ఆ కన్నతల్లి హృదయంలోని... దుఃఖం ఎవరికర్థమవు తుంది?

కాన్పు కష్టమై సుమిత్రకి ఆపరేషన్ చేశారు. కాని, అప్పటికే సమయం మించిపోయింది. ఆ పసికందు లోపలే పోయాడు.

కనీసం తల్లి ప్రాణాన్నైనా బతికించుదామని ఆఖరి గడియ వరకూ ప్రయత్నించారు. కాని లాభం లేకపోయింది.

ఆ పసివాడితోపాటు సుమిత్ర కూడా పరలోకానికి చేరుకుంది.

సుమిత్ర అంత్యక్రియలు ముగిసిన మరుసటి రోజే రుక్మిణి, అన్నపూర్ణమ్మ రవీంద్ర తిరిగి పల్లెకు వెళ్ళిపోయారు.

గౌతమి కూడా భర్తతోపాటు కలిసి వచ్చి వెళ్ళిపోయింది.

సుభద్ర వాళ్ళు వచ్చారు. పిల్లల్ని దగ్గరకు తీసుకొని బావురుమంది. బావని పలుకరించడానికి ధైర్యం చాలడం లేదు. ఆనందరావే అన్నగారిని వాటేసుకొని మౌనంగా ఓదార్చాడు సజలనయనాలతో.

సరైన అడ్రస్ లేకపోవడం వలన... సెల్‌కు చేస్తే కలువకపోవడం వలన సారథికి ఈ వార్త తెలుపలేకపోయారు.

“బావ ఎప్పుడు వస్తాడు అత్తయ్యా?...” వెళ్ళే ముందు అన్నపూర్ణమ్మని అడిగింది సుమ.

“ఏమోనమ్మా, ఎప్పుడు వస్తాడో తెలీదు”

“ఇప్పట్లో బావ తిరిగొస్తే ఇక్కడికి తప్పకుండా రమ్మని చెప్పండత్తయ్యా!” వేడుకోలుగా అంది.

“నేను చెప్పడం ఏమిటి పిచ్చితల్లీ! ఈ ఘోరవార్త తెలియగానే వాడే ఇక్కడికి రెక్కలు కట్టుకొని మరీ వాలుతాడు...” అంటూ పైట చెంగుతో కళ్ళొత్తుకుందావిడ.

వెంకట్రామయ్యగారు దగ్గరుండి అల్లుడితో కూతురి కర్మకార్యక్రమాలన్నీ సక్రమంగా జరిపించాడు.

ఆ మరుసటిరోజే పక్కింటి సుగుణమ్మగారు వాళ్ళ పిచ్చబ్బాయిని ఢిల్లీకి చికిత్సకోసం తీసికెళుతున్నారు.

వెళ్ళేముందు సుమతో చెప్పడానికని వీళ్ళింటికి వచ్చిందావిడ.

ఆమెని చూడగానే అప్రయత్నంగా సుమ కళ్ళనిండా గిర్రున నీళ్ళుతిరిగాయి.

ఏడుస్తున్న సుమని ప్రేమతో దగ్గరికి తీసుకొని ఆర్తిగా గుండెలకదుము కుందావిడ. "సుమిత్ర మనకింత అన్యాయం చేసి పోతుందని కలలో కూడా అనుకోలేదు. మన చేతుల్లో ఏమీ లేదు సుమా! నిమిత్తమాత్రులమే. నిక్షేపం లాంటి మా అబ్బాయి... ప్రేమించిన అమ్మాయి కారణంగా పిచ్చివాడవ్వడం మూలాన సుమిత్ర ఎంతగానో తల్లడిల్లేది. వాడిని చూసినప్పుడల్లా బాధతో విపరీతంగా చలించిపోయేది" హీన స్వరంతో అంది.

"మీరు ఇప్పుడేనా వెళ్ళడం పిన్నిగారు?"

"అవునమ్మా ఇంకో అరగంటలో ట్రైన్ ఉందట. చెప్పి వెళ్ళుదామని ఇలా వచ్చాను. అక్కడికి వెళ్ళాక వాడి పరిస్థితి ఎలా ఉంటుందో ఏమిటో? నాకంతా భయంగానే ఉందమ్మా!..."

"మీరేం అనవసరంగా భయపడకండి పిన్నిగారు! మీ యీ ఆఖరి ప్రయత్నం తప్పకుండా ఫలిస్తుంది. మీ అబ్బాయి మళ్ళీ మామూలు మనిషి అవుతాడు" అంటూ సుమ ధైర్య వచనాలు చెప్పి సాగనంపింది.

"నీ నోటి చలువవలన... ఆ భగవంతుని దయ వలన అలాగే జరిగితే, ఈ కన్నతల్లికి ఇక కావలిసిందేముందమ్మా?..." అంటూ ముసలావిడతో కూడా చెప్పేసి వెళ్ళిపోయింది సుగుణమ్మ.

✧ ✧ ✧

ఏడుస్తున్న చిన్నదాన్ని తీసుకవచ్చి ముసలావిడ కిచ్చింది సుమ.

"పాలు తాగిందా?"

"ఆఁ, ఇందాకనే తాగించాను కాని, మరెందుకు ఏడుస్తుందో?"

"నిద్ర వచ్చినట్లుంది. అందుకనే ఇలా ఏడుస్తుంది. నేను పడుకోబెడ్తానుగాని నువ్వెళ్ళి పని చూసుకో" అంటూ ఆవిడ ఆ పిల్లని మోకాళ్ళపై పడుకోబెట్టుకొని జోకొడ్తూ నిద్రపుచ్చడానికి ప్రయత్నించసాగింది.

అప్పుడే అటుగా వచ్చిన వెంకట్రామయ్యగారు... తనికి కాస్త దూరంలో కూర్చోవడం ముసలావిడ గమనించలేదు.

ఆవిడతో తాము ఊరికి వెళ్ళే విషయం చెప్పాలని వచ్చాడు. కాని ఆవిడ ముందుకి వచ్చాక నోరు విప్పలేక పోతున్నాడు. ఎలా చెప్పాలో దిక్కుతోచనట్లుగా అయోమయంగా ఉంది ఆయన పరిస్థితి. ఎలాగైతేనేం ఓసారి గొంతు సవరించుకొని సూటిగా మాటలకి ఉపక్రమించాడు.

“అక్కయ్యా! మేం ఊరెళదామనుకుంటున్నాం...”

ముసలావిడ ఓ క్షణం ఏం మాట్లాడలేదు.

“పిల్లల్ని మాతోపాటు పల్లెకి తీసికెళుతాం. మీకీ వయస్సులో పిల్లలతో చాలా ఇబ్బంది అవుతుంది. అందుకని నిన్న అల్లుడిగారితో ఈ విషయం గురించి మాట్లాడాను”.

ఆ తరువాత మెల్లిగా గొంతు విప్పిందావిడ.

“అవును మరి. ఎవరి ఊళ్ళకి వాళ్ళు వెళ్ళకుండా... ఇక్కడెందుకని ఉంటారు; ఎన్నాళ్ళనీ ఉంటారు” విరక్తిగా అందావిడ.

“అదికాదు అక్కయ్యగారు! మీరలా బాధపడకండి. నా పరిస్థితిని కూడా మీరు కొంచెం అర్థం చేసుకోవాలి. ఎందుకంటే పల్లెలో పొలం పనులన్నీ అలాగే నిలిచిపోయాయి. సమయానికి సారథి కూడా ఊళ్ళో లేడు. అన్ని విషయాలు స్వయంగా తానే చూసుకునేవాడు... కాబట్టి వెళ్ళాలి. రఘురాంతో కూడా చెప్పానీ విషయం”.

“అబ్బాయి ఏమన్నాడు పిల్లల విషయంలో?”

“మాతో పంపడానికి ఒప్పుకోలేదు. సుమిత్ర లేక పిల్లలు లేక తానీ ఇంట్లో ఒంటరిగా ఉండలేనన్నాడు. వంట మనిషి ఉంది కాబట్టి... పిల్లలు పనులకీ ఓ ఆయాని ఏర్పాటు చేస్తానన్నాడు”.

“అవును వాడిష్టప్రకారమే నడవనీ. అయినా పిల్లలు లేకుండా నేను మాత్రం ఉండగలనా? కాని అబ్బాయ్ ఆయాని ఏర్పాటు చేసే వరకూ సుమ ఇంకొన్నాళ్ళు ఇక్కడే ఉండనీ...” ముసలావిడ అభ్యర్థిస్తున్నట్లుగా అంది.

ఈ విషయంలో వెంకట్రామయ్యగారు ఏం మాట్లాడలేకపోయాడు. ఓ క్షణం ఇప్పటికే సుమ ఇక్కడికి వచ్చి చాలా రోజులైంది. ఇంకా కొన్నాళ్ళు ఉంచాలంటే కాస్త ఆలోచించుకోవాల్సిందే.

అందున ముఖ్యంగా సుమ అభిప్రాయం కూడా కావాలి. అమ్మాయి ఉంటానంటే నాకేం అభ్యంతరం లేదక్కయ్యగారు! ఓవారం పదిరోజులు అయ్యాక మళ్ళీ వచ్చి సుమని తీసికెళతాను''.

వెంకట్రామయ్యగారు అలా అంటుంటే... ముసలావిడ మదిలో ఆలోచనలు మరో విధంగా కదలాడసాగాయి.

సుమిత్ర స్థానంలో సుమ శాశ్వతంగా ఈ ఇంటికోడలుగా ఇక్కడే ఉండిపోతే ఎంతో బాగుండేది. తల్లిప్రేమ కరువైన ఆ పసివాళ్ళకి పినతల్లి దొరికేది. పిల్లలు కూడా ఈ కొద్ది రోజుల్లోనే సుమకి బాగా చేరువైనారు.

సుమ ఈ ఇంటి కోడలుగా... అమ్మో! అది సాధ్యమయ్యే పనేనా?... చిన్నప్పటి నుంచి అనుకున్న దగ్గరి సంబంధం మేనబావ సారథి ఉండగా. రెండో పెళ్ళి వాడికి ముగ్గురు పిల్లలున్న తండ్రికి ఇవ్వమని తానెలా అడుగుతుంది? ఇవ్వడానికి వాళ్ళు ఎలా అంగీకరిస్తారు? ... అందునా ఆ అమ్మాయి ఒప్పుకునేనా? ఊహుఁ. అది కలలో కూడా జరగని పని. చాలా అసంభవమైంది. అయినా ఏదో ఆశ!... ఆవిడ మనస్సులో పీకుతూనే ఉంది. కాని పైకి అనడానికి మాత్రం ధైర్యం లేదు.

వెంకట్రామయ్యగారు అక్కడి నుంచి ఎప్పుడు లేచి వెళ్ళారో కాని... ఆ ఆలోచనలలో మునిగిపోతున్న ముసలావిడ గమనించనే లేదు.

✧ ✧ ✧

''ఊహుఁ, మీరు ఎన్నైనా చెప్పండి. నేనిక ఇక్కడ ఉండలేను నాన్నగారు!...''

''అది కాదు తల్లీ! కాస్త నా మాట విను...''

''లేదు నాన్నగారు! నేను మీతోపాటే వస్తాను పల్లెకి'' సుమ ఖచ్చితంగా అంటోంది.

వెంకట్రామయ్యగారు నిస్సహాయంగా ఈసారి అక్కడ ఉన్న భార్యవైపు చూస్తూ ''నీవైనా చెప్పవేమిటే అమ్మాయికి'' కొంచెం కోపంగా అన్నాడీమారు.

''ఇంకా ఇక్కడే ఉండడం తనకిష్టం లేదట. నేను చెప్పితే మాత్రం వింటుందేమిటి?''

''ఈ పరిస్థితుల్లో అమ్మాయికి ఎలాగో నచ్చజెప్పాల్సింది పోయి నీవూ అలాగే మాట్లాడుతావేం సుశీలా? సుమిత్ర పోగానే పిల్లలూ అల్లుడూ మనకప్పుడే పరాయి

వారైపోయారా? ఆ రక్తసంబంధం... మమతానురాగాలు, ప్రేమాభిమానాలు ఎక్కడికీ పోలేవు. ఏదో పాపం... పెద్దమనిషి ముసలావిడ సుమని ఇంకొద్దిరోజులు ఇక్కడే ఉండమని నోరు తెరిచి అడిగింది. కాదని తిరస్కరించడం భావ్యం కాదు. ప్రస్తుతం ఎలాగో సారథి ఊళ్ళోలేడుకదా! అతను వచ్చేంతవరకూ సుమ ఇక్కడే ఉండనీ. రఘురాం ఆయాని కుదుర్చుకోగానే ఓ వారం పదిరోజుల్లో మళ్ళీ నేనొచ్చి సుమని తీసుకొస్తాను'' నమ్మకంగా అన్నాడాయన.

''నాతో చెప్తారెందుకు? అమ్మాయితోనే చెప్పండి. అక్కయ్య పిల్లల్ని అదెప్పుడూ పరాయివాళ్ళ పిల్లలుగా చూడలేదు. అనవసరంగా మీరెందుకలా మాట్లాడతారు. పిల్లలంటె సుమకెంత ప్రేమనో! ఎంతిష్టమో?... మీకేం తెలుసు? పిల్లల్ని మనతోపాటు ఊరికి తీసికెళదామని అది ఒకటే పోరు. కాని ఆ మహానుభావుడేమో ఎంత చెప్పినా వినడాయె!...'' అల్లుడి గురించి నిష్ఠూరంగా మాట్లాడుతునే పెద్దకూతుర్ని తల్చుకొని హఠాత్తుగా ఏడవడం మొదలు పెట్టింది సుశీలమ్మ.

తల్లి ఏడ్పు చూస్తుంటే సుమకి కూడా కళ్ళనిండా నీళ్ళు నిండాయి. ఏమనుకుందో ఏమో గాని ''మీ ఇష్ట ప్రకారంగానే అలాగే ఉంటానమ్మా. ఎన్నాళ్లైనా ఇక్కడే ఉండిపోతాను...'' గాద్గదిక స్వరంతో అంటూ గది బయటికి వెళ్ళిపోతున్న కూతురి మాటల్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియక అయోమయావస్థలో పడిపోయాడు వెంకట్రామయ్యగారు.

✧ ✧ ✧

చాలాసేపటినుంచి ఎవరికో ఫోన్ కలుపుతునే ఉంది సుభద్ర.

కాని ఫోన్ కలవడం లేదు ఎంగేజ్ వస్తూంది.

అంతలో బయట 'పోస్ట్' అన్న కేక వినవచ్చింది.

సుభద్ర చేతికి ఓ వీక్లీ ఇచ్చి వెళ్ళిపోయాడు పోస్ట్‌మెన్.

దానిపై అడ్రస్ చూసింది. రవీంద్ర పేరున వచ్చిన 'భూమి' వీక్లీ అది.

''ఏదో కథ ప్రచురించబడింది కాబోలు!...'' అనుకుంటూ లోపలికొచ్చి కుర్చీలో కూర్చొని ఆ కవర్ చించి ఆత్రుతగా పేపర్ తిరగేసింది.

రవీంద్ర పేరుతో 'వాగ్దాన భంగం' అన్న కథ ఉంది.

గబగబా సుభద్ర ఆ కథని చదవడం మొదలు పెట్టింది.

ఒకే విధమైన చక్కటి రూపురేఖలతో చురుకైన బుద్ధికుశలతతో తెల్లటి మేని ఛాయతో బొద్దుగా ముద్దుగా ఉండే తనయ్ వినయ్ ఇద్దరూ కవల పిల్లలు. వాళ్ళు ఆరేళ్ళ వయస్సులో ఉన్నప్పుడు జబ్బుతో బాధపడుతున్న తల్లి తానిక బతకలేనని అనుకుందేమో?

ఒకరోజు పిల్లలిద్దర్ని భర్త చేతుల్లో పెట్టి "ఏమండీ! నేను వెళ్ళిపోయేలోగా మీరు నాకో మాట ఇవ్వాలి. వీళ్ళిద్దరినీ మీ నుంచి ఎవ్వరూ ఎట్టి పరిస్థితిలోను దూరం చేయడానికి వీల్లేదు. నేను లేని చోటు కూడా వీళ్ళకి తెలియకుండా పెంచి పెద్దజేసి వాళ్ళు కోరుకున్న విద్యాబుద్ధులు చెప్పించాలి..." అంటూ చెయ్యి చాచింది సుశీల.

శ్రీధర్ ఉబికి వచ్చే కన్నీళ్లను బలవంతంగా ఆపుకుంటూ ఏడుస్తున్న పిల్లల్ని దగ్గరికి తీసుకొని 'సరే' అన్నట్లుగా భార్య చేతిలో చెయ్యి వేసి వాగ్దానం చేశాడు.

ఆ మరుసటిరోజు తెల్లారు జామున సుశీల నిశ్చితంగా కన్నుమూసింది.

తమ తల్లి తండ్రి దగ్గరినుంచి తీసుకున్న ఆ వాగ్దానానికి అర్థం ఆ పిల్లలు తమకు తెలిసీ తెలియని పసి జ్ఞానంతో మరోలా ఊహించుకొని దాన్నే మనసులో భద్రపర్చుకున్నారు. తండ్రిని మళ్ళీ పెళ్ళి చేసుకొని పిల్లలకి దూరం కావద్దన్నట్లుగా తమ కోసం, తమ సుఖం కోసం తండ్రి నుంచి వరంలాంటి వాగ్దానం తీసుకున్నదని పిల్లలెప్పుడూ అనుకునేవారు.

ఎప్పుడూ బిజినెస్ పనులతో తీరిక లేకుండా ఉండే శ్రీధర్ భార్యాబిడ్డలతో గడిపే సమయం చాలా తక్కువే. ఎక్కువగా పిల్లలిద్దరికీ తల్లి దగ్గరే చనువు ఎక్కువ. ఎక్కడికైనా బయటికి వెళ్ళాలంటే పిల్లల్ని కడిగిన ముత్యాల్లా తయారు చేసేది. నీట్‌గా డ్రెస్సెస్ వేసేది. పండుగలకు పుట్టిన రోజులకు ఎప్పుడూ ఇద్దరికీ ఒకేలాంటి ఖరీదైన దుస్తులు, వస్తువులు కొనేది. వాళ్ళని ఎంతో అపురూపంగా పెంచింది. అలాంటి పిల్లలకీనాడు కన్నతల్లి ప్రేమ కరువైంది. తల్లి లేని లోటు... ఆ కొరత కొట్టొచ్చినట్లుగా అగుపిస్తొంది. అన్ని విషయాలలో వంటతను నాయర్ పెట్టే అన్నం తింటూ ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ... తండ్రి బిజినెస్ పనుల్లో పై ఊళ్ళకెళ్ళినప్పుడు తల్లిని తల్చుకొని దుఃఖిస్తూ అంతింట్లో బిక్కు బిక్కుమంటూ ఒంటరిగా గడిపేవారు.

ఓ ఆరు నెలలు గడిచాయి.

ఓ రోజు వాళ్ళ ఊహలకి విరుద్ధంగా తల్లికిచ్చిన మాటకి భంగం కలిగేలా తండ్రి కస్తూరిని గుళ్ళో పెళ్ళిచేసుకొని ఇంటికి తీసుక రావడం పిల్లలు సహించ లేకపోయారు. సవతి తల్లి పెట్టే బాధలు, కష్టాలు భరించే నానిగాడు ప్రతిరోజూ క్లాసులో తమతో చెప్తూ ఏడ్చేవాడు. అవన్నీ ఒక్కసారిగా గుర్తొచ్చి ఇద్దరు ఒకర్ని ఒకరు వాటేసుకొని తల్లి ఫోటో ముందు నిలబడి భోరుమని విలపించసాగారు.

అందరి సవతితల్లులలాంటిది కాదు కస్తూరి.

మంచి మనసున్న మగువ!...

పిల్లలిద్దర్నీ ఎంతో ప్రేమానురాగాలతో చూసేది; నవ్వుతూ మాట్లాడేది. వాళ్ళకి ఎక్కువగా ఏమిష్టమో అడిగి తెలుసుకొని నాయర్‌తో చెప్పి వండించేది. ఏ చిన్న పని కూడా వాళ్ళకు చెప్పేది కాదు.

తమ పిన్ని నానిగానిలాంటి గయ్యాళి పిన్ని కానందుకు తనయ్ వినయ్ ఒకందుకు సంతోష పడ్డారు. వాళ్ళ మనసులు కాస్త కుదుటపడ్డాయి.

వాళ్ళిద్దరికి చేరువ కావాలని కస్తూరి ఎంతగానో ప్రయత్నించి విఫలురాలైంది.

తనయ్ వినయ్ పిన్నిని ఆమడదూరంలో ఉంచేవారు. వాళ్ళపనులు వాళ్ళు చేసుకుంటూ చక్కగా స్కూల్‌కి వెళ్తూ ఒకరితో ఒకరు పోటీ పడుతూ బుద్ధిగా చదువుకొనేవారు. ఫస్ట్ సెకండ్ ర్యాంకుల్లో వచ్చేవారు.

మొదటి నుంచైనా అంతంత మాత్రంగానే తండ్రికి చేరువగా ఉండే పిల్లలు. తండ్రి తల్లికిచ్చిన మాట తప్పి పిన్నిని తెచ్చినందుకు ఉన్న ఆ కాస్త ప్రేమ వాళ్ళలో తుడిచి పెట్టుకపోయింది. ఓ రకమైన కసి కోపం మనస్సంతా నింపుకున్నారు. కాని బిజినెస్ పనుల్లో బిజీగా తీరిక లేకుండా ఉండే శ్రీధర్ ఇవేం గమనించేవాడు కాడు. ఓ తండ్రిగా తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ వాళ్ళకేం లోటు లేకుండా చూసుకునేవాడు.

పెళ్లైన ఏడాదికి కస్తూరికి ఓ పాప జన్మించింది.

తమ తల్లిపేరు సుశీల అని ఆ అమ్మాయికి తండ్రి పెట్టడం వినయ్ తనయ్‌లకి బొత్తిగా ఇష్టం లేకపోయింది.

అన్నయ్యలైన వినయ్ తనయ్‌లు చెల్లెల్ని ఏనాడు వాళ్ళు ఎత్తుకోలేదు సరిగదా... కనీసం ఏడుస్తుంటే దగ్గరికి వచ్చి ఆడించేవారు కూడా కాదు. ఎవరో పరాయి పిల్లలాగా దూరంనుంచే చూసేవారే గాని, చెంతకు కూడా వెళ్ళేవారు

కారు. ఆ దృశ్యం చూసినప్పుడు కన్నతల్లి కస్తూరి మనస్సెంతో బాధతో తల్లడిల్లేది. కాని, ఏ చిన్న విషయమైనా వాళ్ళ గురించి చెడుగా భర్తకు చెప్పేది కాదు. అన్నీ తనలోనే దాచుకునేది.

చూస్తూండగానే కాలచక్రంలో కొన్ని సంవత్సరాలు ఇట్టే తిరిగిపోయాయి.

✧ ✧ ✧

మాంచి ఒడ్డు పొడువులతో పెద్దవారైన వినయ్ డాక్టరైనాడు. తనయ్ ఇంజనీర్ అయ్యాడు. తనకెంత కష్టమైనా కొడుకులిద్దర్ని వాళ్ళు చదువుతామన్న వాళ్ళు ఇష్టపడిన గొప్ప చదువులే చదివించాడు శ్రీధర్.

తనతోపాటు మెడిసిన్ చేసిన శశిని ప్రేమించిన వినయ్ ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకొని పై చదువులకి లండన్ వెళ్ళిపోయాడు.

ఇంజనీర్ చేసిన షీలని రిజిష్టర్ మ్యారేజ్ చేసుకొన్న తనయ్ అమెరికాకు వెళ్ళిపోయాడు.

రెక్కలొచ్చిన పక్షుల్లా గూటినుంచి ఎగిరిపోయిన కొడుకుల్ని మళ్ళీ చూస్తానో చూడనో అన్న అనుమానం శ్రీధర్ మనస్సులో కదలాడింది.

విదేశాల్లో సెటిల్ అయినవాళ్ళు బాగా సంపాదిస్తున్నారని కూడా వినికిడి. వెళ్ళినప్పటినుంచి ఓ ఉత్తరం రెండు ఫోన్ కాల్స్ తప్పించి మరే ఇతర విషయాలూ తెలియవు.

ఈ రెండు మూడేళ్ళలో ఇక్కడ శ్రీధర్ పరిస్థితి మాత్రం ఆర్థికంగా బాగా దిగజారిపోయి అధ్వాన్నంగా తయారయింది. బిజినెస్‌లో పోటీతనం ఎక్కువైంది. అనుకోని ఎదురు దెబ్బలు! ఎన్నో కష్టాలు! మరెన్నో నష్టాలు!... అప్పులు!... ఇవి మాత్రం మిగిలాయి. ఆర్థికస్థోమత లేకపోయేసరికి వయస్సు పైబడుతున్న శ్రీధర్ వీటన్నింటినీ, ఆ టెన్షన్‌కు తట్టుకోలేకపోయాడు. దానికి తోడు సుశీల పెళ్ళికెదిగి రెడీగా ఉంది. ఈ కష్ట సమయంలో వినయ్ తనయ్‌లకి ఫోన్ చేసి ఏమన్నా సహాయం చేయమని భర్తనడగమంది కస్తూరి. శ్రీధర్ మాత్రం అందుకు అంగీకరించ లేదు. చేసేదేమీ లేక ఇక ఊర్కొందామె. తమతో పూర్తిగా సంబంధ బాంధవ్యాలనే తెంపేసుకున్నట్లుగా ఉన్న కొడుకులను అర్థించడానికి మనస్కరించలేదాయనకు.

ఇల్లు గడవడం కష్టమైంది. ఒంటిమీదున్న కాస్త బంగారాన్ని అమ్మేస్తూ ఆ డబ్బుతో సంసారం నెట్టుకొస్తోంది కస్తూరి.

అనుక్షణం దిగుళ్ళతో బాధలతో ఆలోచనలతో మానసిక ఆందోళనతో శ్రీధర్ ఆరోగ్యం పూర్తిగా పాడైంది. బిపి.... షుగర్ ఎక్కువైనాయి. హాస్పిటల్లో అడ్మిట్ చేశారు. టెస్ట్‌లు కూడా చేశారు. గుండెలో కుడివైపు రెండు వాల్స్ పూర్తిగా మూసుకపోయాయని ఆపరేషన్ చేయాలని చెప్పారు డాక్టర్లు.

ఏం చేయాలో తోచలేదు కస్తూరికి, సుశీలకి. చేతిలో డబ్బులేదు. ఆ కష్ట కాలంలో ఆదుకునేవారే కనిపించలేదు. ఆరోగ్యం కొంచెం మెరుగైనాక శ్రీధర్‌ను ఇంటికి తీసుకొచ్చారు. ఉన్న ఇంటిని ఓ మార్వాడీ దగ్గర తాకట్టు పెట్టి, ఆ డబ్బుతో భర్తకు ఆపరేషన్ చేయించాలని తల్లీ కూతుళ్ళు శ్రీధర్‌కు తెలియకుండా రహస్యంగా మంతనాలు జరుపుతున్నారు. ఆయనకి తెలిస్తే ఉన్న ఇంటిని కూడా తాకట్టు పెట్టనీయడని వాళ్ళకి తెలుసు.

ఒకరోజు సుశీల ఉన్నట్టుండి తల్లిని అడిగింది. "మనమన్నా... నాన్నన్నా... అన్నయ్యలిద్దరికీ ఎందుకమ్మా అంతకోపం?"

"ఏమో? నాకా సంగతులేవీ తెలీదు. ఆ తండ్రీకొడుకులకే తెలియాలి" కస్తూరి ముభావంగా జవాబిచ్చింది. అదే విషయం తండ్రిని కూడా అడిగింది.

కూతురు ప్రశ్నకు సమాధానంగా చిన్నగా నవ్వాడాయన. మౌనంగా ఉండి పోయి... దీర్ఘంగా ఓ నిట్టూర్పు విడిచాడే తప్ప నోరు విప్పలేదు.

కూతురి మాటలతో శ్రీధర్ ఆలోచనలు ఒక్కసారిగా గతంలోకెళ్ళాయి. భార్య, తనయ్, వినయ్ గుర్తొచ్చారు. కళ్ళనిండా నీళ్ళు ఉబికాయి.

టేబుల్ మీదున్న కాగితం పెన్ను అందుకొని ఏదో తీవ్రంగా రాయడం మొదలు పెట్టాడు.

✧ ✧ ✧

నేను సుశీల ప్రేమించి పెళ్ళి చేసుకున్నాం. ఇరువైపులా ఎవ్వరి సమ్మతి లేకుండా మా పెళ్ళి గుళ్ళో చాలా నిరాడంబరంగా జరిగింది... కావలసిన వాళ్ళంతా దూరమైనారు. మేము కూడా మా ఉనికే ఎవ్వరీ తెలియనంత దూరం వచ్చేశాం. మొదట్లో ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అయినా కూడా మేం ఏ మాత్రం బెదరలేదు. నేనూ సుశీల ఒకరికి ఒకరన్నట్లుగా తోడు నీడగా ఉంటూ అన్యోన్యంగా ఉన్నాం. కొద్ది పాటి బ్యాంక్ లోన్ సంపాదించి చిన్న బిజినెస్

ప్రారంభించాను. అదే మాకు జీవనాధారం అయింది. సుశీల నేను అహర్నిశలూ కష్టపడి పనిచేయడం వలన... అదే రెండేళ్ళలో అంతకంతకు ఎదుగుతూ మంచి లాభాల బాటలో పయనించసాగింది.

మంచి ఇండిపెండెంట్ హౌస్, అన్ని ఆధునిక సదుపాయాలు కలిగాయి. సంఘంలో హోదా, అంతస్తు పెరిగాయి. జీవితంలో దేనికీ లోటు లేనట్లుగా అనిపించింది. కాని, సుశీలకి ఒకటే చాలా కొరతగా ఉండేది. తనకింకా పిల్లలు కలుగనందుకు, తనపోరు పడలేక ఓ రోజు ఇద్దరం కలిసి తెలిసిన డాక్టర్ దగ్గరికి చెకప్‌కి వెళ్ళాం. అన్ని టెస్టులూ జరిగాయి.

సుశీలకు ఈ జన్మలో పిల్లలు పుట్టే అవకాశమే లేదన్నారు డాక్టర్లు.

ఇది వింటే సుశీల తట్టుకోలేదనీ, బాధతో ఎంతగానో కుమిలిపోతుందని నాకు తెలుసు. కాబట్టి డాక్టర్ సాయంతో ఆ విషయాన్ని ఆమె వద్ద దాచాను. పిల్లలు పుడ్తారనీ, మందులు వాడమన్నారనీ సర్దిచెప్పి మభ్యపెట్టాను. పాపం, సుశీల నామాటల్ని బాగానే నమ్మింది.

మా కారు డ్రైవర్ పేరు రహీం, చాలా మంచివాడు, నెలకు మూడు వేల జీతం ఇచ్చేవాడిని. పేరుకు డ్రైవరే అయినా ఇంట్లో మాత్రం సుశీలతో చాలా కలుపుగోలుగా ఉండేవాడు. ఇంట్లోకి కావలసిన సరుకులు... కూరలు కూడా తెస్తుండేవాడు. ఏ పని చెప్పినా కాదనేవాడు కాడు.

ఓ నెలలో రహీం నాలుగు రోజులు సెలవు తీసుకొని వాళ్ళ ఊరెళ్ళాడు. నాతో గాని సుశీలతోగాని చెప్పాపెట్టకుండా తాను మనసిచ్చిన లంబాడీ అమ్మాయి లచ్చిని పెళ్ళిచేసుకొని నేరుగా వెంటబెట్టుకొని మా ఇంటికి తీసుకొచ్చాడు. తనకేదైనా ఆశ్రయం కల్పించమని వేడుకున్నాడు. కలువరేకుల్లాంటి పెద్ద పెద్ద కళ్ళతో, చంద్రబింబం లాంటి గుండ్రటి ముఖంతో ఎర్రటి శరీరచ్ఛాయతో కాస్త పొట్టిగా ఒత్తైన నల్లటి పొడవాటి జుత్తుతో చాలా చిన్న వయస్కురాలైన ఆ అమ్మాయి ఎంతో అందంగా బొద్దుగా రహీంకు తగిన జోడిగా ఉందనిపించింది.

నా అనుమతితో సుశీల వెంటనే ఇంటి వెనకాల ఉన్న అవుట్‌హౌస్‌లో వాళ్ళు కాపురం ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చకచకా చేసేసింది.

ఆ అవుట్ హౌస్‌లో వాళ్ళిద్దరూ హాయిగా అన్యోన్యంగా కాపురం చేస్తుండేవారు.

సుశీల సాంగత్యం వలన లచ్చి కట్టుబొట్టుతోపాటు మాటతీరులో కూడా మంచి చెప్పుకోతగ్గ మార్పు వచ్చింది. లచ్చి ఇంట్లో సుశీలకు అన్ని పనుల్లో సాయంగా ఉండేది. తీరిక దొరికినప్పుడు చదువు కూడా నేర్చుకునేది.

లచ్చి రహీంలతో కలిసి వాళ్ళిద్దరి సహాయంతో సుశీల ఇంటిముందు తన అభిరుచికి అనుగుణంగా చక్కటి గార్డెన్ తయారు చేసింది. బంతి, చామంతి, కనకాంబరాలు, సన్నజాజి, మల్లె మొదలైన రకరకాల పూలమొక్కలు రహీంతో తెప్పించి నాటించింది. రంగు రంగుల పూల సోయగాలతో... అరుదైన పెద్ద పెద్ద గులాబీలతో కళకళలాడుతుండేది మా ఇంటిముందున్న పూలతోట.

రోజూ పైప్‌తో అన్ని మొక్కలకు, నీళ్ళు పట్టేపని లచ్చే చేసేది.

సంవత్సరం తిరిగేసరికల్లా లచ్చి నెల తప్పింది. ఆ కడుపేదో తనకే వచ్చినట్లుగా తెగ సంబరపడిపోయింది పిచ్చి సుశీల. మా ఫ్యామిలీ డాక్టర్ దగ్గరికి నెలనెలా చెకప్‌కి తీసికెళ్ళేది. వేళకు తిండి తినడం దగ్గరినుంచి మందులు వేసుకోవడం వరకు అన్ని విషయాలలో లచ్చిని తన స్వంత తోబుట్టువులాగా ఆదరిస్తూ ఆప్యాయంగా ఎంతో జాగ్రత్తగా చూసుకునేది.

రహీంతో చెప్పి పాలు పండ్లు బాగా తెప్పించి తినమనేది. బరువైన పనులేవీ చెప్పేది కాదు. ఏ చిన్న పని చేసినా... నాల్గు అడుగులేసినా లచ్చికి విపరీతమైన ఆయాసం వచ్చేది. దానికి తోడు కడుపు చాలా పెద్దగా ఉండేది. అది గమనించిన సుశీల హాస్పిటల్‌కి తీసికెళ్ళి లచ్చికి స్కానింగ్ చేయించింది. కవల పిల్లలని తేలింది. తీసుకోవలిసిన జాగ్రత్తలు ఎన్నో చెప్పారు డాక్టర్స్.

"మీ ఋణం మేమెప్పటికీ తీర్చుకోలేమనీ, ధర్మదేవతలనీ" వాళ్ళిద్దరూ నన్ను సుశీలను తెగ పొగడేవారు.

ఆ రోజు నేను బిజినెస్ పని మీద కార్లో బెంగుళూర్ బయలుదేరుతున్నాను.

ఈ మారు రహీంను నా వెంట రావద్దన్నాను.

వేరే డ్రైవర్‌ను కూడా మాట్లాడాను.

లచ్చికి నెలలు నిండాయి కాబట్టి, తనకి తోడుగా ఇంటిదగ్గరే ఉండమన్నాను. కాని వాడు నేనెంత చెప్పినా వినలేదు.

"ఫర్వాలేదుసార్! ఈ ఒక్కసారి మీతో వస్తాను. అమ్మగారు లచ్చిని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు" అంటూ నేను వద్దన్నా బలవంతంగా బయలుదేరాడు.

విధిరాతను ఎవరు తప్పించుకోలేరంటారు ఇదేనేమో?

బెంగుళూర్‌లో నా కారుకు యాక్సిడెంట్ అయింది.

రహీం సరిగ్గానే డ్రైవ్‌చేస్తున్నాడు. ఎదురుగా వచ్చే లారీయే రాంగ్‌సైడ్‌లో రావడం వలన ఆ ఘోరప్రమాదం అనుకోకుండా క్షణంలో జరిగిపోయింది.

వెనుక సీట్లో కూర్చున్న నేను మాత్రం చిన్న చిన్న దెబ్బలతో బతికి బయట పడ్డాను. కాని, పాపం రహీంకు విపరీతమైన దెబ్బలు తగిలి చాలా రక్తం కోల్పోయి స్పృహలేని స్థితిలో హాస్పిటల్లో చేర్పించాను. వాడు ప్రాణాపాయస్థితిలో ఉన్నాడు. రహీంను బతికించడానికి ఎంత డబ్బైనా నేను ఖర్చుపెడ్తానని డాక్టర్లను బతిమాలాను; వేడుకున్నాను; ఏడ్చాను. కాని డాక్టర్లు రహీం బతకడం కష్టమనీ... అయినా తమ శాయశక్తులా కృషి చేస్తామన్నారు.

ఆ విషమ పరిస్థితిలో నాకేం చేయాలో పాలుపోలేదు. నెలలు నిండిన లచ్చికి ఈ దారుణవార్త చెప్పడం ఏ మాత్రం మంచిది కాదనిపించింది.

సుశీలకు మాత్రం ఫోన్ చేసి అంతా చెప్పి, లచ్చికి ఎట్టి పరిస్థితిలోను ఈ విషయం తెలియకూడదనీ మరి మరీ చెప్పాను. రెండో రోజు ఉదయం స్పృహలోకి రాకుండానే రహీం కన్నుమూశాడు. చిన్నపిల్లాడిలా భోరుమని విలపించాడు.

సుశీల సలహాతో రహీంకు అక్కడ వాళ్ళ మతానుసారంగా అంత్యక్రియలు జరిపించాను. కొండంత దుఃఖాన్ని గుండెల నిండా మోసుకొని ఇంటికొచ్చి సుశీలను వాటేసుకొని బావురుమన్నాను.

అదే రోజు ఉదయం లచ్చికి సీరియస్‌గా ఉంటే హాస్పిటల్లో అడ్మిట్ చేసిందట సుశీల. మా ఇద్దరి దుఃఖం వర్ణనాతీతం. లచ్చికి డెలివరీ అయ్యాక నెమ్మదిగా చెప్పాలని ఓ కట్టుకథ అల్లాం. 'అర్జంటు పనిమీద రహీంను మరో ఊరు పంపాననీ, ఓ నాలుగు రోజుల్లో తిరిగి వస్తాడనీ' నేనూ సుశీల లచ్చికి బాగా నమ్మకం కల్గేలా చెప్పాం. పాపం, ఆ అమాయకురాలు నిజంగానే నమ్మింది.

కాన్పు కష్టమైంది. ఆ రోజురాత్రే లచ్చికి ఆపరేషన్ చేశారు. ఇద్దరు పండంటి మగ బిడ్డల్ని బతికించగలిగారు గాని... లచ్చి ప్రాణాన్ని మాత్రం డాక్టర్లు కాపాడలేక పోయారు.

భర్త మరణ వార్త తెలియకుండానే లచ్చి కూడా ఈ లోకంనుంచి వెళ్ళిపోయే సరికి మేమిద్దరం నిజంగా పిచ్చివాళ్ళమే అయ్యాం.

భగవంతుడు ఎంతో నిర్దయుడని అనిపించిందా క్షణంలో.

కన్నతల్లిదండ్రుల హఠాత్తు మరణాలతో తమకేం నిమిత్తం లేదన్నట్లుగా బోసి నవ్వుల్ని చిందిస్తున్న ఆ పసివాళ్ళని చెరొకర్ని పొత్తిళ్లలో ఎత్తుకొని ఇంటికి వచ్చాం.

ఇద్దరి ఆలన పాలన చూడ్డం అలవాటులేని సుశీలకు కొంచెం కష్టమైంది. ఒక ఆయాను ఏర్పాటు చేశాను కొన్నాళ్ళపాటు.

తల్లీ తండ్రీ లేరన్న లోటే లేకుండా ఎంతో ప్రేమానురాగాలతో అపేక్షగా చూసుకునేది ఆ ఇద్దరి పసివాళ్లను. తనకు పిల్లలు లేరన్న సంగతే మర్చిపోయింది సుశీల. తన రాజాలాంటి కొడుకులకు... కోడళ్ళను కూడా కవలలనే తెచ్చుకుంటానని అప్పుడప్పుడు నవ్వుతూ నాతో అనేది. పాపం. ఆ కోరిక తీర్చుకోకుండానే తానూ వెళ్ళిపోయింది.

✧ ✧ ✧

ఇదీ వినయ్ మీ జన్మరహస్యం. కస్తూరికి కూడా తెలియదు. మీ అమ్మ చనిపోయేముందు నాతో మాట తీసుకొన్నది ఈ విషయంలోనే. 'మిమ్మల్ని ఎట్టి పరిస్థితిలోను అనాథలను చేయవద్దనీ... మీ జన్మరహస్యం ఎవరికీ చెప్పవద్దనీ'. చివరికిప్పుడిలా మీ కెందుకు చెప్పాల్సి వచ్చిందంటే నా ఆరోగ్యం బాగాలేదు. బిజినెస్ కూడా లేదు. నిన్నూ తనయ్‌ని ఒక్కసారి చూడాలనిపిస్తోంది.

కస్తూరిని నేను అనుకోని పరిస్థితిలో తప్పనిసరిగా పెళ్ళి చేసుకోవాల్సి వచ్చింది. అదే మీ పట్ల నేను చేసిన మొదటి తప్పు చివరి తప్పు కూడాను. కాని ఆమె ఎప్పుడూ మిమ్మల్ని తన పిల్లలుగానే భావించింది. తనయ్‌కి కూడా ఇదే ఉత్తరాన్ని పంపిస్తున్నాను. పిన్నిగా కస్తూరి బాగోగులను, సుశీల పెళ్ళి బాధ్యతను కూడా ఇక మీరే పెద్దమనస్సుతో స్వీకరించాలని అర్థిస్తున్నాను. ప్లీజ్, వినయ్! ఒకసారి వచ్చి నన్ను చూసి వెళ్ళరా?... ' అంటూ రాసిన ఆ కథలాంటి ఉత్తరాన్ని చదివిన వినయ్ కళ్ళలో నుంచి అశ్రువులు ధారగా కురుస్తున్నాయి.

ఇంత మంచి నాన్ననా మేం తప్పుగా అర్థం చేసుకుంది? తండ్రి ముస్లిం తల్లి గిరిజన జాతికి చెందిన లంబాడీ స్త్రీ. వాళ్ళిద్దరికీ పుట్టి అనాథలమైన మమ్మల్ని కులమతాలకు అతీతంగా స్వంత బిడ్డల్లాగ పెంచి పోషించి... కోరుకున్న విద్యా బుద్ధులు చెప్పించి... ఈనాడిలా విదేశాల్లో ఉన్నత స్థితిలో ఉండే విధంగా ఆ అర్హతను కల్పించిన దేవుళ్ళు అమ్మా నాన్నలు! అయ్యో!.... ఉన్న నాన్నను కూడా సరిగా అర్థం చేసుకోలేక పోయామే?... ' అనుకుంటూ రోదిస్తున్న వినయ్‌కీ, అమెరికాలో ఉంటున్న తనయ్ నుంచి ఫోన్ వచ్చింది.

తండ్రి రాసిన ఉత్తరం గురించే మాట్లాడుకొని ఇద్దరు తెగ దుఃఖించారు. "మనం వెంటనే ఇండియా వెళ్ళాలి వినయ్! డాడీని దక్కించుకోవాలి. నీ టికెట్ కన్‌ఫమ్ అయ్యాక నాకు ఫోన్ చేయి" అని చెప్పాడు.

అలా ఒకరికొకరు ఫోన్ చేసుకుంటూ లండన్ నుంచి వచ్చిన వినయ్, అమెరికా నుంచి వచ్చిన తనయ్ ఇద్దరూ బొంబాయిలో కలుసుకున్నారు.

అక్కడి నుంచి ఆఘమేఘాలపై హైద్రాబాద్ చేరుకున్నారు.

అంతకు ముందురోజు రాత్రే శ్రీధర్‌కు హార్ట్ ఎటాక్ రావడం వలన కేర్ హాస్పిటల్లో చేర్పించారు. తల్లీ కూతుళ్ళు. అబ్జర్వేషన్‌లో పన్నెండు గంటలు గడవక ముందే మరో మారు తీవ్రమైన స్ట్రోక్ వచ్చి... కొడుకులను కన్నులారా చూడకుండానే ఆయన గుండె హఠాత్తుగా ఆగిపోయింది.

ఆ వార్త తెలిసిన వినయ్ తనయ్ తండ్రి శవంపై పడి భోరున విలపించారు.

✧ ✧ ✧

ఆ కథ పూర్తిగా చదివాక సుభద్ర కళ్ళు చెమ్మగిల్లాయి.

రవీంద్ర ఆ కథని బాగానే రాశాడనిపించింది. ఆ వీక్లీని రవీంద్ర రూంలో టేబుల్ మీదుంచి... వంటింట్లోకెళ్ళి వంట ప్రయత్నాలు మొదలు పెట్టింది.

వాకిట్లో ఏదో ఆటో ఆగిన శబ్దానికి ఎవరో వచ్చారనుకొని, తరుగుతున్న కూరగాయల్ని అట్లాగే వదిలేసి మళ్ళీ ఇవతలికొచ్చిందామె.

ఆటో దిగి సూట్‌కేస్ చేతబట్టుకొని వరండా మెట్లెక్కి వస్తూ రవీంద్ర అగుపించాడు.

"ఎక్కడి నుండి రావడం?" పలుకరింపుగా నవ్వింది సుభద్ర.

"పల్లె నుంచే వస్తున్నాను వదినా!" లోపలికొచ్చి చెప్పులు వదిలి సూట్‌కేస్ గోడవారగా పెట్టి అలసటగా కుర్చీలో కూలబడ్డాడతను.

"ఇందాకనే పల్లెకి చాలాసార్లు ఫోన్ చేశాను... మీ ఇంటికి రింగ్ అవుతుంది గానీ ఎవరూ ఎత్తడం లేదు".

"పిన్ని, అమ్మ ఏ గుడికో వెళ్ళి ఉంటారు... ఇంట్లో ఫోన్ ఎత్తడానికి ఎవరుం టారు వదినా?"

"అమ్మా నాన్నా వచ్చారా అక్కడికి?" ఈసారి ఆత్రుతగా అడిగింది.

‘‘రాలేదొదినా! అమ్మ, రుక్మిణి పిన్నీ రోజూ అత్తయ్య మామయ్యల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు; ఇంత వరకూ రాలేదెందుకో అని’’.

‘‘ఏమో మరి. ఎందుకు రాలేదో? పల్లెకి వెళ్ళేటప్పుడు అమ్మా నాన్న ఇక్కడికి వచ్చే వెళతామన్నారు. అక్కడ పరిస్థితులు ఎట్లా ఉన్నాయో?...’’ బాధగా నిట్టూర్చింది.

‘‘పిల్లల్ని ఊరికి తీసుకవచ్చే విషయంలో ఆలస్యం జరిగి ఉండవచ్చునని అమ్మ పిన్ని అనుకుంటున్నారక్కడ...’’ రవీంద్ర ఆ మాట కూడా చెప్పాడు.

‘‘బావ పిల్లల్ని పల్లెకి పంపిస్తాడని నేను అనుకోవడం లేదు. అవునూ, సారథి తిరిగొచ్చాడా?’’

‘‘ఊహుఁ, కనీసం ఫోన్ గాని... లెటర్‌గాని ఏమీ లేనందుకు అమ్మ చాలా బాధ పడుతోంది. ఎక్కడున్నాడో ఏమో?... ఇక్కడి నుంచి వెళ్ళాక అస్సలు సారథినుంచి లెటర్‌గాని, ఫోన్‌గాని రాలేదా?’’

‘‘వెళ్ళిన వెంటనే క్షేమంగా చేరినట్లుగా లెటర్ రాశాడట. ఫోన్ కూడా చేశాడట. ఆ తరువాతనే అన్నయ్య నుంచి ఏ సమాధానం లేదని అమ్మ కంగారుపడు తోంది...’’ అంటూ సూట్‌కేస్ తెరిచి టవల్ బయటకి తీశాడు రవీంద్ర.

‘‘నీ వెళ్ళి త్వరగా స్నానం చేసిరా రవీ! నేనీలోగా ఏదైనా టిఫిన్ చేస్తాను’’.

‘‘టిఫిన్ అక్కరలేదొదినా! ట్రైన్‌లో చేశాను. ఓ కప్పు కాఫీ మాత్రం కలిపివ్వు’’.

‘‘సరే’’ అంటూ వంటింట్లోకి వెళ్ళుతున్నదల్లా ఓ క్షణం ఆగి ‘‘అన్నట్లు నేను చెప్పడం మరిచాను. నీకో శుభవార్త!’’ నవ్వుతూ అంది.

‘‘ఏంటొదినా! నా కథ ఏదైనా తిరిగొచ్చిందా?’’

‘‘శుభవార్త అంటే... కథ తిరిగొచ్చిందా అని అంటావేమిటి? ఆఁ... తిరిగొచ్చింది. భూమి వీక్లీలో అచ్చయి తిరిగొచ్చింది’’.

‘‘నిజమా వదినా?’’

‘‘అయ్యో రామా! అబద్ధాలు చెప్పడం ఇక నీతోనే ప్రారంభించాలి’’.

‘‘నీవు చదివావా?’’

‘‘చదివాను ఇందాకనే, వీక్లీ నీరూంలో పెట్టి వంటింట్లో కెళ్లాను. ఇంతలోనే నీవు వచ్చావు. చాలా బాగుందా కథ...’’ మెచ్చుకోలుగా అంది సుభద్ర.

‘‘థ్యాంక్స్...’’ రవీంద్ర సంతోషంతో వడివడిగా తన గదిలో కెళ్ళి టేబుల్ పైనున్న పత్రికని చేతిలోకి తీసుకొని.... ఎక్కడలేని ఆదుర్దాతో గబగబా విప్పి చూశాడు.

పత్రికలో ప్రచురించబడిన ఆ కథ పేరు తనపేరు ఓసారి సంతృప్తితో చూసుకొన్న తర్వాత అతని మనస్సు ఆనందంతో నిండిపోయింది. మళ్ళీ ఏం కథ మొదలు పెట్టాలా అని ఆలోచిస్తూ బట్టలు మార్చుకొని ఒంటికి టవల్ చుట్టుకొని హుషారుగా ఈలవేస్తూ బాత్‌రూంలోకి వెళ్ళాడు.

వంటింట్లోకెళ్ళిన సుభద్ర స్టవ్ వెలిగించి కాఫీ కలుపుదామని అలమారలో నుంచి పాలగిన్నె తీసి వేడి చేస్తుంటే... వాకిట్లో మళ్ళీ ఏదో ఆటో ఆగిన శబ్దం వినవచ్చింది.

'మళ్ళీ ఎవరొచ్చారబ్బా!' ఆశ్చర్యంగా అనుకుంటూ ఇవతలికి వచ్చింది సుభద్ర.

ఆటో అతనికి డబ్బులిచ్చేసి సూట్‌కేస్ చేతపట్టుకొని వెంకట్రామయ్య గారు, ఓ పెద్ద వైర్ బుట్ట పట్టుకొని ఆయన వెనకాలే నెమ్మదిగా అడుగులేస్తూ సుశీలమ్మ వస్తూ కన్పించారు.

తల్లిదండ్రులను చూడగానే ఆమె ముఖం సంతోషంతో వెలిగిపోయింది.

''మీ గురించే ఇందాకనే అనుకుంటున్నాను నాన్నా! ఇంతలోనే మీరొచ్చారు...'' అంటూ నవ్వుతూ ఎదురెళ్ళి తండ్రిచేతిలో నుంచి సూట్‌కేస్ అందుకొంది.

అందరూ లోపలికొచ్చారు.

సుశీలమ్మ ముందుహాల్లోనే కుర్చీలో ఆయాసంగా కూలబడింది.

''ఇన్ని రోజులక్కడే ఉండి పోయారేమిటమ్మా? సుమని తీసుకురాలేదెందుకనీ?''

''ఏం చేయం తల్లీ... అక్కడ పరిస్థితులు అలా ఉన్నాయి. వెళ్ళి పోతామని అనడానికే తెగ సంకోచించాం. ఇక గత్యంతరం లేక వచ్చేశాం. సుమని ఇంకా కొన్నాళ్ళు అక్కడే ఉండమని ముసలావిడ ఒకటే బతిమాలడం. సుమనేమో అక్కడ ఉండడానికి మొదట ససేమిరా ఒప్పుకోలేదు. తర్వాత మేమే బతిమాలి ఇంకొద్ది రోజులు ఉండడానికి దాన్ని ఒప్పించి... మేమిలా బయలుదేరాం. ఏమిటోనే అమ్మాయి!... ఇంటికి ఇల్లాలు లేకపోయాక ఎన్ని బాధలు?... ఎన్ని కష్టాలు!'' పిల్లల్ని పెద్దకూతుర్ని తల్చుకొని దుఃఖంతో అంటుంది సుశీలమ్మ.

''పల్లె నుంచి ఏమన్నా సమాచారం తెలిసిందామ్మా?'' ఈసారి వెంకట్రామయ్య గారు అడిగాడు.

"ఆс, ఇందాకనే పల్లెనుంచి రవీంద్ర వచ్చాడు నాన్నా! కాలేజీలు తెరిచారు కదా!..."

"ఏదీ ఎక్కడున్నాడు?"

"బాత్‌రూంలో ఉన్నాడు".

"సారథి వచ్చాడటనా?"

"రాలేదట. కనీసం జాబైనా రాయలేదట... ఓ ఫోనైనా చేయలేదట".

"అయ్యో! అదేంటి?"

"ఎక్కడున్నాడో ఏమో? అని అంటున్నాడు. మీరు స్నానాలు చేయండి నాన్నా! నేనీలోగా కాఫీ, టిఫిన్ ఏర్పాటు చేస్తాను... " స్టవ్‌పై పాలగిన్నె ఉంచి రావడం గుర్తొచ్చి గబగబా వంటింట్లోకి పరిగెత్తినట్లుగా వెళ్ళిపోయింది సుభద్ర.

✧ ✧ ✧

"అక్కయ్యా! వంటేం చేయమంటావ్?" స్నానం చేసి మడి కట్టుకొని పెరట్లోకి నూతి దగ్గరి నుంచి నీళ్ళ బిందె తెస్తూ అడిగింది రుక్మిణి.

"ఇప్పటి నుంచి వంట ప్రయత్నం ఎందుకే రుక్మిణీ! మనిద్దరి వంట ఎంతలో అవుతుంది?" పెరట్లోనే మల్లెపందిరి దగ్గర నిల్చుని పూలుకోస్తున్న అన్నపూర్ణమ్మ అంది.

"పెందరాళే వంటపని అయిపోతే నాకెంతో తేలిగ్గా ఉంటుంది. మధ్యాహ్నం పూట ఆ పొయ్యిల ముందు కూర్చోలేను. నిన్నటి టమాటాలు ఉన్నాయి కదా! అవి పప్పులో వేస్తాను. ములక్కాడల పులుసు పెడ్తాను అక్కయ్యా..." కూరల బుట్టలో నుంచి పచ్చి మిరపకాయల్ని టమాటాల్ని కింద గుమ్మరిస్తూ వంటింట్లో నుంచే అంది రుక్మిణి.

"నీ ఇష్టం. అలాగే చేయి".

"అన్నా వదినలు లేనందువల్ల అంత పెద్ద ఇంట్లో ఒక్కత్తి ఉండలేక రుక్మిణి ప్రస్తుతం వాళ్ళక్కగారింట్లోనే ఉంటోంది.

"అమ్మగారూ!..."

బయటినుంచి వినిపించిన ఆ పిలుపుకు "ఎవరూ?" అంటూ ఇవతలి కొచ్చింది రుక్మిణి.

వరండాలో మస్తాన్ నిల్చుని ఉన్నాడు.

"ఏమిటి మస్తాన్, ఇలా వచ్చావ్?"

"పెద్దబాబుగారు... అమ్మగారు వచ్చినారమ్మ!"

"ఆఁ, నిజమా!..." సంతోషంతో రుక్మిణి ముఖం వెలిగిపోయింది.

"అవునమ్మా... తాళాలు అడిగి తెమ్మన్నారు ఇంటివి?"

"అన్నయ్య వదిన ఎప్పుడొచ్చారు?"

"ఇప్పుడేనమ్మా...తొమ్మిదిగంటల బస్సులో దిగారు".

"ఎవరే వచ్చింది రుక్మిణి? ఎవరితో మాట్లాడుతున్నావ్?" అంటూ చేతిలోని పూల సజ్జతో పెరట్లో నుంచి ఇంట్లోకి వచ్చింది అన్నపూర్ణమ్మ.

"ఊరినుంచి అన్నయ్య వాళ్ళు వచ్చారట అక్కయ్య. ఇంటి తాళాల కోసం మస్తాన్ వచ్చాడు.

"అలాగా అన్నావదినే వచ్చారా? సుమ రాలేదా?" ఆత్రుతగా అడిగింది అన్నపూర్ణమ్మ.

"లేదమ్మా. చిన్నమ్మగారు రాలేదు.

"అక్కడ వదిలేసి వచ్చారు కాబోలు" అంటూ రుక్మిణి ఇంటి తాళాలు తెచ్చి ఇచ్చింది.

"స్నానం... పూజా పునస్కారాలు ముగించుకొని అన్నయ్య వాళ్ళని భోజనాలకి ఇక్కడికే రమ్మన్నానని చెప్పు మస్తాన్! అందరికీ రుక్మిణి ఇక్కడే వంట చేస్తుంది" అంది అన్నపూర్ణమ్మ.

"సరే... అలాగే చెప్తాను అమ్మగారూ!" అంటూ మస్తాన్ వెళ్ళిపోయాడు.

"ఏమిటో అన్నయ్య పిచ్చిగాని ఎదిగిన పిల్లని ఇంకా ఎందుకు వాళ్ళింట్లో ఉంచి రావడం, సుమని అక్కడికి పంపించడం, సారథికస్సలు మొదట్లోనే ఇష్టం లేదు..." ముభావంగా అందామె చెల్లెలితో.

"అవునూ, ఎందుకు ఉంచడం. కావాలంటే పిల్లల్ని తీసుకరావలసింది. ముసలావిడకి తోడుగా వంటమనిషి ఉండనే ఉంది కదా!..."

"ఏమో మరి. ఎందుకు ఉంచి వచ్చారో మనకెలా తెలుస్తుంది విషయమేమిటో అంటూ అన్నపూర్ణమ్మ చేతిలోని పువ్వులబుట్ట దేవుడి గదిలో పెట్టి స్నానానికెళ్ళింది.

రుక్మిణి గబగబా వంటకి ఉపక్రమించింది.

✧ ✧ ✧

భోజనాలయ్యాక అందరు తీరుబాటుగా ముందు గదిలో కూర్చొని మాటల కుపక్రమించారు.

వెంకట్రామయ్యగారు మాత్రం గోడవారగా వాల్చి ఉన్న నవారు మంచంపై మేను వాల్చాడు.

వాళ్ళ వాలకం చూస్తుంటే చాలా సేపటినుంచి వాళ్ళందరి మధ్య సంభాషణ జరుగుతోందని తెలుస్తుంది.

"నీవు ఏమైనా అను అన్నయ్యా! సుమని ఇంకా అక్కడే ఉంచి రావడం నాకంతగా ఇష్టం లేదు" అంటున్న పెద్దాడపడుచు వంక చురుగ్గా చూసిందో మారు సుశీలమ్మ.

"అట్లా అంటే ఎలా పూర్ణా! ఈ ఆపద సమయంలో వాళ్ళని ఆదుకోవడానికి మనం కాక ఇంకెవరున్నారు. అక్కడికీ చెప్పాను, పిల్లల్ని మా వెంట తీసికెళ్ళుతామని... అల్లుడు వింటేగా" అంది కాస్త నిష్ఠూరంగా.

"ఈలోగా సారథి వస్తే సుమ ఇంకా అక్కడే ఉంటే ఏమన్నా అనుకుంటాడేమోనని అక్కయ్య ఉద్దేశ్యం కాబోలు!..." వదినగారికి సర్దిచెప్పుతున్నట్లుగా అంది రుక్మిణి.

"సారథి రానీ, రాకపోనీ ఈ వారం రోజుల్లో మళ్ళీ నేనెళ్ళి అమ్మాయిని తీసుక వస్తాను" వెంకట్రామయ్యగారు ఖచ్చితంగా చెప్పాడు.

అంతలోనే మస్తాన్ చేతిలో ఏదో కవర్ పట్టుకొని వచ్చాడు.

"అమ్మగారూ, పోస్ట్‌మన్ నేనిటు వస్తూంటే దారిలో కనిపించి ఈ ఉత్తరం మీకివ్వమన్నాడు" అన్నపూర్ణమ్మని ఉద్దేశించి అన్నాడు.

రుక్మిణి లేచి వెళ్ళి మస్తాన్ దగ్గరనుంచి ఆ లెటర్ తీసుకొని చూసింది.

"ఎవరు రాశారే రుక్మిణీ?" ఆత్రుతగా అడిగింది అన్నపూర్ణమ్మ.

"మన సారథి రాసినట్లున్నాడు అక్కయ్య!

"విప్పి చదువు, ఏం రాశాడో?..."

“అమ్మగారికి...

నమస్సులు!...

చాలా రోజులుగా లెటర్ రాయలేకపోయాను. అక్కడి సంగతులేవీ నాకు తెలియవు. నాన్నగారు ఇక్కడికి దగ్గరిలోనే ద్వారకలోనే ఉండడం వలన నేనిటు గుజరాత్‌లో ఉన్నాను. ప్రస్తుతం నేను నలియాలో ఉంటున్నాను. ఇక్కడ నా ఫ్రెండ్ రెడ్డి అని ఎయిర్‌ఫోర్స్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడని చెప్పాను కదా! అతనింట్లోనే ఉంటున్నాను. ద్వారకకి నేనూ అతను కలిసి రెండు మూడు సార్లు వెళ్ళి వచ్చాం. నాన్నని అక్కడికి తీసుకరావడానికి చాలా ప్రయత్నించి విఫలుణ్ణయ్యాను. ఆయన మనతో కలిసి జీవించడానికి ఇష్టం లేదు; ఆ ఆశే లేదు. మమ్మల్ని పసితనం నుంచీ మామయ్య అత్తయ్య సహాయ సహకారాలతో, పెంచి పెద్దజేసి విద్యాబుద్ధులు చెప్పించడానికి ఎన్నెన్నో బాధల్ని కష్టనష్టాల్ని భరించావు. నాన్న లేడన్న ఆ లోటే లేకుండా పెంచావు. కాని, అమ్మా!... ఈ వయస్సులో నిన్ను సుఖంగా సంతోషంగా ఉంచాలన్న ఉద్దేశ్యంతోనే నాన్నగారి కోసం నా ఈ ఆఖరి ప్రయత్నం చేశాను. కాని ఫలించలేదు. ఇక ఇక్కడ ఉండి ఏం ప్రయోజనం లేదు. వచ్చేస్తున్నాను ఈ చుట్టుప్రక్కల చూడ తగ్గ ప్రదేశాలన్నీ చూశాను. సుమిత్ర వదినకి డెలివరీ అయిందా? సుమ పల్లెకి వచ్చేసిందా? నేను ఇరవైయవ తేదీన ఇక్కడి నుంచి బయలుదేరుతున్నాను. నేను ఏ ట్రైన్‌కు ఎప్పుడు వచ్చేదీ తెలుపుతూ రవీంద్రకు కూడా లెటర్ రాశాను. ఫోన్ కూడా చేస్తున్నాను. పిన్ని, మామయ్య, అత్తయ్య అందరికీ నా నమస్కారాలు చెప్పగలవు. మిగతా విషయాలన్నీ మీ సమక్షంలో.

ఇట్లు

సారథి”

ఆ ఉత్తరం చదవడం ముగిశాక ఓక్షణం అందరూ నిశ్శబ్దంగా ఉండి పోయారు.

చెమ్మగిల్లిన కళ్ళను పైట చెంగుతో ఒత్తుకుంది అన్నపూర్ణమ్మ.

“ఇవాళ ఇరవై రెండక్కయ్యా! సారథి ఇక్కడికి రేపో ఎల్లుండో వచ్చేస్తాడు. వాడు లేనందుకు అస్సలు మన రెండిళ్ళ కళే పోయింది. అయినా ఊళ్ళోని వాళ్ళు కూడా బాబుగారు ఎప్పుడొస్తారు అంటూ రోజూ అడుగుతూనే ఉన్నారు. సారథి రాగానే ఇక వెంటనే ముహూర్తం పెట్టించు అన్నయ్యా!”

అవునన్నట్లుగా ఈసారి వెంకట్రామయ్యగారు మందహాసంతో తల పంకించాడు.

✧ ✧ ✧

ఉగాది పండుగ దగ్గరికి రావడంతో ఇంట్లో సున్నాలు... రంగులు వేస్తూ అటు వెంకట్రామయ్య ఇల్లూ, ఇటూ అన్నపూర్ణమ్మ ఇల్లూ చాలా సందడిగా ఉంది పనివాళ్ళతో.

ఊరునుంచి గౌతమి కూడా వచ్చింది, సారథి వస్తున్నందుకు.

అదే రోజు మధ్యాహ్నం స్కూటర్‌పై రవీంద్ర, ఆనందరావు హఠాత్తుగా పల్లెకి వచ్చారు. నేరుగా మామగారింటికే వెళ్ళారు.

వాడిపోయిన వాళ్ళ ముఖాలలో తాండవిస్తున్న విషాదచ్ఛాయలు చూస్తుంటే జరగరాని ఆపదేదో జరిగినట్లుగా గోచరిస్తుంది.

బయట వాకిట్లోనే వెంకట్రామయ్యగారు ఎదురైనాడు.

అల్లుడి... మేనల్లుడు ఇద్దరు స్కూటర్‌పై హఠాత్తుగా వచ్చిన వారి రాకకు విస్తుబోతూ "ఏమిటి అల్లుడూ! ఎక్కడి నుంచి వస్తున్నారు మీరు? మీ ముఖాలేమిటి అట్లా ఉన్నాయి?" కంగారుగా అడిగాడు.

"మామగారూ! మీరీ వార్త వినలేదా?" దుఃఖస్వరంతో అడిగాడు ఆనందరావు.

"లేదే!... ఏ వార్త? త్వరగా చెప్పు?" భయాందోళనలతో నిలువెల్లా కంపిస్తున్నాడాయన అప్పటికే.

"సారథి వస్తున్న రైలుకి నిన్న బొంబాయి సమీపంలో పెద్ద బాంబు యాక్సిడెంట్ జరిగింది. ఈ మధ్యకాలంలో ఇంత పెద్ద దారుణం జరగ లేదంటున్నారు రైల్వేవాళ్ళు. చాలా మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు..." ఆనందరావు, రవీంద్ర దుఃఖస్వరంతో చెప్పలేక చెప్పలేక చెప్తూ మధ్యలోనే ఆగిపోయారు.

"బాబూ! సారథీ!" అంటూ గొల్లుమని ఏడుస్తూంటే ఇంట్లోని వాళ్ళంతా ఒక్కసారిగా అక్కడికి పరుగెత్తుకొచ్చారు.

✧ ✧ ✧

పిడుగులాంటి ఆ వార్త వినగానే అన్నపూర్ణమ్మ పూర్తిగా పిచ్చిదానిలా అయిపోయింది. కంటికి మింటికి ఏకధాటిగా విలపించడం తప్ప మరో మాటే లేదు. ఎవరికీ ఆమెను ఆపడమే సాధ్యం కావడం లేదు. అందరూ ఆమెను కంటికి రెప్పలా కాపాడుతున్నారు.

ఆ వార్త తెలియగానే గౌతమి భర్తకూడా వచ్చాడు.

సారథి ఎప్పుడు వచ్చేది రవీంద్రకు ఫోన్ చేసి ఏ ట్రైన్‌కు వచ్చేది కూడా తెలుపడం వలన... టి.వీ.లోను, రేడియోలోను ఈ రైలుకు జరిగిన దుర్ఘటన వార్త తెలియగానే ఆనందరావు రవీంద్ర కలిసి హుటాహుటిన టాక్సీలో ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్ళారు.

బాగా శక్తివంతమైన బాంబులు కాబోలు ఆ పేలుడికి రెండు మూడు రైలు డబ్బాలు పూర్తిగా కాలి చెల్లా చెదురుగా పడివున్నై. ఎంతో మంది చనిపోయారు.

ఇది విద్రోహక చర్య అంటూ ప్రభుత్వం పదే పదే చెప్తోంది.

యాక్సిడెంట్ జరిగిన ఆ ప్రదేశమంతా కాళ్ళు చేతులు విరిగి... ఒళ్ళంతా కాలి కొన ప్రాణాలతో ఉన్న వారిని... గాయపడినవారిని హాస్పిటల్స్‌కు అంబులెన్స్ లతో తరలిస్తూ రణరంగంలా ఉంది.

యమలోకం లాంటి ఆ పెద్దహాస్పిటల్లో ముఖం బాగా చితికిపోయి... ఓ కాలు మోకాలి వరకూ విరిగిపోయి మాంసం ముద్దలా పడిఉన్న ఓ శవాన్ని ఒడ్డు పొడువులని బట్టి ఎడమచెయ్యి కున్న చిలకపచ్చరాయితో వున్న ఉంగరాన్ని బట్టి అది సారథిదిగా పోల్చుకోగలిగారు రవీంద్ర ఆనందరావులు.

అతి భయంకరంగా ఉన్న ఆ శవాన్ని ఇంటికి తీసికెళ్ళడానికి మనస్కరించ లేక... అక్కడి వాళ్ళ సహాయ సహకారాలతో దహన సంస్కారాలు కూడా చేసి వట్టి చేతులతో ఇలా పల్లెకు తిరిగొచ్చారు వాళ్ళిద్దరూ.

దేవుడులాంటి మంచి మనసున్న సారథిబాబు తమకిక లేడని తెలుసుకున్న ఆ ఊరి జనమంతా కడసారిగానైన అతన్ని చూసే భాగ్యానికి నోచుకోలేనందుకు ఎంతగానో దుఃఖిస్తున్నారు.

అన్నపూర్ణమ్మని ఓదార్చడానికి జనాలు గుంపులు గుంపులుగా తరలి ఇంటికి రాసాగారు.

సుమకి ఈ ఘోర వార్త తెలిసింది.

‘‘బావ చచ్చిపోలేదు.... నా బావ చచ్చిపోలేదు.... బతికే ఉన్నాడ’’ంటూ ఉన్మాదిలా ఏడుస్తూ అరవసాగింది.

అసలే కోడలు పోయిన దుఃఖంలో నుంచి తేరుకోక ముందే... పిడుగు పాటులా అందిన ఈ ఘోర వార్తకు ముసలావిడ మరింతగా క్రుంగిపోయింది.

కన్నతల్లి కన్న మిన్నగా సుమని ఒడిలోకి చేర్చుకొని పసిపిల్లని లాలించినట్లుగా లాలించింది; ఊరడించింది.

భార్యా వియోగంతో లోలోన కుమిలి కుమిలి దుఃఖిస్తున్న రఘురాంకు మరదలు పడుతున్న బాధ దుఃఖం మరింతగా రెట్టింపు చేసింది.

‘‘నాతో రా సుమా! పల్లెకు వెళ్దాం...’’ అడిగాడు మరదల్ని.

‘‘వద్దు బావా!... ఇక ఆ పల్లెకు వద్దు... బావలేని ఆ పల్లెకు వెళ్ళలేను. ఆ జ్ఞాపకాలతో బతకలేను... అత్తయ్యను ఓదార్చలేను...’’ విలపిస్తూ తలగోడకేసి బాదుకుంటున్న సుమని ఒక్క ఉదుటున వెళ్ళి పక్కకి లాగబోయాడు. ఆ విసురులో ఆమె అప్రయత్నంగా ఆయన గుండెలపై వాలిపోయింది.

ఈసారి రెండు చేతులతో సుమని బిగ్గరగా అదిమిపట్టుకొని ‘‘ఊరుకో!... ఊర్కో... సుమా! నేను నీ ఈ దుఃఖాన్ని చూడలేకపోతున్నాను’’ సజల నయనాలతో చూస్తూ హీన స్వరంతో ఊరడించసాగాడు.

ఆ దుఃఖంలోనే సుమని  తీసికెళ్ళడానికి వెంకట్రామయ్యగారు పల్లె నుంచి వచ్చాడు.

‘‘నాన్నా! బావ ఇక నిజంగా లేడా నాన్నా! తిరిగిరాడా? మామయ్యని తీసుక రావడానికి బావ ఎందుకు వెళ్ళాడు నాన్నా? ఈ ఘోరం జరగడానికేనా? చెప్పు నాన్నా! చెప్పు’’ అంటూ తండ్రిని వాటేసుకొని వెర్రిదానిలా విలపించసాగింది.

గుండెల నిండా పేరుకున్న దుఃఖం కట్టలు తెంచుకొని ప్రవహిస్తుంటే వెంకట్రామయ్యగారు ఏం మాట్లాడలేకపోయారు. కూతురు తలని అక్కున చేర్చుకొని మూగగా రోదిస్తూనే, ‘‘పద తల్లీ! పల్లెకి వెళ్దాం. అక్కడ పూర్ణ పూర్తిగా పిచ్చిదై పోయింది’’ అన్నాడు బరువుగా.

‘‘నేను రాలేను నాన్నా! రాలేను. అత్తయ్యకి నా ముఖం చూపలేను... ఆమెను ఆ పుత్రశోకంలో నుంచి ఓదార్చే శక్తి నాకు లేదు నాన్నా! బావ రాక కోసం ఎంతగానో

తహతహలాడుతూ ఎదురు చూస్తున్న నాకు, ఆ విధాత ఇంతటి ఘోర కృత్యం ఎందుకు తలపెట్టాడు నాన్నా! నేనేం పాపం చేశాను నాన్నా? ఎందుకిలా జరిగింది?..."

వెంకట్రామయ్యగారు ఏం మాట్లాడకుండా మౌనంగా రోదిస్తున్నాడు.

"చెప్పునాన్నా? నా కెందుకు బావ దూరమైనాడు?"

"నేనేం చెప్పను తల్లీ!..."

"అత్తయ్య ఈ శోకాన్ని ఎలా భరిస్తుంది నాన్నా?"

"గౌతమి దగ్గరుండి తల్లిని చూసుకుంటోంది".

"అయ్యో! ఈ ఘోరం ఎందుకు జరిగిందో నా కర్థం కావడం లేదు నాన్నా"

"లే తల్లీ! బట్టలవీ సర్దుకో వెళ్ళిపోదాం..." బతిమాలుతున్నట్లుగా అడిగాడు వెంకట్రామయ్యగారు కూతురిని.

"ఊహుఁ, నేను పల్లెకి రాలేను నాన్నా!..."

"అది కాదమ్మా సుమా! నా మాట విను. ముందు మనమీరోజు పల్లెకు వెళదాం పద" వెంకట్రామయ్యగారు మరో మారు కూతురికి అనునయంగా నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు.

"ఉహూఁ, నేనక్కడికి ఇప్పట్లో రాను నాన్నా!". కన్న కూతురి ఖచ్చితమైన ఆ నిర్ణయానికి ఆయన విస్తుబోసాగాడు. 'ఒకప్పుడు తానిక్కడ ఇక ఉండలేననీ, తమ వెంట పల్లెకు తీసికెళ్ళమని పేచీ పెట్టిన కూతురేనా ఇప్పుడిలా మాట్లాడుతుంది?' అనుకుంటున్నాడు లోలోన.

నేల చూపులు చూస్తూ నిల్చున్న సుమకి ఎలా నచ్చచెప్పాలో ఆయనకి నిజంగానే అర్థం కావడంలేదు.

అంతవరకు అక్కడే కూర్చొని తన తొడపై చంటిదాన్ని పడుకోబెట్టుకొని జోకొడ్తూ... మౌనంగా తండ్రీ కూతుర్ల సంభాషణను ఆలకిస్తున్న ముసలావిడకి 'సుమని ఎలాగైనా ఇంకొన్నాళ్ళు ఇక్కడే ఉంచుకోవడానికి తగిన సమయం ఇదే' అనుకొని నెమ్మదిగా నోరు విప్పింది.

"సుమ రానంటుంటే నీ వెందుకు వెంకట్రామయ్యా అమ్మాయిని తీసికెళ్ళడానికి అంతగా బలవంతపెడ్తున్నావు? నాకు కోడలిగా... తల్లిలేని ఈ పసిపిల్లలకు పిన్నిగా ఇక్కడే ఉండనీ ఇంకొన్నాళ్ళపాటు".

ఆవిడ మాటల్లోని గూఢార్థమేదో దాగిఉన్నట్లు అనిపించింది.

''అక్కడ పూర్ణ బండెడు దుఃఖంలో ఉందక్కయ్యా! తనని ఓదార్చడానికి తోడెవరన్నా ఉండాలిగా. గౌతమి మాత్రం భర్తను వదలి ఇంకా ఎన్నాళ్ళు పుట్టింట్లో ఉంటుంది. అందుకనే సుశీల కూడా సుమని తీసుకురమ్మనే నన్ను పంపింది''.

''మరే, సుమ కూడా బావ లేడన్న దుఃఖంలోనే ఉంది కదా! అక్కడికొస్తే సారథి జ్ఞాపకాలతో మరీ తల్లడిల్లిపోదూ?''

ఈసారి ఆయన ఏం మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నట్లుగా మౌనంగా ఉండిపోయాడు.

ముసలావిడ మళ్ళీ మెల్లిగా పెదవి విప్పింది. ధైర్యాన్ని కూడగట్టుకొని తన మనస్సులోని భావాన్ని నేరుగా బయటపెట్టింది.

''నేనీమాట ఈ సమయంలో మాట్లాడవచ్చునో లేదో వయస్సులో పెద్దదాన్నైన నాకు కూడా తెలియడం లేదు. నా స్వార్థమే అనుకోండి; మరేదైన అనుకోండి! సుమని నా ఇంటికోడలిగా... ఈ పిల్లలకు తల్లిగా... రఘురాంకు భార్యని చేయమని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను...''

ఈ వార్త వినగానే వెంకట్రామయ్య, సుమ క్షణకాలం పాటు కొయ్యబారి పోయారు.

పక్కగదిలోనే ఉండి వీళ్ళ మాటల్ని ఆలకిస్తున్న రఘురాం కూడా చాలా ఆశ్చర్యానికి లోనైనాడు. తల్లి ఇంత తొందరగా తన తెగువ ప్రదర్శించి... నేరుగా వాళ్ళని ముఖాముఖి అడిగేస్తుందని అతనూహించలేని విషయం.

తండ్రీకూతుళ్ళ నుంచి ఏం సమాధానం వస్తుందోనని ఉత్కంఠతో ఊపిరి బిగపట్టి... చెవులు రిక్కించుకొని ఎదురు చూడసాగాడు.

వాళ్ళ నుంచి ఎలాంటి సమాధానం రాకపోయేసరికి ముసలావిడే మళ్ళీ గొంతు విప్పింది.

''సుమకి పెళ్ళి చేయడానికి సారథి ఎలాగూ లేడు. వేరే సంబంధమే చూడాలిప్పుడు మీరు. ఆ వేరే కొత్త సంబంధం కన్నా, ఈ పాత సంబంధానికే రఘురాం కిస్తే పైలోకాలలో ఉన్న సుమిత్ర ఆత్మకూడా సంతోషిస్తుంది. తన పిల్లలకు స్వంత చెల్లెలే తల్లైనందుకు''.

సుమ ఇక అక్కడో క్షణం కూడా ఉండలేక గిర్రున వెనుదిరిగి లోపలికి వెళ్ళిపోయింది.

ఒంటరిగా మిగిలిపోయిన వెంకట్రామయ్య గారికేం మాట్లాడాలో తెలియ లేదు. ఓక్షణం మౌనంగా ఉండిపోయాడు. ఆ తరువాత "చూద్దామక్కయ్యా! ఆ విధాత దాని నుదిటిన ఎలా రాస్తే అలా జరుగుతుంది" అంటూ మెల్లిగా అక్కడి నుంచి తప్పుకున్నాడు.

✧ ✧ ✧

"సుమని బావకిచ్చి పెళ్ళి చేయడమేమిటి నాన్నా? ఆ ముసలావిడకు అడిగేందుకు సిగ్గు లేకపోయింది. మీరెందుకు నాన్నా... ఆవిడలా ఆ కోణంలోనే ఆలోచిస్తున్నారు? సారథే సుమకి భర్త అవుతాడని అనుకున్నాం ఇన్నాళ్ళును. కాని ఆ దైవం చిన్న చూపు చూసింది. వాళ్ళిద్దరికీ మూడు ముళ్ళ బంధం పడక ముందే క్రూరంగా దూరం చేశాడా దేవుడు. ఇక లోకంలో మనకు పెళ్ళికొడుకులే కరువైనారా? చూస్తూ చూస్తూ అందాల బొమ్మలాంటి సుమని ముగ్గురు పిల్లల తండ్రికి... ఆ రెండో పెళ్ళివాడైన బావకివ్వడమేమిటి? అసలు మీ ఊహే నాకు ఏమాత్రం నచ్చడం లేదు నాన్నా! ఉహుఁ... వద్దు!..." సుభద్ర ఖచ్చితంగా తన నిర్ణయాన్ని తండ్రికి తెలిపింది.

పల్లెకు వెళ్తూ మధ్యన ఆగి రెండో కూతురి దగ్గరికొచ్చారు వెంకట్రామయ్య గారు.

అక్కడే కూర్చున్న రవీంద్ర, ఆనందరావులు ఆ మాటల్ని వింటూనే ఉన్నారు.

తన అన్నకు భార్య కావలసిన సుమ వదిన వేరొకరికి భార్యగా ఊహించలేక పోతున్నాడు రవీంద్ర. సారథిని తల్చుకోగానే ఉప్పొంగే కెరటంలా దుఃఖం తన్నుక వచ్చేసింది. కళ్ళనిండా నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

వెంటనే అక్కడి నుంచి లేచి గదిలోకి వెళ్ళిపోయాడు రవీంద్ర.

"సుభద్ర మాటలతో నేనూ ఏకీభవిస్తున్నాను మామగారూ! రఘురాం అన్నకు సుమ నివ్వొద్దు! వేరే మంచి సంబంధం చూద్దాం మనం" ఆనందరావు కూడా తన అభ్యంతరం తెలిపాడు.

"ఎక్కడో ఎందుకు? మా చిన్నత్తగారి మరిది కొడుకు సుమనివ్వమని నన్నోసారి అడిగారు. మేనరికం ఉందని చెప్పాను. ఆ అబ్బాయి కూడా మన సారథి లాగ మంచి ఒడ్డు పొడువుతో ఉన్న అందగాడే! అతను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అమెరికాలో ఉంటున్నాడు. మనం ఓ ఫోన్ చేస్తే చాలు. వాళ్ళే సంతోషంగా ఒప్పుకొని

ముహూర్తాలు పెట్టుకోవడానికి బయలుదేరి వస్తారు...'' ఉత్సాహంగా చెప్పుకపోతున్న భార్య మాటలకు ఆనందరావు కూడా వంత పాడాడు.

''అది కాదు సుభద్రా! నువ్వు ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడం లేదు. మన సుమకి సంబంధాలు దొరకవని కాదు నా బెంగ? కొడుక్కి మళ్ళీ పెళ్ళిచేయాలన్న ఉద్దేశ్యంతోనే ఉన్నట్లుంది తల్లి. వేరే పరాయింటి పిల్ల ఆ ఇంటికి కోడలుగా వస్తే రఘురాంకి భార్యా, ఆవిడకు కోడలు దొరుకుతుంది గానీ, ఆ పసిపిల్లలకు తల్లి దొరకదు కదా! మన సుమయితే కన్నతల్లిలా చూసుకోగలదని నా అభిప్రాయం. మీ అమ్మ వాళ్ళను కూడా అడగాలి కదా?...''

''మరి సుమ ఈ పెళ్ళికిష్టపడిందా నాన్నా?''

''నేనైతే తనని ఏమీ అడగలా రఘురాం వాళ్ళమ్మ అన్నమాటల్ని విందంతే!...''

''విని ఊర్కుందా?''

''అవును. ఆవిడ మాటలకి కాదనిగానీ, అవుననిగానీ ఏం సమాధానం చెప్పలేదు. మౌనంగా విని వెళ్ళిపోయింది లోపలికి. ఆ మౌనమే అర్ధాంగీకారంగా నేను ఊహించుకున్నానంతే!''

''మీరు ఎన్నైనా చెప్పండి నాన్నా! నాకైతే సుమని బావకిచ్చి పెళ్ళి చేయడం సుతరామూ ఇష్టం లేదంతే!...'' తన అభిప్రాయాన్ని కుండ బద్దలు కొట్టినట్లుగా చెప్తూ విసురుగా లోపలికెళ్ళుతున్న కూతురు వంక అయోమయంగా చూడసాగాడు వెంకట్రామయ్య గారు.

✧ ✧ ✧

''ప్లీజ్ అమ్మా! ఇంకొక ముద్ద తిను...''

''ఊహుఁ, నా కొద్దు గౌతమీ! ఎందుకే నన్నిలా ఊరికే 'తిను తిను' అని సతాయించి చంపుతున్నావ్?''

''సారథన్నయ్య ఎలాగో పోయాడు... ఉన్న నిన్ను కూడా పోగొట్టుకుంటే ఇక నాకు రవీంద్రకు దిక్కెవరమ్మా?'' ఏడుస్తూనే ఇంకొక ముద్ద తల్లి నోట్లోకి బలవంతంగా కుక్కింది గౌతమి.

''నేనెందుకు పోతానే అప్పుడే?... నాది పాపిష్ఠి జన్మ! మీ నాన్న నాకు దూరమైన నాడే నా ఈ గుండెలు బండబారిపోయాయి...'' అన్నం ఇక వద్దంటూ చెయ్యి అడ్డుపెట్టుకొని ఏడుస్తూంది అన్నపూర్ణమ్మ.

"అన్నయ్య ఆ రైలు ప్రమాదంలో పోయిన వార్త విన్నప్పటి నుంచీ ఏనాడైనా నాలుగు ముద్దలు కడుపు నిండా తిన్నావమ్మా? నీ శరీరం ఎలా శుష్కించిపోయిందో చూశావా? కంటికి నిద్రలేదు, కడుపుకి తిండిలేదు. అస్సలు ఎప్పుడో ఇల్లు వదిలిన నాన్న కోసం అన్నయ్య గుజరాత్ వెళ్ళడమేమిటీ? వెళ్ళినవాడు సవ్యంగా తిరిగి రాకుండా ఆ రైలు ప్రమాదంలో ఘోరంగా చనిపోవడమేమిటమ్మా? తల్చుకుంటుంటే నాకొకసారి అంతా అయోమయంగా ఉంటుంది..." పైట చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ చేతిలోని అన్నం ప్లేట్ తీసి పక్కన పెట్టింది.

"ఏం చేస్తాం చెప్పు? నిమిత్త మాత్రులమైన మనం విధిరాతను తప్పించుకోలేమమ్మా గౌతమీ!"

ఆ మాటలు వినబడిన వైపుకు దృష్టిసారించారు తల్లీ కూతుర్లిద్దరును.

చేతిలో పూల సజ్జ పట్టుకొని ఇటే వస్తూ గుమ్మంలో కనబడింది రుక్మిణి.

"ఎండలోపడి ఈ వేళప్పుడు వచ్చావేం పిన్నీ?" తల్లికి నీళ్ళు తాగించి ఆ నీళ్ళతోనే అన్నం పళ్ళెంలో చెయ్యి కడిగేసుకుంటూ అంది గౌతమి.

"ఎండో గిండో... అన్నయ్య చెప్పిన ఆ ఘోర వార్త విన్నప్పటినుంచి అక్కడ ఇంట్లో ఉండలేకపోయానే తల్లీ! గుడికెళ్ళి ఆ నీలకంఠేశ్వరుడిని అభిషేకించుకొని పూజించుకొని ఇలా వచ్చాను".

"మళ్ళీ ఏం ఘోరవార్త పిన్నీ?..." భయాందోళనలతో కంపిస్తున్నట్లుగా అంది గౌతమి.

నిండా మునిగాక ఇక చలేమిటన్నట్లుగా ఆ ఘోరవార్త ఏమిటో తెలుసుకోవాలన్న ఆసక్తిగాని, ఆదుర్దాగాని లేకుండా నిర్లిప్తంగా చూస్తూ మౌనంగా అక్కడే కొంగు పర్చుకొని మేను వాల్చింది అన్నపూర్ణమ్మ.

"మామయ్యా! సుమని హైద్రాబాద్ నుంచి తీసుకొచ్చాడా పిన్నీ?"

"ఆఁ, ఇంకేం తీసుకొస్తాడు? పెద్ద కూతురి స్థానంలో సుమని ఆ ఇంటి కోడలుగా చేయబోతున్నాడు త్వరలో".

ఆ వార్త వినగానే ముందుగా కొయ్యబారిపోయింది గౌతమి.

"ఏంటి పిన్నీ!... మీరు మాట్లాడేది? నిజమా ఇది?"

"అవునే తల్లీ! పొద్దున అన్నయ్య ఊరినుంచి వచ్చాక వదినతో ఈ సంగతి మాట్లాడుతుంటే... నా మనస్సులో ఎంత కంపరంగా ఉందో చెప్పలేను".

“రఘురాం అన్నయ్యతో సుమకి పెళ్ళా?.... అమ్మా, వింటున్నావా? మీ అన్నయ్య చేస్తున్న నిర్వాకం!” దెప్పిపొడిచినట్లుగా అంది గౌతమి తల్లితో.

ఆ విషయం విన్నాక కూడా ‘నా కొడుకే లేకపోయాక ఇక సుమ ఎవరింటి కోడలైతే మాత్రం నాకేంటి?’ అన్నట్లుగా నోరు విప్పకుండా ముభావంగా ఉండిపోయింది అన్నపూర్ణమ్మ.

“నేనైతే వద్దని ఖచ్చితంగా చెప్పాను. సుభద్ర ఆనందరావు కూడా ససేమిరా వద్దన్నారట. ఎంత అక్క భర్త అయినా పిల్లలకోసం దాని నిండు జీవితాన్ని ఇలా అస్తవ్యస్తంగా బలి చేస్తారా? మంచి సంబంధం చూసి పెళ్ళి చేయమని చెప్పాను కాని అన్నా వదినా వినే పరిస్థితిలో లేరు. శాస్త్రిగారింటికెళ్ళి ముహూర్తం పెట్టించుకొని మళ్ళీ వీళ్ళిద్దరూ అక్కడికి వెళ్ళి గుళ్ళో పెళ్ళి చేసి వస్తారట క్లుప్తంగా”.

అయ్యో! ఎంత ఘోరం? అస్సలు ఈ పెళ్ళికి సుమ నిజంగా ఒప్పుకుందా పిన్నీ?”

“అది ఒప్పుకోకపోతే వీళ్ళందరూ ఇంతదూరం ఎందుకాలోచిస్తారు. పిచ్చిది!... సారథి లేక పోయాడు. ఇక ఎవరైతే ఏంలే అని అనుకుంది కాబోలు ఆ అమాయకురాలు!” సుమ పట్ల జాలితో బాధతో దుఃఖభారంతో అంది రుక్మిణి.

“ఆ మధ్య ఓసారి నేనిక్కడికి వచ్చినప్పుడు ఓ రోజు సాయంత్రంపూట నన్ను కలువడానికని సుమ రత్తాల్ని తీసుకొని వచ్చిందిక్కడికి. ఏదో మాట్లాడుతూ మాట్లాడుతూ అమ్మ తిన్నగా అన్నయ్య పెళ్ళి విషయానికి వచ్చేసింది. ‘ఆరు నూరైనా... నూరు ఆరైనా ఈ సంవత్సరం సుమబాల పెళ్ళికూతురవుతుందని’ అన్నయ్య అన్నాడు. అప్పుడు నేనేమో ‘సుమ పెళ్ళికూతురైతే పెళ్ళికొడుకువి నువు కాదా అన్నయ్యా?’ అన్నాను నేను. దానికి సమాధానంగా ‘పెళ్ళికొడుకు బావకాక మరింకెవ్వరు? అంటూ కనుబొమ్మలెగరేస్తూ విలాసంగా నవ్వాడన్నయ్య. కాని ఈనాడు పెళ్ళికొడుకు మేనబావ కాక... అక్కమొగుడు బావవుతున్నాడు...” అంటూ బాధతో దుఃఖంతో నిట్టూర్చింది గౌతమి.

“ఈ వార్త విన్నప్పటినుంచి నా మనస్సు మనస్సులో లేదు గౌతమీ!”

“నా కనిపిస్తుంది పిన్నీ!... మనమంతా అనవసరంగా బాధపడుతున్నామేమో? ఇప్పుడెలాగో అన్నయ్య లేడు. మనం విచారించి లాభమేమిటి? జరిగేది జరగక మానదు. మామయ్య అత్తయ్య ఇష్టప్రకారమే జరగనీ...”

"ఏం జరగడమో ఏమోనే తల్లీ! నా కింట్లో ఉండబుద్ధి కాలేదు. ఆ నీలకంఠేశ్వరుని దర్శించుకుందామని గుడికొచ్చి ఇలా వచ్చాను".

"వచ్చి మంచి పని చేశావ్. భోజనం చేశావా పిన్నీ?"

"లేదింకా..."

"పద .... వంటింట్లోకి పిన్నీ! నేను కూడా తినలేదు".

"ఒద్దు గౌతమీ! నేనింటికి వెళ్ళి తింటానులే"

అంతవరకూ మౌనంగా ఉన్న అన్నపూర్ణమ్మ చెంపల మీదుగా కారుతున్న అశ్రువుల్ని కొంగుతో తుడుచుకుంటూ మెల్లిగా నోరు విప్పింది.

"వెళ్ళు రుక్మిణీ! ఇద్దరూ కలిసి భోజనం చేయండి ముందు ఈ ఎండలో మళ్ళీ అంతదూరం ఏం వెళ్తావు? సాయంత్రం తాపీగా వెళ్దువులే..."

అక్కగారి మాటల్ని మరి తోసిపుచ్చలేకపోయి... మారు మాట్లాడకుండా నెమ్మదిగా గౌతమి వెనకాలే వంటింట్లోకి వెళ్ళింది రుక్మిణి.

✧ ✧ ✧

మంచంపై రెండు కాళ్ళూ బార్లా చాపుకొని, దిండుకానుకొని కూర్చున్న సుమ చేతిలోని ఆ ఉత్తరాని కేసి పదే పదే చూస్తూ... మళ్ళీ ఓ సారి సొంతం క్షణంగా చదివింది.

పక్కింటి సుగుణమ్మగారు సుమకి రాసిన ఉత్తరం.

తన కొడుకు శ్రీనివాస్ పరిస్థితి ప్రస్తుతం చాలా ఆశాజనకంగా ఉందంటూ తన సంతోషాన్ని వ్యక్త పరుస్తూ రాసిందావిడ.

"భగవంతుడు కొందరి పట్ల నిజంగా ఎంతో సానుకూలంగా ఉండేటట్లు అనుగ్రహిస్తాడు. కాని, తనపట్లే ఎందుకనో చాలా ఘోరాతి ఘోరంగా నిర్దాక్షిణ్యంగా కఠినంగా ప్రర్తించాడనిపిస్తోంది. ఏం పాపం చేశానో? పూర్వజన్మలో ఏదో చేసే ఉంటాను..." అని ఆలోచిస్తూంటే సారథి సుమిత్ర వెంట వెంటనే గుర్తుకొచ్చారు. ఆ వెంటనే రెండు కళ్ళనిండా నీళ్ళు నిండుకున్నాయి.

తాను పల్లెలో టెన్త్ వరకు చదివింది.

ఇంటర్, డిగ్రీ చదివేందుకు ఇద్దరక్కలు కూడా తన దగ్గర ఉంచుకొని చదివిస్తానంటే... తన దగ్గర ఉంచుకొని చదివిస్తానంటూ పోటీ పడ్డారు. చివరికి సుభద్రక్కయ్యే పంతమే నెగ్గింది.

పెద్దక్కయ్య సుమిత్ర దగ్గరైతే పిల్లలతో అత్తగారితో సతమతమయ్యే ఆమెకు మళ్ళీ సుమ కూడా ఉంటే మరింత కష్టమవుతూందనీ బాగా ఆలోచించిన వెంకట్రామయ్య గారు పెద్ద కూతురు బాధతో నొచ్చుకోకుండా సున్నితంగా వద్దన్నారు.

అయినా కొన్నాళ్ళపాటు సుమిత్ర బాధ పడకుండా ఉండలేకపోయింది.

కాలేజీకి సెలవులిస్తే ఓసారి పెద్దక్కయ్య దగ్గరికెళ్ళింది తాను.

“ఏమే సుమా! నేనంత కానిదాన్నయిపోయానా నీకు? సుభద్రే నీకు అక్క!... నేను కానా?” అంటూ నిష్ఠూరమాడి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

“అయ్యో, అలా ఎందుకనుకుంటావక్కయ్యా! మీరిద్దరూ నా కక్కలే! నాకు రెండు కళ్ళలాంటివారు. డిగ్రీ అయ్యాక నీ దగ్గరుండే ఉస్మానియా యూనివర్సిటి నుంచి పీజీ చేస్తాన”ంటూ నమ్మబలికి పెద్దక్కయ్యను ప్రసన్నం చేసుకుంది. కాని, తన చదువు డిగ్రీతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అమ్మకి మోకాళ్ళ కీళ్ళ నొప్పులు ఎక్కువ కావడంతో పల్లెలోనే ఉండిపోవలసి వచ్చింది. తల్లికి సాయంగా పెద్దక్కయ్యకిచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయింది తాను. ఈనాడిలా అనుకోని విపత్తులో వాళ్ళింట్లో ఇక్కడ ఉండిపోవలసి వచ్చింది.

పురిటిలో కాంప్లికేషన్స్ వచ్చి అక్క మరణించకుండా ఉండివుంటే, పండంటి బాబుతో ఇంటికి చేరేది. తాను పల్లెకు వెళ్ళిపోయేది.

“పిన్నీ, పిన్నీ!....” అంటూ వస్తున్న పిల్లల పిలుపులతో ఆమె మనస్సులోని ఆలోచనా స్రవంతికి ఆనకట్ట పడింది.

సుమ బుగ్గలమీదికి జాలువారుతున్న కన్నీళ్ళను చూసి పిల్లలు ఏడ్పు ముఖాలు పెట్టారు.

“పిన్నీ! ఎందుకు ఏడుస్తున్నావు?” చిన్నమ్మలడిగింది.

“అమ్మ గుర్తొచ్చింది...”

“తప్పు అమ్మ గుర్తొచ్చినా ఎవరూ ఏడవకూడదని డాడీ చెప్పాడు”.

“అలాగా...”

“మనం ఏడిస్తే అక్కడెక్కడో ఉన్న అమ్మ కూడా ఏడుస్తుందట పిన్నీ!... ” పెద్దమ్మలు పెద్ద ఆరిందలా కళ్ళు చేతులు తిప్పుతూ చెప్పింది.

“సరే... నేనిక ఏడువనులే” పైట కొంగుతో కళ్ళు తుడుచుకుంది. సుమ చిన్నగా నవ్వుతూ.

"నిన్నే! ఇక అమ్మ అనుకోవాలని నిన్ననే మాకు నానమ్మ కూడా చెప్పింది పిన్నీ!"

"అవునా? అరే... ఇకనుంచీ మీ అమ్మను నేనేలే" అలా అంటుంటే సుమ పెదాలపై పేలవంగా నవ్వు వెలసి మాయమైంది.

"మరే పిన్నీ! ఇందాక డాడీ నిన్ను పిల్చుక రమ్మన్నారు".

"ఎవర్నీ... నన్నా?" ఆశ్చర్యపడిందామె.

"ఏం ఎందుకనీ?"

"ఏమో తెలీదు. ఇందాక చాలా సేపటినుంచి నానమ్మ, డాడీ ఏమేమో మాట్లాడుకున్నారు. ఆ తరువాత నిన్ను పిలుచుకు రమ్మని చెప్పారు".

"సరే... నే వెళ్తానుగానీ మీరెళ్ళి చదువుకోండి" మంచంపై నుంచి కిందికి దిగి జుత్తు సవరించుకొని వాళ్ళ బావగది దగ్గరికెళ్ళింది.

రఘురాం కిటికీ దగ్గర నిల్చుని ఏదో ఆలోచిస్తున్నట్లుగా తదేకంగా బయటికి చూస్తున్నాడు.

గది గుమ్మం దగ్గరే ఆగిపోయింది సుమ.

ఏదో అలికిడి అయినట్లుగా అనిపించి గభాల్న వెనుదిరిగాడతను.

ద్వారబంధంపై కుడి చెయ్యి వేసి మరదలు నిల్చుని ఉందక్కడ.

"ఎందుకో పిలిచారట బావా?"

"ఆఁ, అవునవును... పిలిచాను. లోపలికిరా సుమా! నీతో కొంచెం మాట్లాడాలి".

"చెప్పండి. ఏం మాట్లాడాలి?"

"మామయ్యగారు పల్లె నుంచి ఫోన్ చేశారు".

"ఏం చెప్పారు నాన్న?"

విషయం ఎలా మొదలుపెట్టాలో రఘురాంకి ఓ క్షణం పాలు పోలేదు. తటపటాయిస్తున్నట్లుగా చేతి వేళ్ళవంక చూసుకుంటూ బిడియంగా ఉండి పోయాడు.

"ఫర్వాలేదు బావా! మీరేం సంకోచించకండీ చెప్పండి... ఏదైనా వినడానికి నేను సిద్ధంగానే ఉన్నాను".

మరదలన్న ఆ మాటల్ని తనెలా అన్వయించుకోవాలో తెలియనట్లుగా కళ్ళెత్తి ఓ మారు నిశితంగా ఆమెకేసి చూశాడు.

“ఫోన్‌లో నాన్నగారు ఏం చెప్పారు బావా?”

“అదే ... మన పెళ్ళి సంగతి. ఈ వారంలో ఇక్కడే గుళ్ళో సింపుల్‌గా జరపడానికి ముహూర్తం పెట్టించారట” చెప్పలేక చెప్తున్నట్లుగా ఎలాగో చెప్పేశాడు.

“ఊఁ...” నిర్లిప్తంగా మూలిగిందామె.

“బాధపడుతున్నావా సుమా?”

“బాధా? నాకా? ఉహుఁ, అలాంటిదేమీ లేదు. నా మనస్సెప్పుడో చచ్చిపోయి శారీరకంగా మనిషిని ఉన్నానంతే!”

“నీకీ పెళ్ళి ఇష్టం లేదు కదూ?”

ఆమె పెదాలపై శుష్కహాసం మెరిసింది.

“నా ఇష్టాయిష్టాలతో ఇప్పుడెవ్వరికీ పని లేదు బావా! పెద్దవాళ్ళైన అత్తయ్య, అమ్మ, నాన్న, మీరందరూ చెప్పినట్లుగా నడుచుకోవడమే నా ఇష్టమిప్పుడు”.

“అంటే నీకిష్టం లేదనేగా అర్థం?”

“ఆ అర్థంతో ఎవరికి పనిలేదిప్పుడు? మీ అమ్మగారికి కోడలిగా, మీ పిల్లలకి తల్లిగా, ఇక మీకు భార్యగా ఈ ఇంటికి రావడమే నాధ్యేయమిప్పుడు”.

“సుమా!...” దెబ్బతిన్నట్లుగా చూశాడు.

తాను చెప్పబోయే ఉద్విగ్నమయిన భావాన్ని అణచుకోవడాని కన్నట్లుగా ఓ క్షణం పై పంటితో కింది పెదవిని నొక్కిపట్టి ఆగిపోయి... మళ్ళీ ఆమే అంది.

“ఈ సందర్భంలో మీకో విషయం చెప్పాలి బావా! మానసికంగా మీకు భార్యగా పేరుకు మాత్రమే ఉండగలనుగాని... శారీరకంగా మనిద్దరి మధ్యా ఎలాంటి సంబంధం ఉండదు, ఉండబోదు. సంసార జీవితం పట్ల నాకెలాంటి ఆశలు కోరికలూ లేవిప్పుడు. నా మనస్సంతా సారథి బావే ఉన్నాడు. నాడు నేడూ మీ అర్ధాంగినైనా నా నుంచి మీకు ఎలాంటి సుఖమూ ఉండదు” పళ్ళు బిగువున దుఃఖాన్ని ఆపుకుంటూ మరో మాటకైనా ఎదురు చూడకుండా చరచరా వెళ్ళిపోయింది అక్కడి నుంచి.

మాన్పడిపోయినట్లుగా మరదలు వెళ్ళిన వైపే చూస్తున్న రఘురాం పెదవులపై ఓ నవ్వు వెలసి మాయమైంది.

"ఎన్నాళ్ళు ఆ సారథిగాడిని తల్చుకుంటూ ఉంటావో నేనూ చూస్తానులే!..." అన్నట్లుగా ఉందా నవ్వుకి అర్థం.

ఆ సాయంత్రం ముసలావిడ సుమని దగ్గరికి పిలిచి చాలా సంతోషంగా చెప్పింది. బజారుకెళ్ళి నీకిష్టమైన పట్టుచీరలు నగలు తెచ్చుకొమ్మని చెప్పింది.

"ఇప్పుడెందుకత్తయ్యా! అక్కయ్య నగలే ఎలాగో చాలానే ఉన్నాయిగా..." అయిష్టంగా అంది.

"అవి వుంటే వుండనీ. విడిగా కొత్తవి నీకిష్టమైనవి అబ్బాయ్ వెంట వెళ్ళి తెచ్చుకో అమ్మాయ్!"

లేని నవ్వు తెచ్చి పెట్టుకొని అక్కడి నుంచి కదిలిందామె.

✧ ✧ ✧

డాక్టర్ రెడ్డి ఆంధ్ర నుంచి వచ్చిన తన అత్తగార్ని మామగార్ని తీసుకొని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నలియా నుంచి శ్రీకృష్ణుడు పరిపాలించిన ద్వారకను చూపించ డానికి వచ్చాడు.

అక్కడికి రాగానే తన మిత్రుడు సారథి గుర్తొచ్చి గుండె బరువెక్కింది.

ఇక్కడికి వచ్చి తండ్రిని ఎలాగో తనవెంట తీసికెళ్ళలేకపోయాడు.

ఊరినుంచి వాడినిక్కడికి పిలిపించి, వెళ్ళేటప్పుడు రైళ్ళో బాంబు పేలుడులో వ్యర్థంగా చంపించినట్లైంది.

హాయిగా పల్లెలో ఉండినా నిక్షేపంలా బతికేవాడు.

అతని కనుకొలకుల్లో నీళ్ళు నిండాయి. 'మనసారా కోరుకున్న మరదల్ని పెళ్ళి చేసుకొని పిల్లా పాపలతో కళకళలాడాల్సిన సారథి జీవితం విషాదంగా మారింది. తాను వాళ్ళ తండ్రిని గురించి చెప్పకుంటే వాడు ఇంతదూరం వచ్చేవాడే కాడు. ఇదంతా తన వల్లనే జరిగింది... నిజంగా అక్షరాలా తన వల్లనే జరిగిందా ఘోరం..." అనుకుంటూ భారంగా నిట్టూర్చాడు రెడ్డి.

సముద్ర స్నానం కోసం వెళుతున్నప్పుడు ఆ చుట్టుపక్కలెక్కడన్నా సారథి తండ్రి ఆ కేశవస్వామి సాధుపుంగవుడు కనిపిస్తాడేమోనని నలువైపులా తేరిపార చూచాడు.

కన్నకొడుకు మరణవార్త విషయం ఆయనకెలాగూ తెలిసి ఉండదు. ఈ ఘోర వార్త వింటే నిజంగా ఆయనగారి స్పందన ఎలా ఉంటుందో చూడాలను కున్నాడు.

కళ్ళు రెండు విప్పార్చుకొని మెట్లపై కూర్చున్న ఋషీశ్వరుల నందర్నీ ఓమారు నిశితంగా కలియ చూశాడు రెడ్డి.

స్నానఘట్టానికెళ్ళే దారిలో మెట్ల చివర్న అటువైపు చివరగా కళ్ళుమూసుకొని దరహాస వదనంతో కూర్చున్న తెల్లని గెడ్డంతో కాషాయ వస్త్రాలతో ధ్యాన నిమగ్నుడై ఉన్న ఆయన్ని సారథి తండ్రిగా ఇట్టే పోల్చుకున్నాడు.

ఇప్పుడే వస్తానని మామగారి వాళ్ళతో చెప్పి గబగబా అటు కేసి నడిచాడు రెడ్డి.

ఆయన దగ్గరగా వెళ్ళి "స్వామీ!..." అంటూ పిలిచాడు.

"......................"

"ఓ కేశవస్వామిగారు!" ఈ మారు కాస్తా గొంతు హెచ్చించాడు.

నెమ్మదిగా కళ్ళు తెరిచాడాయన.

రెడ్డిని వెంటనే పోల్చుకున్నాడు.

అతన్ని మందహాసంతో చూస్తూ "నువ్వా నాయనా! ఎప్పుడొచ్చావు ద్వారకకి. నీ మిత్రుడు కుశలమే కదా?" పలుకరించాడాయన.

"ఇంకెక్కడి మిత్రుడు స్వామీ!" బావురుమని విలపించాడు.

"ఏం, ఏమైంది నాయనా? సారథికేమైంది?" ఆ మాటల్లో ఎనలేని భయాందోళనలను కనబర్చాడు.

"మిమ్ములను ఇక్కడ గుర్తించిన నేను వాడిని పల్లెనుంచి పిలిపించాను. కాని మీరేమో వాడి వెంట ఇంటికెళ్ళడానికి నిరాకరిస్తిరాయె! తీరా సారథి వెళ్ళేటప్పుడు బొంబాయిలో రైళ్ళో బాంబు పేలుళ్ళో ప్రాణాలు పోగొట్టుకున్నాడు స్వామీ!"

తన కన్న కొడుకు సారథి అర్ధాంతరంగా మరణించాడన్న వార్త ఆయన్ని ఎనలేని బాధా వ్యధలకి గురిచేసింది.

నమ్మలేకపోతున్నట్లుగా మాన్పడి చూడసాగాడు.

శాంతి దూతలా ఉన్న ఆయన ప్రశాంత వదనంలో ఏదో తెలియని కలవరం చోటు చేసుకుంది.

ఆయన రెండు కళ్ళల్లో నిండుగా నిరాశ ద్యోతకమవుతోంది.

"ఎంత ఘోరం జరిగింది కృష్ణ! కృష్ణ!"

"వాడిని ఇంతదూరం మీకోసం పిలిపించి పరోక్షంగా వాడి చావుకి కారణమైన నాకు నిష్కృతి లేదు స్వామీ!"

"అలా అనకు నాయనా! ఎవరి ఖర్మకు ఎవరు బాధ్యులు? అంతా భగవదీచ్ఛ". సుఖదుఃఖాలకు అతీతంగా ఉన్న ఆయన మనస్సులో కూడా మెల్లిగా అలజడి మొదలైంది.

"స్వామీ, మిమ్మల్ని నేకోరుకునేది ఒకటే. సారథి ఆత్మకు శాంతి కలగాలంటే మీరు సాధ్యమైనంత త్వరలో పల్లెకు తిరిగి వెళ్ళండి స్వామీ!... సారథి లేక దిక్కులేని కుటుంబమైన వాళ్ళకి కాస్త పెద్దదిక్కుగా ఉండండి స్వామీ! అదే వాళ్ళకు కొండంత సంతోషాన్ని కలుగజేస్తుంది" అంటూ ఆయన నుంచి ఎటువంటి సమాధానం కూడా ఆశించకుండా సజల నయనాలతో వెనుదిరిగి వెళ్ళిపోయాడు రెడ్డి.

✧ ✧ ✧

రాత్రి ఎనిమిది అవుతూంది...

కాచిన పాలు గ్లాసు నిండా పోసి, చక్కెర వేసి స్పూన్‌తో కలిపి తల్లిచేతి కందించింది గౌతమి.

"నాకీ పాలు చూస్తూనే చాలా వెగటుగా ఉంటుందీ మధ్య గౌతమీ!"

"అదేమిటమ్మా!, అలా అంటావు? ఈ రోజు శనివారమని టిఫిన్ కూడా వద్దన్నావు. కనీసం పాలన్నా తాగకపోతే ఎలా?"

"నీవిక్కడి నుంచి వెళ్ళాక ఇక్కడిక నా ఆలనాపాలనా చూసే వాళ్ళెవరు గౌతమీ? తిన్నా తినక పోయినా అడిగేవారు లేరు కదా!" నిర్లిప్తంగా పెదవి విరిచింది ఆవిడ.

"అలా మాట్లాడకమ్మా నేను వెళ్ళి రుక్మిణి పిన్నిని వచ్చి ఇక్కడే మనింట్లోనే నీకు తోడుగా ఉండడానికి మామయ్య అత్తయ్యను ఫోన్ చేసి అడుగుతాను. వాళ్ళెలాగూ సుమపెళ్ళికి హైద్రాబాద్ వెళ్తున్నారుగా".

''వద్దులేమ్మా, ఎవర్నీ అడక్కు. నా తిప్పలేమిటో నేను పడుతాను. ఇంట్లో రాత్రిళ్ళు మస్తాన్ ఎలాగో పడుకోవడానికి వస్తూనే ఉన్నాడుగా''.

''పగలంతా ఒక్కత్తివి ఎలా ఉంటావు అమ్మా? ఏం వండుకుంటావు? ఏం తింటావు? నేను ఊరెళ్ళినా కూడా నా మనస్సంతా ఇక్కడే నీ చుట్టే తిరుగుతుంటుంది. ఈ పరిస్థితిలో నిన్ను వదలి వెళ్ళడానికి నాకు మనస్కరించడం లేదు. ఆయనేమో నన్ను ఇంకొన్నాళ్ళపాటు ఇక్కడే ఉండి రమ్మంటున్నారు. నీవేమో నా మాట వినక అల్లుడిగారికి ఇబ్బంది అవుతుందని వెళ్ళు వెళ్ళు అంటున్నావు?''

''పరీక్షలైపోయాక రవీంద్ర ఎలాగో వస్తాడాయె! ఇక నేనెలా ఒంటరిదాన్ని అవుతాను?...''

''చిన్నన్నయ్య వచ్చేవరకన్నా... నీ కెవరన్నా తోడు ఉండాలిగా!''

''అగ్ని సాక్షిగా కట్టుకున్నవాడు కడదాకా తోడు నీడగా నిలుస్తాడనుకున్నాను. నాకిక ఆ ముఖ్యమైన తోడే లేకపోయాక ఇక దిగులెందుకు? కనీసం కనిపెంచి పెద్ద చేసిన పెద్దాడైనా వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకున్నాను. నా దురదృష్టమేమో గాని అన్నీ ఆదిలోనే తుడిచిపెట్టుకపోతున్నాయి...'' కళ్ళనీళ్ళ పర్యంతమైన ఆవిడ స్వరం దుఃఖభారంతో జీరబోయింది.

తల్లి కన్నీళ్ళు తనపైట చెంగుతో తుడుస్తున్న గౌతమి హృదయం బరువైంది.

''రవీంద్ర చదువు ఇంకొక సంవత్సరానికిగాని పూర్తి కాదు కదా! అప్పటి వరకూ మన పొలం విషయాలు మిగతా అన్ని పనులు ఎవరు చూసుకుంటారో నా కర్థం కావడం లేదు...''

''అదేమిటి రవి చదువు ఈ సంవత్సరంతో ఆఖరని సారథి అన్నాడుగా''.

''అది నిజమేనమ్మా మెడిసిన్ ఫైనలియర్ అయిపోతుంది. ఇంకొక ఏడాది హౌస్ సర్జన్ ఉందిగా. అది పూర్తయ్యాకనే ఎం.బి.బి.యస్. సర్టిఫికెట్ చేతి కొస్తుంది. పొలాల విషయంలో అంతదాకా పనివాళ్ళ మీదనే ఆధారపడాలి''.

''అలాగా పోనీ అన్నయ్యన్నా చూస్తాడంటే ఆయన పరిస్థితి కూడా అంతంత మాత్రమే. తన పొలం విషయంలో సరిగా చూసుకోలేక అప్పుడప్పుడు సారథికే అప్పజెప్పేవాడు''.

''పోనీలేమ్మా. ఈ ఒక్క సంవత్సరం నేనూ మీ అల్లుడుగారు మధ్య మధ్యన వచ్చి చూసుకుంటూ ఉంటాం. ప్రస్తుతానికిక అన్ని విషయాలను నాయుడుగారినే చూసుకోమని చెపుదామమ్మా!''

“కాక ఇక ఇప్పుడు చేసేదేముందిగానీ, నీవు బట్టలవీ అన్ని సర్దుకున్నావా? ప్రయాణం రేపు ఉదయం బస్సుకే అన్నావుగా”.

“ఆఁ, అన్నీ సర్దుకుని రెడీగానే ఉంచుకున్నాను. ఫస్ట్ బస్సు ఐదింటికేగా. మస్తాన్ ఎలాగో ఇంట్లోనే ఉంటాడాయె! సూట్‌కేస్, బ్యాగ్ బస్‌స్టాండ్ వరకు పట్టుక రావడానికి”.

“ముందుగా అల్లుడిగారికి ఫోన్ చేయి. అక్కడ బస్‌స్టాండ్‌కి తప్పకుండా రమ్మని...”

“ఫర్వాలేదమ్మా. కొత్తచోటేం కాదు కదా! ఆయన వచ్చినా రాకపోయినా నేను క్షేమంగానే ఇంటికి చేరగలను” తల్లి వంక అపేక్షగా చూస్తూ అంది గౌతమి.

✧ ✧ ✧

సోఫాలో పేపరు చదువుతూ కూర్చున్న ఆనందరావు పక్కనే ఉన్న ఫోన్ మోగితే వెంటనే ఎత్తి “హలో” అన్నాడు.

అవతలి వైపు నుంచి ఎవరో బిగ్గరగా మాట్లాడుతున్నారు.

“ఆఁ, మీరా మామయ్యగారూ! చెప్పండి... ఏమిటి విశేషాలు? అంతా కుశలమే కదా! అత్తగారి ఆరోగ్యం బాగుంది కదా?

“................”

“సుమ పెళ్ళికా? నాకైతే ఆఫీసులో ఆడిట్ జరుగుతూంది. రవీంద్రకేమో ప్రాక్టికల్స్ జరుగుతున్నాయి. కాబట్టి మా ఇద్దరికీ రావడానికి వీలు కాదు.

“...................”

“సుభద్రనా? ఏమో మరి... వస్తేరావచ్చు. ఒక్కక్షణం మీరు లైన్‌లో ఉండండి. మీ అమ్మాయిని పిలుస్తాను. మీరే మాట్లాడండి...” అంటూ మౌత్‌పీస్ మూసి “ఓయ్ సుభద్రా! త్వరగా రా, మీనాన్నగారి నుంచి ఫోన్” అంటూ గట్టిగా కేకేశాడు.

వంటింట్లో ఉన్న సుభద్ర తడిచేతులు పైట చెంగుతో తుడుచుకుంటూ గబగబా ఇవతలికి వచ్చింది.

ఫోన్ భార్యకందించి మాట్లాడమని సైగ చేశాడు ఆనందరావు.

“ఆఁ, చెప్పండి నాన్నా! మీరెప్పుడు బయలుదేరుతున్నారు? ఇక్కడికొస్తే మీతోపాటు నేనూ వస్తాను”.

“..........................”

“సుమ పెళ్ళికి రుక్మిణి అత్తయ్య రావడం లేదా? ఏం, ఎందుకని?”

“.......................”

“పోనీలే నాన్నా! ఎవరొచ్చినా, రాకపోయినా పెళ్ళిమాత్రం ఎట్టిపరిస్థితిలోను ఆగదు కదా?”

“..................”

“గౌతమి రేపు ఉదయం వెళ్ళిపోతుందా? అదేం నాన్నా?.... సుమ పెళ్ళికి హైద్రాబాదొచ్చి అక్కడి నుంచి వెళ్ళమని చెప్పకూడదా?”

“..................”

“అయితే అక్కడి నుంచే శాస్త్రిగారిని... అదే మనింటి పురోహితుడిని వెంటబెట్టుకొని మీరు అమ్మే వస్తున్నారన్నమాట. సరే నాన్నా! ఇక్కడికొచ్చాక అన్నివిషయాలు మాట్లాడుకుందాం. బస్‌స్టాండ్‌కి మీ అల్లుడిగారిని పంపనా?”

“..................”

“వద్దా?.... సరే.... మీరే ఆటోలో వచ్చేస్తారా? మరిక ఉంటాను నాన్నా!” అంటూ సుభద్ర ఫోన్ పెట్టేసింది.

“ఏమిటో దాని అదృష్టం ఇలా తగలడింది. సారథే బతికి ఉండి ఉంటే సుమ పెళ్ళి పల్లెలోనే రంగరంగ వైభవంగా జరిగేది. ఇప్పుడేమో ఎవరూ లేనట్లుగా అనామకంగా గుళ్ళో క్లుప్తంగా జరుపబోతున్నారు”. నిట్టూరుస్తున్న భార్య కేసి కోపంగా కొరకొరా చూశాడు ఆనందరావు.

“ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. మీ నాన్న వాళ్ళు మనస్సు మార్చుకొన్నారంటే... ఏ అమెరికా సంబంధమో చూసి అంతకంటే గొప్పగా ఘనంగా చేసేయొచ్చు పెళ్ళి”.

“మీరు అలా మాట్లాడుతారేమండీ? నాన్న అమ్మ మనవరాళ్ళ బాధ్యతను, వాళ్ళ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొనే ఈ నిర్ణయం తీసుకొని పెళ్ళికి ఒప్పుకున్నారు కదా?”

“ఊఁ, నీ వెళ్ళుతున్నావా పెళ్ళికి?”

“ఆఁ, తప్పకుండా వెళ్ళాలి కదా!”

“వెళ్తే వెంటనే వచ్చేసేయ్” అంటూ చేతిలోని పేపర్ని సోఫాలోకి గిరవాటేసి పడుకోవడానికన్నట్లుగా పడగ్గదిలోకి వెళ్ళిపోతున్న భర్త వంక విస్మయంగా చూడసాగింది సుభద్ర.

✧ ✧ ✧

“తెల్లవారబోతూంది. ఉషాకన్యకి స్వాగతం పలుకడానికన్నట్లుగా చెట్లపై పక్షులన్నీ కిలకిల రావాలతో మేల్కొల్పులు పాడుతున్నాయి. శివాలయానికి అవతలున్న ఇళ్లలో నుంచి ‘కొక్కొరోకో... కో...’ అంటూ కోడి కూతలు జోరుగా ఉత్సాహంగా వినవస్తున్నాయి.

గుమ్మం వాకిలి తలుపులు తెరుచుకొని బయటికొచ్చిన గౌతమికి చల్లని పిల్లగాలులు రివ్వున ముఖానికి కొట్టాయి.

మసక చీకట్లో గేట్‌కు ఇటువైపుగా ఉన్న సిమెంట్ చప్టాపై ఏదో తెలియని తెల్లని ఆకారం అటు తిరిగి కూర్చుని ఉంది. అది కంటబడగానే భయాందోళనలతో ఓ గావు కేక పెట్టి తలుపులేసి మళ్ళీ లోపలికి పరుగెత్తు కొచ్చిందామె.

గౌతమి పెట్టిన ఆ గావుకేకతో మంచి నిద్రలో ఉన్న మస్తాన్ ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు కళ్ళు నులుపుకుంటూ.

“ఏంటమ్మాయిగారూ! అంతలా కేక పెట్టారు?”

గౌతమి అరుపుకన్నా ముందే లేచిన అన్నపూర్ణమ్మ కూడా భయంతో వణుకుతున్న కూతురి దగ్గరగా వెళ్ళి “ఏదో చూసి జడుసుకున్నావులా ఉంది. ఏమైంది గౌతమీ?” తలపై చెయ్యి వేసి ఆప్యాయంగా నిమురుతూ అంది.

“అమ్మా!... మరే... మరే బయట వాకిట్లో సిమెంట్ చప్టాపై ఏదో తెల్లని ఆకారం కూర్చుని ఉంది. అది బహుశా అన్నయ్య.... అన్నయ్య ఆత్మనేమో నమ్మా” తల్లిని బిగ్గరగా కరుచుకొని బావురుమంది గౌతమి.

“అన్నయ్య ఆత్మ! హుఁ, మనకంత అదృష్టం కూడానా? ఒక్కనాడైనా ఇంతవరకు ఈ కన్నతల్లికి కలలోకి కూడా రాలేదాయె! ఎక్కడో దూరాన వాడి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. కడసారి చూపులకైనా నోచుకోలేని అభాగ్యులం మనం. అలాంటి వాడీనాడు ఆత్మరూపంగా తిరిగొచ్చాడని నీవంటే... నన్ను నిజంగా నమ్మమంటావా? పద, బయటికెళ్ళుదాం. నువ్వేం చూసావో మరి...” అంటూ కూతురికి అభయమిచ్చి గుమ్మం వాకిలివైపు కదిలిందావిడ.

“వద్దమ్మా... వద్దు! నాకు చాలా భయంగా ఉంది”.

“ఫర్వాలేదు పదండమ్మగారూ! నేనూ వస్తాను” పక్కనున్న దుడ్డు కర్రను చేతిలోకి తీసుకొని మస్తాన్ కూడా లేచి నిలబడ్డాడు.

వీధి గుమ్మం తలుపులు తెరుచుకున్నాయి.

శివార్చనకు వేళైనట్లుగా దగ్గరలోనే ఉన్న నీలకంఠేశ్వరస్వామి ఆలయంలోని గంటలు శుభసూచకంగా సుమధురంగా మారు మోగాయి.

“ఏదీ, ఎక్కడ చూపించు” అన్నపూర్ణమ్మ ధైర్యంగా ముందుకు అడుగు వేయసాగింది.

“అదిగోనమ్మా ఆ సిమెంట్ చప్టాపై అటు తిరిగి కూర్చొని ఉంది చూడు. తెల్లని ముసుగేసిన ఆకారం”.

అప్పుడే అటుకేసి చూసిన మస్తాన్, అన్నపూర్ణమ్మ కూడా నిశితంగా గమనించారు ఆకారాన్ని.

“ఎవరు? ఎవరది? పలుకరేం? ” గట్టిగా గద్దించిందావిడ.

ఆ ఆకారంలో చలనం లేదు.

“ఉండండమ్మగారు! మీరీడనే ఆగండి. దాని విషయమేమిటో నేను కనుక్కుంటాను...” అంటూ మస్తాన్ చేతిలోని కర్రని ఎత్తిపట్టుకొని ముందుకు అడుగేశాడు.

తల్లి భుజాన్ని భీతితో బిగ్గరగా కరుచుకొని పట్టుకొని ఉంది గౌతమి నిలువెల్లా వణుకుతూ.

“నువ్వాగు మస్తాన్!” అంటూ కూతురితోపాటు ముందుకు ఆ ఆకారానికి అభిముఖంగా నడిచిందావిడ.

తెల్లని బట్టలతో తెల్లటి బారెడు గడ్డం, జులపాల జుట్టుతో పద్మాసనంలో కూర్చుని కళ్ళు రెండూ మూసుకొని ధ్యాననిమగ్నుడై ఉన్న ఆ ప్రశాంతమైన వదనంలో కోటేరులాంటి ఆ పొడుగు ముక్కుని చూడగానే అన్నపూర్ణమ్మ కళ్ళు పత్తికాయల్లా అయ్యాయి. ‘ఇది నిజమా? ఇది సంభవమా? తనకళ్ళని తానే నమ్మలేక భ్రమిస్తున్నాయా?’ అనుకుంది. పాతికేళ్ళనాడు ఇల్లు విడిచిన భర్త పోలికలు ఆయనలో సుస్పష్టంగా గోచరించాయి. చేష్టలుడిగిన దానిలా

రెప్పవాల్చకుండా చూస్తుంటే... అది సంతోషమో దుఃఖమో తెలియని భావోద్వేగంతో ఆవిడ కాళ్ళలో సన్నగా వణుకు ప్రారంభమై అలాగే కూలబడిపోసాగింది.

“ఈయనో సాధుపుంగవుడమ్మగారూ! ఇక్కడికెలా వచ్చాడబ్బా!” అంటూనే స్పృహ కోల్పోతున్న అన్నపూర్ణమ్మను కిందపడకుండా మస్తాన్ గౌతమి చెరో వైపు పట్టుకొని ఆపడానికి ప్రయత్నించారు.

ఏం జరుగుతోందో తెలియని విషమపరిస్థితిలో “అమ్మా!” అంటూ గౌతమి పెట్టిన గావుకేకకి, ఆ ఋషీశ్వరుడు నెమ్మదిగా కళ్ళు తెరిచి చుట్టూ ఉన్న పరిసరాలనీ, మనుషులని గమనించాడు.

✧ ✧ ✧

“రుక్మిణీ, రుక్మిణీ!...”

“ఆఁ, వస్తున్నాను. ఏంటన్నయ్యా?”

“మరి నువ్వు రత్తాల్ని తోడుగా ఉంచుకొని ఇక్కడే ఉంటావా? లేక పూర్ణ వాళ్ళింటికి వెళ్ళతావా?” ప్రయాణానికి అంతా సిద్ధమైన వెంకట్రామయ్యగారు చెల్లెల్ని పిలిచి అడిగాడు.

“గౌతమి కూడా ఈ రోజే ఊరెళ్ళుతుందట. నన్నక్కడికి వచ్చి అక్కకి తోడుగా ఉండమని ఫోన్ చేసి చెప్పింది నిన్ననే”

“సరే, నీ ఇష్టమిక, మేం తిరిగొచ్చే వరకు పూర్ణ దగ్గరే ఉండుమరి”.

“అలాగే అన్నయ్యా!”

“మీ వదిన ఇంకా తయారు కాలేదా? బస్సుకి టైం అవుతూంది. శాస్త్రిగారు కూడా ఇంకా రానేలేదు” వాచీ కేసి చూసుకుంటూ ప్రయాణానికి హడావుడి పడుతున్నాడు వెంకట్రామయ్యగారు.

“అయిపోయిందండీ నేను తయారే!” చీర కుచ్చెళ్ళు సవరించుకుంటూ సుశీలమ్మ ఇవతలికి వచ్చింది.

“అంతలోనే మస్తాన్ పెద్ద పెద్ద అంగలేస్తూ పరుగెత్తుకుంటూ ఇంట్లోకి వచ్చాడు.

“ఏంటిరా, ఏమైంది?” భయ విహ్వలుడైన ఆయన కంగారుగా అడిగాడు.

అక్కడే ఉన్న రుక్మిణి, సుశీలమ్మ విస్తుబోయి చూస్తున్నారు మస్తాన్ వంక.

చాలా దూరం నుంచీ పరిగెత్తుకొని రావడం వలన ఆయాసంతో ఒగర్చుతున్నాడు. శ్వాస తీసుకోవడానికి కష్టపడుతున్నాడు.

"ఏమైందిరా మస్తాన్? ఎందుకిలా పరిగెత్తుకొచ్చావు? పూర్ణ కుశలమే కదా? ఎవరికీ ఏం అపాయం కలుగలేదు కదా?" పెద్ద కూతురి మరణవార్త విన్నప్పటి నుంచీ ఇలాంటి సన్నివేశం ఎదురైతే భయాందోళనలతో తల్లడిల్లి పోతున్నాడాయన.

"ఆఁ..." తల ఊపుతూ "మరే... మరేనండి అయ్యగారు! పెద్ద బాబుగారు... సాధువు బాబుగారు తిరిగొచ్చారండీ"

ఆయన భ్రుకుటి ముడిపడిందీసారి.

"సాధువు బాబుగారెవ్వరురా?"

"అదేనండీ. పెద్దమ్మగారి... పూర్ణమ్మగారి భర్త ఇన్ని సంవత్సరాలకి తిరిగొచ్చారింటికి"

"ఆఁ...?' ముగ్గురూ అప్రతిభులైపోయారు.

"ఏం మాట్లాడుతున్నావురా మస్తాన్? నిజమా... నిజమా ఇది!"

"అవును బాబుగారూ! నిజమే. మీరు వెంటనే బయలుదేరి రండి. ఉన్న ఫళంగా మిమ్మల్నంతా వెంటబెట్టుక రమ్మని గౌతమమ్మగారు పంపారు.

"ఎంతటి శుభవార్త మోసుకొచ్చావురా!" ఆయన కళ్ళలో ముఖంలో సంతోష తరంగాలు ఎగసి పడ్డాయి.

ఆ బాబుగార్ని చూడగానే మతి తప్పి పడిపోయిందమ్మగారు. సాధువు బాబుగారు తన దగ్గరున్న చెంబులోనుంచి నీళ్ళు తీసి ముఖాన చల్లారు. అవి మంత్రపు నీళ్ళు కాబోలు! చటుక్కున లేచి కూర్చున్నారు అమ్మగారు. చాలా మహిమ చూపగల సాధువులాగున్నారు".

వాళ్ళు ముగ్గురూ మరో మాటకైనా ఎదురు చూడకుండా మస్తాన్ వెంట పరుగులాంటి నడకతో వెళ్ళారు.

మోకాళ్ళ నొప్పులున్న సుశీలమ్మ మాత్రం కాస్త వెనుక పడింది.

వీళ్ళంతా వెళ్ళేసరికి అన్నపూర్ణమ్మ ఇంట్లో నయనానందకరమైన దృశ్యం కనబడింది.

కేశవరావుని వెంటనే బాగానే పోల్చుకున్నాడు వెంకట్రామయ్యగారు. ఆనందాతిశయం పట్టలేక బావని మనసారా ఆలింగనం చేసుకున్నాడు.

ఆనందబాష్పాలతో అక్కడి వాళ్ళందరి కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఆ ద్వారకానాథుడైన జగద్విధాత ఇన్నేళ్ళకు మా పూర్ణ కోరికను తీర్చాడు".

"అన్నపూర్ణమ్మలో ఆనందం అద్వితీయంగా అలవికానంతగా వర్ణించ శక్యం కానంతగా పొంగిపొరలుతూంది.

"ఈ శుభ సమయంలో సారథి ఉండి ఉంటే ఎంత సంతోషపడే వాడో కదా!"

"సారథి సంభవించిన అకాలమరణాన్ని గురించి అతని మిత్రుడు డాక్టర్ రెడ్డి వచ్చి నాకు చెప్పేసరికి నమ్మలేకపోయాను. ఎంత ఆపుకున్నా నా మనసు ఆగలేదు. ఓడిపోయిన నా మనస్సు పిచ్చెక్కినట్లుగా, ఊపిరాడనట్లుగా విలవిల్లాడి పోయాను. ఓ రోజంతాను ఆలోచించాను... బాగా ఆలోచించాను. నా గురించి అంతదూరం వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్న చెట్టంత కొడుకును గురించి పూర్ణ ఎంతగా కుమిలి కుమిలి పోతూందో?... ఎంత దుఃఖాన్ని నరకాన్ని అనుభవిస్తూందో అంచనా వేయలేక పోయాను. ఆ రోజంతా బాధా దిగుళ్ళతో అమావాస్య చీకట్లో కొట్టు మిట్టాడు తున్నట్లుగా తపించిపోయాను.

"ఏం చేయలేని అశక్తత నన్నానాడు ఏదో తెలియని అగాధంలోకి నెట్టివేస్తే... అక్కడక్కడ దేశాలు పట్టుక తిరిగి శోధించి... శోధించి చివరికిలా వేదాంతం అనే సంతృప్తిని పొంది దాని ద్వారా సేద తీర్చుకున్నాను. కాని, ఇప్పుడిలా ఇన్నాళ్ళకు మనస్సు మార్చుకొని తిరిగి రావడం జరిగిందిలా..." మందస్వరాన ఎంతో ప్రశాంతత సంతరించుకొన్న మనస్సులో గుబురు మీసాల చాటు నుంచి గంభీరంగా చెప్పుకొచ్చా రాయన.

భర్త సమక్షంలో స్పృహ కోల్పోయిన అన్నపూర్ణమ్మ ఆయన సపర్యతోనే తేరుకుంది. ఇన్నేళ్ళుగా తాను పడ్డ కలతలన్నీ కష్టాలన్నీ తుడిచిపెట్టుక పోయినట్లుగా హాయిగా సాంత్వన పడి సేద తీరినట్లుగా ఉందావిడ మనస్సిప్పుడు.

'గుడ్డిలో మెల్ల...' అన్నట్లు ఆ భగవంతుడు కనికరించాడు. సారథి పోయినా కనీసం తండ్రినిక్కడికి రప్పించగలిగాడు. ఎక్కడున్నా మేనల్లుడి ఆత్మశాంతిస్తుందని మదిలో తలచాడు వెంకట్రామయ్యగారు.

గౌతమి ప్రయాణంతోపాటు వాళ్ళ ప్రయాణం కూడా వాయిదా పడింది.

ఆ రోజు ఆ ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది.

ఈ శుభవార్త తెల్పుతూ వెంకట్రామయ్యగారు ఆనందోత్సాహాలతో అందరికీ ఫోన్ చేశాడు.

సారథి బాబుగారి తండ్రి పెద్దబాబుగారు సాధువు రూపంలో తిరిగొచ్చాడన్న వార్త, ఆనోట... ఈ నోట ఆ పల్లెలో నలుమూలలా వ్యాపించింది. ఫలితం జనాలు గుంపులు గుంపులుగా వచ్చి కేశవస్వామిని దర్శించుకొని దండాలిడి వెళ్ళసాగారు.

ఫోన్ కాల్స్ అందిన వెంటనే కలా నిజమా అన్నట్లుగా సంతోష సంబరాలతో బంధుజనమంతా పల్లెకు తరలి వచ్చారు.

తమ పసితనంలో ఇల్లు వదలివెళ్ళిన తండ్రినిలా ఇన్నేళ్లకు మొట్టమొదటి సారిగా చూసుకుంటున్న రవీంద్ర గౌతమిల వవ్యోత్సాహంతో కూడిన ఆ ఆనందం వర్ణణాతీతం. ఆ సంతోష సంబరాలలో పాలుపంచుకోవడానికి గౌతమి భర్త కూడా వచ్చాడు.

ఇంతమంది వచ్చిన సారథి లేడన్న దిగులు మాత్రం వాళ్ళందరి అంతరాత్మలలో పట్టి పీడిస్తూ నరక యాతన అనుభవించారు.

ఆ మరుసటిరోజు వెంకట్రామయ్యగారు వాళ్ళు వెళ్ళిపోయారు.

అన్నయ్య కూతురైన సుమబాలని చిన్నప్పటినుంచి సారథికి చేసుకోవాలని తానెన్ని కలలు కందో... అవెలా భగ్నమయ్యాయో, ఇప్పుడు సుమబాల పెళ్ళి ఎవరితో ఎందుకు జరగబోతుందో అంతా పూసగుచ్చినట్లుగా భర్తకి వివరించింది అన్నపూర్ణమ్మ.

"పోనీలే, పూర్ణా! ఆ అమ్మాయికి మన ఇంటి కోడలయ్యే అవకాశం లేదు కాబోలు. అందుకనే ఆ విధాత సారథి పట్ల ఇంతటి ఘోరకృత్యం తలపెట్టాడు".

భర్త పలికిన సాంత్వన వచనాలతో మదిలో కాస్త ప్రశాంతత ఏర్పడిందామెకు.

పచ్చి కూరగాయలు... పచ్చిపాలు... పండ్లు అన్నీ సాత్త్వికఆహారపు అలవాట్లే కేశవస్వామికి.

ఎప్పుడైతే ఇల్లు విడిచాడో ఆనాడే రావు బదులు స్వామిగా పేరు మార్చుకున్నాడు. ఇప్పుడదే పేరుతో కేశవస్వామిగానే పిలువబడుతున్నాడు.

రోజుకి కొన్ని గంటల ధ్యానం... గుడిలోకొచ్చి భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పడం ప్రస్తుతం ఆయన దినచర్య.

నాయుడిగారి ఆధ్వర్యాన మస్తాన్ మరికొంత మంది పనివాళ్ళ సహాయ సహకారాలతో భర్త కోరిక మీదట... సారథి విశ్రాంతి రూంకి దగ్గర్లో పంపుసెట్‌కి సమీపంలో... జామతోటకివతల చక్కటి ప్రదేశంలో రేల్ గడ్డితో చక్కటి పర్ణశాల లాంటిది నిర్మించారు.

కేశవస్వామి వెంటనే తన మకాం అక్కడికి మార్చాడు.

అన్నపూర్ణమ్మ, రుక్మిణి రోజు అక్కడికెళ్ళి ఆయనతో ముచ్చటిస్తూ ఆయన చెప్పే భక్తి ప్రవచనాలు వింటూ గంటలు గంటలు గడిపేవారు.

✧ ✧ ✧

పల్లెకెళ్ళి తిరిగొచ్చాక. కన్నతండ్రిని కన్నులారా వీక్షించాక రవీంద్రలో మరింత ఆత్మవిశ్వాసం, నూతనోత్సాహం ద్విగుణీకృతమైంది. ఆ ఆనందంతో పరీక్షలకి బాగా తయారవుతున్నాడు.

బాబ్జీని తీసుకొని సుభద్ర తల్లిదండ్రులతోపాటు చెల్లెలు సుమపెళ్ళికని హైద్రాబాద్ వెళ్ళింది. పనిమనిషి వచ్చి ఇల్లూడ్చి టీ గిన్నెలు గ్లాసులు కడిగి బట్టలుతికి ఆరేసి వెళ్ళిపోయింది.

ఇంట్లో వంట ప్రయత్నాలేవీ మొదలుపెట్టక అన్నదమ్ములిద్దరూ బయటే తినడానికి నిన్ననే నిర్ణయించుకున్నారు.

ఆ రోజు సాయంత్రమే రఘురాంతో సుమ పెళ్ళి గుళ్ళో జరగవల్సి ఉంది.

ఆనందరావు ఆఫీసుకెళ్ళడానికి తయారవుతున్నాడు.

రవీంద్రకారోజు సెలవు. పెందరాళే నిద్రలేచి స్నానాదికాలు ముగించుకొని రేపు జరగబోయే అనాటమీ ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్‌కి శ్రద్ధాసక్తులతో ప్రిపేరవుతున్నాడు.

ఉన్నట్లుండి అతని సెల్ మోగింది.

ఓ వైపు ఏకదీక్షగా పుస్తకంలోకి చూస్తూ చదువుకుంటూనే సెల్ ఎత్తి "హలో" అన్నాడు.

ఎలాంటి శబ్దమూ వినబడలేదు.

"హలో! ఎవరూ?...." అన్నాడు మళ్ళీ ఓసారి బిగ్గరగా.

అవతలి వైపు నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేదు.

“అబ్బా!” అని విసుక్కుంటూ దాన్ని నొక్కి పక్కన పడేశాడు.

మళ్ళీ మోగిందీసారి సెల్.

‘చదువుకుంటున్నప్పుడు ఇదో డిస్టర్బెన్స్! దీన్ని అస్సలు ఆఫ్ చేసిపెట్టేయాలి’ అనుకుంటూ సెల్ చేతిలోకి తీసుకున్నాడు.

అప్రయత్నంగా నెంబర్ వంక చూశాడు కొత్తదిలా కన్పించి... ఆన్‌చేసి యధాలాపంగా “హలో” అన్నాడు.

“హలో, ప్లీజ్! ఫోన్ పెట్టేయకండీ! మీకో వెరీ వెరీ ఇంపార్టెంట్ గుడ్ న్యూస్ మేటర్ చెప్పాలి!...”

“ఇంతకీ మీరెవరండీ బాబూ?”

“నేను డాక్టర్ చక్రపాణిని. మీరు రవీంద్రే కదూ?”

“అవును. నేను అక్షరాలా రవీంద్రనే. మీరెక్కడి నుంచి మాట్లాడుతున్నారు?”

“బొంబాయిలోని.. ఓ పెద్ద హాస్పిటల్ నుంచి”

“ఇంతకీ న్యూసేమిటి సార్?” అవతలి వ్యక్తి డాక్టర్ కాబట్టి, తానూ ఆ వృత్తికి సంబంధించిన వాడు కావడం వలన రవీంద్ర ఈసారి చాలా సౌమ్యంగా అడిగాడు.

“మీ అన్నయ్య సారథికి ట్రీట్ చేస్తున్న డాక్టర్‌ని”.

“ఆఁ!....” రవీంద్ర నిటారైనాడు.

షాక్ తిన్నట్లైంది ఆయన అన్న ఆ మాటలకి.

“ఏంటి... ఏంటి సార్? మీరు మాట్లాడుతున్నది? మా అన్నయ్య... మా సారథి అన్నయ్యకా?...”

“ఆఁ.....”

“అన్నయ్య బతికే ఉన్నాడా సార్?” ఆనందమో ఆశ్చర్యమో తెలియని విషమ పరిస్థితిలో బిగ్గరగా అరచినట్లుగా అడిగాడు.

“మీరంతా అనుకున్నట్లుగా అతను చనిపోలేదు. ఆ రైల్లో ప్రమాదం జరిగిన సమీపంలో అతడు బాగా దెబ్బలు తగిలి కొన ఊపిరితో పొలాల్లో చెట్ల గుబురుల మధ్య పడిఉంటే.... ఆ పల్లె ప్రజలు అతన్ని తీసుకొచ్చి ఇక్కడ చేర్పించారు. ఊరేమో

పేరేమో తెలియని అతనికి చాలా రోజుల నుంచి వైద్యం జరుగుతూంది. అతని దగ్గర తన వాళ్ళదంటూ ఏ క్లూ కనిపించలేదు... మీకు సమాచారం తెలపడానికి. పేరు తెలియని అతను ఇన్నాళ్ళు ప్రాణాపాయ స్థితిలో కోమాలో కొట్టు మిట్టాడుతూ ఉన్నాడు. ఈ రోజే అర్ధరాత్రి కళ్ళు తెరిచాడు. ఇన్నాళ్ళుగా మేం చేసిన వైద్య ప్రయత్నానికి చక్కటి ఫలితం కనిపించింది. థాంక్ గాడ్!... అతను బతికాడు. అతనే ఇందాక మేమడిగిన ప్రశ్నలకు సమాధానాలిస్తూ మీ పేరు చెప్పి మీ సెల్ నెంబరు చెప్పాడు. తన గురించిన చాలా వివరాలు చెప్తూ తన పేరు సారథి అని చెప్పాడు. అందుకని ముందుగా మీకీ వార్త తెలియ చేస్తున్నాను..."

"థ్యాంక్స్ డాక్టర్! థ్యాంక్యూ వెరీమచ్. మేమిప్పుడే బయలుదేరి వస్తాం. బొంబాయిలో మీ హాస్పిటల్ ఎక్కడుందో వివరాలు చెప్పండి డాక్టర్!" అంటూ ఆనందంతో తడబాటుగా మాట్లాడుతూ ఆయన చెప్పిన అడ్రస్ నోట్ చేసుకున్నాడు రవీంద్ర గబగబా.

"ఏంటి రవీ! నీ విందాకట్నుంచీ ఎవరితో అలా బిగ్గరగా మాట్లాడుతున్నావ్?" అంటూ వేసుకున్న షర్టు స్లీవ్స్‌పైకి మడుచుకుంటూ పక్కగదిలో నుంచి ఆనందరావు వచ్చాడు.

"అన్నయ్యా! మనం చాలా అదృష్టవంతులమన్నయ్యా! సారథన్నయ్య బొంబాయిలో ఓ హాస్పిటల్లో బతికే ఉన్నాడన్నయ్యా!... " సంతోష తరంగాలలో తబ్బిబ్బై పోతూ... చేతిలోని సెల్‌ని పదే పదే ముద్దాడుతూ... ఆనందరావును పట్టుకొని ఇల్లంతా చిన్ని పిల్లాడిలా ఎగిరెగిరి గంతులేయసాగాడు.

"నిజమా?..." ఆనందరావు కళ్ళు సంతోషంతో తళతళ లాడాయి.

"సారథి... మనసారథి బతికే ఉన్నాడా? ఇదెలా సాధ్యం రవీ?..."

"అంతా భగవంతుడి లీలా వినోదమన్నయ్యా!...." అంటూ డాక్టర్ ఫోన్‌లో చెప్పిన విషయాలన్నీ మళ్ళీ వివరంగా వివరించాడు.

"మనం వెంటనే పల్లెకు ఫోన్ చేసి అమ్మ వాళ్ళకీ విషయం తెలుపుదాం అన్నయ్యా?"

"ప్లీజ్ రవీ! పల్లెకు కాదు ముందు హైద్రాబాద్‌కు ఫోన్ కలుపు. నీ విక్కడ అతి ముఖ్యమైన విషయం మర్చిపోతున్నావులా ఉంది. సుమ పెళ్ళి ఇంకొన్ని గంటల్లో జరుగబోతూంది. అది ఎట్టి పరిస్థితిలోను జరగకూడదు. ఆమె జీవితం

బుగ్గిపాలు కారాదు. మనమే అక్కడికెళ్ళి ఆపు చేయించడానికి టైం లేదు. క్విక్... రఘురాం అన్నయ్యకి ముందుగా ఫోన్ కల్పు'' చాలా హడావుడి పడిపోతున్నాడు ఆనందరావు.

రఘురాం సెల్‌కి ఫోన్ కలిసింది.

''హలో'' అంటూ అవతలి వైపు నుంచి రఘురాం అన్నయ్య గొంతు వినబడింది.

''హలో, రఘురాం అన్నయ్యగారూ! నేను ఆనందరావుని మాట్లాడు తున్నాను... ఇప్పుడే అందిన శుభవార్త! సారథి బతికే ఉన్నాడు. ఈ వార్త మామయ్య అత్తయ్య వాళ్ళకి చెప్పి వెంటనే ఈ పెళ్ళి ఆపు చేయించండి...'' అంటుండగానే అవతలి వైపు ఫోన్ కట్టైంది.

''ఇదేంటి? ఫోన్ కట్ చేశాడు?'' మళ్ళీ మళ్ళీ ఆ నెంబర్‌కు డయల్ చేయసాగాడు కాని నో రెస్పాన్స్!...

ఏదో ఆలోచిస్తున్న రవీంద్ర బుర్రలో తళుక్కున ఓ మెరుపు మెరిసింది

''అన్నయ్యా! సారథన్నయ్య బతికే ఉన్నాడన్న వార్త తెలిస్తే సుమ వదిన తనకిక దక్కదుగా! అందుకని తాను వినీ విననట్లుగా నటించి ఫోన్ ఆఫ్ చేసి పెట్టాడు కాబోలు. మరి మామయ్య వాళ్ళకి ఎలా తెలియాలీవిషయం?

''వాళ్ళది లాండ్ లైన్ నెంబర్ నీకు తెల్సా?''

''తెలియదన్నయ్యా!''

''ఉండు... సుభద్ర డైరీలో ఎక్కడో రాసే ఉంటుందంటూ ఆనందరావు తన గదిలోకెళ్ళి భార్య డైరీ చూసి ఆ ఫోన్ నెంబరు సంపాదించాడు.

రవీంద్ర గబగబా ఆ నెంబర్‌కి డైల్ చేశాడు.

ఆ ఫోన్‌కి కూడా రెస్పాన్స్ లేదు. ఆ ఫోనే పనిచేయడం లేదు.

''దౌర్భాగ్యుడు! సుమ ఎక్కడ తనకు కాకుండా పోతుందోనని ఈ ఫోన్ కనెక్షన్ పీకేశాడులా ఉంది. ఇప్పుడెలా రవీ! హైద్రాబాద్‌కు మామయ్య వాళ్ళకెలా ఈ వార్త చేరాలి? ముందిప్పుడు పల్లెకు ఫోన్ చేసి చెప్పు. నాయుడిగారిచే అక్కడనే ఓ జీవు మాట్లాడుకొని వెంటనే వాళ్ళనిక్కడికి రమ్మను. ఎయిర్‌పోర్ట్‌కి ఫోన్ చేసి ప్రస్తుతానికి నాలుగు టికెట్స్ బుక్ చేయ్; బొంబాయి ప్లేన్‌కి... '' రవీంద్రకు పని అప్పచెప్పి ఆనందరావు హాల్లో అటూ ఇటూ పచార్లు చేస్తూ చాలా తీవ్రంగా

ప్రయత్నించసాగాడు. సుమ పెళ్ళి రఘురాంతో జరగకుండా ఏ విధంగా ప్రయత్నించాలా అని మథనపడసాగాడు.

కనీసం సుభద్రకి తెలిసినా పెళ్ళి ఆగిపోతుంది. 'ఎలా... ఎలా వాళ్ళకి తెల్పడం? భగవాన్! నీవే దయతో ఏదైనా దారి చూపాలి' పదే పదే ఆ సాయినాథ్‌ని మనస్సులో వేడుకోసాగాడు.

✧ ✧ ✧

"ఫోన్ మోగుతుంది ఎత్తి చూడక్కయ్యా! ఎవరి నుంచో? ఎక్కడి నుంచో..." కూరగాయలు తరుగుతున్న రుక్మిణి వంటింట్లో నుంచి అంది.

అన్నపూర్ణమ్మ వెళ్ళి రిసీవర్ ఎత్తి "హలో" అంది.

"అమ్మా! అమ్మా! నేను రవీంద్రను మాట్లాడుతున్నాను... నాన్నగారొచ్చిన వేళా విశేషం! మనకన్నీ శుభవార్తలేనమ్మా! అన్నయ్య... మన సారథన్నయ్య బతికే ఉన్నాడట బొంబాయిలోని ఓ హాస్పిటలో. అక్కడి నుంచి నాకు ఇందాకనే ఫోన్ వచ్చింది..."

"ఆఁ... నిజమా!... నిజమా రవీ ఇది?"

"నిజమేనమ్మా. నాయుడిగారి ద్వారా ఓ జీపు మాట్లాడుకొని వీలైనంత త్వరగా మీరిక్కడికి రండి. రేపు ఫ్లైట్‌లో మనం బొంబాయి అన్నయ్య దగ్గరికి వెళ్ళుదామమ్మా!" రవీంద్ర అవధులు లేని ఆనందంతో గబగబా మాట్లాడుతూనే ఉన్నాడు.

"ఇది నిజమా రవీ? నువ్వు చెప్పేది నిజమా? సారథి... మన సారథి బతికే ఉన్నాడా? భగవంతుడు ఎంతటి కరుణామయుడు రవీ! ఎంతటి అపారకృపను మనపై గుమ్మరించాడు. మొన్నటికి మొన్న హఠాత్తుగా నాన్నగారు రావడం! ఈ రోజు సారథి బతికే ఉన్నాడన్న నిజం తెలియడం ముందుగా హైద్రాబాద్‌కి ఫోన్ చేసి ఈ శుభవార్త చెప్పి సుమ పెళ్ళి ఆపు చేయించు రవీ! సుమ మన ఇంటి కోడలు కావాల్సిన పిల్ల!...

"అలాగలాగే... నేను ఆనందరావు అన్నయ్య అదే ప్రయత్నంలో ఉన్నాం. కాని వాళ్ళకి ఫోన్ కలువకుండా చేశాడు రఘురాం అన్నయ్య".

"అయ్యో! మరిప్పుడు ఎలాగరా?"

"నీవేం కంగారు పడకు. ఎట్టి పరిస్థితిలోనూ ఆ పెళ్ళి జరగదమ్మా! నాన్నగారితోపాటు మీరంతా వీలైనంత త్వరగా వచ్చేయండి" అంటూ ఫోన్ పెట్టేశాడు.

ఆ సంభాషణ ద్వారా సారథి బతికే ఉన్నాడన్న వార్త అర్థమై రుక్మిణి కూరగాయల్ని, కత్తి పీటని వదిలేసి అక్క దగ్గరికి ఆనందంతో పరిగెత్తుకొని వచ్చి ఆమెను వాటేసుకుంది బిగ్గరగా.

అక్కా చెల్లెళ్ళు ఇద్దరి కళ్ళల్లో ఆనంద బాష్పాలు తొణికసలాడు తున్నాయి.

"సారథి బతికుండడం నిజంగా మనం చేసుకున్న అదృష్టమక్కయ్యా! సుమ పెళ్ళి కాక మునుపే తెలియడం మరీ మరీ అదృష్టవంతులం..."

"కాని వాళ్ళకక్కడికి ఫోన్లేవీ కలవడం లేదట రుక్మిణీ! ఏం చేయడం? ఓ భగవంతుడా! సుమకాపెళ్ళి జరగకూడదు..." అంటూ ఆదరా బాదరాగా పూజాగదిలోకి వెళ్ళి ఏడుకొండల స్వామికి భక్తి శ్రద్ధలతో ముడుపు కట్టి మనసారా మొక్కుకుంది.

రుక్మిణి కూడా నీలకంఠేశ్వరస్వామికి నూట ఎనిమిది కొబ్బరి కాయలు కొట్టి అభిషేకం చేయిస్తానని మనస్సులోనే ప్రార్థించింది.

"త్వరగా పద రుక్మిణీ! మనమిప్పుడు పొలం దగ్గరికెళ్ళి మీ బావగారితో ఈ తీయని శుభవార్త చెప్పి, నాయుడిగారితో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా జీపు మాట్లాడుకొని వెళ్ళిపోవాలి" అంటూ అన్నపూర్ణమ్మ చెల్లెల్ని తొందర పెట్ట సాగింది.

"వెళ్ళుదాం గానీ, రవి చెప్పాడో లేదో ఫోన్ చేసి గౌతమి కీ విషయం చెప్పక్కయ్యా!" అంటూ గుర్తు చేసింది రుక్మిణి.

"అవునేవ్... మర్చేపోయాను" మళ్ళీ ఆవిడ ఫోన్ దగ్గరికి పరిగెత్తింది.

✧ ✧ ✧

సుమ వివాహానికిక ఓ గంటే టైముంది.

అందరూ శాస్త్రిగారితో పాటు గుడి కెళ్తున్నారు.

సుభద్రే దగ్గరుండి అక్క నగలు పెట్టి చక్కగా చెల్లెల్ని అలంకరించింది.

ముసలావిడ చాలా సంతోషంగా ఉందా శుభసమయంలో.

అంతా వెళ్ళాక తాపీగా సుభద్ర బాబ్జీని తయారు చేస్తుంది.

"తొందరగా గుడికి వచ్చేసేయ్ సుభద్రా!" సుశీలమ్మ కూతుర్ని మరోసారి హెచ్చరించి వెళ్లిపోయింది.

"అలాగేనమ్మా. నువ్వెళ్ళు..."

"మమ్మీ! మనం ఓసారి డాడీకి ఫోన్ చేద్దామా?"

"ఏం, ఎందుకనీ? ముందు నీవు త్వరగా తయారుకారా, బాబ్జీ, ఫోన్ సంగతి తర్వాత ఆలోచించుదాం..." కొడుక్కి షర్టుకాలర్ సరిచేసి తల దువ్వుతూ "ఇంట్లోని ఫోన్ పని చేయడం లేదు కదా! ఎలా చేద్దాం ఫోన్ మరి?" మళ్ళీ సుభద్రే అంది.

"గుడికెళ్ళేప్పుడు దారిలో అ పక్కనే ఎస్.టి.డి. ఫోన్ బూత్ ఉంది. మమ్మీ!"

"అవునా... అయితే చేద్దాంలే?"

"ఆ బూత్ నుంచి ఫోన్ చేసి డాడీతో బాబాయ్‌తో మాట్లాడదాం మమ్మీ!"

"అబ్బా! సరే అన్నానుగా, అయినా ఈ పెళ్ళి అయిపోగానే రేపు ఎలాగో మనం వెళ్ళే పోతాం కదా బాబ్జీ! ఇప్పుడెందుకు వాళ్ళకి అనవసరంగా ఫోన్ చేయడం చెప్పు?" ఓ క్షణం కోపంగా చూసి విసుక్కుందామె కొడుకుని.

"ప్లీజ్ మమ్మీ!..."

"సరే సరే... పద షూ వేసుకో ముందు" కొడుకును తొందర పెట్టి హేండ్ బ్యాగ్‌ని చేతిలోకి తీసుకొని ఇంటికి తాళంపెట్టి రోడ్డు మీదికి వచ్చిందామె గబగబా.

సుమ పెళ్ళి జరిగేది వాళ్ళింటికి సమీపంలోనే ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోనే కాబట్టి కొడుకు చెయ్యి పట్టుకొని వడివడిగా నడుస్తొంది సుభద్ర.

"మమ్మీ! ఫోన్..." బాబీ అక్కడే ఆగిపోయి, ఫోన్ బూత్ వైపు చెయ్యి పెట్టి చూపిస్తూ మళ్ళీ గుర్తు చేశాడు.

"అబ్బబ్బా! చెప్తే నువు వినవు కదా! సరే పద..." విసుక్కుంటూ ఆ పక్కనే ఉన్న బూత్‌లోకి వెళ్ళింది భర్తకి ఫోన్ చేయడానికి.

నెంబర్ డయల్ చేసి "హలో" అంది సుభద్ర.

"హలో వదినా! నేను రవీంద్రను పెళ్ళి అయిపోయిందా? ఆనందన్నయ్య వచ్చాడా అక్కడికి? ప్లీజ్ వదినా! ఫోన్ పెట్టేయకు. నేను చెప్పేది కాస్త వినొదినా! సారథన్నయ్య బొంబాయిలో ఓ హాస్పిటల్లో బతికే ఉన్నాడు. ఈ రోజు అన్నయ్యకు వైద్యం చేస్తున్న డాక్టర్ ఫోన్ చేసి చెప్పాడు. సుమవదిన పెళ్ళి ఎలాగైనా ఆపు

చేయించాలని రఘురాం అన్నయ్య సెల్‌కి ఫోన్ చేసి చెప్పినాం. ఆయన మాకు ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వకుండా సెల్ ఆఫ్ చేసి పెట్టడమే గాక, ఇంట్లోని ఫోన్ కూడా పనిచేయకుండా చేశాడొదినా దుర్మార్గుడు! మామయ్య వాళ్ళకీ వార్త తెలిస్తే... సుమ తనకు దక్కదని కాబోలు ఇలా చేశాడొదినా! అందుకనీ టాక్సీ తీసుకొని అన్నయ్య బయలుదేరాడు రేపు బొంబాయి వెళ్ళాలి. నీవు త్వరగా వెళ్ళి ఈ విషయం అందరికీ చెప్పి పెళ్ళిజరగకుండా చూడొదినా! క్విక్! పల్లెనుంచి అమ్మ కూడా ఇదే అంటోంది....'' రవీంద్ర ఏకధాటిగా ఆగకుండా మాట్లాడాడు.

''నిజమా రవీ ఇది? నీవు చెప్పేది నిజమేనా? సారథి... మన సారథి బతికే ఉన్నాడా?.... ఎంతటి తీయని వార్త చెప్పావు! మీ అన్నయ్య ఇంకా రాలేదు, రఘురాం బావ కావాలనే అలా ఫోన్ కట్ చేసి ఉండొచ్చు. నిజంగానే సుమ ఇక అతనికి దక్కదుగా! నేనిప్పుడు గుడికెళ్ళుతున్నాను రవీ! బాబ్జీగాడు 'ఫోన్ ఫోన్...' అంటూ నా వెంటబడితే చేశాను. నేనిలా చేయడం నిజంగా చాలా మంచిదైంది. ముందుగా బాబ్జీకి చెప్పాలి థ్యాంక్స్. ఇదిగో వీడితో మాట్లాడు'' సుభద్ర మనస్సిప్పుడు ఆనందోత్సాహాలతో గాలిలో తేలిపోతున్నట్లుగా హాయిగా ఉంది.

కొడుకు మాట్లాడగానే మళ్ళీ ఫోన్ అందుకొని ''రవీ! పెట్టేస్తున్నాను. ముందు గుడికెళ్ళి మనవాళ్ళందరికీ శుభవార్త చెప్పాలి'' అంటూ ఫోన్ పెట్టేసి బిల్ చెల్లించింది.

''సారథి బాబాయ్ నిజంగా చనిపోలేదా మమ్మీ?''

''లేదురా... బతికే ఉన్నాడట'' ప్రేమగా కొడుకును ముద్దాడుతూ ''పద మనం గబగబా వెళ్ళాలి గుడికి'' అంటూ బాబ్జీ చెయ్యిపట్టుకొని ఆఘమేఘాలమీద గుడికి చేరుకుంది.

గుళ్ళో అక్కడ పల్లెనుంచి వచ్చిన పురోహితుడైన శాస్త్రిగారు పెళ్ళికి కావలసిన వస్తువులన్నీ సంచిలో నుంచి తీస్తూ రెడీగా పెట్టుకునే పనిలో చాలా హడావుడిగా ఉన్నాడు.

''నాన్నా నాన్నా! ... అమ్మా! సుమా! అందరూ వినండి! సారథి.... మన సారథి బతికే ఉన్నాడట; బొంబాయిలో ఓ హాస్పిటల్లో. ఈ పెళ్ళి ఎట్టి పరిస్థితిలోను జరగడానికి వీల్లేదని పూర్ణమ్మ అత్తయ్య కూడా చెప్పిందట. బాబ్జీ ఒకటే గోల పెడితే ఇందాక ఇంటికి ఫోన్ చేశాను. రవీంద్ర చెప్పాడీ విషయాలు. మీ అల్లుడు గారు కూడా టాక్సీ తీసుకొని ఇక్కడికే బయలు దేరారట. ఇంకాసేపట్లో ఇక్కడికి చేరొచ్చు....'' అని చెప్తున్న సుభద్ర మాటల్ని అందరూ మంత్ర ముగ్ధుల్లా విన్నారు.

సుమకి తనేం వింటుందో అర్థంకాకపోయిందో క్షణం శిలా ప్రతిమలా నిలబడిపోయింది. ఆమె తన అదృష్టానికి తానే నమ్మలేకపోతూంది.

"అవునా అక్కయ్యా! ఇది నిజమా అక్కయ్యా!... బావ.... సారథి బావ బతికే ఉన్నాడా?" సుమ ఒక్క అంగలో పరిగెత్తుకొచ్చి అక్కని వాటేసుకుంది.

"నిజంగా నీవు చాలా అదృష్టవంతురాలివమ్మా సుమా! ఈ శుభవార్త మనకు తెలియడానికి ఒక్కరోజు ఆలస్యమైనా చాలా ఘోరం జరిగేది..." అక్కున చేర్చుకున్న చెల్లెలి తలను ప్రేమగా నిమురుతూ అంది సుభద్ర.

నిజమో కలయో తెలియని స్థితిలో ఉండిపోయిందామెకు అక్క స్పర్శ. మాటలతో ఇది కలకాదు... యథార్థమని తెలుసుకొని భరించ శక్యంగాని ఆనంద కెరటాలు ఆమె గుండె లోతుల్లోన ఎగసి పడుతున్నాయి.

"రఘురాం బావ సెల్‌కి ఫోన్ చేసి మీ అల్లుడుగారు ఈ శుభవార్త మన కందరిక చెప్పమని చెప్పాడట కూడా.... ఆ తరువాత ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వకుండా సెల్ ఆఫ్ చేసి పెట్టాడట. ఇంట్లో ఫోన్ మోగక పోవడానికి కూడా కారణం ఆయననే అని అనుకుంటాను నేను. ఇది నిజమే కదా బావా?" క్రీగంటగా చూస్తూ ధైర్యంగా అడుగుతున్న మరదలి కళ్ళల్లోకి సూటిగా చూడలేక తప్పుచేసిన వాడిలా అవమాన భారంతో తల వంచుకున్నాడు రఘురాం.

అంతలోనే ఓ టాక్సీ శరవేగంతో వచ్చి గుడి ముందాగింది.

అందులోనుంచి ఆనందరావు హడావుడిగా దిగి గబగబా గుళ్ళోకి పరిగెత్తు కొచ్చినట్లుగా రాసాగాడు.

✧ ✧ ✧

ఓ మినీ వ్యాన్ వచ్చి ఆగింది హాస్పిటల్ ముందు.

అందులోనుంచి అందరూ బిలబిల మంటూ ఆత్రంగా కిందికి దిగి పరిగెత్తు తున్నట్లుగా లోనికెళ్ళసాగారు.

సెక్యూర్టీగార్డ్ గుంపుగా ఉన్న వాళ్ళందర్నీ ఎగాదిగా చూస్తూ మధ్యలోనే ఆపాడు.

"ఎవరు మీరంతా? ఎవరు కావాలి మీకు?" అంటూ హిందీలో అడిగాడు.

"మాకు డాక్టర్ చక్రపాణిగారు కావాలి..." అంటూ సారథి విషయమంతా క్లుప్తంగా చెప్పారు ఆనందరావు, రవీంద్రలు.

"ఓఁ, అలాగా!... ఆ డాక్టర్‌గారు ఫస్ట్‌ఫ్లోర్‌లోనే కుడివైపు నున్న రూం నెంబర్ సిక్స్‌లో ఉంటారు. వెళ్ళండీ..." అంటూ వాళ్ళని లోనికి పంపాడు.

ముందుగా ముఖ్యులు ఓ ముగ్గురో నలుగురో వెళ్ళుదామని ప్లేన్ టికెట్స్ బుక్ చేశారు. కాని అందరూ ప్రయాణమయ్యే సరికి ఆ టికెట్స్ క్యాన్సిల్ చేసేసి ఇలా ఓ మినీ బస్సు మాట్లాడుకుని అందరూ వచ్చేశారు.

డాక్టర్ చక్రపాణిగారు తన గది ముందు గుంపుగా వచ్చిన వాళ్ళందర్నీ సంభ్రమంగా చూస్తూ, "ఓహోఁ! మీరంతా సారథి కుటుంబ సభ్యులన్నమాట. నేనన్నది నిజమే కదా? రండి... రండీ" సంతోషంతో అంటూ రవీంద్రతో పాటు వాళ్ళందర్నీ పరిచయం చేసుకొని సారథి ఉన్న రూం వైపుకు తీసుకపోసాగాడు.

"ఇప్పుడు మా అబ్బాయి ఎలా ఉన్నాడు డాక్టర్? వాడు బతకడానికి ముఖ్య కారణమైన ప్రాణదాతలు మీరు!... " అంటూ అన్నపూర్ణమ్మ ఆనందం పట్టలేకపోయి... గభాల్న ఆయన కాళ్ళ మీద పడినంత పని చేసింది.

"అయ్యయ్యో! ఇదేమిటమ్మా! లేవండి మీరు.... నా వృత్తి ధర్మాన్ని నేను సక్రమంగా నిర్వర్తించాను. మీరు ముందుగా కృతజ్ఞతలు చెప్పవలసింది నాకు కాదు అతన్ని ఇక్కడికి సరైన సమయంలో తీసుకొచ్చి విలువైన అతని ప్రాణాలు కాపాడారు ఆ పల్లె ప్రజలు. లేకుంటే పరిస్థితి మరోలా ఉండేది. సారథిప్పుడు ఫర్‌ఫెక్ట్ ఆల్‌రైట్! కానీ, మీరంతా కలిసి అతన్ని మరీ ఎక్కువగా మాట్లాడించకండి!..." అంటూ డాక్టర్ గారు ముందుకు సాగారు.

అనిర్వచనీయమైన తన్మయావస్థను అనుభవిస్తున్న సుమ అతని వెనకాలే ఉంది. బావనెప్పుడు చూస్తానా అన్నట్లుగా ఆత్రుత పడుతోందామె.

గదిలోపలికి అడుగు పెట్టగానే కొంచెం చిక్కిపోయి నీరసంగా కళ్ళు మూసుకొని బెడ్‌పై దిండుకానుకొని కూర్చుని ఉన్న సారథిని చూడగానే అందరి హృదయాలలో పూలవాన కురిసినట్లైంది ఒక్కసారిగా.

అందరికన్నా ముందుగా సుమ "బావా" అని నోరార ప్రేమగా పిలుస్తూ అతని గుండెలపై వాలిపోయింది పరిగెత్తుకెళ్ళి.

కన్నీళ్ళతో హీనస్వరంతో "బాబూ, సారథీ!" అంటూ కొడుకుని ఆప్యాయంగా ఆనందంతో ఆలింగనం చేసుకుంది అన్నపూర్ణమ్మ.

''మిస్టర్ సారథీ! మీ బంధుపటాలమంతా వచ్చేసింది చూడు. ఎంజాయ్ యువర్ సెల్ఫ్'' అంటూ డాక్టర్ నవ్వుతూ రవీంద్రతో ఆనందరావుతో కరచాలనం చేసి బయటికి వెళ్ళిపోయాడు.

నుదుటిమీద... చేతులకి తగిలిన దెబ్బల తాలుకు మచ్చలింకా అక్కడక్కడ తెల్లగా కనబడుతూనే ఉన్నాయి.

అందర్నీ ఒక్కసారిగా చూసిన ఆనందం కన్నా అందరికన్నా వెనకాలా నిల్చున్న కేశవస్వామిని చూడగానే సారథి ఆనందం పదింతలైంది.

''అమ్మా! ఇది నిజమా? నాన్నగారు వచ్చేశారా? తిరిగొచ్చేశారా? నేను నిజంగా నా కళ్ళను నేనే నమ్మలేక పోతున్నాను... ఇదెలా జరిగింది? ఎప్పుడు జరిగింది? ఇదెలా సాధ్యపడింది?...'' తల్లిదండ్రులను ఒకే చోట కలిసి చూడ్డం సారథికి ఆ దృశ్యం కన్నుల పండువుగా ఉంది.

''బావగారు తిరిగి రావడం, నీవు చచ్చి బతకడం ఈ రెండు సంఘటనలూ నాకు మహానందంగానూ, మహా అద్భుతంగానూ కనిపిస్తున్నాయి సారథీ!...'' నవ్వుతూ ముందుకొచ్చిన వెంకట్రామయ్యగారు మేనల్లుడి తలని ఆప్యాయంగా నిమరసాగాడు.

కళ్ళనిండా వెలుగుపూలు నింపుకొని తండ్రి వంక మనసారా వీక్షించసాగాడు.

''మీ డాక్టర్ ఫ్రెండ్... అదే రెడ్డి ఓసారి మళ్ళీ వాళ్ళ చుట్టాలతో కలిసి నలియా నుంచి ద్వారకకు వచ్చాడు. అప్పుడు అతను నన్ను కలిసి నీ విషాదకథంతా తెలియజేశాడు. ఆ విషయం నన్ను బాగా కలిచి వేసింది. అసాధ్యం అనుకున్న దాన్ని సాధ్యమనుకునేలా మనసు మార్చుకుని ఇంటికి తిరిగొచ్చాను బాబూ!...''

''మంచి పని చేశారు నాన్నా! అమ్మ కోరిక తీర్చారు. సర్వదా మీకు కృతజ్ఞులం'' అంటూ శిరస్సు వంచి సారథి తండ్రికి అభివాదం చేశాడు.

''అన్నయ్యా!... '' అంటూ చెంతకు చేరిన రవీంద్రను, గౌతమిని ప్రేమానురాగాలతో అక్కున చేర్చుకున్నాడు. రుక్మిణిని చూడగానే కనుబొమ్మ లెగరేస్తూ ''పిన్నీ! నీవు చేసిన కొత్తరకం స్వీట్స్ ఏవీ నాకోసం ఇక్కడికి పట్రాలేదా?'' చిరునవ్వులు చిందిస్తూ అడిగాడు.

''పిచ్చోడా! ఇప్పుడు కూడా నాతో పరాచికాలేనా?'' అంటూ రుక్మిణి మురిపెంగా నవ్వుతూ సారథి చేతిని తన చేతిలోకి తీసుకుంది ఆప్యాయంగా.

తానెలా యాక్సిడెంట్‌కి గుర్తైంది క్లుప్తంగా ఓ కథలా చెప్పుకొచ్చాడు.

రైలెక్కేముందే ఓ దొంగ వెధవ తన పర్సు... సూట్‌కేస్ కొట్టేయడం వల్ల తన వాళ్ళ ఆనవాళ్ళేవీ తన దగ్గర లేకుండా పోయాయి. చేతిలో ఓ రూపాయి కూడా లేదు. కొన్న రైలు టిక్కెట్‌తోపాటు చేతికున్న ఉంగరం లూజ్ కావడం వలన దాన్ని కూడా పర్సులోనే పడేయడం వలన చేతిలో ఏమీ మిగలలేదు. దేవుడి మీద భారం వేసి రైలెక్కేయడం జరిగింది. ఆ తర్వాత పెద్ద బాంబు విస్ఫోటంతో ఆ రైలు ప్రమాదం జరిగి పోయింది. నాకేమైందో తెలియని విషమ పరిస్థితిలో ఆ పల్లెజనం నన్ను హాస్పిటల్లో చేర్పించి పోతున్న నా ప్రాణాలు కాపాడారు వాళ్ళు. వాళ్ళ ఋణం తీర్చుకోలేనిది...''

''తన చేతికి నీ ఉంగరం పెట్టుకున్న ఆ వ్యక్తి ముఖం బాగా గుర్తుపట్టలేనంతగా చితికిపోయి, నీలాగే మాంచి ఒడ్డు పొడువుతో ఉండడం వలన అదే నీవనుకొని దహనసంస్కారాలు జరిపించాం, నేను ఆనందరావు అన్నయ్యా...'' సజల నయనాలతో చెప్పుకొచ్చాడు రవీంద్ర.

''ఆపదలో ఉన్న వారిని ఆదుకునే మంచి స్వభావమున్న వాళ్ళకి భగవంతుడు అన్ని విధాలా సాయం చేస్తాడు. అపస్మారక స్థితిలో ప్రాణాపాయంలో ఉన్న నిన్ను సరైన సమయంలో హాస్పిటల్‌కి చేర్చి తమ ఉదార స్వభావాన్ని చాటుకున్నారు ఆ పల్లెటూరి జనం. వాళ్ళందరికీ మన చేతనైన సహాయం చేద్దాం సారథీ! అన్నారు సుభద్రా ఆనందరావులు.

ఆ రోజే సారథిని కాపాడిన వాళ్ళను పిలిపించి తగిన పారితోషికాలు ఇచ్చారు.

వాళ్ళు ఎంత వద్దు వద్దన్నా వినలేదు.

అతి త్వరలో సుమతో జరగబోయే సారథి పెళ్ళికి డాక్టర్ చక్రపాణితో సహా వాళ్ళనందరినీ కూడా నిండు మనస్సుతో మనసారా ఆహ్వానించారు పల్లెకు రమ్మని.

వాళ్ళంతా కూడా ఆనందంతో వస్తామని వాగ్దానం కూడా చేశారు.

ఆ మరుసటి రోజే సారథిని డిశ్చార్జీ చేశారు.

ట్రీట్‌మెంట్ డబ్బుతోపాటు అన్ని బిల్స్ చెల్లించారు.

హాస్పిటల్ సిబ్బంది కందరికీ కిలోల కొద్ది స్వీట్స్ తెచ్చి పంచారు అన్నపూర్ణమ్మ దంపతులు ఆనందంగా.

ఆ రోజు సాయంత్రమే వాళ్ళందరికీ వీడ్కోలు చెప్పి సంతోషంగా ఇంటి ముఖం పట్టారు.

"అందరూ వచ్చారుగానీ, రఘురాం అన్నయ్య వాళ్ళెవ్వరూ రాలేదు. సుమిత్రా వదినకి ఈసారి పాపనా? బాబా?... " మార్గ మధ్యలో సారథి హఠాత్తుగా అడిగాడు.

ఒక్కసారిగా అందరి ముఖాలు మ్లానమైనాయి.

మౌనంగా ఉండిపోయారు.

"ఏం! ఏమైంది? ఎవరూ మాట్లాడరేం? ఈసారి కూడా మళ్ళీ పాపనే పుట్టింది కదూ?.... " ఈ మారతను నవ్వుతూ అడిగాడు.

"లేదు సారథీ! ఈసారి బాబే పుట్టాడు కాని వాళ్ళు దురదృష్టవంతులు. పుట్టిన ఆ పసికందుతోపాటు సుమిత్ర కూడా మనకు దక్కకుండా దేవుడి దగ్గరకు వెళ్ళిపోయిందయ్యా!...." వెంకట్రామయ్యగారు దుఃఖభారంతో జీరబోయిన గొంతుకతో పలికాడు.

"ఆఁ! అయ్యో! ఎంత ఘోరం జరిగింది? పాపం... పిల్లలు రఘురాం అన్నయ్య వాళ్ళమ్మగారు ఈ దుఃఖాన్ని ఎలా భరించారు? ఎలా ఉన్నారిప్పుడు వాళ్ళంతాను?" సారథి ఎంతో సానుభూతితో అనునయంగా అడిగాడు.

"మరుపు అనేది మనుష్యులకి దేవుడిచ్చిన వరం సారథీ! వాళ్ళంతా ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఇన్నాళ్ళ వరకు సుమ అక్కడే ఉంటూ ఆ పిల్లలని స్వంత పిల్లలుగా చూసుకుంది..." సుశీలమ్మ కన్నీళ్ళతో ఆవేదనగా చెప్పింది.

"మీరు బాధ పడకండత్తయ్యా! రఘురాం అన్నయ్య మళ్ళీ పెళ్ళి చేసుకున్నా సరే... వాళ్ళని మనతోపాటు తెచ్చుకుందాం ఊరికి. ఇక నుంచి నేను సుమ ఆ పిల్లల బాధ్యత తీసుకుంటాం...."

సారథి అన్న ఆ మాటలకు అక్కడున్న వాళ్ళందరి హృదయాలలో ఆనందపు జల్లులు కురిశాయి.

సుమతో రఘురాం పెళ్ళి పీటల మీది వరకు వచ్చి ఆగిపోయిన విషయం ఎవరి ద్వారా కూడా సారథికి తెలియలేదు. అందరూ ఆ విషయాన్ని రహస్యంగా తమ మనస్సుల్లోనే భద్రంగా దాచుకున్నారు.

✧ ✧ ✧

సారథి బతికి తిరిగొస్తున్న ఆ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని పల్లె జనమంతా ఆనందోత్సాహాలతో ఊరి బయటికి వచ్చి... డప్పు వాయిద్యాలతో అతనికి సుస్వాగతం పలికి పెద్ద పెద్ద పూల మాలలు వేసి అతనిపట్ల తమ కున్న అభిమానాన్ని, గౌరవాన్ని ప్రేమని వ్యక్త పర్చుకున్నారు.

వాళ్ళందరి ఆదరాభిమానాలకు చలించిపోయిన సారథి నీళ్ళు నిండిన కళ్ళతో అందర్నీ నిండుగా కలియ చూస్తూ రెండు చేతులూ ఊపసాగాడు.

ఊరు ఊరంతా కదిలి వచ్చిన ఆ జన సందోహాన్ని ఆశ్చర్యంగా పరికిస్తున్న కేశవస్వామికి... ప్రజోపకారంతో ఊరి ప్రజలతో కొడుకు ఏర్పర్చుకొన్న సన్నిహిత సంబంధ బాంధవ్యాలు అర్థమై మనస్సంతా ఆనందంతో నిండిపోయింది.

ఓ నెలరోజుల తర్వాత సుమసారథిల పెళ్ళికి శుభముహూర్తం నిర్ణయించబడింది.

పెళ్ళికి నలియా నుంచి డాక్టర్ రెడ్డి దంపతులతోపాటు, బొంబాయి నుంచి డాక్టర్ చక్రపాణి దంపతులు కూడా వచ్చారు.

వాళ్ళతోపాటు సారథి ప్రాణాలు కాపాడిన పల్లెవాళ్ళు కూడా ఇద్దరు ముగ్గురు వచ్చారు సారథి పెళ్ళి చూడడానికి.

ఢిల్లీలో అమెరికా డాక్టర్‌గారి ట్రీట్‌మెంట్‌తో ఆయన పర్యవేక్షణలో పరిపూర్ణ ఆరోగ్యవంతుడిగా మారిన కొడుకు శ్రీనివాస్‌ని తీసుకొని సుమ పెళ్ళికి సుగుణమ్మ గారు కూడా రావడం మరో విశేషం!

మారిన మనస్సుతో పిల్లల్ని తీసుకొని ఓ రోజు ముందుగానే అత్తగారింటికి చేరుకున్నాడు రఘురాం.

ఊరు ఊరంతతా పచ్చటి మామిడి తోరణాలు... రంగు రంగుల కాగితపు పూల తోరణాలు కట్టి చక్కగా అలంకరించారు. వీధి వీథులన్నీ రంగవల్లికలతో తీర్చి దిద్దారు. ఇంటి ముందు మామిడాకులతో... మర్రి ఆకులతో పెద్ద పెళ్ళి పందిరి వేసి బంతి చామంతి పూలదండలతో చక్కగా అలంకరించారు.

భూదేవంత అరుగు... ఆకాశమెత్తు పందిరి అన్నట్లుగా నభూతో నభవిష్యత్తు అన్నట్లుగా... ఊరి ప్రజల ఆనందోత్సాహాల మధ్య... సకల బంధుమిత్రుల సమక్షంలో సుమసారథిల వివాహమహోత్సవం అత్యంత వైభవో పేతంగా కన్నుల పండుగ్గా జరిగింది.

ఆ శుభముహూర్తాన తన మేనమరదలైన సుమబాల మెడలో ఆ మూడు ముళ్ళు వేసి తన దానిగా చేసుకున్నాడు సారథి.

ఎన్నెన్నో ఒడుదుడుకులతో కూడుకొని ఉన్న మానవ జీవితం గులాబీపూల చెట్టువంటిదని అనవచ్చునేమో! లౌకికమైన బంధాలు, అనుబంధాలు ఆ చెట్టుకున్న కొమ్మలు, రెమ్మలు! కష్టాలు, కోరికలు, దుఃఖాలు ఆ చెట్టుకున్న ముళ్ళవంటివి. ఆ చెట్టుకు పూసే పూవే ప్రేమ పుష్పం! చెట్టుకున్న కొమ్మలకు అల్లుకొని ఉన్న ముళ్ళకన్నా ప్రత్యేకంగా ఉన్న పువ్వును ముళ్ళు గుచ్చుకోకుండా కొమ్మల నుండి ఆకుల నుండి ఆ పువ్వును వేరు చేసి జాగ్రత్తగా కోసి... తాను మనసారా ప్రేమించిన సుమబాల అనే ఆ ప్రేమ పుష్పాన్ని తన దానిగా చేసుకున్నాడిప్పుడు సారథి.

మెడలో కొత్తగా అలంకరించబడ్డ తాళిబొట్టుతో తెల్లనిపట్టుచీరతో... బంగారు రాళ్ళ నగలతో సిగ్గుల మొగ్గలా సర్వాలంకార శోభితై ముకుళిత హృదయంతో ఉన్న మరదలిని ఆ రోజు రాత్రి తన బాహువుల్లో గట్టిగా బంధించాడు, పెళ్ళికొడుకు వేషధారణల తెల్లని మల్లెపువ్వు వంటి దుస్తులలో మెరిసిపోతున్న సారథి.

"బావా! నిజంగా నీవిలా తిరిగిరావడం పునర్జన్మలా ఉంది. చిన్నప్పటి నుంచి నిన్నే భర్తగా ఊహించుకొని ఆరాధించుకొని ప్రేమించిన నీతోనే నా కల్యాణం జరగడం నిజంగా నా కెంతో ఆనందదాయకంగా ఉంది బావా!..." క్రీగంటగా మురిపెంగా చూస్తూ మృదుమధుర స్వరంతో గుసగుసగా అంది సుమ.

"నాకూ అలాగే ఉంది. ఇదో కొత్త జీవితం!..." అంటున్న అతని రెండు చేతులు ఎంతో అపురూపంగా చంద్ర బింబం వంటి ఆమె ముఖాన్ని పట్టుకొని పైకి ఎత్తాయి. అతని పెదాలు అతి సున్నితంగా సుతారంగా ఆమె నుదురుని ప్రేమానురాగాలతో పదే పదే స్పృశించాయి.

సారథి ఏం మాట్లాడకుండా ఆమె భుజాల చుట్టూ చెయ్యి వేసి దగ్గరికి తీసుకున్నాడు. అరమోడ్పు కన్నులతో హాయిగా అలవోకగా భర్త చేతి వంపులో సిగ్గుల మొగ్గలా పువ్వులా ఒదిగిపోయింది సుమబాల.

నిర్మలమైన నీలాకాశంలో... వజ్రపు తునకల్లా మెరుస్తున్న నక్షత్రాల మధ్య నిండైన వెన్నెల వెలుగులు కురిపిస్తూ తిరగాడుతున్న శశాంకుడు... ఆ నూతన జంటని ఆశీర్వదించి అభినందన తెల్పుతున్నట్లుగా ఆ గదికి ఎదురుగుండా ఉన్న కిటికీలో నుంచి కొంటెగా చూస్తూ కొబ్బరి చెట్ల కొమ్మల వెనకాలకి మెల్ల మెల్లగా తప్పుకో సాగాడు.

◆

# PREMAPUSHPAM

*V. Rajyalakshmi*



ఇది రెండు కుటుంబాల కథ. బావా మరదళ్ళ ప్రేమకథ కూడా. ఇందులో బాంధవ్యాలు, అనుబంధాలు, రెండు కుటుంబాలలోని వ్యక్తుల సహృదయుతా సహజత్వానికి చాలా దగ్గరగా చిత్రింపబడ్డాయి. చివరి సగం చాలా ఉత్కంఠభరితంగా సాగుతుంది. పాత్రలు సజీవంగా, వాళ్ళ మధ్య జరిగే సంభాషణలు సహజత్వానికి దగ్గరగా ఉన్నాయి. సంఘటనలు, సన్నివేశాలు కళ్ళకు కట్టినట్టుగా చిత్రించడంలో రచయిత్రి కృతకృత్యులైనారనే చెప్పొచ్చు. ఈ నవల సమాజానికి పెద్దగా సందేశాన్ని అందించకపోయినా ఒడిదుడుకులతో, వెలుగు నీడలతో కూడుకొన్న మానవజీవితాన్ని గులాబీ చెట్టు ముళ్ళతో పోల్చడం, ప్రేమను ఆ చెట్టుకు పూసిన గులాబీ పువ్వుగా అభివర్ణించడం సముచితంగా ఉంది! ఒక మంచి నవలను చదివిన అనుభూతి పాఠకులకు మిగులుతుంది.

- పోల్కంపల్లి శాంతాదేవి